

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 11 సంచిక: 312

శనివారం 2-2-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మిథాలీ రాజ్ ఘనత

మహిళల క్రికెట్‌లో 200 వన్డేలు ఆడిన తొలి క్రికెటర్‌గా మిథాలీ రికార్డు –స్పోర్ట్స్‌లో



ఎందుకు నియమించలేదు?

సీబీఐకు డైరెక్టర్‌ను ఎందుకు నియమించలేదని కేంద్రానికి 'సుప్రీం' ప్రశ్న – 16లో

మోదీ సర్కార్ సమర్పించిన ఎలక్షన్ సినిమా..

నమో ఓటర్..



ఏడాది బడ్జెట్ పెట్టిన మూడు నెలల సర్కార్

దుస్సంప్రదాయానికి తెర తీసిన కేంద్రం

ఇదో విచిత్రమైన కొత్త సంప్రదాయం. బడ్జెట్ తేదీలనే కాదు.. తీరునూ మార్చేసింది నరేంద్ర మోదీ ప్రభుత్వం. నాలుగున్నరేళ్లుగా ప్రవేశపెట్టడానికి ఇష్టపడని డ్రీమ్ బడ్జెట్‌ను.. మరో 3 నెలల్లో పదవీకాలం ముగుస్తుందనగా ముందుకు తెచ్చింది. ఎన్నికలే లక్ష్యంగా.. 25 కోట్ల మంది ఓటర్లే లక్ష్యంగా సమ్మోహనాస్త్రాలు సంధించింది. 12 కోట్ల మంది రైతులకు నేరుగా ఖాతాల్లో డబ్బులు వెయ్యటమే కాదు.. 3 కోట్ల మంది మధ్య తరగతి ఉద్యోగుల జేబులనూ నింపుతోంది. మరో 10 కోట్ల మంది అసంఘటిత కార్మికులపై పింఛన్ వల విసిరింది. నిజం చెప్పాలంటే... తీవ్రమైన నిరాశా నిస్పృహల్లో ఉన్న రైతాంగానికి ఎంత చేసినా తక్కువే. కాకుంటే ఎన్నికలు ఏప్రిల్‌లో ఉండగా... మార్చిలో ఖాతాల్లోకి డబ్బులు వేస్తామనటమే హర్షించడానికి మనస్కరించని విషయం. మూడు నెలల ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టే సంప్రదాయానికి గండికొట్టేసి... పూర్తి సంవత్సరానికి బడ్జెట్ పెట్టడమనేది ప్రజాస్వామ్యబద్ధమని మాత్రం చెప్పలేం. కార్మికుల పింఛను.. పన్ను రాయితీలు అన్నీ హర్షించదగ్గవే. కాకుంటే వీటిని గడిచిన ఐదు బడ్జెట్లలో ఎప్పుడు తెచ్చినా మరింత హర్షం వ్యక్తమయ్యేదేమో!

- కథనాలు 2, 7, 8, 9, 10, 11, 12, 13, 14,15 పేజీల్లో

27,84,200 బడ్జెట్ మొత్తం (రూ. కోట్లలో)

19,77,693 రెవెన్యూ వసూళ్లు

8,06,507 మూలధన వసూళ్లు

27,84,200 మొత్తం వసూళ్లు

6,000 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు ఏటా ఇచ్చే ఆర్థిక సాయం

5,00,000 ఆదాయం వరకు పన్ను లేదు — శ్లాబులు మార్చకుండా రిబేటు రూపంలో మినహాయింపు

60 ఏళ్లు దాటిన అసంఘటిత రంగ కార్మికులకు ప్రతి నెలా రూ. 3,000 పింఛన్

సెక్షన్ 87 రిబేటు రూ.2,500 నుంచి రూ.12,500కు పెంపు	ఇకపై నెలకు రూ.40 వేలు వడ్డీ వచ్చినా టీడీఎస్ మినహాయించరు	ఉద్యోగులకు రెండో ఇంటిపై అద్దె వస్తే దానికి పన్ను మినహాయింపు
రూ.40,000 నుంచి రూ.50,000కు పెరిగిన స్టాండర్డ్ డిడక్షన్	ఇంటద్దెపై టీడీఎస్ పరిమితి రూ.1.8 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు పెంపు	రెండో ఇంటికీ వర్తించనున్న దీర్ఘకాలిక మూలధన పన్ను లాభాలు

ఇది ట్రైలర్ మాత్రమే...

మధ్యంతర బడ్జెట్ అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చేలా ఉంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత భారత్ పురోభివృద్ధికి ఏయే అంశాలు దోహదం చేస్తాయన్నదానికి ఈ బడ్జెట్ ట్రైలర్ మాత్రమే. ఈ బడ్జెట్‌తో 12 కోట్లకుపైగా రైతు కుటుంబాలు, అసంఘటిత రంగంలో ఉన్న 30–40 కోట్ల మంది కార్మికులు లబ్ధి పొందుతారు.

– ప్రధాని నరేంద్ర మోదీ

రోజుకు 17 రూపాయలా..

రైతులకు ఏటా రూ.6,000 ఇస్తామని గోయల్ ప్రకటించారు. గత ఐదేళ్లలో మీ చేతకానితనంతో రైతుల జీవితాలు నాశనమైపోయాయి. రైతులకు ఏటా రూ.6 వేలు అంటే రోజుకు రూ.16.44 ఇస్తామని చెప్పడం అవమానించడమే. 2 నెలల్లో రఫేల్ ఒప్పందం, ఉద్యోగాలు, నోట్ల రద్దులో మోదీపై సర్జికల్ స్ట్రైక్ జరుగుతుంది.

– రాహుల్ గాంధీ

130 మంది విద్యార్థుల అరెస్టు

- అమెరికాలో నకిలీ వర్సిటీ కేసులో పట్టుకున్న పోలీసులు
- వారిలో అత్యధికులు భారతీయులే
- బూటకపు వర్సిటీ అని విద్యార్థులకు తెలీదంటున్న న్యాయవాదులు

16లో

మిడిల్ క్లాస్.. మోదీ



రూ. 5 లక్షల లోపు ఆదాయం ఉంటే పన్ను లేదు

స్టాండర్డ్ డిడక్షన్ రూ.40 వేల నుంచి 50వేలకు పెంపు

మినహాయింపులతో కలిపితే రూ. 9 లక్షల వరకూ పన్ను జీరో

మధ్య తరగతి వేతన జీవులపై కేంద్రం ఎన్నికల వరాలు - 7లో


ఇదండీ సంగతి



బడ్జెట్ విషయంలో కూడా ఈసీని కలుద్దాం సార్!



రూపాయి రాక	రూపాయి పోక
రుణాలు సంబంధిత ఇతర మార్గాలు	కేంద్ర స్పాన్సర్డ్ పథకాలు
కార్పొరేట్ పన్ను	కేంద్ర పథకాలు
ఆదాయపు పన్ను	వడ్డీ చెల్లింపులు
కస్టమ్స్	రక్షణ వ్యయాలు
కేంద్ర ఎక్సైజ్ సుంకాలు	సబ్సిడీలు
వస్తు, సేవల పన్ను	ఫైనాన్స్ కమిషన్, ఇతర బదలాయింపులు
పన్ను యేతర ఆదాయం	పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాటా
డివిడెండ్ తరహా మూలధన ఆదాయాలు	పెన్షన్లు
	ఇతర వ్యయాలు



ఎన్నికల తర్వాతే మినహాయింపు

- అధికాదాయ వర్గాలకు పన్ను మినహాయింపుపై కేంద్ర మంత్రి గోయల్
- ఇది 'పరిమిత' బడ్జెట్ కావడంతో నిర్ణయాలు తీసుకోలేకపోయాం

గతేడాది ఆన్‌లైన్ ద్వారా 99.54% రిటర్నులు

- వివరాలు 7లో

ఇది ట్రైలర్ మాత్రమే!

- మధ్యంతర బడ్జెట్‌లోని పథకాలపై ప్రధాని మోదీ వ్యాఖ్య
- దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిందని వెల్లడి



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2019–20 ఆర్థిక సంవత్సరానికి తీసుకొచ్చిన మధ్యంతర బడ్జెట్ సమాజంలోని అన్నివర్గాలకు లబ్ధి చేకూర్చేలా, సాధికారత కల్పించేలా ఉందని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. 2019 లోక్‌సభ ఎన్నికల అనంతరం భారత్ పురోభివృద్ధికి ఏయే అంశాలు దోహదం చేస్తాయన్నదానికి తాజా బడ్జెట్ ట్రైలర్ మాత్రమేనని వెల్లడించారు. మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన పలు సంక్షేమ పథకాలను ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటులో శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెట్టే కార్యక్రమం ముగిసిన అనంతరం మోదీ మీడియాతో మాట్లాడుతూ..''ఈ బడ్జెట్‌తో 12 కోట్లకుపైగా రైతు కుటుంబాలు, అసంఘటిత రంగంలో ఉన్న 30–40 కోట్ల మంది కార్మికులు లబ్ధి పొందుతారు. ప్రభుత్వ చర్యలతో దేశంలో ప్రస్తుతం పేదరికం రేటు గణనీయంగా తగ్గుతోంది. మధ్యతరగతి ప్రజలు, రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ)లకు లబ్ధి చేకూర్చేలా బడ్జెట్‌లో కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈసారి బడ్జెట్‌లో ఆదాయపన్ను మినహాయింపు పొందిన మధ్యతరగతి ప్రజలకు అభినందనలు. దేశ నిర్మాణంలో మీరు చేసిన కృషికి సెల్యూట్ చేస్తున్నా'అని తెలిపారు.

కిసాన్ నిధి పథకం చరిత్రాత్మకం..

'గతంలో ప్రభుత్వాలు రైతుల కోసం రకరకాల పథకాలు తీసుకొచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో లబ్ధి చేకూర్చలేకపోయాయి. కానీ 'ప్రధానమంత్రి కిసాన్ నిధి'పేరుతో ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం చరిత్రాత్మకమైనది. దీనికింద 5 ఎకరాల వరకూ భూమి ఉన్న రైతులకు లబ్ధి చేకూరుతుంది. నవ భారత్ నిర్మాణంలో భాగంగా పశుపోషణ, చేపల పెంపకం రంగాలపై బడ్జెట్‌లో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. 'ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ యోజన'కింద దేశంలోని అసంఘటిత రంగంలోని కార్మికులు లాభపడతారు. ఆయుష్మాన్ భారత్, ఇతర సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకురాబోతున్నాయి. సంక్షేమ పథకాల ఫలాలు అన్నివర్గాలకు దక్కాలి. ఈ మధ్యంతర బడ్జెట్ పేదలకు సాధికారత కల్పిస్తుంది. రైతులకు ప్రోత్సాహం, ఆర్థికాభివృద్ధికి ఊతమందిస్తుంది'' అని పేర్కొన్నారు.

ఇదీ బడ్జెట్ స్వరూపం.. (రూ.కోట్లలో)

అంశాలు	2017-18 వాస్తవ కేటాయింపులు	2018-19 బడ్జెట్ అంచనాలు	2018-19 సవరించిన అంచనాలు	2019-20 బడ్జెట్ అంచనాలు
1. రెవెన్యూ వసూళ్లు	14,35,233	17,25,738	17,29,682	19,77,693
2. పన్ను ఆదాయం	12,42,488	14,80,649	14,84,406	17,05,046
3. పన్నేతర ఆదాయం	1,92,745	24,50,89	2,45,276	2,72,647
4. మూలధన వసూళ్లు	7,06,742	7,16,475	7,27,553	8,06,507
5. రుణాల రికవరీ	15,633	12,199	13,155	12,508
6. ఇతర వసూళ్లు	1,00,045	80,000	80,000	90,000
7. అప్పులు, ఇతరత్రా వసూళ్లు	5,91,064	6,24,276	6,34,398	7,03,999
8. మొత్తం వసూళ్లు (1+4)	21,41,975	24,42,213	24,57,235	27,84,200
9. మొత్తం వ్యయం (10+13)	21,41,975	24,42,213	24,57,235	27,84,200
10. రెవెన్యూ ఖాతా	18,78,835	21,41,772	21,40,612	24,47,907
11. వడ్డీ చెల్లింపులు	5,28,952	5,75,795	5,87,570	6,65,061
12. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు	1,91,034	1,95,345	2,00,300	2,00,740
13. మూలధన ఖాతా	2,63,140	3,00,441	3,16,623	3,36,293
14. రెవెన్యూ లోటు (10-1)	4,43,602	4,16,034	4,10,930	4,70,214
15. నికర రెవెన్యూలోటు (14-12)	2,52,568	2,20,689	2,10,630	2,69,474
16. ద్రవ్యలోటు 9-(1+5+6)	5,91,064	6,24,276	6,34,398	7,03,999
17. ప్రాథమిక లోటు (16-11)	62,112	48,481	46,828	38,938


రైతులను అవమానించడమే

బడ్జెట్‌పై కాంగ్రెస్ చీఫ్ రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్లలో ప్రధాని మోదీ రైతుల జీవితాలను నాశనం చేశారని మండిపడ్డారు. 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం'కింద ఇప్పుడు ఒక్కో రైతుకు రోజుకు రూ.17 చొప్పున ఇస్తామంటూ అన్నదాతలను అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశం అనంతరం రాహుల్ స్పందిస్తూ..'రైతులకు ఏటా రూ.6,000 ఇస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ప్రియమైన మోదీజీ.. గత ఐదేళ్లలో మీ చేతకానితనం, మూర్ఖత్వంతో మన రైతుల జీవితాలు నాశనమైపోయాయి. రైతులకు సంవత్సరానికి రూ.6 వేలు అంటే రోజుకు రూ.16.44 ఇస్తామని చెప్పడం వారిని అవమానించడమే'అని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్‌ను ఎన్డీయే ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్స్‌గా అభివర్ణించడంపై మాట్లాడుతూ..ఇంకో 2 నెలల్లో రఫేల్ ఒప్పందం, ఉద్యోగాలు, నోట్ల రద్దు విషయంలో ప్రధాని మోదీపై సర్జికల్ స్ట్రైక్స్ జరుగుతాయని చురకలు అంటించారు.

'మధ్య తరగతి వారికి మేలు'



న్యూఢిల్లీ: ఈ బడ్జెట్‌లో వార్షికాదాయం రూ.5లక్షల వరకు ఆదాయ పన్ను (ఐటీ) రిబేటుతో మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్ 2019–20 మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచేలా ఉందన్నారు. ఈమేరకు జైట్లీ తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో పేర్కొన్నారు. 'ఇది మధ్యంతర బడ్జెట్. ఎన్నికల తర్వాత ప్రభుత్వం భారత్‌ను అసలైన అభివృద్ధి పథంలో నడిపిస్తుంది'అని వ్యాఖ్యానించారు. ఉద్యోగ కల్పన లేనిదే ఐదేళ్లలో 7.5 ఆర్థిక వృద్ధి ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. 'భారత్‌ను 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడం లక్ష్యంగా పెట్టుకున్నాం'అని జైట్లీ పేర్కొన్నారు. రైతు, పేదల అనుకూల బడ్జెట్ ప్రవేశ పెట్టారని పీయూష్ గోయల్‌ను జైట్లీ ప్రశంసించారు.

'డిప్రెషన్ లో మోదీ ప్రభుత్వం'



కోల్‌కతా: మధ్యంతర బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలను ప్రకటించడాన్ని పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతాబెనర్జీ తప్పుపట్టారు. కేంద్రం చేసిన ప్రకటనలకు ఎలాంటి విలువ లేదని స్పష్టం చేశారు. 'కేవలం ఓట్ల కోసం షో చేయడానికే పలు పథకాలను ప్రకటించారు. మళ్లీ అధికారంలోకి రావాలన్న డిప్రెషన్ మోదీ ప్రభుత్వంలో కనిపిస్తోంది' అని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే బీజేపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. పెద్దనోట్ల రద్దు, వెనువెంటనే జీఎస్టీ అమలుతో ప్రస్తుతం దేశంలో ఆర్థిక అవ్యవసర పరిస్థితి కొనసాగుతోందని దుయ్యబట్టారు.

బీజేపీ మేనిఫెస్టోలా బడ్జెట్

లోక్‌సభాపక్ష నేత మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ: బడ్జెట్ యావత్తూ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను తలపించిందని కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం పార్లమెంట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం పేర్కొన్నవన్నీ ఎన్నికల తాయిలాలేనన్నారు. బీజేపీ గత ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల్లో ఎన్ని హామీలను నెరవేర్చారో కూడా ఆ పార్టీ నేతలు చెప్పలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఈ బడ్జెట్‌తో పేదలకు ఒరిగేదేమీ లేదన్నారు. దళితులను విస్మరించారని.. రైతులను మరోసారి మోసం చేయడానికి యత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

నమో ఓటర్

ఏడాది బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన 3నెలల సర్కారు

- దుస్సంప్రదాయానికి తెరదీసిన కేంద్రం
- ఎన్నికలు లక్ష్యంగా ఓటర్లపై వరాల జల్లు
- 5 లక్షల్లోపు ఆదాయానికి పన్ను లేదు
- చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ.6వేలు
- అసంఘటిత రంగ కార్మికులకు రూ.3వేల పింఛన్

2019 సార్వత్రిక ఎన్నికలకు సమయం ముంచుకొస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వం ఓటర్లను ఆకట్టుకునేలా బడ్జెట్‌లో జిమ్మిక్కులు చేసింది. ఇటీవల మూడురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో ఆత్మరక్షణలో పడిన బీజేపీ.. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దేశ జనాభాలో ఎక్కువగా ఉన్న మధ్యతరగతి, రైతులు, అసంఘటిత రంగంలోని కార్మికులను లక్ష్యంగా చేసుకునే వ్యూహాత్మకంగా బడ్జెట్‌ను రూపొందించింది. మూడు నెలల్లో ప్రభుత్వం గడువు ముగుస్తున్నందున.. ఈ కాలపరిమితికే బడ్జెట్ ప్రవేశపెట్టాలి. కానీ, దుస్సంప్రదాయానికి తెరదీస్తూ.. ఆర్థిక మంత్రి పీయుష్ గోయల్ పూర్తిస్థాయి బడ్జెట్‌ను శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఐదు లక్షల్లోపు వార్షికాదాయం ఉన్న వారికి పూర్తిగా పన్ను రిబేట్ ఇవ్వాలని బడ్జెట్‌లో నిర్ణయించారు. దీంతోపాటు చిన్న, సన్నకారు రైతులను ఆకట్టుకునేలా.. ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు ఏటా రూ.6వేలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. అసంఘటిత రంగంలోని కార్మికులకు పదవీ విరమణ తర్వాత ఏటా రూ.3వేల పింఛను ఇచ్చే ప్రతిపాదనలను కూడా బడ్జెట్‌లో పేర్కొన్నారు.

బ్రహ్మాస్త్రంగా ఆదాయపు పన్ను!

ఏటా ఐదులక్షల్లోపు ఆదాయం ఉన్న మూడుకోట్ల మంది వేతనజీవులు, పింఛనర్లు, స్వయం ఉపాధి పొందుతున్నవారు, చిరు వ్యాపారులను టాక్స్ చెల్లించే అవసరం లేకుండా ఆదాయపన్ను పరిమితిని పెంచారు. దీని ద్వారా ప్రతి ఒక్కరికీ రూ.13వేల వరకు లబ్ధిచేకూరనుంది. ఈ నిర్ణయం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ.18,500 కోట్ల ఆదాయం తగ్గుతుంది. స్టాండర్డ్ డిడక్షన్‌ను కూడా రూ.40 వేల నుంచి రూ.50వేలకు పెంచడం ద్వారా రూ.2,080 నుంచి రూ.3,588 వరకు మేలు (ఆదాయ స్థాయిల ఆధారంగా) జరగనుంది. బ్యాంకు వడ్డీలపై టీడీఎస్ మినహాయింపును రూ.10వేల నుంచి రూ.40వేలకు పెంచడం, గృహ ఆదాయ మినహాయింపును ఒక ఇంటి నుంచి రెండో ఇంటికి కూడా వర్తింపజేయడం, ఇంటి అమ్మకం ద్వారా వచ్చే ఆదాయాన్ని రెండు వేర్వేరు ఆస్తులపై పెట్టుబడి పెట్టడం వంటివి బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయం విషయంలో కీలకంగా చెప్పుకోవాల్సిన అంశాలు.

సన్నకారు రైతులపై దృష్టి

దేశవ్యాప్తంగా 5 ఎకరాలకంటే తక్కువ భూములున్న 12కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూర్చే 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి'పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఈ రైతుల బ్యాంకు అకౌంట్లలోకి నేరుగా ఏటా రూ.6వేలను (నాలుగు నెలలకోసారి 3 దఫాలుగా రూ.2వేల చొప్పున) జమచేయనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొంది. ఇందుకోసం ప్రభుత్వంపై ఏటా రూ.75వేల కోట్ల భారం పడనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే ఈ పథకం అమల్లోకి వస్తుందని పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఈ ఏడాది కోసం రూ.20వేల కోట్లను విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయాదాయ మద్దతు పథకం ద్వారా నిర్దేశిత 3.3% ద్రవ్యలోటును చేరుకోవడంలో ప్రభుత్వం వెనకబడింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో టార్గెట్‌గా పెట్టుకున్న 3.1% ద్రవ్యలోటును చేరుకోవడం కూడా కష్టంగానే మారనుంది. ప్రకృతి విపత్తుల ద్వారా నష్టపోయే రైతులకు 2% వడ్డీ ప్రభుత్వ సాయంగా అందిచేందుకు కూడా కేంద్రం ముందుకొచ్చింది.

రూ.3వేల పింఛన్‌తో..

అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులపై వరాల జల్లు కురిపించింది. ప్రస్తుతం నెలకు రూ.100 కనీస చెల్లింపు ద్వారా 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.3వేల పింఛను ఇవ్వాలని నిర్ణయించింది. ఈ తాత్కాలిక బడ్జెట్ కేవలం ట్రయలర్ మాత్రమేనని.. లోక్‌సభ ఎన్నికల తర్వాత దేశాన్ని సంక్షేమంగా మార్చేందుకు మరిన్ని పథకాలు తమ వద్ద ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అయితే రోజుకు 17 రూపాయలు ఇవ్వడం ద్వారా రైతులను అవమానించేలా ప్రభుత్వం వ్యవహరించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ఓట్ల కోసమే ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుందని మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం విమర్శించారు.

7% పెరిగిన రక్షణ బడ్జెట్

రక్షణరంగ బడ్జెట్‌ను రూ.3లక్షల కోట్లకు (గతేడాదితో పోలిస్తే 7% పెంపు) పెంచడం, ఎల్పీజీ సబ్సిడీ రూ.2.66 లక్షల కోట్ల నుంచి రూ.2.97 లక్షల కోట్లకు పెంచడం వంటివి కూడా బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.90వేల కోట్ల సేకరణ, ఆర్బీఐతోపాటు వివిధ బ్యాంకుల డివిడెండ్ల ద్వారా రూ.82,900కోట్ల ఆదాయం సమకూరిందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఆదాయపన్ను పరిమితి రూ.5లక్షలకు పెంచడమే ఈ బడ్జెట్ మొత్తానికి హైలైట్ అని పేర్కొన్నారు. 'సంప్రదాయం ప్రకారం పూర్తిస్థాయి బడ్జెట్‌లో పన్నుల మినహాయింపుల గురించి ప్రస్తావించాలి. కానీ మధ్యతరగతి, వేతనజీవులు, పింఛనర్లు, సీనియర్ సిటిజన్లలో ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో ఆశలు, ఆకాంక్షలతో ఎదురుచూస్తున్న వారిని.. పూర్తిస్థాయి బడ్జెట్ వరకు వేచి ఉంచకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం'అని గోయల్ స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో దేశాభివృద్ధికి ఇప్పటికే ఎన్డీయే ప్రభుత్వం పునాదులు వేసిందని.. దేశ ఆర్థిక వ్యవస్థను వచ్చే ఐదేళ్లలో 5 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లే లక్ష్యంతో దూసుకెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు.



పార్లమెంటు ప్రాంగణంలో బడ్జెట్ ప్రతులను తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది



శుక్రవారం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్. చిత్రంలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, సుష్మ, బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్

అంచెలంచెలుగా..




పార్లమెంటులో కేంద్ర వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన పీయూష్ గోయల్ (54) మోదీ ప్రభుత్వం అమలు పరిచిన ఆర్థిక సంస్కరణలన్నింటికీ సూత్రధారి. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అనారోగ్య కారణంగా తాత్కాలిక ఆర్థిక మంత్రి బాధ్యతలు చేపట్టిన గోయల్ ఆ హోదాలోనే 'మధ్యంతర'బడ్జెట్ ప్రవేశపెట్టారు. చార్టెర్డ్ అకౌంటెంట్‌గా, న్యాయ విద్యార్థిగా అత్యున్నత ప్రతిభా పాటవాలు చూపిన గోయల్ 2014 ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల ప్రచారం ద్వారా ఎన్డీఏ విజయానికి దారులు వేశారు. విపత్కర సమయాల్లో నేనున్నానంటూ ముందుకొచ్చి పార్టీని, ప్రభుత్వాన్ని ఆదుకున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు పని చేస్తూ 'పని రాక్షసుడి'గా పేరుపడ్డారు. రైల్వే మంత్రిగా బులెట్ రైళ్లు, స్పీడ్ రైళ్లతో భారతీయ రైల్వేను పరుగులు పెట్టిస్తున్నారు. రైల్వేల ఆధునీకరణ, ప్రయాణికుల సౌకర్యాలకు పెద్దపీట వేశారు. మోదీ ప్రభుత్వం అమలు చేసిన నిరంతర విద్యుత్, స్వచ్ఛ ఇంధనం, ఉదయ్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ్ జ్యోతి యోజన వంటి పథకాల రూపకర్త గోయలే. దేశంలోని 5,97,464 గ్రామాలను పూర్తిగా విద్యుదీకరించినందుకుగాను గోయల్‌కు రెండు రోజుల క్రితమే పెన్సిల్వేనియా వర్సిటీ కర్నాట్ బహుమతిని ప్రదానం చేసింది.

స్వతంత్ర ప్రతిపత్తి గల సహాయ మంత్రిగా మోదీ మంత్రివర్గంలో చేరిన గోయల్ తన శక్తిసామర్థ్యాలను నిరూపించుకుని అనతికాలంలోనే కేబినెట్ స్థాయికి ఎదిగారు. బొగ్గు, విద్యుత్ శాఖ మంత్రిగా బొగ్గు గనుల వేలాన్ని పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించారు. ఉజ్వల పథకం కింద దేశంలో ఎల్ఈడీ బల్బుల వినియోగాన్ని పెంచి కరెంటు ఖర్చు తగ్గించారు. త్వరగా, వినూత్నంగా నిర్ణయాలు తీసుకుంటారని పేరున్న గోయల్‌కు జ్ఞాపకశక్తి అపారం. సీఏలో ఆలిండియా రెండో ర్యాంకు సాధించారు. న్యాయవిద్యలో ముంబై యూనివర్సిటీలోనే సెకండ్ ర్యాంకు సంపాదించారు. స్టేట్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా డైరెక్టర్ల బోర్డుల్లో పని చేశారు. కేంద్ర మంత్రి వర్గంలో చేరే నాటికి గోయల్ బీజేపీ కోశాధికారిగా ఉన్నారు. ఆయన తర్వాత పార్టీ మరెవరినీ కోశాధికారిగా నియమించకపోవడం గమనార్హం. కార్పొరేట్ వర్గాలతో సన్నిహిత సంబంధాలున్న పీయూష్ గోయల్ తన 34 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రభుత్వానికి ఎన్నో విజయాలు సాధించి పెట్టారు. గోయల్ తండ్రి వేద్ ప్రకాశ్ గోయల్ బీజేపీ జాతీయ కోశాధికారిగా, కేంద్రంలో మంత్రిగా పని చేశారు. తల్లి చంద్రకాంత గోయల్ మహారాష్ట్ర శాసనసభకు మూడుసార్లు ఎన్నికయ్యారు.

నాలుగు నెలలకు రూ.34.17 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: వచ్చే ఏప్రిల్ నుంచి నూతన ఆర్థిక సంవత్సరం (2019–20)లో మొదటి నాలుగు నెలల కాలానికిగాను (ఏప్రిల్ నుంచి జూలై వరకు) రూ.34.17 లక్షల కోట్ల వ్యయాల కోసం కేంద్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ ద్వారా పార్లమెంట్ అనుమతి కోరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి స్థూల వ్యయాలు రూ.97.43 లక్షల కోట్లుగా మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అంచనాలను పేర్కొన్నారు. మొదటి నాలుగు నెలల కాలానికి అయ్యే వ్యయాలకు గాను పార్లమెంటు ఆమోదం కోరారు. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్–మే నెలల్లో పూర్తవుతాయి. తదుపరి ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను వచ్చే జూలైలో కొత్త ప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించనుంది.

హౌ ఈజ్ ద జోష్..?



న్యూఢిల్లీ: బడ్జెట్ సందర్భంగా సభలో పలు ఆసక్తికర సన్నివేశాలు చోటుచేసుకున్నాయి. తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రసంగం దాదాపు ఉత్సాహంగా సాగింది. ఇటీవల సూపర్ హిట్ అయిన బాలీవుడ్ సినిమా 'ఉడీ.. ది సర్జికల్ స్ట్రైక్స్'ను ప్రస్తావిస్తూ.. 'హౌ ఈజ్ ద జోష్?'అంటూ విపక్ష సభ్యుల్ని బీజేపీ నేతలు ప్రశ్నించారు. పీయూష్ గోయల్ రైతులకు నగదు బదిలీ పథకం, ఆదాయ పన్ను మినహాయింపులు వంటి పలు కీలక ప్రకటనలు చేస్తున్నప్పుడు బీజేపీ సభ్యులు మోదీ.. మోదీ అంటూ నినాదాలు చేస్తూ, బల్లలు చరుస్తూ స్వాగతించారు.

- సాధారణంగా ఆర్థిక మంత్రులు బడ్జెట్ ప్రసంగాన్ని చదవడానికే పరిమితమవుతుంటారు. అయితే ఇందుకు భిన్నంగా పీయుష్ గోయల్ కీలక ప్రకటనలు చేస్తున్నప్పుడు విపక్ష సభ్యుల్ని ఉద్దేశించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.
- భవిష్యత్ అజెండా గురించి పీయూష్ ప్రస్తావిస్తూ 'నేను ఉడీ సినిమా చూశాను. అందులో మంచి జోష్ ఉంది..'అంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. మరోవైపు న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తో పాటు మరికొందరు బీజేపీ సభ్యులు సైతం 'హౌ ఈజ్ ద జోష్?..'అంటూ కాంగ్రెస్ నేతలను వ్యంగ్యంగా ప్రశ్నించారు.
- పీయూష్ రూ.5 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ప్రకటన చేయగానే బీజేపీ సభ్యులు బల్లల చరుస్తూ.. మోదీ, మోదీ అంటూ నినాదించారు. దీంతో నిమిషం పాటు గోయల్ తన ప్రసంగాన్ని ఆపారు.
- ప్రధాని కూడా పలు ప్రకటనలప్పుడు బల్లను కొడుతూ సంతోషం వ్యక్తం చేశారు.
- బడ్జెట్ ప్రవేశపెట్టడం పూర్తయిన తర్వాత గోయల్ మోదీ వైపు తిరిగి నవ్వుతూ నమస్కారం చేశారు.
- అనంతరం మోదీ చిరునవ్వుతో గోయల్ వద్దకు వెళ్లి వెన్నుతట్టి అభినందించారు.
- కాగా, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు బిగ్గరగా నవ్వుతూ పీయూష్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు.
- సభ ప్రారంభమవ్వడానికి ఐదు, ఏడు నిమిషాల ముందు లోపలికి వచ్చిన గోయల్ కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, ఉమా భారతి, బీజేపీ సీనియర్ నేత శాంత కుమార్‌ల పాదాలకు నమస్కారం చేసి.. ఆశీర్వాదం తీసుకున్నారు.
- బడ్జెట్ ప్రసంగం ముగిసిన తర్వాత చాలా మంది ఎంపీలు గోయల్ వద్దకు వెళ్లి అభినందించారు. అదే సమయంలో విజిటర్స్ గ్యాలరీలో నిల్చొని ఉన్న తన కుటుంబసభ్యుల్ని చేయి ఊపుతూ పలకరించారు.
- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కొద్దిసేపు సభ నుంచి బయటకు వెళ్లారు. దీంతో పలువురు బీజేపీ నేతలు 'రాహుల్ పారిపోయాడు'అంటూ ఎగతాళి చేశారు.
- యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, కాంగ్రెస్ విప్ జ్యోతిరాదిత్య సింధియా, డిప్యూటీ స్పీకర్ ఎం.తుంబిదురై సభకు గైర్హాజరయ్యారు.

'ఇది అకౌంట్ ఫర్ ఓట్స్'



న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం మధ్యంతర బడ్జెట్‌పై ఘాటుగా స్పందించారు. ఇది ఓటాన్ అకౌంట్ కాదని.. అకౌంట్ ఫర్ ఓట్స్ (ఓట్ల లెక్కలు) అని అభివర్ణించారు. ఓట్ల కోసమే ఈ జిమ్మిక్కులని విమర్శించారు. 'ఇది ఓటాన్ అకౌంట్ కాదు.. ఇది అకౌంట్ ఫర్ ఓట్స్..'అని కేంద్రం మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ట్విట్టర్‌లో ఆయన పేర్కొన్నారు. 'దేశ వనరులు ముందుగా పొందాల్సిన హక్కు పేదలదే అన్న కాంగ్రెస్ ప్రకటనను కాపీ చేసినందుకు ధన్యవాదాలు..'అని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానిం చారు.

ఇది 'పకోడానామిక్స్'..

బడ్జెట్‌లో ఉద్యోగాలు, విద్య.. అంశాలకు సంబంధించిన ప్రస్తావనే లేదని చిదంబరం విమర్శించారు. దీన్ని బట్టి చూస్తే మోదీ ప్రభుత్వం యువతను పకోడాలు అమ్ముకోవాలని (పకోడానామిక్స్) సూచిస్తున్నట్టుందని దుయ్యబట్టారు.

అక్రమ వీసాల వ్యవహారంలో
పాల్వంచ వాసి..?

పాల్వంచ: అమెరికాలోని ఓ యూనివర్సిటీలో అక్రమ వీసాలతో పలువురు విద్యార్థులను చేర్పించిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన వ్యక్తి కూడా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఫేక్ యూనివర్సిటీ పేరుతో అమెరికాలోని సెక్యూరిటీ విభాగం స్టింగ్ ఆపరేషన్ చేయగా.. అందులో తప్పుడు వీసాలతో ఉంటున్న వారిలో అనేక మంది తెలుగు విద్యార్థులు ఉన్నట్లు తేలడం ప్రకంపనలు సృష్టిస్తోంది. అయితే ఇలా వీసాలను దుర్వినియోగం చేసిన వ్యక్తుల్లో పాల్వంచ పట్టణంలోని నవతా రోడ్‌లో ఉండే కర్నాటి ఫణికుమార్ కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇతను 2009లో ఉన్నత చదువు నిమిత్తం అమెరికా వెళ్లాడు. ఎంఎస్ పూర్తి చేసి అక్కడే స్థిరపడ్డాడు. అనంతరం బతుకు దెరువు నిమిత్తం బ్రోకర్‌గా అవతారం ఎత్తి పలు యూనివర్సిటీల్లో విద్యార్థులను చేర్పించే పని ఎన్నుకున్నట్లు తెలిసింది. ఇటీవల అక్రమ వీసాలతో అమెరికాలో స్థిరపడిన వారిని గుర్తించాలనే వ్యూహంతో అక్కడి ప్రభుత్వం ఓ నకిలీ యూనివర్సిటీని స్థాపించి ప్రకటన విడుదల చేయడంతో ఫణికుమార్ కూడా దొరికినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అతడి తండ్రి రమేష్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులో లేరు. అయితే ఫణికుమారే ఈ వ్యవహారంలో ఉన్నాడా..? లేక అతడిని కావాలనే ఇతర ముఠా తప్పుదోవలో ఇరికించిందా..? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

నా భార్య మృతికి జడ్జియే కారణం

కోర్టు ఎదుట మృతదేహంతో ధర్నా

- న్యాయమూర్తిని అరెస్టు చేయాలని డిమాండ్, ఉద్రిక్తత
- మృతురాలు కోర్టులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని


కోర్టు ఎదుట మృతదేహంతో బైఠాయించిన కుటుంబ సభ్యులు, బంధువులు

వరంగల్ లీగల్: తన భార్య తలుగుల టీనా మృతికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అనిరోజ్ క్రిష్టియానా కారణమని మృతురాలి భర్త రవి ఆరోపించారు. శుక్రవారం కోర్టు ఎదుట టీనా మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు బైఠాయించారు. జడ్జిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ జులైవాడకు చెందిన టీనా న్యాయ సేవాధికార సంస్థలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగినిగా పనిచేస్తోంది. జడ్జి క్రిష్టియానా మానసిక వేధింపులు, సహచర ఉద్యోగుల ఎదుట అవమానిస్తుండటంతో కలత చెందిన టీనా.. గతేడాది సెప్టెంబర్ 26న న్యాయసేవా సదన్ భవనంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స అనంతరం తిరిగి విధుల్లో చేరింది. మళ్లీ అనారోగ్యానికి గురికావడంతో అనేక ఆస్పత్రులు తిరిగినా ఫలితం దక్కలేదు. టీనా వైద్య ఖర్చులు నిమిత్తం ఇల్లును విక్రయించామని రవి సుబేదారి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. చివరకు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం టీనా తుదిశ్వాస విడిచింది.

కోర్టు ఎదుట బైఠాయింపు

కాగా, టీనా మృతదేహంతో కోర్టు గేటు ఎదుట కుటుంబసభ్యులు, బంధువులు, ఎమ్మార్పీఎస్ నేతలు బైఠాయించారు. మధ్యాహ్నం మొదలైన ధర్నా సాయంత్రం వరకు కొనసాగింది. టీనా మృతికి కారణమైన జడ్జిని అరెస్టు చేయాలని, మృతురాలి కుటుంబానికి ఉద్యోగ అవకాశం కల్పించి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భర్త రవి, కుమారుడు సంజీవ్ ఒక దశలో జడ్జి చాంబర్‌లోకి దూసుకెళ్లడానికి ప్రయత్నించగా ఉద్రిక్తత ఏర్పడింది. ప్రధాన జడ్జి తిరుమలాదేవి ప్రతినిధిగా సూపరింటెండెంట్ రవికాంత్ బాధితుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

డబుల్ ఓట్లు కలిగిన 22 మందిపై కేసు

సాక్షి, కామారెడ్డి: గాంధారి మండలం నేరల్ తండా, మేడిపల్లి గ్రామాల్లో డబుల్ ఓటు హక్కు కలిగి ఉన్న 22 మందిపై కేసు నమోదు చేసినట్లు కలెక్టర్ సత్యనారాయణ తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో డబుల్ ఓట్ల కారణంగా తాము ఓటమి చెందామంటూ ఆధారాలతో సహా ఓటమి చెందిన అభ్యర్థులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. రెండు గ్రామాల్లో 22 మంది ఓట్లు వేసి తమ ఓటమికి కారణమయ్యారని అందులో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశం మేరకు వారిపై కేసు నమోదు చేశారు.

ఒత్తిడి తట్టుకోలేకపోతున్నా!

ఐఐటీ హైదరాబాద్ విద్యార్థి ఆత్మహత్య

- కంది క్యాంపస్‌లో ఏడో అంతస్తుపై నుంచి దూకి బలవన్మరణం


అనిరుధ్య (ఫైల్)

సంగారెడ్డి రూరల్

'మానసిక ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నాను.. చాలా రోజుల నుంచి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నాను.. ఈరోజు ఆత్మహత్య చేసుకుంటున్నాను'అని లెటర్ రాసి.. మిత్రుడికి మెయిల్ చేసిన ఐఐటీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంగారెడ్డి జిల్లా కంది శివారులోని ఐఐటీ హైదరాబాద్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన రాజన్ కుటుంబం హైదరాబాద్‌లోని తిరుమలగిరిలో నివాసం ఉంటోంది. రాజన్ కుమారుడు అనిరుధ్య (21) కంది ఐఐటీ హైదరాబాద్‌లోని డీ బ్లాక్‌లో గల హాస్టల్‌లో ఉంటూ బీటెక్ మెకానికల్ అండ్ ఏరోస్పేస్ కోర్సు ఫైనలియర్ చదువుతున్నాడు. కాగా, అనిరుధ్య.. మానసిక ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నాను అని లెటర్ రాసి గురువారం రాత్రి 12 గంటల సమయంలో మిత్రుడు కనిష్క్‌రెడ్డికి మెయిల్ చేశాడు. అనంతరం హాస్టల్ ఏడో అంతస్తు పైకి చేరుకుని భవనంపై నుంచి కిందికి దూకేశాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అనిరుధ్యకు ఐఐటీలోని ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఇదిలా ఉండగా మృతుడి తండ్రి రాజన్ మాట్లాడుతూ.. ఈమధ్యే తన కుమారుడు సెలవుపై ఇంటికి వచ్చి వెళ్లాడని, ఇంతలోనే ఏం జరిగిందో అంతుబట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో కుటుంబీకులు బోరున విలపించారు. ప్రమాదానికి ముందు అనిరుధ్య టెర్రస్‌పైకి వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఐఐటీ క్యాంపస్ సెక్యూరిటీ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'పచ్చబొట్టు' పట్టేసింది

కుటుంబం చెంతకు చేరిన మతిస్థిమితం లేని వ్యక్తి


నర్సింహులును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏసీపీ నారాయణ

గజ్వేల్: మతిస్థిమితం కోల్పోయిన కారణంగా ఎనిమిదేళ్ల క్రితం తప్పిపోయి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు వెళ్లిన వ్యక్తిని.. చేయిపై వేయించుకున్న పచ్చబొట్టు తిరిగి స్వగ్రామానికి చేరుకునేలా చేసింది. కనిపించకుండా పోయాడనుకున్న వ్యక్తి తిరిగి రావడంతో కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామలో ఈ ఘటన చోటు చేసుకుంది. జాలిగామకు చెందిన గంగాల నర్సింహులుకు భార్య యాదమ్మ, కూతురు రేణుకలు ఉన్నారు. అయితే ఎనిమిదేళ్ల క్రితం అతను మతిస్థిమితం కోల్పోయాడు. దీంతో ఎప్పుడు, ఎక్కడికి వెళ్లేవాడో తెలిసేది కాదు. కుటుంబ సభ్యులు తరచూ అతని కోసం వెతుకులాడేవారు. ఇదే క్రమంలో ఎనిమిదేళ్ల క్రితం అతను రైలెక్కి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు వెళ్లాడు. అక్కడే భిక్షాటన చేస్తూ కాలం గడిపాడు. ఈ తరుణంలో గత నెల 15న సంక్రాంతి సందర్భంగా భోపాల్‌కు చెందిన అన్షుమన్ త్యాగి, అతని స్నేహితుడు హిమాన్‌జైన్‌లతోపాటు మరికొందరు యువకులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగంగా భోపాల్ రైల్వేస్టేషన్‌లో పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహులు వారికి తారసపడ్డాడు. అప్పటికే అతను కాలికి గాయమై నీరసంగా ఉన్నాడు. చేతిపై లక్ష్మి పేరుతో ఉన్న పచ్చబొట్టును వారు గుర్తించారు. అక్షరాలు తెలుగులో ఉండటం గమనించి అన్షుమన్ త్యాగి, హైదరాబాద్‌లోని దమ్మాయిగూడలో నివాసముండే తన బావ రాకేష్ త్యాగికి ఫోన్‌లో విషయాన్ని వివరించాడు. పచ్చబొట్టు ఫోటో తీసి వాట్సాప్ చేశాడు. అనంతరం నర్సింహులు ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. కొన్ని రోజుల తర్వాత కోలుకున్న నర్సింహులు తమది గజ్వేల్ ప్రాంతమని, భార్య పేరు యాదమ్మ అని చెప్పుకొచ్చాడు. ఈ వివరాల గురించి త్యాగి.. గుగూల్‌లో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ నంబర్ తీసుకొని సమాచారమిచ్చాడు. దీంతో గజ్వేల్ ఎస్‌బీ ఏఎస్‌ఐ జగదీశ్వర్ జాలిగామ గ్రామానికి వెళ్లి నర్సింహులు ఫొటో తీసుకెళ్లి విచారణ జరపడంతో తమ గ్రామస్తుడేనని తెలిపారు. శుక్రవారం నర్సింహులును భోపాల్ నుంచి అన్షుమన్ త్యాగి సాయంతో ఇక్కడకు రప్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పచ్చబొట్టు ఆధారంగా తిరిగి నర్సింహులు తమవద్దకు చేరుకోవడంతో కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అన్షుమన్ త్యాగి, హిమాన్ జైన్, రాకేశ్‌త్యాగిలను ఏసీపీ అభినందించారు.

నేతన్న బలవన్మరణం

తంగళ్లపల్లి (సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీకి చెందిన నేత కార్మికుడు కొండల శ్రీనివాస్ (35) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న శ్రీనివాస్.. మహారాష్ట్రలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఈ క్రమంలో కొంత అప్పయ్యింది. దీనికి తోడు ఇటీవల ఇల్లు కట్టుకున్నాడు. ఇందుకోసం మరింత అప్పు చేసిండు. మొత్తం రూ.8 లక్షల వరకు అప్పు అయ్యింది. చికిత్స పొంది ఇటీవల ఇంటికి వచ్చిన శ్రీనివాస్.. కొద్దిరోజులుగా మనస్తాపంతో ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరివేసుకుని చనిపోయాడు.

గోపురాలకు ఎల్ఈడీ లైట్లు

యాదగిరికొండ: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పునర్నిర్మాణంలో భాగంగా ప్రధానాలయ రాజగోపురాలకు అత్యాధునిక ఎల్ఈడీ లైట్లు అమర్చనున్నారు. వీటిని అమెరికా నుంచి తెప్పిస్తున్నారు. శుక్రవారం అమెరికాకు చెందిన ఈకో సంస్థ ప్రతినిధులు ఆలయాన్ని సందర్శించారు. సంస్థ ప్రతినిధి సునీల్ అగర్వాల్ మాట్లాడుతూ ఈకో సంస్థ ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లోని దేవాలయాలకు, ప్రముఖ నిర్మాణాలకు లైట్లను అమర్చిందని తెలిపారు. యాదాద్రిలోని నాలుగు రాజగోపురాలు రాత్రి పూట సుందరంగా కనిపించేందుకు అత్యాధునిక ఎల్ఈడీ లైట్లను అమర్చనున్నట్లు చెప్పారు. వాటిని పరిశీలించడానికి తాము వచ్చినట్లు ఆయన వెల్లడించారు.


కేవీ కేశవులు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ తదితరులు

కేవీ కేశవులుకు అంతిమ వీడ్కోలు

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి

ధర్మపురి: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి కేవీ.కేశవులు (95) అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో శుక్రవారం జగిత్యాల జిల్లా ధర్మపురిలో జరిగాయి. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. జనవరి 30న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. కేశవులు భౌతికకాయాన్ని స్వస్థలమైన ధర్మపురికి శుక్రవారం తీసుకొచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉంచి పలువురు నివాళులర్పించారు. గోదావరి తీరంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజేశం, అడిషనల్ ఎస్పీ మురళీధర్, ఆర్డీవో నరేందర్ తదితరులు పాల్గొన్నారు. 1924 జనవరి 14న జన్మించిన కేశవులు నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని ధర్మపురిలోని ఆయన నివాసంపై జాతీయజెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్యం అనంతరం సిర్పూర్(టి) నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. పీవీ నర్సింహారావు మంత్రివర్గంలో జౌళి, సహకార శాఖల మంత్రిగా పనిచేశారు.

రక్షణ మంత్రిని కలిసిన టీఆర్‌ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సచివాలయ నిర్మాణం, రహదారుల విస్తరణకు వీలుగా రక్షణ శాఖ పరిధిలోని బైసన్ పోలో భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు శుక్రవారం టీఆర్‌ఎస్ ఎంపీలు విజ్ఞప్తి చేశారు. అనంతరం జితేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'రక్షణ శాఖ భూముల బదలాయింపుపై ఇప్పటికే అనేక మార్లు ప్రధాని మోదీని కలిశాం. బైసన్‌పోలో స్థల వివాదం కేసు హైకోర్టులో ఉందని గతంలో ఆయన చెప్పారు. తాజాగా హైకోర్టు బైసన్ పోలో స్థలం కేంద్రానిదే అని స్పష్టతనిచ్చింది. ఈ నేపథ్యంలో మరోసారి కేంద్ర రక్షణ మంత్రిని కలిసి ఈ అంశంపై చర్చించాం. బైసన్‌పోలో స్థలానికి బదులు స్థలం, కొంత శాతం పరిహారం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్న విషయాన్ని వివరించాం. మా విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు' అని పేర్కొన్నారు. రక్షణ మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు బి.వినోద్‌కుమార్, కవిత, గుత్తా సుఖేందర్‌రెడ్డి, జోగినిపల్లి సంతోష్‌కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.


ఎన్సీపీ చీఫ్ పవార్‌ను కలిసిన బీసీ నేతలు ఆర్.కృష్ణయ్య తదితరులు

శరద్‌పవార్‌తో బీసీ నేతల భేటీ

యూపీఏ మేనిఫెస్టోలో బీసీ రిజర్వేషన్ల హామీకి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా రాబోయే యూపీఏ ప్రభుత్వం కచ్చితమైన హామీ ఇస్తుందని, ఇందుకు తగ్గట్టుగా ఎన్నికల మేనిఫెస్టోలో ఈ వాగ్దానాన్ని చేరుస్తామని ఎన్సీపీ జాతీయ అధ్యక్షుడు శరద్ పవార్ హామీ ఇచ్చినట్టు బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఇక్కడ శరద్ పవార్‌ను ఆయన నివాసంలో బీసీ నాయకులు కలిశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర బీసీ సంఘాల నేతలను ఆహ్వానించి బీసీ సమస్యలపై పవార్ అరగంట సేపు చర్చలు జరిపారని కృష్ణయ్య వివరించారు. అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టి బీసీలకు అన్యాయం చేస్తున్నారని పవార్ దృష్టికి తీసుకెళ్లారు. బీసీలకు రాజ్యాధికారంలో వాటా ఇస్తే తప్ప ఈ కులాలకు న్యాయం జరగదన్నారు. దీనిపై పవార్ స్పందిస్తూ బీసీలకు అన్యాయం జరిగిందని, బీసీల పక్షాన నిలబడతానని హామీనిచ్చినట్టు తెలిపారు. బీసీల డిమాండ్లను మేనిఫెస్టోలో పెట్టడానికి అంగీకరించారన్నారు. సమావేశంలో గుజ్జ కృష్ణ, రవీందర్, నీల వెంకటేశ్, భూపేశ్ సాగర్, తాండూరు గోపీనాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి కొమిరెడ్డి రాములు సస్పెన్షన్

మధుయాష్కీపై దాడి చేయడమే కారణం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ ఎం.కోదండరెడ్డి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. రాములు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆధారాలతో ఆయనకు గత నెల 18న షోకాజ్ నోటీసు జారీ చేసి వారం రోజుల్లో వివరణివ్వాలని కోరామని, అయినా ఆయన స్పందించకపోవడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఏఐసీసీ కార్యదర్శి మధుయాష్కీ వెళ్లిన సందర్భంగా కోరుట్ల అసెంబ్లీ టికెట్ రాములుకు రాకపోవడానికి యాష్కీనే కారణమని ఆరోపిస్తూ ఆయన వర్గీయులు యాష్కీపై దాడి చేశారు. దీంతో తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని యాష్కీ పార్టీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఫిర్యాదుతో టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ రాములు నుంచి ఎలాంటి వివరణ రాకపోవడంతో సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

'డబుల్' బాధితులను ఆదుకోవాలి: తమ్మినేని



సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో మృతి చెందిన వారి ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాతో ఆదుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. 2 వేల మంది పనిచేస్తున్న చోట కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని ఆ పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రమాదానికి బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఇళ్లు నిర్మించే ప్రాంతాల్లో మరుగుదొడ్లు, మంచినీరు, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసి కూలీలకు హెల్మెట్లు, సేఫ్టీ బెల్టులు, ప్రమాదవశాత్తు కింద పడినా హాని జరగకుండా నెట్ ఏర్పాటు చేయాలన్నారు. కార్మికుల మృతి పట్ల సీపీఎం సంతాపం తెలిపింది.

10 నుంచి 22వరకు బీపీపీఎల్: గూడూరు



సాక్షి, హైదరాబాద్: ఫిబ్రవరి 10 నుంచి 22 వరకు ఐపీఎల్ తరహాలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భువనగిరి పార్లమెంట్ ప్రీమియర్ లీగ్ (బీపీపీఎల్) 20-20 క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం గాంధీభవన్‌లో బీపీపీఎల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు ఐపీఎల్, ఐసీఎల్, సీసీఎల్ క్రికెట్ పోటీలు జరిగాయని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభగల క్రికెటర్ల నైపుణ్యాన్ని వెలికితీయడం కోసం బీపీపీఎల్ నిర్వహిస్తున్నామని చెప్పారు. భువనగిరి పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాలకు చెందిన 8 టీంలతో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతాయని, లీగ్ విజేతకు రూ.1.50 లక్షలు, రన్నరప్‌కు రూ.లక్ష, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.50 వేల బహుమతిని అందజేస్తామని తెలిపారు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌కు రూ.25 వేలు, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌కు రూ.20 వేలు ఇస్తామన్నారు.

నేటి నుంచి పీడీఎం మహాసభలు

హైదరాబాద్: దోపిడీని ప్రశ్నించే హక్కుల నేతలు, కవులు, రచయితల గొంతులు నొక్కేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని వివిధ పౌర, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాజు మాట్లాడుతూ.. ఈ నెల 2, 3, తేదీల్లో దమ్మాయిగూడ, అంబేడ్కర్ నగర్‌లోని రోజ్‌గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రెండో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలను అడ్డుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో సభలు జరుపుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లోనూ సభలు జరిపి తీరతామని స్పష్టం చేశారు. శనివారం (2న) ఉదయం 10 గంటలకు పౌరహక్కుల సంఘం ఉమ్మడి రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ శేషయ్య ప్రారంభోపన్యాసం ఉంటుందని తెలిపారు. ఆదివారం (3న) ప్రజా కళామండలి నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

దివ్యాంగుల శాఖకు సీఎస్ అభినందన


సీఎస్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న శైలజ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి కృషి చేసిన దివ్యాంగుల సంక్షేమ శాఖకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల అవార్డు అందజేసింది. ఈ సందర్భంగా అవార్డు స్వీకరించిన దివ్యాంగుల సంక్షేమ శాఖ సంచాలకులు బి.శైలజ శుక్రవారం సీఎస్‌ను కలిశారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకునేలా కృషి చేయాలని ఈ సందర్భంగా సీఎస్ సూచించారు.

పల్లెల్లో కొత్త పాలన

- నేడు కొలువుదీరనున్న కొత్త పాలక వర్గాలు
- అన్ని పంచాయతీల్లో నేడు మొదటి సమావేశం
- ప్రమాణ స్వీకారం అనంతరం సాధారణ భేటీ
- పంచాయతీల్లో కొత్త సందడి

సాక్షి, హైదరాబాద్: కొత్త పంచాయతీలు శనివారం కొలువుదీరనున్నాయి. పల్లె పోరు ముగిసిన నేపథ్యంలో ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఎన్నికైన పంచాయతీ ప్రజా ప్రతినిధుల ప్రమాణ స్వీకారంతో పాటు కొత్త గ్రామ పంచాయతీల తొలి సమావేశాలతో గ్రామాలు కళకళలాడనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతలుగా దాదాపు నెల రోజుల పాటు సాగిన ఎన్నికలు పూర్తయ్యాక పదవీ స్వీకారాలతో పల్లెలు కొత్త సవాళ్లకు సిద్ధమవుతున్నాయి. ఇటీవలి ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల పదవీ కాలం శనివారం (ఫిబ్రవరి 2) నుంచి మొదలవుతుందని పంచాయతీరాజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ రోజు నుంచే పంచాయతీల కొత్త పాలకవర్గాల పదవీకాలం మొదలవుతోంది. అన్ని గ్రామపంచాయతీల్లోనూ కొత్త పాలకవర్గాల ప్రమాణ కార్యక్రమానికి అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కోర్టు కేసులు ఇతరత్రా కారణాలతో ఎన్నికలు జరగని పంచాయతీలు మినహా శనివారం పదవీ స్వీకారం చేసిన పాలకవర్గాల పదవీకాలం ఐదేళ్లపాటు కొనసాగనుంది. ఎన్నికలు జరగని పంచాయతీలు, ఇంకా గడువు ముగియని పంచాయతీలకు పంచాయతీ రాజ్ శాఖ విడిగా అపాయింటెడ్ డేను ప్రకటించనుంది. గ్రామీణ స్థానిక సంస్థల ప్రతినిధులకు ముఖ్యంగా పంచాయతీ సర్పంచ్‌లకు కొత్త పంచాయతీరాజ్ చట్టంతో సహా గ్రామస్థాయిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం తదితర కార్యక్రమాల గురించి సమగ్ర అవగాహన కల్పించే చర్యలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయి అభివృద్ధిలో భాగస్వాములను చేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో సర్పంచ్‌లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నారు.

త్వరలోనే శిక్షణ

కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు ఈ నెల 11 నుంచి విస్తృతస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం భావించినా ఈ కార్యక్రమం కొన్ని రోజులు వాయిదా పడింది. సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చే అధికారుల శిక్షణ కార్యక్రమం ఈ నెల 4 నుంచి మొదలుకానుంది. 15 జిల్లాలకు చెందిన అధికారులకు ఫిబ్రవరి 4 నుంచి 8 వరకు మిగతా 15 జిల్లాల అధికారులకు ఆ తర్వాత మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇస్తారు. పంచాయతీ చట్టంపై అవగాహనతో పాటు, శిక్షణ కార్యక్రమాల్లో తగిన అనుభవమున్న 10 మంది అధికారులకు ఒక్కో జిల్లా నుంచి (ఒక ఎంపీడీవో, ఒక ఈవోపీఆర్‌డీ, ఒక పంచాయతీ సెక్రటరీతో పాటు ఏడుగురు విశ్రాంత ఉద్యోగులు) శిక్షణ ఇస్తారు. రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) కింద ఇండక్షన్ ట్రైనింగ్ ఇవ్వడం తప్పనిసరి కాబట్టి ఈ శిక్షణకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో శిక్షకులకు శిక్షణ ముగిశాక ఒక్కో జిల్లాలో కొత్త సర్పంచ్‌లకు రెండు బ్యాచ్‌ల (వంద మంది) చొప్పున పంచాయతీ చట్టాలు, విధులు, అధికారాలు, తదితర ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ శిక్షణ కార్యక్రమం మార్చి 15 వరకు ముగించే అవకాశాలున్నాయని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు వెల్లడించారు.


టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని అమెరికా కాన్సుల్ జనరల్ కేథరిన్ హడ్డా శుక్రవారం ప్రగతిభవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా అమెరికాలో సంక్షోభంలో చిక్కుకున్న తెలుగు విద్యార్థుల సమస్యను కేటీఆర్ ఆమె దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించాలని అమెరికాను కోరుతున్నట్లు తెలిపారు.

'ఓటుకు కోట్లు'లో ఈడీ ఎంట్రీ!

- రూ. 50 లక్షల సంగతి తేల్చేందుకు రంగంలోకి..
- మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డికి నోటీసులు
- వారం లోపల తమ ఎదుట హాజరుకావాలని ఆదేశం
- కేసులోని ఇతర నిందితులకు తాఖీదు యోచనలో ఈడీ

సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు కోట్లు కేసు కీలక మలుపు తిరిగింది. దాదాపు మూడున్నరేళ్ల క్రితం టీడీపీ అధినేత చంద్రబాబు తెలంగాణలో ఎమ్మెల్యేల కొనుగోలుకు కుట్ర పన్నిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ మొదలుపెట్టింది. దీంతో మూడేళ్లుగా స్తబ్దుగా ఉన్న కేసులో ఈడీ ఎంట్రీతో టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నట్లు తెలుస్తోంది.

ఆ రూ. 50 లక్షలు తేల్చండి...

ఎమ్మెల్యేల కొనుగోలు విషయంలో నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు ఇవ్వజూపిన రూ.50 లక్షల వ్యవహారాన్ని తేల్చాలని గతంలోనే దర్యాప్తు విభాగమైన అవినీతి నిరోధక శాఖ ఈడీకి లేఖ రాసింది. దీంతో తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్)నమోదు చేసింది. అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు ఇచ్చేందుకు యత్నించిన రూ.50 లక్షలు ఎక్కడివో చెప్పాలంటూ ఎమ్మెల్సీగా పోటీ చేసిన వేం నరేందర్‌రెడ్డికి శుక్రవారం ఈడీ నోటీసులు జారీ చేసింది. గచ్చిబౌలి రోలింగ్‌స్టోన్‌హిల్స్‌లోని ఆయన నివాసంలో ఈడీ అధికారులు ఈ నోటీసులు అందించారు. అలాగే కేసుకు సంబంధించిన పలు అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది. వారం రోజుల్లోపల బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అధికారులు నరేందర్‌రెడ్డికి స్పష్టం చేసినట్లు తెలిసింది.



వాళ్లకి కూడా...

ఓటుకు కోట్లు కేసులో ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, సెబాస్టియన్, ఉదయ్‌సింహా, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో ఇప్పటికే వీరంతా అరెస్టయి బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే వేం నరేందర్‌రెడ్డికి మాత్రం ఈడీ నోటీసులు జారీ చేయగా, మిగిలిన వాళ్లకి సైతం ఈడీ నోటీసులు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ కేసులో ఏసీబీ ఇప్పటికే చార్జిషీట్‌తో పాటు సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసింది. నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌తో చంద్రబాబు మాట్లాడిన సంభాషణలకు సంబంధించిన ఆడియో టేపులను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ ద్వారా నిర్ధారణ టెస్టులు చేయించారు. స్టీఫెన్‌సన్‌తో మాట్లాడింది చంద్రబాబే అని ఏసీబీ దాఖలు చేసిన చార్జిషీట్లలోనూ అనేక సార్లు పేర్కొంది. తాజాగా ఈడీ ఎంట్రీతో మరోసారి ఓటుకు కోట్లు కేసు సంచలనంగా మారింది. ఈ కేసులో ప్రధాన కుట్రదారుడు, సూత్రధారిగా ఉన్న చంద్రబాబు వ్యవహారంలో ఏసీబీ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.

అందులో బాబు పేరు తప్పదు...

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగడంతో చంద్రబాబు వ్యవహారం మరిన్ని ఆధారాలతో తేలబోతోందని ఏసీబీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అసలు ఆ రూ.50 లక్షలు వైట్ మనీనా.. లేకా నల్లధనమా.. అన్న విషయంలో ఈడీ విచారణ జరుపనుందన్నారు. ఈడీ విచారణ పూర్తి చేయగానే అసలు సూత్రధారి అయిన బాబుపై కూడా మరో సప్లిమెంట్ చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఏసీబీలోని కీలక అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

నిరుద్యోగం పెరుగుదలకు క్షమాపణ చెప్పాలి

మోదీని డిమాండ్ చేసిన సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం

సాక్షి, హైదరాబాద్: ఐదు దశాబ్దాల్లో ఎప్పుడూ లేనంతగా దేశంలో నిరుద్యోగం పెరిగినందుకు ప్రధాని నరేంద్రమోదీ క్షమాపణలు చెప్పాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నేషనల్ శాంపిల్ సర్వే(ఎన్‌ఎస్‌ఎస్) ప్రకారం నిరుద్యోగం పెరగగా, రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ప్రసంగంలో అది తగ్గినట్టుగా పేర్కొనడం ద్వారా వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఎన్‌ఎస్‌ఎస్ నివేదికను పార్లమెంట్ ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మఖ్దూంభవన్‌లో ఆ పార్టీ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డిలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ నేతృత్వం లోని ఎన్డీయే ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల వల్ల నిరుద్యోగం పెరిగిందని, ప్రభుత్వరంగాన్ని పెంచాల్సింది పోయి, ప్రైవేట్ రం గాన్ని ప్రోత్సహించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మేకిన్ ఇండియా అనేది బోగస్ నినాదమని విమర్శించారు. విదేశాల నుంచి వచ్చి పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించిన దాఖలాల్లేవని పేర్కొన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ రంగ అను కూల ధోరణి వల్ల దేశంలో తలెత్తిన పరిస్థితులకు బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.


మాట్లాడుతున్న చాడ. చిత్రంలో సురవరం

బీజేపీతో టీఆర్‌ఎస్ లాలూచీ కుస్తీ

పార్లమెంట్‌లో బీజేపీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తామంటూ టీఆర్‌ఎస్ చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉందని సురవరం అన్నారు. నాలుగేళ్లలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి అంశానికి టీఆర్‌ఎస్ మద్దతు తెలిపిందని, ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీతోపాటు ప్రతిపక్ష కాంగ్రెస్‌పట్ల కూడా వ్యతిరేక వైఖరినే టీఆర్‌ఎస్ అవలంబిస్తుందంటే ఆ పార్టీకి బీజేపీతో ఉన్న లాలూచీ బయటపడుతోందన్నారు.


50 రోజులుగా మంత్రులు లేకపోవడం ఏమిటీ?: చాడ

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి యాభైరోజులు గడిచినా మంత్రులు లేకుండానే ప్రభుత్వాన్ని నిర్వహించడం సీఎం కేసీఆర్ ఒంటెత్తు పోకడకు నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. పూర్తిస్థాయి కేబినెట్ లేకపోవడంతో ప్రజాసమస్యలపై తక్షణ చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందని, దీనిని ప్రభుత్వ వైఫల్యంగా భావిస్తున్నామన్నారు. పంచాయతీ ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావంతోపాటు విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పంచాయతీలకు నిధులు, విధులను వెంటనే కేటాయించాలని చాడ డిమాండ్ చేశారు.

ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుపై వైఖరి చెప్పండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులకు సంబంధించి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసే విషయంలో వైఖరి తెలియచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సినీ పరిశ్రమలో అసంఘటిత వర్గంగా ఉన్న మహిళల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను కూడా వివరించాలంది. తదుపరి విచారణను ఈ నెల 12కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. సినీ పరిశ్రమలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ వి.సంధ్యారాణి, మరో ఆరుగురు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇటీవల సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాది వసుధా నాగరాజ్ వాదనలు వినిపిస్తూ సినీపరిశ్రమలో జరుగుతున్న లైంగిక వేధింపులపై సమగ్ర దర్యాప్తు జరిపేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఇందు కోసం ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ఇందులో మహిళాహక్కుల కార్యకర్తలు, హోం, కార్మిక, మహిళా సంక్షేమ శాఖలతోపాటు సినీ పరిశ్రమకు చెందినవారికి స్థానం కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.



2,119 మంది చిన్నారుల రెస్క్యూ

నెల రోజులు సాగిన ఆపరేషన్ స్మైల్ ఐదో దఫా కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: బాల కార్మికులుగా, బెగ్గింగ్ మాఫియాలో బలిపశువులుగా బాల్యాన్ని కోల్పోతున్న చిన్నారులను రెస్క్యూ చేసేందుకు ప్రారంభించిన ఐదో దఫా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ముగిసింది. జనవరి 1న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 2,119 మంది చిన్నారులను బాలకార్మిక వ్యవస్థ నుంచి విముక్తి కల్పించినట్టు మహిళా భద్రతా విభాగం ఐజీ స్వాతిలక్రా శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణ పోలీస్‌తో పాటు మహిళా శిశుసంక్షేమ శాఖ, ఆరోగ్యశాఖ, కార్మిక శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా తప్పిపోయిన చిన్నారులను ఫేస్ రికగ్నైజేషన్ టూల్ దర్పన్ ఉపయోగించి తల్లిదండ్రుల చెంతకు చేర్చినట్టు తెలిపారు. వీరిలో మైనర్ బాలురు 1,653 మంది, మైనర్ బాలికలు 466 మంది ఉన్నారని పేర్కొన్నారు. 1,303 మంది చిన్నారులను తల్లిదండ్రులు, సంరక్షులకు అప్పగించగా, 816 మందిని రెస్క్యూ హోంకు తరలించినట్టు వెల్లడించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 763 మంది ఉన్నారన్నారు. చిన్నారులతో వెట్టిచాకిరి చేయిస్తున్న వారిపై 58 కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

వ్యాపారవేత్త జయరామ్ అనుమానాస్పద మృతి

- కృష్ణా జిల్లా ఐతవరం వద్ద కారులో మృతదేహం లభ్యం
- మిస్టరీగా కేసు నమోదు చేసిన నందిగామ పోలీసులు

సాక్షి, అమరావతిబ్యూరో/నందిగామ: ప్రముఖ వ్యాపారవేత్త, ఎన్నారై చిగురుపాటి జయరామ్ (55) అనుమానాస్పదంగా మృతి చెందారు. కృష్ణా జిల్లా నందిగామ మండలం ఐతవరం వద్ద కారులో ఆయన మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఇతర డాక్యుమెంట్లను పరిశీలించిన పోలీసులు.. కారులోని మృతదేహం చిగురుపాటి జయరామ్‌దేనని గుర్తించారు. కార్లో వెనక సీట్లో కూర్చున్న ఆయన తలపై బలమైన గాయాలున్నాయి. రోడ్డు ప్రమాదం జరిగిన దాఖలాల్లేవు. కారులో మద్యం సీసాలు లభ్యమయ్యాయి.

అసలేం జరిగింది?

రెండ్రోజుల క్రితం జయరామ్ హైదరాబాద్ నుంచి విజయవాడ బయల్దేరినట్లు.. ఆయనతోపాటు మరో వ్యక్తి కూడా కారులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. జయరామ్ కుటుంబం ప్రస్తుతం అమెరికాలో నివాసముంటుండగా.. ఆయన తల్లిదండ్రులు విజయవాడ కానూరులో ఉంటున్నారు. హైదరాబాద్‌లోని తన ఇంటి నుంచి బుధవారం జయరామ్ ఒంటరిగా బయటకు స్వయంగా కారు డ్రైవ్ చేసుకుని వెళ్లారు. గురువారం సాయంత్రం తాను విజయవాడ వస్తున్నానని బసకు ఏర్పాట్లు చేయాల్సిందిగా తన సిబ్బందికి మెసేజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆయన ఫోన్ నుంచి వెళ్లిన చివరి మేసేజ్ అదే. తరువాత కొద్ది గంటల్లోనే ఆయనను హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు విచారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి చెప్పారు. బెజవాడకు చెందిన జయరామ్.. 1993లో అమెరికాకు వెళ్లారు. అక్కడే స్థిరపడి వివిధ సంస్థలను నడిపారు. ఫ్లోరిడాలోని సైప్రెస్ ట్రస్ట్ కంపెనీకి చైర్మన్, సీఈవోగా సేవలందిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ టీవీని కూడా స్థాపించారు. తర్వాత నష్టాలు రావడంతో దాన్ని మూసేశారు.



పడకేసిన ప్రాథమిక వైద్యం

- పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది కొరతతో అందని సేవలు
- విధులకు డుమ్మా కొట్టే సిబ్బందితోనూ రోగులకు తిప్పలే
- 24 గంటలు సేవలందించే ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)లో వైద్య సేవలు పడకేశాయి. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది లేక గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందడం లేదు. సిబ్బంది ఖాళీలను పూర్తి స్థాయిలో భర్తీ చేయకపోవడంతో వైద్యం చేసే నాథుడు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని చోట్ల వైద్య సిబ్బంది విధులకు డుమ్మా కొడుతుండటంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలుచోట్ల ఆస్పత్రులకు వస్తున్న గర్భిణులు సైతం అక్కడ వైద్య సిబ్బంది లేక వెనుదిరుగుతున్నారు. దీంతో స్థానికంగా ఉండే ఆర్‌ఎంపీలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

294 వైద్య పోస్టుల ఖాళీలు..

పీహెచ్‌సీలు గ్రామాల్లో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తుంటాయి. చిన్నచిన్న అనారోగ్య సమస్యలు మొదలు ఒకస్థాయి వరకు అక్కడ వైద్య సేవలు పొందొచ్చు. టీకాలు వేయడం కూడా పీహెచ్‌సీల ద్వారానే జరుగుతోంది. తెలంగాణ సామాజిక అభివృద్ధి నివేదిక-2017 ప్రకారం రాష్ట్రంలో 668 పీహెచ్‌సీలున్నాయి. వాటిల్లో 24 గంటలు పనిచేసేవి కూడా కొన్ని ఉన్నాయి. వాటిల్లో ప్రసవాలు సైతం చేస్తారు. అత్యవసర వైద్య సేవలూ అందుబాటులో ఉంటాయి. వీటిల్లో ఇద్దరు వైద్యులు, ముగ్గురు నర్సులు, ఒక సహాయకుడు ఉండాలి. కానీ అనేకం ఖాళీగా ఉన్నాయి. మొత్తం పీహెచ్‌సీల్లో 1,318 అల్లోపతి వైద్యుల పోస్టులకు గాను, 1,024 మంది వైద్యులే పనిచేస్తున్నారు. ఇంకా 294 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని ఖాళీలను భర్తీ చేసినా పట్టణ పీహెచ్‌సీలతో కలుపుకుంటే 350 ఖాళీలున్నట్లు ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు 'సాక్షి'కి తెలిపారు. చాలా ఆస్పత్రుల్లో వైద్యులు కూడా విధులకు వెళ్లకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారిపై పర్యవేక్షణ కూడా లేదు. దీంతో గ్రామాల్లో ప్రాథమిక వైద్యం అందడం గగనంగా మారింది. కేసీఆర్ కిట్ పథకం ప్రవేశ పెట్టిన తర్వాత ప్రసవాల కోసం గర్భిణులు ఎక్కువగా 24 గంటల పీహెచ్‌సీలకు వస్తున్నారు. అయితే అక్కడా సరైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో వారు దూర ప్రాంతాలకు వెళ్లలేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.



ఇతర వైద్య సిబ్బంది ఖాళీలూ అధికమే...

పీహెచ్‌సీలతోపాటు సబ్‌సెంటర్లలో 9,141 మంది ఆరోగ్య కార్యకర్తలు పనిచేయాల్సి ఉండగా, 7,705 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 1,436 ఖాళీలున్నట్లు సదరు నివేదిక తెలిపింది. పీహెచ్‌సీల్లో ఆరోగ్య సహాయకులు 1,111 మంది ఉండాల్సి ఉండగా, 944 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 167 ఖాళీ లున్నాయి. సీహెచ్‌సీలు మొదలుకుని పీహెచ్‌సీల్లో లేబొరేటరీ టెక్నీషియన్లు 765 మంది ఉండాల్సి ఉండగా, 566 మందే పనిచేస్తున్నారు. ఇంకా 199 ఖాళీలున్నాయి. వాటిల్లో నర్సులు 1,666 మంది ఉండాల్సి ఉండగా, 1,453 మందే ఉన్నారు. ఇంకా 213 ఖాళీలున్నాయి. పీహెచ్‌సీల్లో బ్లాక్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేటర్ పోస్టులు 633 ఉండాల్సి ఉండగా, 544 మంది పనిచేస్తున్నారు. ఇంకా 89 ఖాళీలున్న ట్లు నివేదిక తెలిపింది. పీహెచ్‌సీల్లో ఖాళీలున్నమాట వాస్తవమేనని, త్వరలో సర్దుబాటు చేసి వాటిని పటిష్టం చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

నేటి నుంచి గేట్

సాక్షి, హైదరాబాద్: ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్) పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను ఫిబ్రవరి 2, 3, 9, 10 తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు ఐఐటీ మద్రాస్ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. రోజూ రెండు షిఫ్టులుగా మొత్తం 8 షిఫ్టులలో ఈ పరీక్షలను నిర్వహించనుంది. ఉదయం పరీక్ష 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్ష 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు కొనసాగనుంది. రాష్ట్రంలోని హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, కోదాడ పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు ఉద్యోగాల భర్తీలో గేట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటుండటంతో గేట్ రాసే వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. 24 సబ్జెక్టులలో నిర్వహించే గేట్ స్కోర్‌కు మూడేళ్ల వ్యాలిడిటీ ఉంటుంది. దేశ వ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది గేట్‌కు హాజరు కానుండగా, తెలుగు రాష్ట్రాలనుంచి దాదాపు లక్షన్నర మంది హాజరయ్యే అవకాశం ఉంది.

జేఈఈ మెయిన్-2 ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: ఎన్‌ఐటీ, ఇతర జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో బీప్లానింగ్/బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ మెయిన్ పేపరు-2 పరీక్ష ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. జనవరి 8 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన ఈ పరీక్షకు దేశ వ్యాప్తంగా 1,80,052 మంది దరఖాస్తు చేసుకోగా, 1,45,386 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జి.ఎన్.లక్ష్మీనారాయణ, జి.రఘునందన్‌రెడ్డి 100 పర్సంటైల్‌ను సాధించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది.

'ట్యూటర్' ఇంటర్వ్యూ మార్కులు విడుదల

సాక్షి, హైదరాబాద్: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో ట్యూటర్ (నాన్ క్లినికల్) పోస్టులకు సంబంధించిన ఇంటర్వ్యూ మార్కుల జాబితాను టీఎస్‌పీఎస్సీ శుక్రవారం ప్రకటించింది. అనాటమీ, సైకాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఫార్మాకాలజీ విభాగాల్లోని ట్యూటర్ పోస్టులకు టీఎస్‌పీఎస్సీ గతనెల 30న ఇంటర్వ్యూలు నిర్వహించింది. వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

ఆ పోస్టుల ఇంటర్వ్యూ జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌లో రేడియోలాజికల్ ఫిజిక్స్, ఫిజిసిస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీలో భాగంగా నిర్వహించిన ఇంటర్వ్యూ మార్కుల జాబితాను టీఎస్‌పీఎస్సీ శుక్రవారం ప్రకటించింది. వీటికి సంబంధించిన ఇంటర్వ్యూలు గతనెల 30న నిర్వహించినట్లు పేర్కొంది. వివరాలు www.tspsc.gov.in లో పొందవచ్చని సూచించింది.

మార్చిలో టీఎస్‌సెట్ నోటిఫికేషన్

హైదరాబాద్: మార్చి మొదటి వారంలో తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్‌సెట్)-2019 నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఉస్మానియా యూనివర్సిటీ సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ యాదవరాజు తెలిపారు. లెక్చరర్ ఉద్యోగాల అర్హత కోసం ఓయూ నిర్వహిస్తున్న టీఎస్‌సెట్ జూన్‌లో ఉంటుందన్నారు. పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ టెస్ట్ రాయడానికి అర్హులని పేర్కొన్నారు. గత టీఎస్‌సెట్-2018లో అర్హత సాధించిన అభ్యర్థులు సర్టిఫికెట్లు తీసుకోవాలని సూచించారు.

నిబంధనల ప్రకారమే ఆ పోస్టు భర్తీ

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ద్వారా తనకు అన్యాయం జరిగిందంటూ కోర్టును ఆశ్రయించిన శ్రావ్య అనే అభ్యర్థి చేసిన ఆరోపణలకు టీఎస్‌పీఎస్సీ శుక్రవారం వివరణ ఇచ్చింది. నిబంధనల ప్రకారమే స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) టీచర్ పోస్టును భర్తీ చేశామని పేర్కొంది. లోకల్ అభ్యర్థి అయిన తనకు కాదని వేరే జిల్లా అభ్యర్థిని ఎంపిక చేశారని శ్రావ్య ఆరోపించింది. నోటిఫికేషన్ ప్రకారం మెదక్ జిల్లాలో ఓపెన్ కేటగిరీలో మహిళ, ఎస్సీ మహిళ రెండు పోస్టులున్నాయి. ఇందులో ఓపెన్ కేటగిరీ (మహిళ) లో మెరిట్ మార్కులు సాధించిన ఏ జిల్లా అభ్యర్థిని అయినా అర్హులుగా పరిగణిస్తారు. లోకల్ అభ్యర్థిని ఎంపిక చేయాలనే నిబంధన లేదు. శ్రావ్యకు 50.254 మార్కులు రాగా, తనకంటే ఎక్కువ మార్కులు 51.269 వచ్చిన రంగారెడ్డి జిల్లా అభ్యర్థిని ఎంపిక చేసినట్లు టీఎస్‌పీఎస్సీ పేర్కొంది. టీఆర్‌టీ ద్వారా భర్తీ చేయనున్న స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) పోస్టులు 9 ఉండగా అందులో శ్రావ్యకు రాష్ట్ర వ్యాప్తంగా 8 వ ర్యాంకు, జిల్లాలో మొదటి ర్యాంకు గమనార్హం.

సీట్ల కుదింపు విరమించుకోవాలి

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో కేటాయిస్తున్న సీట్లను కుదించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌ఓ) డిమాండ్ చేసింది. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ పాపిరెడ్డిని కలసి వినతిపత్రం అందించింది. అలాగే లేటరల్ ఎంట్రీ విద్యార్థులందరికీ సరిపడే విధంగా యూనివర్సిటీల్లో సీట్లను పెంచాలని కోరింది.

పనిచేస్తున్న బ్యాంకుకే టోపీపెట్టిన మేనేజర్

సాక్షి, హైదరాబాద్: పనిచేస్తున్న బ్యాంకుకే టోపీపెట్టిన మేనేజర్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరకాల(కంఠాత్మకూర్) బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న నరేన్ చౌదరి, హన్మకొండకు చెందిన రాజేశ్‌కుమార్, పోస్టల్‌కాలనీకి చెందిన డి.శ్రీనివాస్‌లతో కలిసి రూ.2.15కోట్ల కుంభకోణానికి పాల్పడట్లు ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ రాజగోపాలన్ సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపిన దర్యాప్తు అధికారులు... రాజేశ్, శ్రీనివాస్‌లు కొన్ని నకిలీ సంస్థలను ఏర్పాటు చేసి, వాటి వ్యాపార కార్యకలాపాల నిమిత్తం బ్యాంకు నుంచి రూ.2.15 కోట్ల రుణాలు పొందారని, ఈ వ్యవహారంలో బ్యాంకు మేనేజర్ వారితో కుమ్మక్కయ్యారని గుర్తించారు. ఈ మేరకు ముగ్గురుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీబీఐ డీఐజీ తెలిపారు.

ప్రసాద్ ఐమ్యాక్స్‌పై సెంట్రల్ ట్యాక్స్ విచారణ

రూ.100 దాటిన టికెట్లపై జీఎస్టీ తగ్గించకపోవడమే కారణం

సాక్షి, హైదరాబాద్: ప్రసాద్ ఐమ్యాక్స్ థియేటర్‌పై సెంట్రల్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ విచారణ చేపట్టింది. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించిన విధంగా రూ.100 దాటిన సినిమా టికెట్లపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించకుండానే ప్రేక్షకుల నుంచి రుసుము వసూలు చేస్తున్నారనే కారణంతోనే ఈ విచారణ చేపట్టినట్లు సమాచారం. వాస్తవానికి ఈ ఏడాది జనవరి 1 నుంచి అన్ని థియేటర్లలో ఈ తగ్గించిన రుసుము సినిమా టికెట్లపై వసూలు చేయాల్సి ఉంది. అయితే, సినిమా థియేటర్లు దీన్ని అమలు చేస్తున్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించేందుకు కస్టమ్స్ శాఖ పరిధిలోని ప్రత్యేక విభాగం అధికారులు కొన్ని థియేటర్లను పరిశీలించగా, ఐమ్యాక్స్ థియేటర్‌లో తగ్గించలేదని తేలింది. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా సేకరించిన కస్టమ్స్ విభాగం దీనిపై విచారణ జరిపించేందుకు రాష్ట్ర స్థాయి స్క్రీనింగ్ కమిటీకి సంబంధిత అధికారులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ కమిటీ ఆమోదం లభిస్తే ప్రసాద్ ఐమ్యాక్స్ థియేటర్‌పై మరోమారు పూర్తిస్థాయి విచారణ చేస్తారని తెలిసింది.

గిన్నిస్ బుక్‌లో 'గాంధీ ఆస్పత్రి'

గంటలో 11,416 మందికి బీపీ పరీక్షలు

హైదరాబాద్: తెలంగాణ వైద్యప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి చరిత్రలో మరో మైలురాయి అధిగమించింది. గంట వ్యవధిలో అత్యధిక బీపీ పరీక్షలు నిర్వహించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఆస్పత్రి సెమినార్ హాలులో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ రాజారావు, వైద్యులు వినయ్‌శేఖర్, ఆర్‌ఎంవోలు జయకృష్ణ, శేషాద్రి, సత్యరత్న వివరాలను వెల్లడించారు. గతేడాది సెప్టెంబర్ 24న గాంధీ ఆస్పత్రిలో గంట వ్యవధిలో 11,416 మందికి బ్లడ్‌ప్రెషర్ (బీపీ) రీడింగ్‌లు నమోదు చేశారు. దేశంలోని 37 కేంద్రాల్లో ఏకకాలంలో ఈ ప్రక్రియ కొనసాగగా, అత్యధికంగా బీపీ పరీక్షలు నిర్వహించి గాంధీ ఆస్పత్రి గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుందని వివరించారు. ఈ మేరకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ నుంచి శుక్రవారం అధికారికంగా సర్టిఫికెట్ అందిందని తెలిపారు. ఆస్పత్రి పాలనా యంత్రాంగంతో పాటు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సంయుక్త సహకారంతో గిన్నిస్ రికార్డ్స్‌లో గాంధీ ఆస్పత్రి పేరు నమోదైందని వారు హర్షం వ్యక్తం చేశారు.



మేడ్చల్ జిల్లాలో బియ్యం పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న అకున్ సబర్వాల్ ఇతర అధికారులు

అంగన్‌వాడీలకు రేషన్ ద్వారా బియ్యం

ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం పౌరసరఫరాల శాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింది. అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం పంపిణీలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం కోసం వేలిముద్రల ఆధారంగా రాష్ట్రంలో ఉన్న 35,700 అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపంలో ఉన్న రేషన్‌షాపుల్లో ఈ-పాస్ యంత్రాల ద్వారా బియ్యం పంపిణీ ప్రక్రియను చేపట్టింది. ఇందుకోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న మొత్తం 72 వేల మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్ల ఆధార్‌తోపాటు వేలిముద్రలను ఈ-పాస్ మెషీన్లకు నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ (ఎన్‌ఐసీ) సహకారంతో అనుసంధానం చేసింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో శుక్రవారం పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. మేడ్చల్ జిల్లాలోని కొన్ని రేషన్ షాపుల్లో బియ్యం సరఫరా ప్రక్రియను, అంగన్‌వాడీ కేంద్రాల్లో బియ్యం నాణ్యతను మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.జగదీశ్వర్, డైరెక్టర్ విజయేందిర బోయి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ పరిశీలించారు. బియ్యం పంపిణీలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పౌరసరఫరాల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో పనిచేయాలని అకున్ సభర్వాల్ సూచించారు. కాగా, రేషన్‌షాపుల ద్వారా వేలిముద్రలతో బియ్యం సరఫరాతో అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. దీంతో ప్రభుత్వానికి నిధులు ఆదా కానున్నాయి.

లక్నో కేంద్రంగా కాల్ రూటింగ్!

- హైదరాబాద్ సహా నాలుగు మెట్రోల్లో బ్రాంచ్‌లు
- విదేశాల్లోనూ ఏజెంట్ల ఏర్పాటు
- గుట్టురట్టు చేసిన యూపీ ఏటీఎస్ టీమ్
- హైదరాబాద్ రానున్న ప్రత్యేక దర్యాప్తు బృందం

సాక్షి, హైదరాబాద్: హైటెక్ పద్ధతిలో ఇంటర్నేషనల్ కాల్స్‌ని వాయిస్ ఓవర్ ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ (వీఓఐపీ) పద్ధతిలో లోకల్ కాల్స్‌గా మారుస్తున్న కాల్ రూటింగ్ ఎక్స్ఛేంజ్ దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నట్లు ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (యూపీ ఏటీఎస్) అధికారులు గుర్తించారు. గురువారం అర్ధరాత్రి అక్కడి లాల్‌బాగ్ ఏరియాలో దాడులు చేసి ఓ ఎంబీఏ విద్యార్థిసహా ముగ్గురిని పట్టుకున్నారు. వీరి విచారణ నేపథ్యంలోనే ఈ ప్రధాన ఎక్స్ఛేంజ్‌కు హైదరాబాద్‌లోనూ ఓ బ్రాంచ్ ఉన్నట్లు తేలింది. వివరాలు సేకరించిన ఏటీఎస్ ఇక్కడి వారిని పట్టుకోవడానికి త్వరలో ఓ ప్రత్యేక బృందాన్ని పంపనుంది.

ఇలా 'రూటు' మళ్లిస్తారు..

విదేశాల నుంచి ఓ వ్యక్తి చేసే ఫోన్ కాల్ అక్కడి ఎక్స్ఛేంజ్ నుంచి నేషనల్ లాంగ్ డిస్టెన్స్ ఆపరేటర్‌కు చేరతాయి. అక్కడ నుంచి ఇంటర్నేషనల్ గేట్ వే ఆఫ్ ఐఎల్‌డీ ఆపరేటర్‌కు వచ్చి అక్కడ నుంచి ఆప్టికల్ ఫైబర్ కేబుల్ లేదా శాటిలైట్ ద్వారా మన దేశానికి వస్తాయి. ఇక్కడకు చేరిన ఫోన్‌కాల్ ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతాల్లో ఉన్న ఇంటర్నేషనల్ గేట్‌వే ఆఫ్ ఐఎల్‌డీ ఆపరేటర్, నేషనల్ లాంగ్ డిస్టెన్స్ ఆపరేటర్, బీఎస్‌ఓ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా ఇక్కడ కాల్ రిసీవ్ చేసుకునే ఫోన్‌కు వస్తుంది. ఈ విధానం మొత్తం సెకను కన్నా తక్కువ కాలంలోనే పూర్తవుతుంది. ఈ సేవలు అందించినందుకు ఇక్కడి ఇంటర్నేషనల్ గేట్‌వే ఆఫ్ ఐఎల్‌డీ ఆపరేటర్, నేషనల్ లాంగ్ డిస్టెన్స్ ఆపరేటర్, బీఎస్‌ఓ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లకు సైతం విదేశీ కాల్ ఆపరేటర్లు కొంత మొత్తాన్ని చెల్లిస్తారు. ఈ మొత్తం చెల్లించకుండా తప్పించుకోవడానికి అక్కడి కాల్ ఆపరేటర్లే ఇక్కడ వ్యవస్థీకృత ముఠాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దేశం నుంచి ఓ కాల్ విదేశాలకు వెళ్ళాలంటే (ఔట్ గోయింగ్) కచ్చితంగా అది సర్వీస్ ప్రొవైడర్ ద్వారానే జరగాలి. విదేశాల నుంచి వచ్చే ప్రతి ఫోన్ కాల్ పైనా ఏజెన్సీల నిఘా ఉంటుంది. అనుమానాస్పద దేశాలు, వ్యక్తులు, నెంబర్ల నుంచి వచ్చే వాటిని ట్యాప్ కూడా చేస్తారు. ఇందుకు ఉపకరించే సాధనాలు దేశంలోని



నాలుగు ప్రధాన నగరాల్లో ఉన్న ఇండియన్ ఇంటర్నేషనల్ గేట్‌వే ఐఎల్‌డీ ఆపరేటర్ల వద్ద ఉంటాయి. వారికి చిక్కకుండా హైటెక్ పద్ధతిలో ఇంటర్నేషనల్ కాల్స్‌ని వాయిస్ ఓవర్ ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ పద్ధతిలో లోకల్ కాల్స్‌గా మారుస్తుంటారు. విదేశీ ఆపరేటర్లు ఇక్కడి ఏజెన్సీలకు డబ్బు చెల్లించకుండా ఉండేందుకు, కొన్ని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి ఉపకరించే విధంగా ఓ విధానాన్ని రూపొందించారు. ఇక్కడ ఉంటున్న కొంత మందికి ఇంటర్‌నెట్ ద్వారా ఎరవేసి అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేసేలా చేస్తారు. అలా ఏర్పాటయిన తరవాత విదేశంలో ఉన్న ఇంటర్నేషనల్ గేట్‌వే ఆఫ్ ఐఎల్‌డీ ఆపరేటర్‌కు వచ్చిన ఫోన్ కాల్ అక్కడ డేటాగా మారిపోతుంది. దాన్ని ఇంటర్‌నెట్ ద్వారా నేరుగా ఇక్కడి వారిని ఎరవేసి ఏర్పాటు చేయించిన అత్యాధునిక పరికరాలకు పంపిస్తారు. వీరి దగ్గర ఉండే గేట్‌వేలు ఈ డేటాను మళ్లీ కాల్‌గా మారుస్తాయి. వాటిని అనుసంధానించి ఉన్న సీడీఎమ్ఏ ఎఫ్‌డబ్ల్యూటీలకు చేరుతుంది. స్థానికంగా (లోకల్) బోగస్ వివరాలతో తీసుకున్న ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డులను సేకరించి ఈ సీడీఎమ్ఏ ఎఫ్‌డబ్ల్యూటీలను తయారు చేస్తారు. గేట్‌వే నుంచి వీటికి వెళ్లిన అంతర్జాతీయ కాల్ లోకల్‌గా మారిపోయి ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డునకు చెందిన నెంబరు (లోకల్) నుంచి వస్తున్నట్లు ఆ ఫోన్ అందుకునే వారికి కనిపిస్తుంది. దీని వల్ల విదేశాల్లో ఉండే వ్యక్తికి సైతం కాల్‌ఛార్జ్ తగ్గుతుంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి...

ఈ కాల్ రూటింగ్ గ్యాంగ్‌లో మహారాష్ట్రకు చెందిన ఎంబీఏ గ్రాడ్యుయేట్ సచిన్‌రాజ్ ఇస్సాక్, లక్నో, వారణాసిలకు చెందిన డిగ్రీ విద్యార్థులు చంచల్ మిశ్రా, సుజీత్ సింగ్ కీలక పాత్రధారులుగా ఉన్నారు. వీరు హైదరాబాద్‌తో పాటు వారణాసి, ముంబై, చెన్నైల్లో కొందరి సహకారంతో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కడికక్కడ స్థానికులకు వీటి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ రూటింగ్ వల్ల దేశంలోని అనేక ఆపరేటర్లకు రావాల్సిన ఆదాయం, ప్రభుత్వానికి రావాల్సిన పన్ను దెబ్బతింటుంది. ఇలా దేశంలోని సర్వీసు ప్రొవైడర్ల ఆదాయానికి గండి కొట్టడం ద్వారా విదేశీ సర్వీసు ప్రొవైడర్ ఆ మొత్తాన్నీ మిగుల్చుకుంటున్నాడు. ఇక్కడ అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేసి సహకరించిన స్థానికులకు హవాలా రూపంలో కమీషన్ పంపిస్తారు. ఈ లక్నో గ్యాంగ్ చెన్నై, నేపాల్, ఫిలిప్పీన్స్, శ్రీలంకలోనూ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుంది. వీరి వ్యవహారాలను గుర్తించిన యూపీ ఏటీఎస్ గురువారం సచిన్, చంచల్, సుజీత్‌లను అదుపులోకి తీసుకుంది. సాధారణంగా ఈ తరహా కాల్స్‌ను ఎక్కువగా ఉగ్రవాదులు, అసాంఘికశక్తులు వాడుతుంటారు. యూపీలోని అనేక ప్రాంతాలు వీటికి అడ్డాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రూటింగ్ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఏజెంట్లపై దాడులు చేయడానికి టీమ్స్ సిద్ధం చేశారు.

హాస్టళ్లు 2,245.. బకాయిలు రూ.66 కోట్లు!

- విద్యుత్ బకాయిలు చెల్లించాలని సంక్షేమాధికారులకు ట్రాన్స్‌కో నోటీసులు
- లేకుంటే వసతి గృహాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామంటూ హెచ్చరికలు
- గతేడాది నుంచి కరెంటు చార్జీలను విడుదల చేయని ప్రభుత్వం
- కరెంటు కోతలు విధిస్తే పరీక్షల ముందు విద్యార్థులకు ఇబ్బందులే..

సాక్షి, హైదరాబాద్: వివిధ సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాలకు ట్రాన్స్‌కో షాకిచ్చింది. ఏళ్లుగా పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను తక్షణమే చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు సంక్షేమ వసతి గృహాలకు హెచ్చరికలు పంపింది. పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడంతో వసతి గృహ సంక్షేమాధికారులు ఉన్నతాధికారుల వద్ద మొర పెట్టుకుంటున్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలో 2,245 సంక్షేమ హాస్టళ్లున్నాయి. ఇందులో 7 వందల హాస్టళ్లు పోస్టుమెట్రిక్ విద్యార్థులవి కాగా.. మిగతా 1,545 ప్రీమెట్రిక్ హాస్టళ్లు. వీటి పరిధిలో 3.14 లక్షల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. గత వార్షిక సంవత్సరం నుంచి వసతి గృహాలకు విద్యుత్ చార్జీల చెల్లింపునకు బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో వసతి గృహ సంక్షేమాధికారులు హాస్టల్ బిల్లులను చెల్లించకుండా జాప్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌కో అధికారులు బకాయిల చెల్లించాలని కోరుతూ నోటీసులు పంపుతున్నారు.

గతేడాది జనవరి నుంచే బ్రేక్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,245 వసతి గృహాలకు సంబంధించి విద్యుత్ బిల్లులు గతేడాది జనవరి నుంచి చెల్లించడం లేదు. బీసీ సంక్షేమ శాఖకు చెందిన హాస్టళ్లకు సంబంధించి అంతకు ముందు నుంచే బిల్లులు చెల్లించడం లేదు. ఈ క్రమంలో దాదాపు రూ.66 కోట్లు ట్రాన్స్‌కోకు బకాయిపడ్డాయి. ఇందులో అత్యధికంగా బీసీ సంక్షేమ శాఖకు చెందిన వసతి గృహాల బిల్లు రూ.28 కోట్లు, ఎస్టీ సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్ల బిల్లులు రూ.20 కోట్లు, ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలోని హాస్టళ్ల విద్యుత్ బిల్లు రూ.18 కోట్ల చొప్పున పేరుకుపోయాయి. వీటిని తక్షణమే చెల్లించాలని ట్రాన్స్‌కో అధికారులు సంక్షేమ శాఖపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. నెలాఖరు నాటికి బకాయిలు చెల్లించకుంటే కరెంటు కోతలు పెడతామని హెచ్చరిస్తున్నారు. కనీసం విడతల వారీగా చెల్లించినా సరిపోతుందని సూచిస్తున్నప్పటికీ.. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకపోవడంతో అధికారులు సైతం చేతులెత్తేస్తున్నారు.



కోతలతో విద్యార్థులకు ఇక్కట్లే..

విద్యుత్ బిల్లుల బకాయిల పేరిట కరెంటు సరఫరా నిలిపేస్తే హాస్టళ్లలో పరిస్థితి దారుణంగా మారనుంది. ప్రస్తుతం పరీక్షల సీజన్ కావడంతో విద్యార్థులంతా వాటికి సన్నద్ధమవుతున్నారు. పదో తరగతి విద్యార్థులతో పాటు పోస్టుమెట్రిక్ హాస్టళ్లలోని విద్యార్థులు ఇంటర్మీడియట్, డిగ్రీ తదితర పరీక్షలకు ఎక్కువగా రాత్రి వేళల్లోనే సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో కరెంటు సరఫరా నిలిచిపోతే విద్యార్థులకు ఇబ్బందులు తప్పవు. పగలంతా స్కూళ్లు, కాలేజీల్లో గడిపే విద్యార్థులకు రాత్రి సమయమే కీలకం. ఇలాంటి తరుణంలో కరెంటు లేకుంటే వారి భవిష్యత్తు అంధకారమవుతుందని సంక్షేమాధికారులు అభిప్రాయపడుతున్నారు.

సివిల్ డ్రెస్సుల్లో దాడులా?

- మీకో యూనిఫాం ఉంది.. దానిపై పేరూ, కోడ్ ఉంటాయి
- ఇష్టానుసారం వ్యవహరిస్తామంటే కుదరదు
- పరిధి దాటి వ్యవహరించడం మంచిది కాదు
- కరీంనగర్ పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: పోలీసులు సివిల్ డ్రస్సుల్లో వెళ్లి దాడులు (రైడ్స్) చేయడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. పోలీసులకు యూనిఫాం, దానిపై పోలీసు పేరు, కోడ్ ఉంటాయని గుర్తు చేసింది. యూనిఫాంను పక్కన పెట్టి సివిల్ డ్రస్సుల్లో వెళ్లి ఇష్టానుసారం వ్యవహరిస్తామంటే కుదరదని స్పష్టం చేసింది. ఇటువంటి చట్ట వ్యతిరేక చర్యలను ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పింది. హైకోర్టు ఆదేశాలున్నా కూడా, వాటిని పట్టించుకోకుండా సివిల్ డ్రస్సులో వెళ్లి ఓ రిసార్ట్‌లో దాడులు చేయడాన్ని తప్పుపట్టింది. నేరశిక్షాస్మృతి (సీఆర్‌పీసీ) కంటే పోలీసులు ఉత్తర్వులు గొప్పవని కావన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని పోలీసులకు హితవు పలికింది. పోలీసులు తమ పరిధిని దాటి వ్యవహరించరాదని స్పష్టం చేసింది. తమ ఆదేశాలకు విరుద్ధంగా దాడులకు చేసిన పోలీసులను ఎంత మాత్రం ఉపేక్షించేది లేదంది. ఈ కేసులో హాజరు కావాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ)కి స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రమ్మీ చట్ట విరుద్ధం కాదని హైకోర్టు చెప్పినప్పటికీ పోలీసులు కరీంనగర్‌లోని తమ రిసార్ట్‌పై తరచూ దాడులు చేస్తుండటాన్ని ప్రశ్నిస్తూ పుష్పాంజలి కంట్రీ రిసార్ట్ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన హైకోర్టు.. పుష్పాంజలి రిసార్ట్‌పై దాడులు చేయరాదని పోలీసులను ఆదేశించింది. అయినా కూడా పోలీసులు తమ వైఖరిని మార్చుకోకపోవడంపై రిసార్ట్ యాజమాన్యం కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ విచారించారు. కోర్టు ఆదేశాలు ఉన్నా కూడా దాఖలు చేయడాన్ని న్యాయమూర్తి తప్పుపటారు. అందులోనూ సివిల్ డ్రస్సులో వెళ్లి దాడులు చేస్తుండటంపై విస్మయం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను సహించేది లేదని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదని తేల్చి చెప్పారు.



సేవింగ్స్ ఖాతాలకు వడ్డీలేని రుణాల పైకం

సాక్షి, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల (వీఎల్‌ఆర్) కింద విడుదల చేసే మొత్తాన్ని ఈ సంఘాల రుణ ఖాతా (లోన్ అకౌంట్)కు బదులు సేవింగ్స్ అకౌంట్స్‌కు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. వడ్డీ లేని రుణాల కింద డబ్బు విడుదల చేసే సమయానికి ఈ సంఘాల లోన్ అకౌంట్లు చాలామటుకు మూతపడుతుండడంతో వచ్చే రుణాలు తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో వీఎల్‌ఆర్ డబ్బును సేవింగ్స్ ఖాతాల విడుదలకు, గతంలో రెండు జీవోల ద్వారా మంజూరు చేసిన రూ.672 కోట్లు ఇప్పుడు ఈ ఖాతాలకు విడుదల చేసేందుకు సెర్ప్ సీఈవో చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించింది. శుక్రవారం ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శివికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, గ్రామ సమాఖ్య సహాయకులకు గౌరవ వేతనం చెల్లింపు కింద అయ్యే ఖర్చును భరించేందుకు రూ.41.58 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం పాలనాపరమైన మంజూరునిచ్చింది.

అమూల్యమైన ఆరోగ్యనిధి 'భగీరథ': స్మితా సబర్వాల్

కార్యాచరణ, నిర్వహణ విధానాలు, మార్గదర్శకాలపై వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: మిషన్ భగీరథతో రాష్ట్రంలోని భావితరాలకు వెలకట్టలేని ఆరోగ్య నిధిని ప్రభుత్వం అందిస్తోందని ఆ ప్రాజెక్టు కార్యదర్శి స్మితా సబర్వాల్ పేర్కొన్నారు. వ్యయ ప్రయాసల కోర్చి ప్రతీ ఇంటికి తీసుకొస్తున్న తాగునీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనన్నారు. మిషన్ భగీరథ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్‌ఎం)పాలసీ, మార్గదర్శకాలపై రెండ్రోజులుగా జరుగుతున్న వర్క్ షాప్‌నకు స్మితా సబర్వాల్ హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ, ఇంజనీర్లు, సిబ్బంది అంకితభావంతోనే రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి శుద్ధిచేసిన తాగు నీరు సరఫరా చేసే కృషి సాగుతోందన్నారు.

వివిధ అంశాలపై ప్రజెంటేషన్లు...

మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, నీటి సరఫరా అంశాలపై చీఫ్ ఇంజనీర్ విజయ్ ప్రకాశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 24 గంటలు తాగునీటిని సరాఫరా చేయడంలో ఉన్న సాధ్యాసాధ్యాలపై ''అస్కీ''డైరెక్టర్ శ్రీనివాస చారి ప్రజెంటేషన్ ఇచ్చారు. కృత్రిమ మేథ (ఏఐ) ఉపయోగించి రోజువారీ నీటి వినియోగం, లీకేజీలను సమర్థవంతంగా లెక్కగట్టొచ్చని 'స్మార్ట్ టెర్రా'ప్రతినిధి గోకుల్ వివరించారు. కాగా, రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో మంచినీరు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు, నీటి సంబంధిత వ్యాధులపై సర్వే చేసినట్లు యూనిసెఫ్ ప్రతినిధులు తెలిపారు. సర్వేలో గమనించిన సమస్యలన్నీ భగీరథతో పరిష్కార మవుతాయని చెప్పారు.

లేని వ్యాపారంతో 200 కోట్ల దందా!

- ఇన్వాయిస్‌లు మార్పిడి చేసుకుంటూ దందా
- దాదాపు రూ.36.41 కోట్ల మేర జీఎస్టీ టోకరా
- రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విస్తరించిన ముఠా
- నలుగురిని అరెస్టు చేసిన డీజీజీఐ

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న బడా వ్యాపారులు నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి, లిక్విడ్ క్యాష్ ఏర్పాటు చేసుకోవడానికి భారీ పథక రచన చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో చిన్న వ్యాపారులతో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని ఏడాది కాలంగా బోగస్ ఇన్వాయిస్‌ల దందా చేపట్టారు. వాస్తవంగా లేని ఇనుముతో వ్యాపారం చేసిన 7 కంపెనీలు రూ.200 కోట్ల టర్నోవర్ సృష్టించాయి. ఈ మొత్తాన్ని దారి మళ్లిస్తూ చెల్లించాల్సిన జీఎస్టీని మాత్రం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌లో (ఐటీసీ) లెక్కలు చూపిస్తూ ప్రభుత్వానికి రూ.36.41 కోట్ల నష్టం వాటిల్లేలా చేశారు. గుట్టుగా సాగుతున్న ఈ దందాపై సమాచారం అందుకున్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) అధికారులు 2 నెలలుగా వరుసదాడులు చేస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో అరెస్టు చేసిన వ్యాపారి సహా మొత్తం నలుగురిని కటకటాల్లోకి పంపారు. సాధారణంగా సరుకు సరఫరా చేసే వ్యాపారులు/సంస్థలు సరుకుతో పాటు ఇన్వాయిస్‌ను ఖరీదు చేసుకునే వారికి అందిస్తారు. దీని ఆధారంగానే ఆ సరుకు ఖరీదు చేసిన వ్యక్తి డబ్బు ఆన్‌లైన్‌లో సరఫరా చేసిన వారికి ఇస్తుంటాడు. ఈ నేపథ్యంలోనే ఆ మేరకు జీఎస్టీని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అయితే వ్యాపారుల వెసులుబాటు కోసం ప్రభుత్వం జీఎస్టీ తక్షణం చెల్లించకుండా ఐటీసీలో చూపించే అవకాశం కల్పించింది. ఇందులో ఉన్న లోపాలకు అధ్యయనం చేసిన కొందరు బడా వ్యాపారులు దాదాపు ఏడాది క్రితం భారీ స్కామ్‌కు తెరలేపారు. ఎంపిక చేసుకున్న వ్యాపారుల వద్ద లేని ఇనుప టీఎంటీ బార్స్‌ను తమకు సరఫరా చేసినట్లు ఇన్వాయిస్‌లు సృష్టించారు. ఆ మేరకు డబ్బును వారి ఖాతాల్లోకి బదలాయించారు. ఆపై వారు ఈ మొత్తాన్ని డ్రా చేసి మళ్లీ బడా వ్యాపారులకే ఇస్తూ వచ్చారు. ఇలా చేసినందుకు వారి నుంచి కొంత మొత్తం కమీషన్‌గా తీసుకుంటున్నారు. ఎక్కడా కేజీ ఇనుము కూడా లేకుండా ఈ పంథాలో మొత్తం 7 కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి ఏడాదిలో రూ.200 కోట్ల వ్యాపారాన్ని సృష్టించేశాయి. ప్రతి లావాదేవీలోనూ జీఎస్టీని చెల్లించాల్సి ఉండగా.. ఈ లేని వ్యాపారంలో అలా చేస్తే నష్టం వస్తుందనే ఉద్దేశంతో ఆ పన్నును ఐటీసీలో చూపిస్తూ కాలం గడిపేస్తున్నారు.

2 నెలల కిందట రంగంలోకి డీజీజీఐ..

ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న హైదరాబాద్‌లోని డీజీజీఐ కార్యాలయం 2 నెలల క్రితం దర్యాప్తు చేపట్టింది. 15 రోజుల క్రితం నగరంలో ఇద్దరిని, 3 రోజుల క్రితం వైజాగ్‌లో ఒకరిని, శుక్రవారం హైదరాబాద్‌లోనే మరో వ్యాపారిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించింది. ఈ దందాలో బడా వ్యాపారులు తమ బ్లాక్ మనీని వైట్‌మనీగా మార్చుకుంటున్నారని డీజీజీఐ అధికారులు అనుమానిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అనేక కంపెనీలు లంచాలు తదితరాలు ఇవ్వాల్సి వస్తుంది. అలాంటి వాటికి అవసరమైన నగదు కంపెనీకి చెందిన ఖాతాల నుంచి చెల్లించలేవు. దీంతో ఇలాంటి వాటి కోసం వినియోగించడానికి లిక్విడ్ క్యాష్ సమకూర్చుకోవడానికి ఈ విధానం వినియోగిస్తున్నారని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేయడానికి డీజీజీఐలో ప్రత్యేక బృందాలు ఏర్పడ్డాయి.



సాక్షి
శనివారం, ఫిబ్రవరి, 2

ఎన్నికల బడ్జెట్

గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఓటేసిన వర్గాలను నరేంద్రమోదీ ప్రభుత్వం ఎట్టకేలకు కనికరించింది. పదవీకాలం ముగుస్తుండగా 'కొసమెరుపు'లా వరాల జల్లు కురిపించి వారిని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తింది. శుక్రవారం 'తాత్కాలిక బడ్జెట్' ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి పియూష్ గోయెల్ ప్రధానంగా అటు చిన్న సన్నకారు రైతులను, ఇటు మధ్యతరగతిని సమ్మోహనపరచడానికి ప్రయత్నించారు. ఇతరేతర వర్గాలకూ ఎన్నో తాయిలాలు పంచారు. అయిదెకరాల లోపు ఉన్న రైతులకు ఏడాదికి రూ. 6,000 మూడు దఫాలుగా ఇస్తామని ప్రకటించారు. ఈ నగదును నేరుగా కేంద్రమే రైతులకు బదిలీ చేస్తుంది. గత డిసెంబర్ నుంచి ఇది అమల్లోకొస్తుంది. అంటే ఎన్నికల ముందు దేశ వ్యాప్తంగా 12 కోట్ల మంది రైతులకు రూ. 2,000 చొప్పున అందుతాయి. వేతన జీవుల ఆదాయ పన్ను పరిమితిని రూ. 5 లక్షలకు పెంచడం, 60 ఏళ్ల వయసుపైబడిన అసంఘటిత రంగ కార్మికులకు నెలకు రూ. 3,000 చొప్పున పెన్షన్ పథకం వంటివి సహజంగానే ఆ వర్గాలను ఆకట్టుకుంటాయి. తాజా ప్రతిపాదనలతో ఆదాయపన్ను పరిధి నుంచి తప్పుకునేవారి సంఖ్య 3 కోట్లు ఉండొచ్చునని అంచనా. అలాగే 10 కోట్లమంది అసంఘటిత కార్మికులు పెన్షన్ లబ్ధి పొందుతారని లెక్కేస్తున్నారు. పదవీకాలం ముగుస్తున్న ప్రభుత్వం ఓటాన్ అకౌంట్‌తో సరిపెట్టడమే సంప్రదాయంగా వస్తోంది. మోదీ సర్కారు కూడా దీన్ని తాత్కాలిక బడ్జెట్ అని చెబుతోంది. కానీ బడ్జెట్ ప్రతిపాదనలు గమనిస్తే ఇవి మూడు నెలల కాలానికి ఉద్దేశించినవి కాదని సులభంగానే తెలుస్తుంది. కొత్తగా పన్నులు విధించడం లేదా ఉన్న పన్నుల్ని తగ్గించడం, ప్రభుత్వ వ్యయాన్ని పెంచే ప్రతిపాదనలు చేయడం వగైరాలకు ఫైనాన్స్ బిల్లు సవరించవలసిన అవసరం ఏర్పడుతుంది. నిష్క్రమిస్తున్న ప్రభుత్వం ఇలా తదుపరి ప్రభుత్వానికి భారం కలిగించరాదన్నది ఓటాన్ అకౌంట్ సంప్రదాయంలోని ఉద్దేశం. లోక్‌సభకూ, రాష్ట్రాల అసెంబ్లీలకూ జమిలి ఎన్నికలు జరపడంపై నిర్మాణాత్మక చర్చ సాగించాలని ఆమధ్య నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఎప్పుడూ ఏవో ఎన్నికలు ముంచుకొస్తున్నందువల్ల అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతున్నదని ఆయన ఫిర్యాదు. కానీ తరచు ఎన్నికలు వస్తే బడ్జెట్‌లు ఎంత బాగుంటాయో తాజా బడ్జెట్ చూశాక అందరికీ అర్థమవుతుంది.

ఇది పూర్తి స్థాయి బడ్జెట్టా, తాత్కాలికమా అన్న వివాదం సంగతలా ఉంచి ఇందులో సాధారణ రైతుల్ని పట్టించుకుని వారికి ఏదోమేర ఉపశమనం కలిగించడానికి ప్రయత్నించడం హర్షించదగ్గ విషయం. నిజానికి రైతులకు ఆర్థిక ఆసరా కల్పించి వారి కష్టాలను తీర్చడానికి ప్రయత్నించే పథకాన్ని దేశంలోనే మొట్టమొదటిసారి ప్రకటించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. 'వైఎస్సార్ రైతు భరోసా' కింద ప్రతి ఏడాది మే నెలలో రైతులకు రూ. 12,500 చొప్పున అందజేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి రెండేళ్లక్రితం చెప్పారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం 'రైతుబంధు', ఒడిశా 'కలియా', జార్ఖండ్ 'ముఖ్యమంత్రి కృషి యోజన'వంటి పథకాలను ప్రకటించాయి. ఇప్పుడు కేంద్రం కూడా ఆ వరసలో చేరింది. అయితే నిజంగా రైతులకు లబ్ధి చేకూర్చదల్చుకుంటే తాజా పథకం వారి కష్టాలను ఏమాత్రం తీర్చదు. అలా తీరాలంటే 2014 ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ చేసిన వాగ్దానాన్ని అమలు చేయాలి. స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సుకు అనుగుణంగా సాగు దిగుబడికయ్యే వ్యయానికి అదనంగా 50 శాతం చేర్చి కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) నిర్ణయిస్తామని ఆ మేనిఫెస్టో చెప్పింది. నిజానికి సాగు వ్యయం అయిదారేళ్లుగా అపారంగా పెరిగింది. విత్తనాలు మొదలుకొని ఎరువులు, పురుగు మందులవరకూ అన్నిటి ధరలు మండుతున్నాయి. సాగు ఉపకరణాలకిచ్చే సబ్సిడీలు కొన్నేళ్లుగా కనుమరుగయ్యాయి. ఏటా కేంద్రం విడుదల చేసే ఆర్థిక సర్వేలే రైతు వార్షికాదాయం గరిష్టంగా రూ. 20,000 మించడం లేదని చెబుతున్నాయి. ఇంటిల్లిపాదీ కష్టపడటంతోపాటు కూలీలను కూడా నియమించుకుని పనిచేసే రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 6,000(నెలకు రూ. 500) ఏ మూలకు సరిపోతాయి?

ఈ బడ్జెట్‌లో అత్యంత కీలకమైన గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ. 60,000 కోట్లు కేటాయిస్తూ చేసిన ప్రతిపాదన నిరాశ కలిగిస్తుంది. అయితే అవసరమనుకుంటే దీన్ని పెంచుతామని మంత్రి గోయెల్ హామీ ఇస్తున్నారు. నిరుటి బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 55,000 కోట్లు కేటాయించారు. మళ్లీ అవసరాలు పెరగడంతో ఆ కేటాయింపులు రూ. 61,084 కోట్లకు చేరాయి. అయితే ఈసారి ఆ మొత్తాన్ని మరింత పెంచకపోగా రూ. 1,084 కోట్లు కోత విధించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. చట్ట నిబంధనలకు అనుగుణంగా దీన్ని సక్రమంగా కొనసాగించడానికి కనీసం రూ. 80,000 కోట్లు అవసరమవుతాయని ఆ రంగంలోని ప్రజాసంఘాలు చెబుతున్నాయి. విద్యారంగానికి చేసిన కేటాయింపులు కూడా నిరాశ కలిగిస్తాయి. నిరుడు ఆ రంగానికి రూ. 85,010 కోట్లు కేటాయిస్తే, ఇప్పుడది 10శాతం పెరిగి రూ. 93,847 కోట్లకు చేరుకుంది. ఇది ఏమూలకూ సరిపోదని విద్యారంగ నిపుణులు చేస్తున్న వాదనలో నిజముంది. విద్య, ఉద్యోగావకాశాల్లో పేదలకు పది శాతం కోటా కల్పిస్తూ గత నెలలో సర్కారు నిర్ణయించింది. ఉన్నత విద్యాసంస్థల్లో అది అమలు కావాలంటే అదనంగా 25 శాతం సీట్లు పెంచాలి. ఇంత స్వల్ప మొత్తం అదనపు అవసరాలకు ఏమాత్రం చాలదు. ఇక ఇతర ఉన్నత సంస్థల సంగతి చెప్పనవసరం లేదు. రక్షణ వ్యయం 7 శాతం పెరిగి అది రూ. 3లక్షల కోట్లు దాటింది. ఆంధ్రప్రదేశ్‌కు ఈ బడ్జెట్‌లో ఎప్పటిలాగే మొండిచేయి చూపారు. ఈ ఎన్నికల సంవత్సరంలోనైనా రైల్వేజోన్, ప్రత్యేక హోదా వంటి వాగ్దానాలను పరిశీలించేందుకు, సానుకూల నిర్ణయం తీసుకునేందుకు కేంద్రం ప్రయత్నించలేదు. తాజా జనాకర్షణ బడ్జెట్ మరికొన్ని నెలల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఏమేరకు ఓట్లు రాబడుతుందో వేచిచూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి బ.త్రయోదశి రా.9.41 వరకు తదుపరి చతుర్దశి, నక్షత్రం పూర్వాషాఢ రా.12.29 వరకు తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం ఉ.8.58 నుంచి 10.41 వరకు దుర్ముహూర్తం ఉ.6.35 నుంచి 8.05 వరకు, అమృతఘడియలు... రా.7.19 నుంచి 9.03 వరకు, శనిత్రయోదశి.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం: 5.52
రాహుకాలం : ఉ. 9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

మన్మోహన్ కంటే ఘనుడు మోదీ!


శేఖర్ గుప్తా

యూపీఏ ప్రధాని మన్మోహన్ సింగ్ కంటే ఎన్డీఏ ప్రధాని నరేంద్ర మోదీనే ఎక్కువ మార్కులు కొట్టేశారన్నది ఏరకంగా చూసినా వాస్తవమే. బడా రుణ ఎగవేతదారుల వంచనకు అడ్డుకట్టలు వేయడం, ఆహార ధరలను కనీస స్థాయికి తగ్గించడం, ప్రభుత్వ రాబడిని మౌలిక వసతుల కల్పనపై పెట్టి స్థూలదేశీయోత్పత్తిని వృద్ధి చెందించడం వంటి అంశాల్లో గతంలోని ప్రభుత్వాల కంటే మోదీ ప్రభుత్వం మెరుగ్గా వ్యవహరించింది. పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా పెద్దనోట్ల రద్దు వంటి అకాల చర్యలు చేపట్టడంతో విమర్శలు చెలరేగినప్పటికీ, వినియోగదారుల సంతృప్తి వంటి కొన్ని అంశాల్లో నరేంద్ర మోదీ మంచి మార్కులే సాధించారు.

జాతిహితం



మీ ఓటింగ్ ప్రాధాన్యతలు ఎవరివైపు మొగ్గు చూపుతున్నాయి అనే అంశం ఆధారంగా చూసినట్లయితే, మోదీ ప్రభుత్వం గత అయిదేళ్ల కాలంలో ఆర్థిక వ్యవస్థను మరీ గొప్పగా నడిపిందీ లేదు, అలాగని పూర్తిగా విధ్వంసకరంగా నిర్వహించారని చెప్పడానికీ లేదు. మోదీ పాలనలో ఆర్థిక వ్యవస్థ డేటాను చూసి మాట్లాడమని ఆయన అభిమానులు చెబుతుంటారు. మోదీ విమర్శకులు కూడా ప్రతివాదం చేస్తూ డేటానే చూడాల్సిందిగా చెబుతుంటారు. కానీ అభిమానులుగా మీరు రూపొందిస్తున్న డేటా అబద్ధాలకుప్ప అయినప్పుడు దాన్ని మేం ఎలా అంచనా వేయాలని అడుగుతారు? ఈ అంశంపై ఇరుపక్షాల నిపుణులనూ యుద్ధం చేసుకోనిద్దాం. తర్వాత మోదీ హయాంలో అయిదేళ్లపాటు సాగిన రాజకీయ అర్థశాస్త్రం తీరుతెన్నుల గురించి విస్తృతస్థాయిలో పరిశీలిద్దాం.

త్వరలో మోదీ అయిదేళ్ల పాలన ముగియనున్నందువల్ల, ఈ అయిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సరిగా వ్యవహారాలను నడిపిన అయిదు అంశాలను జాబితాకు ఎక్కిద్దాం. ఈ అంశాన్ని రాజకీయాలు లేక రాజకీయ అర్థశాస్త్రానికి చెందిన సులోచనాల నుంచే చూస్తున్నాను తప్ప కేవలం అర్థశాస్త్ర దృక్పథం నుంచి మాత్రం కాదని నేను మళ్లీ నొక్కి చెబుతున్నాను. కాబట్టి ఈ కోణంలో ఈ వ్యాసంలో కనిపించే అతి పెద్ద సానుకూలాంశం ఏదంటే ఐబీసీ అమలు. అంటే దివాలా, అప్పుల ఎగవేత కోడ్‌కి చెందిన ప్రక్రియను ఎలా అమలు చేస్తారన్నదే.

ఇంతవరకు 12 మంది రుణ ఎగవేత దారుల్ని మాత్రమే రుణ ఎగవేత వ్యతిరేక విచారణ ప్రక్రియలో నిలబెట్టారన్నది వాస్తవం. కానీ ఈ 12 మంది దేశంలోనే అతి పెద్ద, అత్యంత శక్తిమంతులైన వ్యక్తులు. అయితే దేశంలోని చాలామంది శక్తివంతులైన రాజకీయనేతలు, స్పీడ్ డయల్‌పై బతికేసే ప్రభుత్వ ఉద్యోగులు ఈ రుణ ఎగవేతల నుంచి ఎంత పోగు చేసుకున్నారనేది తర్వాతి అంశంగా మిగులుతుంది. కానీ వీరిలో ఏ ఒక్కరికీ ఒక్క ఫోన్ కాల్ చేసి తమ అపరాధాలనుంచి తప్పించుకోవడం సాధ్యం కాలేదు. చివరకు బలవంతులైన రూయాలు, ఎస్సార్‌లకు కూడా ఇది సాధ్యం కాలేదు. ఇది నిజంగా దేశంలో సరికొత్త రాజకీయ చిత్తశుద్ధికి నిదర్శనం అనే చెప్పాలి.

ఈ అంశాన్ని ఇలా చూద్దాం. ఒక ఫ్రెండ్లీ ఫోన్ కాల్ చేయడం ద్వారా తాము చేసిన తప్పుకు శిక్ష పడకుండా తప్పుకునే లేక వాయిదా వేసుకునే పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు. భారతీయ పెట్టుబడిదారీ విధానంలో మీరు ఇప్పుడు ఒక కొత్త శకంతో వ్యవహరిస్తున్నట్లు తెలుసుకోవాలి. మీ వ్యాపారం విఫలమైనట్లయితేనే దివాలా తీస్తారు. కొత్త శకంలోకి రావాల్సింది పెట్టుబడిదారీ విధానమే కావచ్చు కానీ వ్యాపారంలో వైఫల్యం చెందడం ద్వారా మీరు ఎదుర్కొనవలసిన చేదు నిజాన్ని ఆమోదించాలని సమాజం నేర్చుకోవలసి ఉంది. భారత్‌లో దివాలా తీయడం అనే అంశాన్ని దాచిపెట్టవలసిన కుటుంబ అవమానంగా చూస్తూ వస్తున్నారు.

బాహాటంగా వామపక్ష–సోషలిస్టు స్వభావంతో ఉన్నప్పటికీ, ''ఫోన్ బ్యాంకింగ్'' తరహా రాజ్యవ్యవస్థకు ఈ నేరంలో భాగముంది. నరేంద్రమోదీ ప్రభుత్వం దానికి ముగింపు వాక్యం పలికింది. బడా బాబుల వలువలు ఊడిపోతున్నాయి. ఈ తరహా కార్పొరేట్ డాంబికాలు, ఆడంబరాలు మంటల్లో కాలిపోయిన తర్వాత నూతన భారతీయ పెట్టుబడిదారీ విధానం ఆవిర్భవించగలదు. ఈ పరిణామాన్ని నేనయితే స్వాగతించదగిన తప్పనిసరి అవసరమైన రాజకీయ, సాంస్కృతిక మార్పుగానే చూస్తున్నాను.

ఒకవైపు ముడిచమురు ధరలు పడిపోతున్నప్పటికీ పెట్రోలు ధరలను అధికస్థాయిలో ఉంచినందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం చాలా విమర్శలను ఎదుర్కొంది. కానీ అది యూపీయే హయాంలో ప్రజలు పెట్టిన పెనుకేకల వంటిది కాదు. ఎందుకంటే వినియోగదారు నెల చివరలో తన షాపింగ్ బిల్లు ఎంతయింది కూడా గమనిస్తాడు. మోదీ పాలనాకాలంలో చమురుధరలు బాగా పెరిగాయి కానీ మొత్తం మీద చూస్తే తక్కువ ద్రవ్యోల్బణం ఉంటూ వచ్చింది. ప్రత్యేకించి ఆహారం విషయంలో ఇది మరీ స్పష్టం. మోదీ హయాంలోని ద్రవ్యోల్బణం డేటా అబద్ధాల కుప్ప అని ఎవరూ ఇంకా ఆరోపించడం లేదు. అలాగని జీడీపీ లెక్కల్లాగా దాన్ని మార్చి చూపారని కూడా ఎవరూ ఆరోపించడం లేదు. కాబట్టి మనం న్యాయమైన పోలికను పోల్చవచ్చు.

మోదీ ప్రభుత్వం 2014 వేసవిలో ప్రభుత్వాన్ని ఏర్పర్చినప్పుడు, అంతవరకు దేశాన్ని పాలించిన యూపీఏ–2 ప్రభుత్వం.. వినియోగదారు ధరల ద్రవ్యోల్బణం 8.33 శాతం వరకు పెరిగిన ఆర్థిక వ్యవస్థను మోదీ చేతిలో పెట్టింది. కానీ ఈరోజు అది 2.19 శాతంగా మాత్రమే ఉంది. కాబట్టే చమురుధరలు అధికంగా పెరిగినప్పటికీ ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొన్న విధానం మోదీ ప్రభుత్వానికి రెండో అతి పెద్ద విజయాన్ని కట్టబెట్టింది. గతంలో చాలా ప్రభుత్వాలు చమురుధరలను తగ్గుముఖం పట్టించే విషయంపై ఆపసోపాలు పడుతూ నోటి బలం ఉన్న నగర కులీనులనుంచి శాంతిని కొనుక్కునేవారు.

ధరల రాజకీయం తన సొంత మార్మికతను కలిగివుంది. యూపీఏ–1 హయాంలో వ్యవసాయ పంటలకు కనీస మద్దతుధరలు పెంచినందున, రైతు, రైతుకూలీ ఇరువురూ సంతృప్తి చెందారు. దీంతో యూపీఏ రెండో దఫా కూడా సులభమైన విజయం సాధించేసింది. కానీ దాని రెండో దఫా పాలనలో వినియోగదారు ఆహార ధరలు చుక్కలనంటాయి, దీంతో వీధుల్లో బలమైన అశాంతి పెరిగింది. చివరకు అదే యూపీయే మనుగడను ధ్వంసం చేసింది. ఇప్పుడు మోదీ ప్రభుత్వం వినియోగదారు ఆహార ధరలను బాగా తగ్గించివేసింది. కొన్నింటికి గరిష్ట మద్దతు ధరను పెంచకపోవడంద్వారా, కొన్నింటిని బాగా ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వం ఆహార ధరలను తగ్గించగలిగింది. ఈ క్రమంలో మార్కెట్ శక్తులను కేంద్ర పట్టించుకోలేదు.

ఫలితంగా, రైతు నిండా మునిగాడు, వ్యవసాయ కూలీల కూలీలు పడిపోయాయి. గత మూడు పంట కాలాల్లోనే ఎన్డీఏ ప్రభుత్వం గరిష్ట మద్దతు ధరను పెంచడం ప్రారంభించింది. కాని ఇది కూడా త్వరలోనే తనదైన ప్రభావాన్ని చూపుతుంది. అందుచేత మోదీ అయిదేళ్ల పాలనలో రైతు సర్వం కోల్పోయాడంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్య తప్పే. అటు వినియోగదారు, ఇటు రైతు ప్రయోజనాలు పరస్పరం విభేదించినంత కాలం.. అధిక ధరలు, పంట ధరల తీవ్ర పతనం కారణంగా ప్రభుత్వం అధికారం కోల్పోవడం అన్నది క్రూరమైన రాజకీయ వాస్తవంగానే ఉంటుంది. ఈ చక్రవ్యూహం నుండి ప్రభుత్వాలు బయటపడాలంటే వ్యవసాయ సంస్కరణలను పెద్ద ఎత్తున చేపట్టడమే ఏకైక మార్గం. ఇక్కడే ఎన్డీఏ ప్రభుత్వం విఫలమైంది.

ఇంధన పన్నుల కింద వసూలు చేసిన అదనపు నగదునంతా మోదీ ప్రభుత్వం ఏం చేసినట్టు? ఇలా వచ్చిన భారీ మొత్తాల్లో వేలాది కోట్ల రూపాయలను ఓటర్లకు నజరానాలుగా ఇచ్చేకంటే ఆర్థిక లోటును పూడ్చడానికి వినియోగించడం సరైనదని అనుకుంటాం. జాతీయ రహదారులపై విస్తృతంగా పెట్టుబడులు పెట్టే బదులు, ఓడరేవులు, సాగర మాల ప్రాజెక్టులు, రైలు మార్గాలు, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిపై తగిన దృష్టి పెట్టొచ్చు. ఎందుకంటే, వీటి నుంచి వచ్చిన ఆదాయం కారణం గానే మన స్థూల దేశీయోత్పత్తి గత పదేళ్లలో మూడు రెట్లు పెరిగినట్టు సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది.

ఐదు విజయాలలో నాలుగోదైన పన్నుల చెల్లింపు పెరిగింది. స్థూల దేశీయోత్పత్తిలో 9 నుంచి 12 శాతం పన్నుల నుంచే లభిస్తోంది. ఉన్నత స్థాయిలో చెల్లింపుదారుతో కఠినంగా వ్యవహరిస్తున్నట్టు, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్టు అనిపించినా; కింది, మధ్య స్థాయిల్లోని వారికి సంబంధించి పన్ను విధానం చాలా బాగుంది. చాలా వరకు మధ్యవర్తుల ప్రమేయం లేదు. నిషేధించాల్సిన వ్యాపారాలు లేనట్టయితే, ఏజెన్సీలు ప్రత్యేకంగా దృష్టిసారించనట్లయితే, రాజకీయ బాధితులు కాకపోతే పన్ను చెల్లింపుదారుడికి సమస్యలేమీ లేనట్టే. ఐదవది, చివరిదీ జీఎస్‌టీ. బీజేపీ సొంత కూటమిలోనే దాని సాధక బాధకాలు దానికి ఉన్నాయి. అయినా, అది కొనసాగుతూనే ఉంది.

చాలా విషయాల్లో వైఫల్యాలు కూడా ఉన్నాయి. వ్యవసాయం నుంచి ఎగుమతుల వరకు, తయారీ రంగం నుంచి ఉపాధి కల్పన వరకు, పీఎస్‌యూలను ఆధునీకరించకపోవడం నుంచి సమాచారాన్ని వక్రీకరిస్తున్నారనే చెడ్డపేరు ఉండనే ఉన్నాయి. వీటితోపాటు పిచ్చుకపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించడం లాంటి డీమోనిటైజేషన్ లాంటి చర్యలు కూడా ఉన్నాయి. ఇంకా అనేక అంశాలపై మనం ఫిర్యాదులు చేయొచ్చు. ఈ వారం ఒక ప్రభుత్వం అరుదుగా ప్రదర్శించిన మంచి ఆర్థిక విధానాలను గుర్తిద్దాం.. కేవలం చెత్త రాజకీయాలనే కాదు.

వ్యాసకర్త ద ప్రింట్ ఛైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

జుమ్లా



"ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వపు చివరి జుమ్లా ఇది. గతంలో ప్రవేశపెట్టిన నాలుగు బడ్జెట్లలాగే ఈ మధ్యంతర బడ్జెట్ కూడా ఢిల్లీకి నిరుత్సాహాన్నే మిగిల్చింది. మేము కేంద్ర ప్రభుత్వానికి కడుతున్న పన్నులు సుమారు రూ॥ 325 కోట్ల వరకూ ఉంటాయి. కానీ, స్థానిక సంస్థలకు మాత్రం ఏమీ విదల్చలేదు. ఢిల్లీ తన సొంత ఆర్థిక వనరులపైనే కొనసాగాల్సి ఉంది"

– అరవింద్ కేజ్రీవాల్
ఢిల్లీ సీఎం

కాపీ



"కాంగ్రెస్ ప్రకటనను కాపీ కొట్టినందుకు మధ్యంతర ఆర్థికమంత్రికి కృతజ్ఞతలు. వనరులను మొదట అందుకునే హక్కు దేశంలోని పేదలకు మాత్రమే ఉందని చెప్పాం. ఇది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కాదు, ఇది ఓట్ల కోసం తయారు చేసిన బడ్జెట్"

– పి. చిదంబరం
కేంద్ర మాజీ ఆర్థికమంత్రి


ముఖ్య గమనిక



"ఓ ముఖ్యమైన వివరణ– ఆర్థిక మంత్రి ప్రకటించిన ఆదాయపన్ను రిబేట్ కేవలం ప్రతిపాదన మాత్రమే. దీన్ని జూలై నెలలో ఏర్పడే కొత్త ప్రభుత్వం కొనసాగిస్తేనే అది అమల్లో కొస్తుంది. అప్పుడు ఎవరు అధికారంలో కొస్తారో తెలియదు"

– నిధి రజ్దాన్
ఎన్డీటీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్


శక్తి



"ఇది నిస్సందేహంగా అభివృద్ధికరమైన బడ్జెట్. దూరదృష్టితో రూపొందించిన బడ్జెట్. రైతులకు, పేదలకు అనుకూలంగా ఉండటంతోపాటు భారతదేశంలోని మధ్యతరగతివారి కొనుగోలు శక్తిని మరింత పెంచేలా బడ్జెట్ ఉంది"

– అరుణ్ జైట్లీ, కేంద్ర మంత్రి

రెండు టికెట్లు



"అనిల్ అంబానీకి ముప్ఫై వేల కోట్లు, రైతు కుటుంబంలోని వారికి మూడు రూపాయల ముప్ఫై మూడు పైసలు– సూక్ష్మంగా చెప్పాలంటే ఇదీ మధ్యంతర బడ్జెట్ తీరు. ఐదేళ్లపాటు మధ్యతరగతి వారందరినీ ఫూల్స్‌ను చేసి, ఇప్పుడు సంవత్సరానికి కేవలం రూ.12,500 రాయితీ ఇవ్వడం విడ్డూరం. ఆ మొత్తాన్ని నెలవారీగా లెక్కిస్తే.. నెలకు వెయ్యి రూపాయలకు మించదు. అంటే రెండు మల్టీప్లెక్స్ సినిమా థియేటర్ టిక్కెట్ల ఖరీదంత మాత్రమే బడ్జెట్‌లో రాయితీ ఇచ్చారన్న మాట"

– సంజయ్ ఝా, కాంగ్రెస్ నేత

సాయిబాబకి వైద్య బెయిల్ ఇవ్వాలి

న్యాయస్థానం ఆదేశాలతో ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబని ఆయన సోదరుడు రామ్‌దేవ్‌తో పాటు 2018 డిసెంబర్ 26న కలిశాను. నాగ్‌పూర్ జైలులో ములాఖత్ కిటికీ గుండా కాకుండా, చాలా కాలం తర్వాత నాగ్‌పూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో తనను నేరుగా చూడగలిగాను. తన పరిస్థితి గతంలో నేను ఊహించిన దానికంటే ఘోరంగా ఉంది. దాదాపు కదల్లేని స్థితిలో కనిపించారు. తన చేతులు విడుపులేకుండా వణుకుతున్నాయి. బరువు కూడా బాగా కోల్పోయారు. ఇప్పుడు తనను కుర్చీలోంచి పడకమీదికి మార్చాలంటే కనీసం ఇద్దరు మనుషుల సహాయం అవసరం. డిసెంబర్ 26న వైద్య పరీక్షల సమయంలో కూడా సాయి సోదరుడు, ఒక పోలీసు కలిసి తనను అనేక సార్లు చేతుల మీద ఎత్తుకుని మార్చాల్సి వచ్చింది. ఆ దృశ్యాలను వీడియోగా కూడా తీసి ఉంచాను కాబట్టి గౌరవనీయ న్యాయమూర్తులు కూడా చూసి సాయి పరిస్థితిని అర్థం చేసుకోవాలి. సాయిబాబకు జైల్లో మరిన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. తనను చుట్టుముట్టిన తీవ్ర అనారోగ్య పరిస్థితులను పట్టించుకోకుండా మూత్రాశయంలో రాళ్లను మాత్రమే శస్త్ర చికిత్సతో తీసేస్తామని మాత్రమే ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు. సాయి మొత్తంమీద 19 రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రాణాంతకంగా మారిన గుండె సమస్య, కిడ్నీల్లో రాళ్లు, యూరిన్ ఇన్ఫెక్షన్ వంటి పలు సమస్యలు తనను వెంటాడుతున్నాయి. వైద్యులు సిఫార్సు చేసిన పలు పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో లేవు. అందుకే తనను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్చాలని కూడా వైద్యులు సూచించారు. సాయి ఉంటున్న సెల్ ఓపెన్‌గా ఉండటంతో తనకు తీవ్రంగా చలివేస్తోంది. దీంతో తన కాళ్లు స్తంభించిపోయాయి. అండా సెల్ లోపల ఉష్ణోగ్రత మరింత తక్కువగా కావడంతో తాను నరకం అనుభవిస్తున్నట్లే లెక్క. తన ఎడమ భుజం స్తంభించిపోయినందున వెంటనే ఆయనకు థెరపీ చికిత్స చేయించాలని న్యూరాలజీ విభాగాధిపతి రాశారు. తనకు నిత్యం ఫిజియోథెరపీ అవసరం. కుటుంబ సభ్యుల తోడు లేకుండా అది అసాధ్యం. తీవ్రమైన నొప్పిని అనుభవిస్తూ జీవిత చరమాంకంలో లాగా గడుపుతున్నారు.

జనవరి 24న డిఫెన్స్ కౌన్సిల్ వాదన ముగిసింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 11న ఉంటుంది. సాయిని జైల్లో ఉంచి రెండేళ్లవుతోంది. తనకు మెడికల్ బెయిల్ కోసం అప్లై చేసి 11 నెలలు అవుతోంది. ఈలోగానే తన ఆరోగ్య స్థితి విషమంగా మారింది. ఘన ఆహారం స్వీకరించలేనంత బలహీనంగా ఉన్నారు. 90 శాతం వైకల్యంతో ఉన్న సాయి హక్కులకు తీవ్రంగా భంగం కలుగుతోంది. తరచుగా స్పృహ కోల్పోతున్న సాయిబాబది అక్షరాలా ఇప్పుడు చావు బతుకుల సమస్య. తన ప్రాథమిక మానవ హక్కులను గౌరవ న్యాయస్థానం ఎత్తిపట్టి పూర్తి స్థాయి అంగవైకల్యంతో ఉంటున్న సాయి వైద్య బెయిల్‌ను తదుపరి విచారణలో అయినా మంజూరు చేయాలని కోరుతున్నాను.

వసంత,
ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబ సహచరి

అతి లౌక్య బడ్జెట్!


శ్రీరమణ

అక్షర తూణీరం



మొన్న మహాత్మా గాంధీ అమరుడైన రోజు, ప్రధాని మోదీ స్టూడెంట్ కుర్రాళ్లకి, వారి తల్లిదండ్రులకి, ఉపాధ్యాయులకు ఢిల్లీ తాలక్‌టోరా స్టేడియంలో మంచి క్లాసు పీకారు. 'పరీక్షలు పండగలా ఉండాలి' అనగానే, 'అబ్బో! ఎలక్షన్లు మాత్రం ఉండద్దా' అని ఓ తెలుగు కుర్రాడు గొణిగాడు. 'మీరు పరీక్షల్ని ధైర్యంగా ఎదుర్కోవాలి' అని మోదీ అంటే 'ఆప్ భీ' అన్నదొక హిందీ అమ్మాయి. 'జీవితంలో పరీక్షలు ఒక భాగమే తప్ప జీవిత సర్వస్వం కాదు' అనగానే 'ఎలక్షన్ల లాగా'నే అంటూ ఓ కుర్రాడు అందించాడు. 'పిల్లలెప్పుడూ తుళ్లుతూ నవ్వుతూ ఉండాలి' అన్నారు గంభీరంగా ప్రసంగ ధోరణిలో. అందరూ ఒక్కసారి ఫెళ్లున నవ్వారు. ఎందుకంటే ప్రధాని నవ్వడం వాళ్లెప్పుడూ పొరబాటున కూడా చూడలేదుట.

భారత పూర్వ ప్రధాని చిరునవ్వడం వారి తండ్రి ఒకసారి కళ్లారా చూశారట. మరో ప్రధాని మన్మోహన్ నవ్వడం చూసిన పెద్దలు ఒకరిద్దరా సభలో ఉన్నారట. మోదీయే కాదు, ఆయన మంత్రివర్గంలో కూడా ఎవ్వరూ నవ్వరు. నీతి పరులు గంభీరంగా ఉండాలని నవ్వుతారు. పెద్ద పెద్ద జడ్జీలు, గవర్నర్లు సాధారణంగా నవ్వరు. పిల్లల్ని ఇంకొకరితో పోల్చి తక్కువ చేయవద్దని మోదీ చెప్పారు. బీజేపీ మాత్రం పోల్చుకుని అనవసరంగా పోటీ పడటం దేనికి? రేపు ఎన్నికల్లో తేడాపడితే దేశ సేవ చేయడానికి ఇంకొకరికి సువర్ణ అవకాశం వస్తుంది. మోదీ ఎక్కడున్నా ప్రజాసేవ మితం లేకుండా చెయ్యొచ్చు. స్వేచ్ఛగా బోలెడు ఉద్యమాలు చెయ్యొచ్చు. అసలు ఓం ప్రథమంగా రామమందిర నిర్మాణం మీద మహోద్యమం తీయచ్చు. దీంతో ఏంటంటే గుడి వచ్చినా రాకపోయినా, కొన్ని వర్గాల్లో గొప్ప కీర్తి మిగుల్తుంది. మొన్న పిల్లలకి వైఫల్యం నుంచి విజయం సాధించాలని చెప్పారు. ఇట్లాంటివి చెప్పడానికి భలే ఉంటాయి, కానీ వింటుంటే చెవుల్లో సెగలొస్తాయన్నాడొక స్టూడెంటు.

'చదువు పుస్తకాల్లో మాత్రమే ఉండదు. పుస్తకాల్లోనూ ఉంటుంది'. విన్నావా, మనం కూడా మంత్రులమై ఇట్లా మాట్లాడాలిరా. వీళ్ల కంటే కాషాయ డ్రెస్ వేసుకుని మాట్లాడే ప్యూర్ వేదాంతులు నయమని ఓ అమ్మాయి తెగ వేష్ట పడింది. మా స్కూలు టీచరు, మా గుళ్లో పూజారి వీళ్లు కూడా ఇవే మాటలు చెబుతుంటారు– వినే వాళ్లంటే. పాపం వాళ్లకెవరూ ఉండరు. చాలా పెద్దాయన కాబట్టి ఎక్కడ చూసినా మైకులే– ఎవరూ విన్నా వినకపోయినా. రేడియోలు, టీవీలు మోదీ సందేశాన్ని వినిపించాయ్. అవన్నీ రేపెప్పుడో పుస్తకాలుగా వస్తాయ్. పాఠ్యగ్రంథాలు అవుతాయ్. కానీ ఆయన పవర్‌లో ఉండాలి.

మనమే చచ్చినట్టు నిశ్శబ్దంగా వింటాం. ఇవ్వాళ పెద్ద పెద్ద వాళ్లు బడ్జెట్ సభలో తెగ కేకలు పెట్టారని పిల్లలు అనుకున్నారు. 'ఔను, వాళ్లంటే సాటి సమానస్తులు కదా. వాళ్లకేం భయం' అని కొందరు సమర్థించారు. బడ్జెట్ అన్నా తాయిలాలన్నా ఒకటేనా అని పిల్లలకి ధర్మ సందేహం వచ్చింది. ఎన్నికల ముందే అమ్మనాన్నలకి, మేష్టారికి మంచి చేస్తారెందుకు. ఇంకాస్త ముందు చెయ్యచ్చుకదా అని పిల్లలకి సందేహం వచ్చింది. 'మంచి చేయడానికి ఓటు వేయడానికి ఎక్కువ టైం ఉంటే మర్చిపోరూ' – ఓ పెద్ద కుర్రాడు దీర్ఘం తీశాడు.

అసలిది గొర్రెతోక బడ్జెట్‌ట. కోతి తోకది తర్వాత వస్తుందిట– ఓ పెద్దాయన టీవీలో చెబుతున్నాడు. ఏ తోక అయితేనేంగానీ నేనెప్పుడూ ఏటా బడ్జెట్ ప్రసంగం శ్రద్ధగా వింటా. బంగారం, పెట్రోలు లాంటి వాటిపై పన్నులు రాయితీలు నేనసలు పట్టించుకోను. వాటిమీద ఉండేది కూడా స్వల్పంగానే ఉంటుంది. నాకు వినబుద్ధి అయ్యేవి, గుండు సూదులు, తుంగచాపలు, ఎర్రరంగు మొలతాళ్లు, కుక్కల మెడ బెల్టులు, నిక్కరు గుండీలు, సీళ్లలక్క, చింతరావి మామిడి కొయ్యలతో చేసిన పాంకోళ్లపై పన్ను మినహాయింపు ఇచ్చారు. ఇంకా ఇట్లాంటివే బోలెడుంటాయి. ఈసారి మోదీ బడ్జెట్ అతిలౌక్యంగా కొట్టాడన్నాడొక గ్రామపెద్ద. మావూరి చిన్న టీకొట్లో స్ట్రాంగ్‌గా కావాలా, లైట్‌గా కావాలా అని అడిగితే 'లౌక్యంగా కొట్టు' అనడం అలవాటు. అంటే అటూ ఇటూ కాకుండా అని అర్థం.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

సాధన

మొదటిసారి వేదికనెక్కి ప్రసంగించేటప్పుడు చాలా భయం వేస్తుంది. కాళ్లు, చేతులు వణుకుతాయి. దేహం అంతా చెమటతో తడిసిపోతుంది. ఎందుకింత బాధ అనుకుని రెండోసారి ప్రయత్నించకపోతే మంచి వక్త కావాలనుకునే ఆ వ్యక్తి ఆశయం నెరవేరేదెలా?

ఉపాధ్యాయుడిగా చేరి భావి భారత పౌరులను తీర్చిదిద్దాలనే తీవ్ర కాంక్ష ఉన్న వ్యక్తి మొదటిసారి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులు అల్లరి చేశారని భయపడిపోయి వెనక్కి వచ్చేస్తే అతని లక్ష్యం ఎలా సాధిస్తాడు? ఒక కొత్త పనికి శ్రీకారం చుట్టినప్పుడు మొదటిసారి భయమే వేస్తుంది. ఇది సహజం. రెండోసారి, మూడోసారి అలా ప్రయత్నిస్తుంటే భయం తగ్గుతుంది. ధైర్యం వస్తుంది. తనలోని లోపాలను తనే గుర్తిస్తూ, ఇంకా మెరుగవటానికి నిరంతర సాధన చేస్తే, అనుకున్న రంగాలలో ప్రావీణ్యం సాధించగలుగుతారు.

మనిషి మానసిక, శారీరక వికాసానికి నిరంతర సాధన దోహదం చేస్తుంది. సాధనమున పనులు సమకూరు ధరలోన అన్నారో శతక కారుడు. గాయకులు, నటులు, చిత్రకారులు, వైణికులు ఇలా పలువురు



వారి రంగాలలో ప్రఖ్యాతులు కావటానికి వారి నిరంతర సాధనే కారణం. సాధన చేయకుండా అదృష్టం కలసి రాలేదని, అందుకే ఇలా ఉన్నామని తమను తాము నిందించుకోవటం. సాధనతో సాధించినవారిని ఊరికే ఆక్షేపిస్తూ, విమర్శించటం అవివేకం.

ధ్యానం చేయాలని ప్రారంభించినప్పుడు మొదట్లో పలు ఆలోచనలు వేధిస్తాయి. మనసుకు నిలకడ ఉండదు. ఎక్కువసేపు స్థిరంగా కూర్చోలేరు. సాధన చేయగా చేయగా కొన్ని రోజులకు ధ్యానంలో ఏకాగ్రత కుదురుతుంది. ఋషులు, మునులు నిరంతర సాధనతోనే వారు అనుకున్నవి సాధించారని పురాణాలలో చదువుతాము. ఇటువంటి కథలు స్ఫూర్తివంతంగా ఉండి సాధనవైపు నడిపిస్తాయి.

జీవితంలో ఏదైనా సాధించాలంటే పట్టుదల ఉండాలి. నిరంతర సాధన దానికి తోడవ్వాలి. అపజయాలకు కుంగిపోకుండా, వాటిని గెలుపునకు మెట్లుగా భావిస్తూ, సాధనను మరింత కఠినంగా చేస్తూ ఉంటే సత్ఫలితాలు వాటంతటవే సొంతమవుతాయి. సాధన చేస్తే సాధ్యంకానిదేదీ లేదీ లోకంలో!

– వాసంతి



07
నల్లగొండ | శనివారం | ఫిబ్రవరి | 2 | 2019 |
www.sakshi.com
సాక్షి


మధ్య తరగతికి.. మహా ఊరట!

ఇది..ముచ్చటగా 3 కోట్ల మందిపై ప్రధాని వేసిన సమ్మోహనాస్త్రం. ఏడాదికి 5 లక్షల రూపాయ ల్లోపు ఆదాయాన్ని ఆర్జించేవారు రూపాయి కూడా పన్ను కట్టక్కర్లేదు. వీరేకాదు.. రకరకాల మిన హాయింపులు, ఇన్వెస్ట్‌మెంట్లను పరిగణనలోకి తీసుకుంటే రూ. 8-9 లక్షల వార్షికాదాయం ఉన్న వారు కూడా పైసా పన్ను కట్టకుండా తప్పించుకోవచ్చు. కాకపోతే ఏడాదికి దాదాపుగా రూ.10 లక్షలు, ఆపైన ఆర్జించేవారికి మాత్రం ఈ బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదు. అందుకే కావచ్చు.. ఈ ఏడాదికి తాము ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్లో ఈ వర్గాల గురించి ఆలోచిస్తామన్నారు గోయల్.

రూ.5 లక్షలలోపు ట్యాక్సబుల్ ఇన్‌కమ్ ఉన్నవారు **3 కోట్లు**

రూ.5 లక్షలలోపు ఆదాయమున్నవారికి ఏటా కలిగే లబ్ధి **రూ. 12,500**





పన్నులు ఫన్నులు


బడ్జెట్ సమావేశాలు మొదలవనున్నాయంటే 'పన్ను'పోటు కాలం మొదలైనట్లే. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా చరిత్రకెక్కిన కొన్ని వింతవింత 'పన్ను'పోట్ల వివరాలు...

సోడా తేడా



షికాగోలో సోడా తాగాలంటే కాస్త తేడా చూసుకు తాగాల్సిందే! అక్కడ సీసాల్లో లేదా క్యాన్‌లలో అమ్మే సోడాపై పన్ను 3 శాతమే. అదే గ్లాసుల్లో లేదా కప్పులో పోసి అమ్మే సోడాపై వినియో గదారులు 9 శాతం 'పన్ను'పోటు భరించాల్సిందే.

విగ్గు పౌ'డర్'..



బ్రిటిష్ ప్రధానుల్లోకెల్లా అత్యంత పిన్న వయస్కుడైన విలియమ్ పిట్ విచిత్రమైన పన్నులతో ప్రజలను విలవిలలాడించేవాడు. తన హయాంలో విగ్గులకు వాడే పౌడర్‌పైనా పన్ను విధించాడు. అప్పట్లో 1790 కాలంలో విగ్గులకు పౌడర్ వాడటం ఫ్యాషన్‌గా ఉండేది. అయితే, ఈ ఫ్యాషన్ 1820ల నాటికే కనుమరుగవడంతో, దానిపై విధించే పన్నుకూ కాలం చెల్లింది.

కిటికీ కిరికిరి



రష్యా పాలకుడు పీటర్-1 కూడా వింత పన్నుల వీరుడే. చిమ్నీలపై పన్నులు విధించాలని తొలుత సంకల్పించాడు. అయితే, అదంత తేలిక కాకపోవడంతో పాటు చిమ్నీల కంటే కిటికీలను లెక్కించడం తేలిగ్గా కనిపించడంతో ఇళ్ల కిటికీలపై పన్ను వడ్డించాడు.

పీకడమే పని...



రష్యాను పాలించిన పీటర్ ది గ్రేట్ సాటిలేని మేటి 'పన్ను'పోటుగాడిగా చరిత్ర ప్రసిద్ధి చెందాడు. కాదేదీ పన్నుకు అనర్హం అని అక్షరాలా నమ్మి, ఆచరణలో పెట్టిన పాలకుడు అతడు. అతగాడి హయాంలో జనాలు 'పన్ను'పోటుతో నిత్యం విలవిలలాడేవారు. టోపీలు, గడ్డాలు, చావు, పుట్టుక, పెళ్లిళ్లు... ఇలా దేనినీ వదలకుండా పన్నులు వడ్డించేవాడు. చివరకు ఆత్మలపై కూడా పన్నులు వసూలు చేసిన ఘనత పీటర్ ది గ్రేట్‌కే చెందుతుంది.

బిచ్చగాళ్లే బెటర్..



ఇంగ్లాండు కథ కూడా అప్పట్లో ఇంచుమించుగా రష్యన్ పాలకుడు 'పీటర్ ది గ్రేట్' పద్ధతిలోనే ఉండేది. చావు, పుట్టుక, పెళ్లిళ్లు, ఖననాలపైన, బ్రహ్మచారులపైన, భార్యా విహీనులపైన, విత తువులపైన కూడా 1695 కాలంలో పన్నులు వసూలు చేసేవారు. అప్పట్లో 'పన్ను'పోటు లేని అదృష్టవంతులు బిచ్చగాళ్లు మాత్రమే.

చేత'బడి'..అయితే ఓకే



విద్యాభ్యాసం కోసం చేసే ఖర్చుపై పన్ను మినహాయింపు కల్పించడం ఎక్కడైనా మామూలే. నెదర్లాండ్స్‌లోనైతే చేత 'బడి' ఖర్చులపైనా పన్ను మినహాయింపు ఇస్తారు. చేతబడి వంటి క్షుద్రవిద్యలను చట్టబద్ధంగా నేర్చుకునే వీలుంది. ఆ కోర్సుల కోసం అయ్యే ఖర్చులకు లెక్కలు చూపిస్తే, వాటిపై పన్ను మినహాయింపు లభిస్తుంది.

గుద్దితే అంతే..



ప్రమాదాలకు కారణమయ్యే డ్రైవర్లకు న్యూజెర్సీ ప్రభుత్వం 1994 నుంచి పన్ను విధిస్తోంది. ప్రమాదం జరిగినప్పటి నుంచి మూడేళ్ల వరకు ఏటా ఈ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ పన్ను ఎగవేస్తే ఏకంగా లైసెన్సు రద్దవుతుంది. ఈ పన్ను ద్వారా న్యూజెర్సీ సర్కారుకు అదనంగా 100 కోట్ల డాలర్లు సమకూరాయి.

మిడిల్ క్లాస్.. మోదీ..



న్యూఢిల్లీ

ఎన్నికల వేళ ప్రధాని మోదీ మిడిల్ క్లాస్ వేతన జీవుల మనసు గెలిచే ప్రయత్నం చేశారు. పన్ను శ్లాబులను మార్చకుండా వారికి ఉపశమనం కల్పించారు. పన్ను చెల్లించాల్సిన ఆదాయం గనక రూ.5 లక్షలలోపు ఉంటే.. వారెలాంటి పొదుపులూ చేయక పోయినా పూర్తిగా పన్ను మినహాయింపు వర్తిస్తుంది. ఈ మేరకు సెక్షన్ 87ఏ కింద ఇస్తున్న రిబేటును రూ.2,500 నుంచి రూ.12,500కు పెంచుతూ బడ్జెట్లో నిర్ణయం తీసుకున్నారు. గతంలో సెక్షన్ 87ఏ రిబేటు పరిమితి రూ.3.50 లక్షలుండగా దీన్ని రూ.5 లక్షలకు పెంచారు. దీంతో రూ.5 లక్షలలోపు పన్ను ఆదాయం (ట్యాక్సబుల్ ఇన్‌కమ్) ఉన్నవారు ఆదాయ పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి గోయల్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. గోయల్ ఈ నిర్ణయాన్ని ప్రకటించాక లోక్‌సభ కొన్ని నిమిషాల సేపు బీజేపీ కార్యవర్గ సమావేశం మాదిరిగా మారిపోయింది. ఎన్‌డీఏ ఎంపీలంతా మోదీ... మోదీ అంటూ సభను మార్మోగించారు. ఈ రిబేటు పరిమితిని పెంచడం వల్ల 3 కోట్ల మంది ఉద్యోగులకు రూ.18,500 కోట్ల మేర పన్ను భారం తగ్గుతుందని గోయల్ ప్రకటించారు. అంతేకాదు సెక్షన్ 80సీ కింద లభించే రూ.1.5 లక్షల మినహాయింపు, ఇంటి రుణానికి చెల్లించే వడ్డీ, ఆరోగ్య బీమా ప్రీమియం వంటి ఇతర మినహాయింపులను పూర్తిగా వినియోగించుకుంటే రూ.9 లక్షల వార్షికాదాయం ఉన్న వారూ పన్ను కట్టక్కర్లేదు. అయితే ట్యాక్సబుల్ ఇన్‌కమ్ కనక రూ.5 లక్షలకన్నా రూపాయి దాటినా.. వారు మునుపటిలానే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. గత నాలుగేళ్లుగా అమలు చేసిన సంస్కరణలు ముఖ్యంగా పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు వల్ల ఆదాయం పెరిగిందని, ఈ ప్రయోజనాన్ని తిరిగి వారికి అందించాలని ఉన్నా ఇది మధ్యంతర బడ్జెట్ కావడంతో వేతనజీవుల వరకు మాత్రమే పరిమితమవుతున్నామని గోయల్ స్పష్టం చేశారు.

బేసిక్ లిమిట్‌లో మార్పు లేదు...



బడ్జెట్ ప్రసంగంలో గోయల్ రూ.5 లక్షలలోపు వారికి ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరంలేదని ప్రకటించడంతో అందరూ ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచినట్లు భావించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన కేంద్ర ప్రత్యక్ష పన్నుల విభాగం... పన్ను శ్లాబుల్లో ఎలాంటి మార్పులు లేవని, కేవలం సెక్షన్ 87 రిబేటు పరిమితిని రూ.3,50,000 నుంచి రూ.5,00,000 మాత్రమే పెంచామని, మును పటి శ్లాబులు యథాతథంగా కొనసాగుతాయని వివరణ ఇచ్చింది. సెక్షన్ 87ఏ పరిమితిని పెంచడం వల్ల పన్ను చెల్లించాల్సిన ఆదాయం రూ.5 లక్షలలోపు గనక ఉంటే... వారికి గరిష్టంగా రూ.12,500 ప్రయోజనం లభిస్తుంది. స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.40వేల నుంచి రూ.50వేలకు పెంచడం వల్ల రూ.2,080 నుంచి రూ.3,120 వరకు ప్రయోజనం లభించనుంది. ఈ రెండింటిని కలిపితే గరిష్టంగా రూ.15,000 వరకు ప్రయోజనం చేకూరనుంది.

రెండో ఇంటికీ 'క్యాపిటల్' గెయిన్స్

ఏదైనా ఇంటిని విక్రయించినపుడు వచ్చిన దీర్ఘకాలిక మూలధన పన్ను లాభాలను రెండు ఇళ్లకు వర్తింపచేస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదన చేశారు. ప్రస్తుతం ఏదైనా ఒక ఇంటిని విక్రయించినపుడు దానిపై వచ్చే దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను చెల్లించాలి. ఒకవేళ ఈ పన్ను భారాన్ని తప్పించుకోవాలంటే ఈ లాభాలతో మరో ఇంటిని కొనుగోలు చేయవచ్చు. ఇంతకాలం ఇది కేవలం ఒక ఇంటి కొనుగోలుకే వర్తించేది. ఇప్పుడు దీన్ని రెండు ఇళ్లను కొనుగోలు చేయడానికి అనుమతించారు. ఈ విధంగా గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకూ వచ్చే మొత్తానికి దీర్ఘకాలిక మూలధన పన్ను లాభాలు వర్తిస్తాయి. కాకపోతే ఈ ప్రయోజనాన్ని జీవితంలో ఒకసారి మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంది. అదే విధంగా వేతన జీవులు ఉద్యోగార్థం ఒక ఇంటిలో ఉండి మరో ఇల్లు ఖాళీగా ఉంచినా దానిని ఊహాజనిత ఆదాయంగా లెక్కించి పన్ను కట్టాల్సి వచ్చేది. ఇప్పుడు రెండో ఇంటిని ఊహాజనిత ఆదాయం నుంచి మినహాయించారు.



పెన్షన్‌దారులకు ఊరట

కేవలం వడ్డీనే ఆదాయంగా ఉన్న వారికి మోదీ సర్కార్ పెద్ద ఊరట నిచ్చింది. పోస్టాఫీసులు, బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన వాటిపై వచ్చే వడ్డీ ఆదాయంపై టీడీఎస్ (మూలం వద్ద ఆదాయ పన్ను) పరిమితిని 3 రెట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఏడాదిలో వడ్డీ రూపంలో వచ్చే మొత్తం రూ.10,000 దాటితే టీడీఎస్ చెల్లించాల్సి వచ్చేది. ఒకవేళ టీడీఎస్ చెల్లించకూడదనుకుంటే... తమ మొత్తం ఆదాయం పన్ను పరిమితికి లోబడే ఉందని నిర్ధారిస్తూ బ్యాంకుకు డిక్లరేషన్ ఇవ్వాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ పరిమితిని రూ.40,000కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అంటే రూ.40,000 దాటేదాకా ఎలాంటి టీడీఎస్ ఉండదు. డిక్లరేషన్ అవసరం లేదు. అదే విధంగా ఇంటి అద్దెల రూపంలో వసూలు చేసే మొత్తంపై కూడా టీడీఎస్ పరిమితిని పెంచారు. ఇప్పటి వరకు ఇంటద్దెల రూపంలో వచ్చే ఆదాయం ఏడాదికి రూ.1.80 లక్షలు దాటితే (నెలకు రూ.15వేలు) టీడీఎస్ చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిమితిని రూ.2.40 లక్షలకు (నెలకు రూ.20 వేలకు) పెంచారు.

ట్యాక్స్ పరిధిలోకి తెచ్చిన నల్లధనం

1.30 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు డీమానిటైజేషన్ సహా నల్లధనం కట్టడికి ప్రభుత్వం తీసుకున్న పలు చర్యలతో బయటకు వెల్లడించని రూ.1.30 లక్షల కోట్ల ధనం పన్ను పరిధిలోకి వచ్చిందని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. నల్లధనాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.''నల్లధన నియంత్రణ చట్టం, పరారీలో ఉన్న నేరస్తుల చట్టం, డీమోనిటైజేషన్ వంటి నిర్ణయాలు రూ.1,30,000 కోట్లను పన్ను పరిధిలోకి తీసుకొచ్చింది. రూ.50,000 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నాం. ఈ కాలంలోనే రూ.6,900 కోట్ల మేర బినామీ ఆస్తులు, రూ.1,600 కోట్ల మేర విదేశీ ఆస్తులను స్వాధీనం చేసుకున్నాం. 3,38,000 షెల్ కంపెనీలను గుర్తించి రిజిస్ట్రేషన్ రద్దు చేయడంతోపాటు ఆ కంపెనీల డైరెక్టర్లను డిస్క్వాలిఫై చేశాం'' అని మధ్యంతర బడ్జెట్‌లో భాగంగా మంత్రి చెప్పారు.

మినహాయింపు ఎన్నికల తర్వాతే..



సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల తర్వాత అధికాదాయ వర్గాల వారికి కూడా పన్ను మినహాయింపు లుంటాయని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ సంకేతమిచ్చారు. మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రూ.ఐదు లక్షల ఆదాయం దాటిన వారికి పన్ను శ్లాబుల్లో ఎలాంటి మార్పులు చేయలేక పోయామని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చే కొత్త ప్రభుత్వం ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌లో వీరికి ప్రయోజనం కల్పిస్తామని చెప్పారు. ఇది మధ్యంతర బడ్జెట్ కావడంతో కొన్ని పరిమితులున్నాయని, దీంతో అన్ని నిర్ణయాలు తీసుకోలేకపోయినట్లు వివరణ ఇచ్చారు. కొత్త ఆర్థిక సంవత్సరం రాగానే పన్ను ప్రణాళికల గురించి ఆలోచించే మధ్యతరగతి ప్రజల కోసం ఎన్నికల వరకు ఆగకుండా ఇప్పుడే ప్రకటించినట్లు తెలిపారు. ఇప్పుడు ఆదాయ పన్ను విభాగం పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో పనిచేస్తోందని, గతేడాది 99.54% రిటర్నులు ఆన్‌లైన్ ద్వారానే వచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో రిటర్నుల స్క్రూటినీ కూడా మానవ ప్రమేయం లేకుండా పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జరిగే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

85శాతం ట్యాక్స్ పేయర్లకు ప్రయోజనం

న్యూఢిల్లీ: తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌తో 85 శాతం మంది పన్నుచెల్లింపుదారులు ప్రయోజనం పొందుతారని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. 2019-20 తాత్కాలిక బడ్జెట్‌లో ప్రతిపాదించిన విధానాలు, రాయితీలతో మధ్య తరగతి కుటుంబాలు, రైతులు, పేదవర్గాలు లబ్ధి పొందుతారని ఓ టీవీ చానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు. 'ఇది ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన బడ్జెట్ కాదు. నాలుగున్నరేళ్లుగా మేం ఈ అంశాలపై నిరంతరం కృషి చేస్తూనే ఉన్నాం'అని మంత్రి అన్నారు. ప్రధాని చెబుతున్నట్లు 'అందరితో కలిసి అందరికీ ప్రగతి ఫలాలు' అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. రైతులు, అసంఘటిత రంగ కార్మికులు, మత్స్య, పశుపోషణ రంగాల్లో పనిచేసే వారందరి కోసం ఈ బడ్జెట్‌ను రూపొందించాం. మధ్య తరగతి కొనుగోలు శక్తి పెరగడానికి, వస్తు, సేవల వినియోగం, అభివృద్ధికి కృషి చేశాం' అని ఆయన వివరించారు. దేశ చరిత్రలోనే మొదటిసారి మొత్తం 22 వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించామంటూ మంత్రి.. ఇది కాకుండా పేద రైతులకు ఏటా రూ.6 వేల కోట్ల మేర మేలు చేకూరుస్తున్నట్లు తెలిపారు.

9 లక్షలు దాటినా పన్ను లేదు!

మినహాయింపులు సరిగ్గా వినియోగించుకుంటే చాలు

బడ్జెట్ నిర్ణయంతో ఎగువ మధ్యతరగతికీ ఉపశమనమే

సాక్షి బిజినెస్ డెస్క్



ఈ బడ్జెట్‌లో సెక్షన్ 87-ఏ కింద లభించే పన్ను రిబేటును పెంచడంతో చిన్న వేతనజీవుల నుంచి ఎగువ మధ్యతరగతి ప్రజల వరకు అందరికీ ప్రయోజనం చేకూరుతోంది. ఈ రిబేటుతో పాటు ప్రస్తుతం అమల్లో ఉన్న ఇతర పన్నుమిన హాయింపులను కూడా పూర్తిగా వినియోగించుకుంటే రూ.10 లక్షల ఆదాయం వరకు ఎలాంటి పన్నూ చెల్లించాల్సిన అవసరం లేదు. గతంలో రూ.3.50 లక్షలలోపు పన్ను ఆదాయంపై రూ.2,500 పన్ను రిబేటు లభించేది. ఇప్పుడు ఈ రిబేటును రూ.5 లక్షల పన్ను ఆదాయంపై రూ.12,500కు పెంచారు. ఇప్పుడు వీటికి అదనంగా సెక్షన్ 80-సీ కింద లభించే రూ.1.50 లక్షలు, స్టాండర్డ్ డిడక్షన్ రూ.50,000, గృహ రుణానికి చెల్లించే వడ్డీ రూ.2,00,000, ఎన్‌పీఎస్‌కు చెల్లించే రూ.50 వేలు పన్ను మినహాయింపులను వినియోగించుకుంటే రూ.9 లక్షల వార్షికాదాయం వచ్చేవారు కూడా ఒక్క రూపాయి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ ఇక్కడ పన్ను ఆదాయం (టాక్సబుల్ ఇన్‌కమ్) రూ.5,00,000 కన్నా ఒక్క రూపాయి దాటినా ఈ రిబేటు వర్తించదు. అప్పుడు ఆదాయ పన్ను శ్లాబుల ప్రకారం పన్ను లెక్కించి చెల్లించాల్సిందే. ఈ రిబేటును పెంచడంతో వార్షిక ఆదాయం రూ.5.50 లక్షలలోపు ఉన్న వారు ఎటువంటి పొదుపు చేయాల్సిన అవసరం లేకుండానే పన్ను భారం నుంచి పూర్తిగా తప్పించుకోవచ్చు.

వివరం	పాత విధానం	కొత్త విధానం
వార్షిక జీతం	5,50,000	5,50,000
స్టాండర్డ్ డిడక్షన్	40,000	50,000
పన్ను ఆదాయం	5,10,000	5,00,000
చెల్లించాల్సిన పన్ను	14,500	12,500
సెక్షన్ 87-ఏ రిబేటు	2,500	12,500
నికర పన్ను	12,500	లేదు
సుంకాలు	580	--
కట్టాల్సిన పన్ను	13,080	--
ప్రయోజనం	13,080	--

ఇప్పుడు ఎటువంటి మినహాయింపులు పరిగణనలోకి తీసుకోకుండా కేవలం స్టాండర్డ్ డిడక్షన్‌ను పరిగణనలోకి తీసుకొని వివిధ ఆదాయ వర్గాలు చెల్లించే పన్నుల్లో తేడా ఏ విధంగా ఉందో ఓసారి పరిశీలిద్దాం.. (గణాంకాలు రూపాయల్లో)

వివరం	పాత విధానం	కొత్త విధానం
వార్షిక జీతం	10,00,000	10,00,000
స్టాండర్డ్ డిడక్షన్	40,000	50,000
పన్ను ఆదాయం	9,60,000	9,50,000
చెల్లించాల్సిన పన్ను	1,04,500	1,02,500
సెక్షన్ 87ఏ రిబేటు	--	--
నికర పన్ను	1,04,500	1,02,500
సుంకాలు	4,180	4,100
కట్టాల్సిన పన్ను	1,08,680	1,06,600
ప్రయోజనం	--	2,080



ఉదాహరణకు ఐటీ కంపెనీలో పనిచేసే నారాయణ వార్షిక జీతం రూ.9.5 లక్షలు అనుకుందాం. ఇప్పుడు నారాయణ అన్ని రకాల పన్ను మినహాయింపు ప్రయోజనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించాల్సిన అవసరం రాదు.

అదెలాగో ఒకసారి చూద్దాం... (గణాంకాలు రూపాయల్లో)

నారాయణ వార్షిక ఆదాయం	9,50,000
స్టాండర్డ్ డిడక్షన్	50,000
సెక్షన్ 80-సీ మినహాయింపులు	1,50,000
ఇంటి రుణంపై చెల్లించే వడ్డీ	2,00,000
ఎన్‌పీఎస్‌కి చెల్లించే చందా	50,000
ఆరోగ్య బీమా ప్రీమియం	25,000
నికర పన్ను ఆదాయం	4,50,000
దీనిపై చెల్లించాల్సిన పన్ను	10,000
సెక్షన్ 87-ఏ గరిష్ఠ రిబేటు	12,500
చెల్లించాల్సిన పన్ను	లేదు

ప్రస్తుతం అమల్లో ఉన్న ఆదాయ పన్ను శ్లాబులు ఇలా ఉన్నాయి. వీటిలో ఎటువంటి మార్పు చేయలేదు.

60 ఏళ్ల లోపు

ఆదాయం	పన్ను రేటు
రూ.2,50,000	పన్ను లేదు
రూ.2,50,001- 5,00,000	5%
రూ.5,00,001- 10,00,000	20%
రూ.10,00,000 పైన	30%





60 నుంచి 80 ఏళ్ల లోపు

ఆదాయం	పన్ను రేటు
రూ.3,00,000	పన్ను లేదు
రూ.3,00,001-5,00,000	5%
రూ.5,00,001-10,00,000	20%
రూ.10,00,000 పైన	30%

80 ఏళ్ల పైన

ఆదాయం	పన్ను రేటు
రూ.5,00,000	పన్ను లేదు
రూ.5,00,001-10,00,000	20%
రూ.10,00,000 పైన	30%



ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి..

- రూ. 5 లక్షల ఆదాయ వర్గాలకు రూ. 12,500 రిబేట్: సీబీడీటీ చైర్మన్

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రూ. 5 లక్షల వార్షికాదాయం గలవారికి నేరుగా రూ. 12,500 మేర రిబేటు లభిస్తుందని, దీంతో వారిపై పన్ను భారం ప్రసక్తి ఉండదని కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు చైర్మన్ సుశీల్ చంద్ర తెలిపారు. వార్షికాదాయం రూ. 5 లక్షలు దాటిన వారికి మాత్రం 'పాత' పన్ను రేట్లు యథాప్రకారం కొనసాగుతాయన్నారు. అయితే పీపీఎఫ్, జీపీఎఫ్, బీమా పథకాలు, మొదలైన వాటిల్లో రూ. 1.5 లక్షల దాకా ఇన్వెస్ట్ చేసిన పక్షంలో రూ. 6.5 లక్షల వార్షికాదాయ వర్గాలూ పన్ను రిబేటు ప్రయోజనాలు పొందవచ్చని సుశీల్ వివరించారు. స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని రూ. 40 వేల నుంచి రూ. 50 వేలకు పెంచడంతో వేతన జీవులకు మరో రూ. 10 వేల మేర అదనపు ప్రయోజనమూ లభిస్తుందన్నారు. దీంతో సుమారు 3 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులు లబ్ధి పొందగలరన్న సుశీల్ చంద్ర.. ఖజానాకు మాత్రం రూ. 4,700 కోట్ల మేర ఆదాయం తగ్గుతుందన్నారు. రూ. 5 లక్షల దాకా ఆదాయవర్గాలకు రిబేట్ ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి రూ. 18,500 కోట్ల దాకా ఆదాయం పోతుందన్నారు.



08
నల్లగొండ | శనివారం | ఫిబ్రవరి | 2 | 2019 |
www.sakshi.com


పింఛన్‌తో పాటు.. గౌరవం!

చిన్నచిన్న దుకాణాల్లో, ఇళ్లలో పనిచేస్తూ మనచుట్టూ ఎంతోమంది కనిపిస్తారు. పనిచేసినంతకాలమే వారికి గౌరవమైనా.. ఆదాయమైనా! వయసు మళ్లితే జీవితమే కష్టం. అలాంటి వారికి నెలకు రూ.3వేల చొప్పన పెన్షన్ ఇచ్చే పథకానికి శ్రీకారం చుట్టింది కేంద్రం. ఈ పింఛన్ల కోసం రాజకీయ నాయకుల దగ్గర లైన్లలో నిల్చుని పేర్లు రాయించుకోనక్కర్లేదు. ఎందుకంటే ఇది గౌరవంగా పొందే పింఛను. పని చేసినన్నాళ్లూ వారు నెలకు రూ.55 నుంచి 100 వరకూ నామమాత్రపు మొత్తం చెల్లిస్తే చాలు. అంతేమొత్తాన్ని ప్రభుత్వమూ చెల్లిస్తుంది.

దేశంలో అసంఘటిత రంగంలో పనివారు **42** కోట్లు

తాజా పథకంతో లబ్ధి పొందేవారు **10** కోట్లు





సాక్షి

ఆదాయం.. పన్నార్పణం

ఇప్పుడంటే ఆదాయ పన్ను ఈ స్థాయిలో ఉందిగానీ.. మన దేశంలోనే ఓ దశలో ఈ పన్ను 93.50 శాతం కూడా ఉన్న విషయం మీకు తెలుసా? 1973–74 సమయంలో మన ఆదాయపు పన్ను శ్లాబులు 11 వరకూ ఉండేవి. కనిష్ట శ్లాబు 11 శాతం కాగా.. గరిష్ట స్థాయిలో 93.50 శాతం పన్ను చెల్లించాల్సి వచ్చేది. అంటే 100 రూపాయల ఆదాయంలో దాదాపు 93.50 రూపాయలు పన్నుకే సరి అన్న మాట! దేశంలో రాష్ట్రపతి కంటే ఎవరికీ ఎక్కువ జీతం ఉండరాదన్న ఉద్దేశంతో అధికాదాయం ఉన్నవారిపై ఇలా భారీగా పన్ను వడ్డించేవారు. తదనంతర కాలంలో 1985–87లో వీపీ సింగ్ హయాంలో గరిష్ట పన్నును 50 శాతానికి తగ్గించారు. తర్వాతి కాలంలో అది మరింత తగ్గిన విషయం మనకు తెలిసిందే. ఇప్పుడు గరిష్ట శ్లాబు 30 శాతమే!

ఇప్పుడు బడ్జెట్ లెక్కలన్నీ వేలు, లక్షల కోట్లలోనే.. మరి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్ లెక్కేంటి? అప్పుడు మన ఆదాయం ఎంత? రక్షణ శాఖ బడ్జెట్ ఎంత? ఆ వివరాలు తెలుసుకుందామా..



1947 నవంబర్ 26

భారత దేశంలో మొట్టమొదటి బడ్జెట్‌ను ఆర్కే షణ్ముగం శెట్టి 1947 నవంబర్ 26న సభలో ప్రవేశపెట్టారు.



1950 ఫిబ్రవరి 28

గణతంత్ర భారత దేశంలో మొట్టమొదటి బడ్జెట్‌ను జాన్ మతాయ్ 1950 ఫిబ్రవరి 28న సభలో ప్రవేశపెట్టారు



ఆర్‌బీఐ గవర్నర్లుగా పనిచేసి తర్వాత ఆర్థికమంత్రులై బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఇద్దరిది. వారిలో ఒకరు సి.డి.దేశ్‌ముఖ్ కాగా రెండో వారు మన్మోహన్‌సింగ్.




ప్రధానిగా ఉంటూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది (ఆర్థిక శాఖ కూడా తమ వద్దే ఉండటంతో) ముగ్గురు. 1958-59లో జవహర్‌లాల్ నెహ్రూ, 1970లో ఇందిరాగాంధీ, 1987లో రాజీవ్‌గాంధీ. మనదేశంలో ఇప్పటిదాకా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఏకైక మహిళ ఇందిరాగాంధీ.



అత్యధిక బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్‌ది. ఎనిమిది సాధారణ బడ్జెట్‌లు, రెండు మధ్యంతర బడ్జెట్‌లతో ఆయన మొత్తం పదిసార్లు బడ్జెట్‌ను పార్లమెంటు ముందుంచారు. తర్వాతి స్థానం 9 బడ్జెట్లతో పి.చిదంబరంది.

ఆర్థికమంత్రిగా పనిచేసి తర్వాత కాలంలో రాష్ట్రపతి పదవిని చేపట్టిన వారు ఆర్.వెంకట్రామన్, ప్రణబ్ ముఖర్జీ.



బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ఆర్థిక మంత్రి లెదర్ బ్రీఫ్‌కేస్‌తో ఫొటోలు దిగటానికి ఓ కారణముంది. 1869లో బ్రిటిష్ కామన్స్ సభలో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి వచ్చిన జార్జి వార్డ్ హంట్ సభాధ్యక్షుడి నుంచి అనుమతి రాగానే లేచి నిలబడ్డాడు. తీరా చూస్తే.. బడ్జెట్ పత్రాలున్న బ్రీఫ్‌కేసు కనిపించలేదు. ఆయన దాన్ని ఇంట్లోనే మరిచిపోయి వచ్చారు. దీంతో అప్పట్నుంచి ఆర్థిక మంత్రులు బడ్జెట్ ప్రవేశ పెట్టటానికి సభకు వచ్చేముందు తమ వెంట పత్రాలన్నీ తెచ్చుకున్నామని, ఇంట్లో ఏవీ మర్చిపోలేదని పార్లమెంట్ వద్ద గుమికూడిన జనానికి తెలియజేస్తూ బాక్స్‌ను చూపించి లోపలికి వెళ్లడం మొదలైంది.

‘శ్రమ’కు ప్రతిఫలం



ప్రధానమంత్రి శ్రమ-యోగి మాన్‌ధన్ పథకాన్ని ప్రకటించిన కేంద్రం

60 ఏళ్లు దాటిన వారికి ప్రతినెలా రూ. 3,000 పింఛన్

29 ఏళ్ల వయసు నుంచి నెలకు రూ.100 చెల్లిస్తే చాలు

విధివిధానాలను వెల్లడించని కేంద్ర సర్కారు

న్యూఢిల్లీ: దేశంలోని కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. నెలకు రూ.15,000 దాకా వేతనం పొందుతున్న వారికి ప్రత్యేక పింఛన్ పథకాన్ని శుక్రవారం బడ్జెట్‌లో ప్రకటించింది. ప్రధానమంత్రి శ్రమ–యోగి మాన్‌ధన్(పీఎంఎస్‌వైఎం) పేరిట అమలు చేసే ఈ పథకంలో కార్మికులకు 60 ఏళ్లు దాటిన తర్వాత నెలకు రూ.3,000 చొప్పున పింఛన్ అందజేస్తారు. ఇందుకోసం కార్మికులు, ప్రభుత్వం తమ వంతు వాటాగా నెలకు రూ.100 చొప్పున పింఛన్ ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ''భారత స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో 50 శాతం అసంఘటిత రంగంలోని కార్మికుల శ్రమ నుంచే వస్తోంది. రిక్షా తొక్కేవారికి, పూట గడవడానికి ఇళ్లలో సేవకులుగా పనిచేస్తున్న వారికి, చిన్నాచితకా కంపెనీల్లో ఉపాధి పొందుతున్న వారికి వృద్ధాప్యంలో సమగ్ర సామాజిక భద్రత కల్పించడం తప్పనిసరి''అని కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ లోక్‌సభలో బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అసంఘటిత రంగ కార్మికులు 29 ఏళ్ల వయసులో పీఎంఎస్‌వైఎం పథకంలో చేరొచ్చు. నెలకు కేవలం రూ.100 చొప్పున చెల్లిస్తే 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతినెలా రూ.3,000 చొప్పున పింఛన్ అందుకోవచ్చు. 18 ఏళ్ల వయసులోనే చేరితే నెలకు రూ.55 చొప్పున చెల్లిస్తే సరిపోతుంది. ప్రభుత్వం అంతేమొత్తాన్ని తన వాటాగా ప్రతినెలా కార్మికుల పింఛన్ ఖాతాలో జమ చేస్తుంది. పీఎంఎస్‌వైఎం పథకం ద్వారా వచ్చే ఐదేళ్లలో 10 కోట్ల మంది కార్మికులు ప్రయోజనం పొందుతారని అంచనా వేస్తున్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ తెలిపారు. ప్రపంచంలోని అతిపెద్ద పెన్షన్ పథకాల్లో ఇది కూడా ఒకటి అవుతుందని అన్నారు. పీఎంఎస్‌వైఎం పథకానికి తాజా బడ్జెట్‌లో కేంద్రం రూ.500 కోట్లు కేటాయించింది. అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు కేటాయిస్తామని పేర్కొంది. ఈ ఏడాది నుంచే ఈ పథకం అమల్లోకి రానుంది.

విధివిధానాలేవీ?

అసంఘటిత రంగ కార్మికులకు 60 ఏళ్లు దాటాక నెలకు రూ.3,000 చొప్పున పెన్షన్ ఇస్తామని కేంద్రం ప్రకటించినప్పటికీ.. ఈ పథకం విధివిధానాలను మాత్రం వెల్లడించలేదు. ఏయే రంగాల్లో, ఎలాంటి పనులు చేసుకునే వారికి ఇస్తారో స్పష్టం చేయలేదు. ఉదాహరణకు 59 ఏళ్ల కార్మికుడు ఒక సంవత్సరంపాటు నెలకు రూ.100 చొప్పున చెల్లిస్తే.. 60 ఏళ్ల వయసు దాటగానే అతడికి పెన్షన్ అందజేస్తారా? అనే దానిపై అనుమానాలున్నాయి. దేశంలో దాదాపు 42 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. వీరిలో ఎంత మందికి ప్రయోజనం దక్కుతుందో తెలియదు. పీఎంఎస్‌వైఎం పథకంపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

50% **అంగన్‌వాడీల వేతనాలు పెంపు**

దేశవ్యాప్తంగా కార్మికులకు కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో పలు వరాలు ప్రకటించింది. ప్రతి కార్మికుడికి కనిష్ట పెన్షన్‌ను రూ.1,000 నిర్దేశించింది. అలాగే కార్మికుడు సర్వీసులో ఉండగా మరణిస్తే ఈపీఎఫ్‌వో ప్రస్తుతం రూ.2.5 లక్షలు చెల్లిస్తోంది. కేంద్రం దీన్ని ప్రస్తుతం రూ.6 లక్షలకు పెంచింది. అన్ని కేటగిరీల అంగన్‌వాడీలు, ఆశా యోజన కార్మికుల గౌరవ వేతనాలను 50 శాతం పెంచేసింది. ఉద్యోగాల సృష్టిలో గొప్ప ప్రగతి సాధించామని పీయూష్ గోయల్ వెల్లడించారు. గత రెండేళ్లలో ఈపీఎఫ్‌వో సభ్యత్వాలు 2 కోట్లు పెరగడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం రూ.10 లక్షల గ్రాట్యుటీపై పన్ను విధిస్తుండగా, దీన్ని రూ.20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంటే రూ.20 లక్షల గ్రాట్యుటీపై ఎలాంటి పన్ను ఉండదు. ఒక సంస్థలో ఐదేళ్ల కంటే ఎక్కువ కాలం పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ పొందినప్పుడు లేదా ఉద్యోగం మానేసినప్పుడు గ్రాట్యుటీ తీసుకోవడానికి అర్హులని పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో అన్ని వర్గాల కార్మికుల కనీస ఆదాయం 42 శాతం పెరిగిందని అన్నారు.

చదివింపులు 10%

విద్యారంగానికి రూ. 93,847 కోట్లు

ఉన్నత విద్యకు రూ. 37,461 కోట్లు

పాఠశాల విద్యకు రూ. 56,386 కోట్లు



న్యూఢిల్లీ: విద్యారంగానికి 2019–20 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.93,847.64 కోట్లు కేటాయించింది. ఇది గత బడ్జెట్ కంటే 10 శాతం అధికం. ఈ బడ్జెట్‌లో ఉన్నత విద్యకు రూ.37,461.01 కోట్లు, పాఠశాల విద్యకు రూ. 56,386.63 కోట్లు కేటాయించింది. గత ఏడాది రూ.85,010 కోట్లు విద్యారంగానికి కేటాయించారు. వైద్య సంస్థలతోపాటు ప్రధాన విద్యాసంస్థల్లో పరిశోధనల రంగంలో పెట్టుబడులు, సంబంధిత మౌలిక వసతుల కోసం ‘రివైటలైజింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సిస్టమ్స్ ఇన్ ఎడ్యుకేషన్ (రైజ్)’అనే కొత్త పథకాన్ని తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇందులో 2022నాటికల్లా రూ. లక్ష కోట్లు పెట్టుబడిగా పెడతారు.

కొత్తగా ఎస్పీఏలు..

- ‘స్కూల్స్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్పీఏ)’పేరుతో రెండు పూర్తిస్థాయి సంస్థలను ఏర్పాటుచేయాలని ప్రతిపాదించారు. దీనికి అదనంగా ఐఐటీ, ఎన్ఐటీల్లో 18 ఎస్పీఏలను స్వయంప్రతిపత్తి గల సంస్థలుగా ఏర్పాటుచేస్తారు. దీనికోసం ఐఐటీ/ఎన్ఐటీల డైరెక్టర్లు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు ప్రతిపాదనలను సమర్పించాలని గోయల్ కోరారు.
- ఈసారి ప్రభుత్వం పరిశోధనలు, ఆవిష్కరణల కోసం రూ.608.87 కోట్లు కేటాయించింది. ఇది గత బడ్జెట్‌లో రూ.350.23 కోట్లుగా ఉంది.
- విద్యలో నాణ్యత పెరగాలంటే సాంకేతికతను వినియోగించుకుంటూ ముందుకెళ్లాలని, ‘బ్లాక్‌బోర్డు’నుంచి ‘డిజిటల్ బోర్డుకు’మారాలని చెప్పారు. టీచర్లు అధునాతన సాంకేతికత ఆధారంగా పరిష్కారాలు సాధించేందుకు, వారికి డిజిటల్ సౌకర్యాలు కల్పించేందుకు ‘దీక్షా’ను అభివృద్ధి చేశామన్నారు.

ఐఐటీ, ఐఐఎంలకు నిధుల కోత

న్యూఢిల్లీ: తాజా బడ్జెట్‌లో ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్ఈఆర్‌లతోపాటు నియంత్రణ సంస్థలైన యూజీసీ, ఏఐసీటీఈల కేటాయింపులను 2018–19తో పోలిస్తే కేంద్రం తగ్గించింది. 2019 విద్యాసంవత్సరం నుంచి జనరల్ కేటగిరీలోని పేదలకు 10 శాతం కోటా కల్పించి, దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లను పెంచిన నేపథ్యంలో ఆయా సంస్థలకు కేటాయింపులు తగ్గడం గమనార్హం. ఐఐఎంలకు గత ఏడాది రూ.1,036 కోట్లు కేటాయించగా ఈసారి 59.9 శాతం కోతపెడుతూ 415.41 కోట్లు కేటాయించారు. ఐఐటీలకు గత ఏడాది రూ.6,326 కోట్లు ఇవ్వగా ప్రస్తుత బడ్జెట్‌లో రూ.6,223.02 కోట్లు కేటాయించారు. 2017–18లో ఐఐటీలకు రూ.8,337.21 కోట్లు ఇచ్చారు. యూజీసీకి గత ఏడాది 4,722.75 కోట్లు ఇవ్వగా, ఇప్పుడు దాన్ని రూ.4,600.66 కోట్లకు తగ్గించారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)కి గత ఏడాది 485 కోట్లు ఉంటే ఈసారి దాన్ని 466 కోట్లకు తగ్గించారు. మొత్తమ్మీద చట్టబద్ధ నియంత్రణ సంస్థలకు గతఏడాదితో పోలిస్తే 2.70 శాతం తక్కువగా ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ సంస్థలకు రూ.5,066.66 కోట్లు ప్రతిపాదించగా, గత ఆర్థిక సంవత్సరంలో రూ.5,207.75 కోట్లు కేటాయించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఎడ్యుకేషన్, రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లకు ఈ బడ్జెట్‌లో రూ.660 కోట్లు ప్రతిపాదించారు. ఇది గత ఏడాది రూ.689 కోట్లుగా ఉంది.

షూటింగ్ కష్టాలకు తెర!

- సినిమాల చిత్రీకరణకు సులభంగా అనుమతులు
- సింగిల్ విండో విధానాన్ని ప్రకటించిన కేంద్రం
- పైరసీని అరికట్టేందుకు యాంటి క్యామ్‌కార్డింగ్ నిబంధనలు



న్యూఢిల్లీ: సినిమా షూటింగ్‌లకు అనుమతుల జారీని సరళతరం చేసేందుకు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం ప్రకటించారు. పైరసీని అరికట్టేందుకు యాంటి క్యామ్‌కార్డింగ్ నిబంధనలు తెస్తున్నట్లు చెప్పారు. భారత్‌లో చిత్రీకరణ జరిపే విదేశీ సినిమాలకు మాత్రమే సింగిల్ విండో అనుమతుల జారీ విధానం ఉండగా ఇప్పుడు భారతీయ సినిమాలకు కూడా వర్తింపచేస్తున్నట్లు గోయల్ బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. పైరసీని అరికట్టేందుకు సినిమాటోగ్రఫీ చట్టంలో కామ్‌కార్డింగ్‌ను నిరోధించే నిబంధనలను పొందుపరుస్తామన్నారు. సినీ పరిశ్రమపై ఆధారపడి వేలాది మంది జీవిస్తున్నారని, చిత్ర నిర్మాతలకు కూడా తాజా నిర్ణయం మేలు చేస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సినీ పరిశ్రమ వర్గాలు స్వాగతించాయి. సింగిల్ విండో విధానంలో సినిమా షూటింగ్‌లకు అనుమతుల జారీతో చిత్ర పరిశ్రమకు మేలు జరుగుతుందని పేర్కొన్నాయి.

విదేశాంగశాఖకు రూ.16 వేల కోట్లు

న్యూఢిల్లీ: మధ్యంతర బడ్జెట్‌లో విదేశాంగ శాఖకు రూ.16వేల కోట్లను ప్రభుత్వం కేటాయించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే ఇది రూ.వెయ్యి కోట్లు ఎక్కువ. గత బడ్జెట్‌లో విదేశాలకు అందించిన సాయం రూ.5,545 కోట్లు కాగా ఈసారి రూ.6,447 కోట్లకు ప్రభుత్వం పెంచింది. మాల్దీవులకు సాయం రూ.125 కోట్ల నుంచి రూ.575 కోట్లకు పెరిగింది. భూటాన్‌కు సాయం గత ఏడాది రూ.2,650 కోట్లు కాగా ఈసారి రూ.2,615 కోట్లకు తగ్గించింది. అఫ్గానిస్తాన్‌కు రూ.325 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ.175 కోట్లు, శ్రీలంకకు రూ.150 కోట్లు, మంగోలియాకు రూ.5 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. నేపాల్‌కు రూ.700 కోట్లు కేటాయించారు.

దశావతారాలు!



మార్పు కోసం పది లక్ష్యాలు

జీవన ప్రమాణాలకు నాంది: పీయూష్

పది లక్ష్యాలతో భారతదేశ దశ దిశలో మార్పు తెస్తామంటూ సార్వత్రిక ఎన్నికలవేళ మోదీ ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌తో జనం ముందుకొచ్చింది. మోదీ ప్రభుత్వం పదిలక్ష్యాలను నిర్దేశించింది. బడ్జెట్‌ని ప్రవేశ పెడుతూ ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ రాబోయే పది ఏళ్లలో 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థకి తాత్కాలిక బడ్జెట్‌తో పునాదివేశారు. ఇది తాత్కాలికం కాదని ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పుకిది నాంది అని ప్రకటించారు. పది లక్ష్యాలతో దారిద్ర్యం, పోషకాహార లోపం, నిరక్షరాస్యత, అపరిశుభ్రత లాంటి రుగ్మతలను రూపుమాపి సరికొత్త భారతాన్ని నిర్మించడం, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ప్రగతిపథంలో ముున్ముందుకు సాగడమే ఈ ప్రభుత్వ ఉద్దేశమని పీయూష్ గోయల్ తెలిపారు.

1 మౌలిక సదుపాయాల మదుపు

ప్రజా జీవనాన్ని మరింత సులభతరం చేసేందుకు ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు రోడ్లు, రైల్వే, సీపోర్టు, విమానాశ్రయాల అభివృద్ధికి బాటలు వేయడం. దీనికోసం అధికంగా నిధులు కేటాయించింది. గ్రామసడక్ యోజనకింద రూ. 19 వేల కోట్లను ఈ బడ్జెట్‌లో కేటాయించింది.

2 డిజిటల్ ఇండియా

సరికొత్త ఆవిష్కరణలతో, నూతన కంపెనీల స్థాపన ద్వారా యువతకు ఉపాధికల్పన. దేశంలో లక్ష గ్రామాలను డిజిటల్ విలేజెస్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికల రూపకల్పన.

3 హరిత భారతం

ఇంధన అవసరాలకు విదేశాలపై ఆధారపడకుండా స్వదేశీ ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిస్తూ విద్యుత్‌తో నడిచే వాహనాలపై దృష్టి పెట్టి పర్యావరణానికి మేలు చేయడంతో హరిత భారత నిర్మాణానికి బాటలు వేసుకోవడం.

4 గ్రామీణ భారతానికి దన్ను

గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వడం. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను స్థాపించి గ్రామీణ భారతాన్ని పారిశ్రామికాభివృద్ధి దిశగా పరుగులు పెట్టించడం.

5 నదుల ప్రక్షాళన

మానవాళికి ప్రధానాధారమైన జలవనరులను కాపాడుకోవడానికీ, భారత ప్రజలందరికీ పరిశుభ్రమైన, రక్షిత మంచినీటిని అందుబాటులోకి తేవడానికి నదులను ప్రక్షాళన చేయడం.

6 సముద్రాలను జయిద్దాం

రాబోయే పదేళ్లలో సముద్రతీర ప్రాంతాలను అభివృద్ధి పరచడం. సముద్ర ఆధారిత ప్రాజెక్టుల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడం. ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడుకునే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరుచుకోవడం.

7 అంతరిక్షంలోకి దూసుకెళ్లడం

అంతరిక్ష రంగానికి అత్యధిక ప్రాధాన్యతినివ్వడం. అందులో భాగంగానే బడ్జెట్ కేటాయింపుల్లో ఈ రంగానికి భారీగా నిధుల కేటాయింపు. 2020 కల్లా భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపడం.

8 పౌష్టికాహారం

వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వడం ద్వారా ఆహారభద్రత అనే దీర్ఘకాలిక లక్ష్యానికి మార్గనిర్దేశనం చేయడం. ఆరోగ్యకరమైన ఆర్గానిక్ ఆహారాన్ని పండించుకోవడం ద్వారా స్వయం సమృద్ధిని సాధించడం.

9 ఆరోగ్యానికి అందలం

ప్రజల ఆరోగ్యానికి అత్యున్నత స్థానాన్ని కల్పించడం. అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో మారుమూల గ్రామ ప్రజలతో సహా సర్వజనానికీ వైద్యాన్ని అందుబాటులోకి తేవడం.

10 సుపరిపాలన

ప్రజాజీవితంలో ప్రభుత్వ యంత్రాంగం జోక్యం సాధ్యమైనంత వరకూ తగ్గించి, ప్రజలందరికీ సుపరిపాలనా ప్రయోజనాలందించడం, సత్వర స్పందన, బాధ్యతాయుత, స్నేహపూరిత అధికార యంత్రాంగం, ఇ–గవర్నెన్స్‌కు సోపానం వేయడం.




నమో ఓటర్

అన్నదాత కరుణిస్తాడా?

ఓట్ల కోసమైతేనేం.. చిన్న రైతుల ఖాతాల్లోకి నాలుగు నెలలకోసారి 2వేల రూపాయలు వచ్చిపడతాయి. అందరి ఆకలి తీర్చే అన్నదాతకు.. ఇదేమీ కడుపు నింపేసేది కాకపోయినా.. విత్తనాలకోసం వడ్డీ వ్యాపారిని ఆశ్రయించాల్సిన దుస్థితి తప్పుతుంది. ఐదెకరాల లోపు కమతాలున్న 12 కోట్ల మంది రైతులపై నరేంద్ర మోదీ విసిరిన అస్త్రమిది. వీరికి తొలివిడత మొత్తం కూడా ఈ ఏడాది మార్చి 31లోగా.. అంటే ఎన్నికల్లోగానే చేతికందుతుంది. దీంతో పాటు వైపరీత్యాల బారినపడ్డ రైతుల రుణాలకు వడ్డీ రాయితీని కూడా పెంచారు. మోదీ తీసుకున్న ఈ 'జై కిసాన్' నినాదం ఏ తీరానికి చేరుస్తుందో!

దేశంలో 5 ఎకరాలలోపు భూములున్న రైతులు	మార్చి 31లోగా ఇవ్వటానికి కేటాయించింది	2019-20 బడ్జెట్‌లో పూర్తి కేటాయింపులు
12 కోట్ల మంది	రూ.20వేల కోట్లు	రూ.75వేల కోట్లు









అత్యంత ధనవంతులైన వారి జాబితాను ఫోర్బ్స్ విడుదల చేస్తుంటుంది. ఈ ఏడాది విడుదల చేసిన జాబితాలో భారత్‌లో టాప్ 10 స్థానాల్లో ఉన్న వారి మొత్తం ఆస్తి విలువ దాదాపు రూ.12.7 లక్షల కోట్లు. టాప్ 10 స్థానాల్లో ఉన్న ఐశ్వర్యవంతులు వీరే..


01 
ముఖేశ్ అంబానీ..
రిలయన్స్ ఇండియా లిమిటెడ్ అధినేత
రూ. 3 లక్షల కోట్లు

02 
అజీమ్ ప్రేమ్‌జీ
విప్రో చైర్మన్
రూ. 1.49 లక్షల కోట్లు


03 
లక్ష్మీ మిట్టల్
ఆర్సెలోర్‌మిట్టల్ చైర్మన్, సీఈవో
రూ. 1.3 లక్షల కోట్లు

04 
హిందుజా బ్రదర్స్
శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్, అశోక్
రూ. 1.2 లక్షల కోట్లు


05 
పలోంజి మిస్త్రీ
షాపూర్‌జీ పలోంజీ గ్రూప్ చైర్మన్
రూ. 1.1 లక్షల కోట్లు

06 
శివ నాడర్
హెచ్‌సీఎల్ సహ వ్యవస్థాపకుడు
రూ. లక్ష కోట్లు

07 
గోద్రెజ్ ఫ్యామిలీ
గోద్రెజ్ గ్రూప్
రూ. 99 వేల కోట్లు

08 
దిలీప్ సంఘ్వీ
సన్ ఫార్మాసుటికల్ ఇండస్ట్రీస్
రూ. 89.8 వేల కోట్లు

09 
కుమార్ బిర్లా
ఆదిత్య బిర్లా చైర్మన్
రూ. 89.1 వేల కోట్లు

10 
గౌతమ్ అదానీ
అదానీ గ్రూప్ చైర్మన్
రూ. 84.8 వేల కోట్లు

రైతుకు రొక్కం!



అన్నదాతకు ఏటా రూ. 6,000 ఆర్థిక సాయం

'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పేరుతో కొత్త పథకం

ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల ఖాతాలకు నేరుగా నగదు బదిలీ

ఈ ఆర్థిక సంవత్సరం నుంచే అమలు

ఈ మార్చిలోగా రూ. 2వేలు బదిలీ... రూ. 75,000 కోట్లు కేటాయింపు..

న్యూఢిల్లీ:

కేంద్ర మధ్యంతర బడ్జెట్ రైతులపై వరాల జల్లు కురిపించింది. పెట్టుబడి సాయంగా ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు ఏడాదికి ఆరు వేల రూపాయల నగదు సాయం ప్రకటించింది. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పేరిట ప్రకటించిన ఈ పథకంలో భాగంగా చిన్న, సన్నకారు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు వెళుతుందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే ఈ పథకం అమల్లోకి వస్తుంది. ఈ పథకం కోసం ఏటా 75 వేల కోట్లు కేటాయించనున్నట్టు మంత్రి వెల్లడించారు. మూడు వాయిదాల్లో డబ్బు లబ్ధిదారులకు చేరుతుందన్నారు. తొలి విడతగా రూ.2వేల ఆర్థిక సాయం ఈ ఏడాది మార్చి లోగా రైతులకు అందజేస్తామని, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధం లేకుండా ఈ నగదు నేరుగా రైతుల ఖాతాలోకి మళ్లిస్తామని గోయల్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాలలో ఈ పథకం కోసం రూ. 20 వేల కోట్లను కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడు ఉత్తరాది కీలక రాష్ట్రాలలో బీజేపీ అధికారం కోల్పోయిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇలాంటి పథకాలకు శ్రీకారం చుట్టే అవకాశముందని గత కొంత కాలంగా వినిపిస్తూనే ఉంది. ఈ మూడు రాష్ట్రాలలో బీజేపీ ఓటమికి ప్రధాన కారణం గ్రామీణ ప్రాంతాలలో పెరిగిన అసంతృప్తే కారణమని విశ్లేషణలు వినిపించాయి. అందువల్లే రైతుల కోసం ప్రత్యక్ష నగదు బదిలీ పథకాన్ని కేంద్రం ప్రకటించిందని విశ్లేషకులంటున్నారు.

పెరిగిన కేటాయింపులు..

రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీతో పాటు 2019–20 మధ్యంతర బడ్జెట్‌లో పాడి రైతులకు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు కూడా ఉపశమన చర్యలను ప్రతిపాదించారు. పశుసంవర్ధక, మత్స్యకార రుణాలకు కూడా వడ్డీ రాయితీ వర్తిస్తుందని ప్రకటించారు. 2019–20 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు రూ. 1,49,981 కోట్లు కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాలు రూ. 86,602 కోట్లతో పోలిస్తే రానున్న ఆర్థిక సంవత్సరానికి కేటాయింపులు భారీగా పెరిగాయి. ఈ ఏడాది ఎరువుల సబ్సిడీ రూ. 70,075 కోట్లు కాగా రానున్న ఆర్థిక సంవత్సరం రూ.74,986 కోట్లు. పేద రైతాంగానికి నిర్దిష్ట ఆదాయ సహాయాన్ని ప్రకటించిన ఆర్థిక మంత్రి.. సాగులో ఆదాయం తగ్గిపోవడానికి చిన్న కమతాలు, వ్యవసాయ ఉత్పత్తుల ధరల పతనం వంటి పలు కారణాలున్నాయని పేర్కొన్నారు.

12 కోట్లమందికి లబ్ధి..

విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సామగ్రి, కూలీలు ఇంకా ఇతర అవసరాలు తీర్చడం కోసం రైతులకు పీఎం కిసాన్ పథకం ఉపకరిస్తుందని గోయల్ తెలిపారు. రైతు అప్పుల ఊబిలో చిక్కకుండా ఈ పథకం కాపాడుతుందని, ముఖ్యంగా ప్రైవేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల నుంచి రక్షిస్తుందని మంత్రి వివరించారు. ఈ పథకానికి నిధులను కేంద్ర ప్రభుత్వమే అందిస్తుందని, దాదాపు 12 కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం వల్ల లబ్ధి చేకూరుతుందని గోయల్ పేర్కొన్నారు. రైతులు సంపాదించడానికి, గౌరవప్రదమైన జీవనం సాగించడానికి ఈ పథకం దారి చూపుతుందని ఆయన వివరించారు. దీనివల్ల అత్యంత నిరుపేద రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూరడమే కాక, సాగు సీజన్‌కు ముందు అవసరమయ్యే అత్యవసర ఖర్చులకు ఉపయుక్తంగా ఉంటుందని మంత్రి తెలిపారు.

రైతులకు 2 శాతం వడ్డీ రాయితీ



ప్రకృతి వైపరీత్యాలు, అననుకూల వాతావరణ పరిస్థితులతో నష్టపోయే రైతులకు 2 శాతం వడ్డీ రాయితీని కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించింది. రుణాలను సకాలంలో చెల్లించేవారికి 3 శాతం అధికంగా అందిస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. చేపల పెంపకం, పశువుల పెంపకంపై ఆధారపడ్డ రైతులకు కూడా 2 శాతం వడ్డీ రాయితీని ప్రకటించారు. చేపల పెంపకం, పశువుల పెంపకంపై ఆధారపడ్డ రైతుల కోసం రూ.750 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్ సందర్భంగా కిసాన్ క్రెడిట్ కార్డులను చేపల పెంపకం, పశువుల పెంపకంపై ఆధారపడ్డ రైతులకు కూడా అందించాలని నిర్ణయించిన సంగతి తెల్సిందే.. ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులందరికీ పంటరుణాలపై 2 శాతం వడ్డీ రాయితీ వర్తింపజేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ రైతులకు జాతీయ వైపరీత్యాల సహాయ నిధి (ఎన్‌డీఆర్‌ఎఫ్) నుంచి అందించే సహాయంతో పాటు రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే రైతులకు ఇచ్చే 3 శాతం ప్రోత్సాహాన్ని వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతాంగానికి కూడా వర్తింపజేస్తామని మంత్రి తెలిపారు. ఈ ప్రోత్సాహాన్ని రుణాలు రీషెడ్యూల్ చేసిన కాలం మొత్తానికి అందించనున్నట్లు గోయల్ వివరించారు. ''ప్రకృతి వైపరీత్యాలు వాటిల్లినపుడు రైతులు సహజంగానే తమ రుణాలను తిరిగి చెల్లించలేరు. అలాంటి రైతులకు రుణాలను రీషెడ్యూల్ చేస్తున్నారు. వారికి రీషెడ్యూల్ చేసిన తొలి సంవత్సరం మాత్రమే 2 శాతం వడ్డీ రాయితీ వర్తింపజేస్తున్నారు.'' అని గోయల్ పేర్కొన్నారు. రాయితీతో కూడిన రుణాలను సులభంగా అందజేయడానికి, రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు అందించడానికి గాను ఒక పరిపూర్ణమైన ప్రక్రియను ప్రారంభించనున్నామని, ఇందుకోసం సులభంగా పూర్తిచేసే దరఖాస్తు ఫారాలను అందించనున్నామని తెలిపారు. పేద, భూమిలేని రైతులు ఉత్పాదక వ్యయాలను ఎదుర్కోవడానికి వారికి నిర్మాణాత్మక ఆదాయం అవసరమని తెలిపారు. సంచార తెగలను పైకి తీసుకురావడానికి ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తామన్నారు.

గోకుల్ మిషన్‌కు నిధుల పెంపు..

వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయ రుణ లక్ష్యం ఎంత అనేది ఆర్థిక మంత్రి వివరించలేదు. 2018–19లో వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.11 లక్షల కోట్లను దాటి రూ. 11.68 లక్షల కోట్లకు చేరుకుందని మంత్రి గోయల్ తెలిపారు. రైతులకు రుణాలను అందుబాటులో ఉంచడం కోసం గత ఐదేళ్లలో వడ్డీ రాయితీని రెట్టింపు చేసినట్లు ఆర్థికమంత్రి వివరించారు. అందువల్లే 2018–19లో పంట రుణాలు రూ.11.68 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఆయన తెలిపారు. రైతుల కష్టాలు తొలగించడానికి మోదీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని మంత్రి వివరిస్తూ.. మట్టి నాణ్యతా కార్డులు, నాణ్యమైన విత్తనాలు, నీటి పారుదల పథకాలు, ఎరువుల కొరత లేకుండా చూడడం వంటివాటి గురించి వివరించారు. పశుసంవర్ధక శాఖ, మత్స్యకార రంగాలకు కూడా గణనీయమైన మద్దతు అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఆ రంగాల ప్రాధాన్యతను గుర్తించినందునే ఈ ఆర్థిక సంవత్సరంలో 'రాష్ట్రీయ గోకుల్ మిషన్'కు నిధులను రూ.750 కోట్లకు పెంచినట్లు గోయల్ తెలిపారు.

కొత్తగా 'రాష్ట్రీయ కామధేను ఆయోగ్'

కొత్తగా 'రాష్ట్రీయ కామధేను ఆయోగ్' అనే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఆవుల ఉత్పాదకతను పెంచడం, గో వనరుల వృద్ధికి అవసరమైన జన్యుపరమైన ప్రయోగాలను విస్తరించడం వంటి పనులను ఈ వ్యవస్థ పర్యవేక్షిస్తుంది. గో సంరక్షణ కోసం రూపొందించిన సంక్షేమ పథకాలను, చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేయించడం కూడా ఈ వ్యవస్థ విధుల్లో భాగమే. మత్స్యకారుల అభివృద్ధిపై ప్రత్యేకంగా కేంద్రీకరించడం కోసం ఫిషరీస్‌కి ప్రత్యేకంగా ఒక డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు గోయల్ వెల్లడించారు. అత్యధికంగా మత్స్య సంపదను ఉత్పత్తి చేసే దేశాలలో రెండో అతి పెద్ద దేశం భారతదేశమేనని, ప్రపంచ ఉత్పత్తిలో భారత్ వాటా 6.3శాతమని మంత్రి వివరించారు. ఇటీవలి సంవత్సరాలలో చేపల ఉత్పత్తిలో సగటున 7శాతం వృద్ధి రేటు కూడా నమోదు చేశామని ఆయన తెలిపారు. 1.45 కోట్ల మందికి ఇది ప్రధాన జీవనాధారంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న ఉద్దేశంతో ఉత్పాదక వ్యయం కన్నా కనీసం 50 శాతం ఎక్కువ ఉండేలా కనీస మద్దతు ధరను నిర్ణయిస్తున్నామని గోయల్ వివరించారు. చరిత్రలోనే తొలిసారిగా ఈ ప్రభుత్వం 22 పంటల కనీస మద్దతు ధరలు



50 శాతం పెంచిందని ఆయన తెలిపారు. ఆహార ధాన్యాలు, నూనెగింజలు, చెరకు, పత్తి, ఇతర ఉద్యానవన పంటల ఉత్పత్తి భారీగా జరగడం వల్ల ధరలు పడిపోతున్నాయని, దాంతో సరైన ఆదాయం రాక దేశంలోని అనేక ప్రాంతాల రైతులు పూర్తి నిస్పృహలో ఉన్నారని ఆర్థికమంత్రి వివరించారు.

తెలంగాణ, ఒడిశా పథకాలతో పోల్చలేం

న్యూఢిల్లీ: రైతులకు నేరుగా నగదు బదిలీ చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పీఎం కిసాన్' పథకాన్ని వ్యవసాయ రంగ నిపుణులు స్వాగతించారు. అయితే ఈ పథకాన్ని ప్రస్తుతం తెలంగాణలోనూ, ఒడిశాలోనూ కొనసాగుతున్న పథకాలతో పోల్చలేమని వారు వ్యాఖ్యానించారు. ఆ రాష్ట్రాలలో రైతులకు ఇస్తున్న మొత్తం కన్నా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పథకం కింద ఇచ్చే మొత్తం చాలా తక్కువని పేర్కొంటున్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న రైతుబంధు పథకం లేదా ఒడిశాలో అమలు చేస్తున్న కాలియా పథకం కన్నా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పథకం మొత్తం చాలా తక్కువని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ చైర్మన్ ఎంజేఖాన్ వ్యాఖ్యానించారు. పీఎం కిసాన్ పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తేనే రైతులకు ఆ ఫలాలు అందుతాయని ఇన్‌సెక్టిసైడ్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ అగర్వాల్ వ్యాఖ్యానించారు. ధరల పతనం, పెరుగుతుండే ఖర్చులు వంటి ఇబ్బందుల నుంచి రైతులను కాపాడడానికి ఈ పథకం ఉపయోగపడుతుందని పీడబ్ల్యూసీ ఇండియాకు చెందిన అజయ్ వ్యాఖ్యానించారు.



రైతన్నల కష్టాలు తీరాలంటే వారు ఎదుర్కొన్న సమస్యలన్నింటినీ కలిపి చూడాల్సిన అవసరం ఉంది. ధరలు, పంట సేకరణ, పంపిణీల్లో సమస్యలకు సమష్టిగానే పరిష్కార మార్గాలు కనుగొనాలి.

– ఎంఎస్ స్వామినాథన్, వ్యవసాయ శాస్త్రవేత్త

రైతులకు ప్రయోజనం కలిగించే బడ్జెట్: నాబార్డ్

ముంబై: కేంద్ర బడ్జెట్‌ను జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) స్వాగతించింది. వ్యవసాయ రంగంపై దృష్టి సారించిందని, బడ్జెట్ ప్రతిపాదనలతో చిన్న రైతులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడింది. కొత్త ప్రభుత్వం తన పూర్తి స్థాయి బడ్జెట్‌ను రైతులకు మార్కెట్ అనుసంధాన వసతులు కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, వాటి తయారీపై పెట్టొచ్చని నాబార్డ్ చైర్మన్ హెచ్‌కె భన్వాలా పీటీఐతో చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో వడ్డీ రాయితీతోపాటు అనేక స్వాగత చర్యలున్నాయని అన్నారు. ప్రాథమిక ఆదాయ మద్దతుతో చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి కలుగుతుందని పేర్కొన్నారు. ఫిషరీస్, యానిమల్ హజ్బెండరీ రంగాలకు 5 శాతం వరకు వడ్డీ రాయితీని కల్పించడం వల్ల చేపల పెంపకం, పశువుల పెంపకం, వీటి అనుబంధ రంగాలపై ఆధారపడిన రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రైతులకు ఏడాదికి ఇచ్చే రూ.6,000 నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని దీంతో విత్తనాలు, ఎరువులు, తదితరాల కొనుగోలుకు వినియోగించవచ్చన్నారు.

వ్యవసాయం గట్టెక్కించేనా?

పెను సంక్షోభంలో రైతాంగం • ఆదాయం అంతంత మాత్రమే • సమగ్ర ప్రణాళికతోనే శాశ్వత పరిష్కారం: నిపుణులు

అప్పులకు తాళలేక అన్నదాతల వరుస ఆత్మహత్యలు, పెట్టుబడికి తగిన రాబడి రాకపోవడం, పంట ఉత్పత్తుల ధరల పతనం లాంటి కారణాలతో దేశ రైతాంగం కనీవినీ ఎరుగని సంక్షోభం ఎదుర్కొంటోంది. ఏడాదిన్నర వ్యవధిలో దేశవ్యాప్తంగా రైతులు 18 సార్లు రోడ్డెక్కి ఆందోళనలకు దిగారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 184 రైతు సంఘాలు దేశవ్యాప్త నిరసనలకు దిగడంతో రైతన్నల ఆగ్రహజ్వాలలు ఢిల్లీ పీఠాన్ని తాకాయి. ఇటీవల హిందీ బెల్ట్‌లోని మూడు రాష్ట్రాల్లో బీజేపీ పరాజయానికి అన్నదాతల ఆగ్రహమే కారణమని నిర్ణయానికొచ్చిన కేంద్ర ప్రభుత్వం వారిని మచ్చిక చేసుకోవడానికి రకరకాల పథకాలపై అధ్యయనం చేసి, చివరికు తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలు అమలు చేస్తున్న పెట్టుబడి సాయమే మంచిదన్న నిర్ణయానికొచ్చింది. కేంద్ర బడ్జెట్‌లో రైతులపై వరాల జల్లులు కురిపిస్తూ ఏడాదికి రూ. 6 వేల పెట్టుబడి సాయాన్ని ప్రకటించింది. కానీ దీని వల్ల రైతులకు కలిగే ప్రయోజనం ఎంత అన్నది ప్రశ్నార్థకమే.

– సాక్షి, హైదరాబాద్



ద్రవ్యోల్బణంలో 40 శాతం వాటా..

ద్రవ్యోల్బణానికి, వ్యవసాయాదాయానికి మధ్య మౌలికంగా కొంత వైరుధ్యం ఉంది. ద్రవ్యోల్బణాన్ని నిర్ణయించే వినిమయ ధరల సూచి (సీపీఐ)లో 40% వరకు ఆహార పదార్థాలే ఉంటాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం దేశ ద్రవ్యవిధానంలో కీలకమైన అంశం. ద్రవ్యోల్బణం తగ్గడం వ్యవసాయ ఉత్పత్తుల ధరలను దెబ్బతీసింది. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి వ్యవసాయాదాయాన్ని నియంత్రించడం మంచిది కాదు. విధాన నిర్ణేతలు ఎదుర్కొంటున్న అతిపెద్ద రాజకీయ–ఆర్థిక సమస్య ఇది.

సాయం కంటితుడుపేనా?

2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇప్పటికే ప్రకటించిన ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల వేళ పెట్టుబడి సాయం రూపంలో తాయిలాలు ప్రకటించింది. భారత్‌లో వ్యవసాయ రంగంపై ఆధారపడిన వారి సంఖ్య 50 శాతానికి పైనే అయినా, ఆ రంగం నుంచి వస్తున్న స్థూల జాతీయోత్పత్తి అంతకంతకు తగ్గిపోయి 17–18 శాతానికి చేరుకుంది. సాధారణ ద్రవ్యోల్బణం కంటే ఆహార ద్రవ్యోల్బణం దారుణంగా పడిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడి సాయం చేయడం కంటి తుడుపు చర్యేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పండిన పంటకి గిట్టుబాటు ధర కల్పించడం, వ్యయ భారాన్ని తగ్గించడం, పంట నిల్వ వసతుల్ని మెరుగుపరచడం లాంటి వాటిపై దృష్టి సారించాలి. రాష్ట్రాల వారీగా అక్కడున్న ఖర్చుల ఆధారంగా పెట్టుబడి వ్యయాన్ని నిర్ణయించాలని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వ్యవసాయ సంక్షోభం ఎలా ఉందంటే..

- మన దేశంలో మొత్తం 26 కోట్ల 30 లక్షల మంది రైతులు ఉండగా, 2016–17 నాబార్డ్ ఆర్థిక సర్వే ప్రకారం ఒక్కో రైతు కుటుంబంపై రూ.1.04 లక్షల అప్పు భారం ఉంది.
- దేశం మొత్తం మీద 52శాతం మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయినట్లు నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీసు (ఎన్ఎస్ఎస్ఒ) వెల్లడించింది.
- రైతు అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. ఏపీలో 92.9శాతం మంది రైతులు రుణగ్రస్తులు కాగా, తరువాతి స్థానాల్లో తెలంగాణ (89.1%), తమిళనాడు (82.5%) ఉన్నాయి.
- ప్రభుత్వ పథకాలపై 64 శాతం మంది రైతులు అసంతృప్తితో ఉన్నట్టు సీఎస్‌డీఎస్ అధ్యయనంలో తేలింది.
- సాగు కమతాల విస్తీర్ణం బాగా తగ్గిపోవడం, ఎకరా, రెండు ఎకరాలు ఉన్న చిన్న రైతుల సంఖ్య పెరగడంతో వారు బేరమాడేశక్తిని కోల్పోతున్నారు. దీంతో దళారులు చెప్పే ధరకే పంటని అమ్ముకుంటున్నారు.
- పంటల ఉత్పత్తికి తగిన డిమాండ్ లేకపోవడంతో రైతులకు ఆశించిన ధర దక్కడం లేదు.
- గోదాములు, శీతల గిడ్డంగుల కొరతతో పంట ఉత్పత్తులు తొందరగా చెడిపోవడం కూడా రైతులకు నష్టం కలిగిస్తోంది.
- డీజిల్ ధరలు పెరగడం, అంతర్జాతీయంగా రూపాయి విలువ పతనంతో ఎరువుల ధరలు ఎగబాకడంతో పెట్టుబడి వ్యయం అధికమవుతోంది.
- ప్రత్యామ్నాయ మార్గాలుంటే వ్యవసాయ రంగాన్ని వదులుకోవాలని సుమారు 40 శాతం రైతులు భావిస్తున్నారు.




దీర్ఘాయుష్మాన్ భవ...

ఇప్పటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సైతం నోచుకోని పల్లెలున్న భారతమిది. ఇక్కడ నిరుపేదకు సుస్తీ చేస్తే చావే శరణ్యం. కాబట్టి కార్పొరేట్ వైద్యాన్ని సాకారం చేసే సార్వత్రిక ఆరోగ్య బీమానిచ్చే ఏ పథకాన్నయినా దీర్ఘాయుష్మాన్ భవ అంటూ దీవించాల్సిందే. కాకపోతే గత బడ్జెట్‌లో ప్రకటించి ఊరుకున్నారు. ప్రయోగాలకే పరిమితమయ్యారు. ఈ సారి ఎన్నికలొస్తున్నాయి కనక పూర్తి స్థాయి కేటాయింపులు చేస్తూ... వెల్‌నెస్ సెంటర్ల నుంచి ఎయిమ్స్ దాకా పూర్తిస్థాయి వైద్య సదుపాయాల్ని అందుబాటులోకి తెచ్చే విజన్‌నూ ఆవిష్కరించారు. ఏ ప్రభుత్వమున్నా ఆ విజన్ సాకారం కావాలన్నదే నిరుపేదల ఆకాంక్ష. ఎందుకంటే వారికి కావాల్సింది వైద్యం మరి.

ఆయుష్మాన్ ప్రధానమంత్రి జనారోగ్య యోజనకు రూ.6,400 కోట్లు





బడ్జెట్ తయారీ ఇలా..



బడ్జెట్ అనగానే చాలామంది లెక్కల చిక్కులే అనుకుంటారు! కానీ ఈ మూడక్షరాల వెనుక చాలా కృషి దాగుంటుంది. ఎంతో కసరత్తు.. లెక్కకు మించి భేటీలు.. ఆద్యంతం గోప్యత.. అబ్బో చాలా తతంగమే ఉంటుంది. అదేంటో ఓ లుక్కేయండి!

సెప్టెంబర్లో..
రానున్న ఆర్థిక సంవత్సరంలో ఏయే రంగానికి ఎంత ఖర్చు పెట్టాలన్న కసరత్తు మొదలవుతుంది. దేశంలో మొత్తం జనాభా తమ తిండి కోసం ఏడాది అంతా ఎంత ఖర్చు చేస్తున్నారో దాదాపు అంత మొత్తాన్ని ప్రభుత్వం బడ్జెట్‌కు కేటాయిస్తుంది.

అక్టోబర్లో..
తమకు కావాల్సిన నిధులపై వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు ఆర్థికశాఖతో చర్చల్లో తలమునకలవుతారు.

డిసెంబర్
ముసాయిదా బడ్జెట్ కాపీలను అధికారులు ఆర్థికమంత్రికి నివేదిస్తారు. ఈ ముసాయిదా పత్రాలన్నీ నీలం రంగులో ఉంటాయి.

జనవరి..
పారిశ్రామిక, బ్యాంకింగ్ రంగాలకు చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు ఆర్థికమంత్రిని కలసి తమ సమస్యలను సలహాలను, సూచనలను అందజేస్తారు. ఈ సందర్భంగా ఆర్థికమంత్రి అందరి వాదనలు వింటారుగానీ ఎవరికీ నిర్దిష్టమైన హామీ ఇవ్వరు.

ముద్రణ ప్రక్రియ
బడ్జెట్‌కు సంబంధించిన అన్ని వివరాలను అత్యంత రహస్యంగా ఉంచేందుకు జనవరి నుంచి ఆర్థికమంత్రిత్వ శాఖ కార్యాలయాల్లోకి జర్నలిస్టుల ప్రవేశాన్ని నిషేధిస్తారు.

ఫోన్ ట్యాపింగ్
బడ్జెట్ ప్రతిపాదనలు ఏమాత్రం లీక్ కాకుండా చూసే బాధ్యతను ఇంటెలిజెన్స్ విభాగం చూసుకుంటుంది. ఇందుకు కొందరు ఉన్నతాధికారుల ఫోన్లను సైతం ట్యాప్ చేస్తుంటుంది.

మూడో కన్ను..
ఆర్థిక శాఖ కార్యాలయానికి వచ్చే సందర్శకులపై సీసీటీవీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు నిఘా ఉంటుంది. ఈ కెమెరాల పరిధిని దాటి వారు కనీసం కుర్చీలపై కూర్చోవడానికి కూడా అనుమతి ఉండదు.

అంతా ప్రత్యేకం
బడ్జెట్ పత్రాలను తయారు చేసే 'ప్రింటింగ్ ప్రెస్' సిబ్బందిని ఎవరితో సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఉంచుతారు. వీరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు.

ఆహారంపైనా..
ప్రింటింగ్ ప్రెస్ సిబ్బందికి అందించే తిండిపై అత్యంత జాగ్రత్త తీసుకుంటారు. ఏ ఆహారాన్నైనా పరీక్షించిన తర్వాతే వారికి ఇస్తారు.

నీడలా వెన్నంటే..
ముద్రణ విభాగంలో పనిచేసే సిబ్బంది ఎవరైనా అత్యవసరంగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తే.. సదరు వ్యక్తి వెంట ఓ ఇంటెలిజెన్స్ అధికారి, ఓ పోలీసు ఉంటారు. వారు అనుక్షణం ఆయనను నీడలా అనుసరిస్తారు.

ఫిబ్రవరి 1న..
ఉదయం 11 గంటలకు ఆర్థికమంత్రి పార్లమెంటుకు బడ్జెట్‌ను సమర్పిస్తారు. సభలో ప్రవేశపెట్టేముందు రాష్ట్రపతి, ప్రధానమంత్రికి బడ్జెట్ గురించి స్థూలంగా వివరిస్తారు.

బడ్జెట్ లీక్..
పరీక్ష పేపర్లే కాదు.. బడ్జెట్ పేపర్లు కూడా లీకైన సంఘటన 1950లో చోటుచేసుకుంది. అప్పట్లో బడ్జెట్ పత్రాల్ని రాష్ట్రపతి భవన్‌లో ముద్రించేవారు. 1950లో ఈ పత్రాలు లీక్ కావడంతో అప్పట్నుంచీ మింట్‌రోడ్‌లోని సెక్యూరిటీ ప్రెస్‌కు వేదికను మార్చారు. 1980 నుంచి ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో బడ్జెట్ పత్రాల్ని ముద్రిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు.

ఆరోగ్యం.. ఆయుష్మాన్!



- గతేడాది కన్నా 16 శాతం అధిక కేటాయింపులు
- మొత్తం రూ.61,398 కోట్లు..అందులో ఆయుష్మాన్ భారత్‌కు రూ.6,400 కోట్లు
- 2022 నాటికి 1.5 లక్షల వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు
- ఎయిమ్స్‌లకు రూ.3,599.65 కోట్లు..ఎన్‌హెచ్‌ఎంకు రూ.31,745 కోట్లు
- బడ్జెట్‌లో ప్రతిపాదించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ:

ఆరోగ్య రంగానికి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.61,398 కోట్లను కేటాయించారు. అందులో రూ.6,400 కోట్లను ఆయుష్మాన్ ప్రధాన మంత్రి జనారోగ్య యోజన(ఆయుష్మాన్ భారత్)కు ప్రత్యేకించారు. గత ఏడాది కన్నా ఈసారి ఆరోగ్య రంగానికి 16 శాతం అధికంగా కేటాయింపులు జరపడం గమనార్హం. ఇతర విశేషాలు..

- జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్(ఎన్ఆర్‌హెచ్‌ఎం)లో భాగంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్, వెల్‌సెంటర్ల ఏర్పాటుకు రూ.250 కోట్ల కేటాయింపు.
- జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కింద హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు నిమిత్తం రూ.1,350.01 కోట్ల కేటాయింపు.
- ఈ పథకం కింద 2022 నాటికి దేశవ్యాప్తంగా 1.5 లక్షల ఉప ఆరోగ్య కేంద్రాల్ని హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతారు. రక్తపోటు, డయాబెటిస్, కేన్సర్, వృద్ధాప్య సంబంధ వ్యాధులకు ఈ కేంద్రాల్లో చికిత్స అందిస్తారు.
- జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) పథకానికి రూ.31,745 కోట్లు కేటాయించారు.
- ఎన్‌హెచ్‌ఎంలో అంతర్భాగమైన రాష్ట్రీయ స్వస్థ్య బీమా యోజనకు రూ. 156 కోట్లు కేటాయించారు. ఈ మొత్తం గతేడాది కన్నా రూ.1,844 కోట్లు తక్కువ కావడం గమనార్హం.
- ఎయిడ్స్, అసురక్షిత లైంగిక వ్యాధుల నివారణ కార్యక్రమానికి రూ.2,500 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం రూ.400 కోట్లు అధికం.

'ఆయుష్మాన్'తో 3 వేల కోట్లు ఆదా: పీయూష్

ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఇప్పటి దాకా ఉచితంగా వైద్యం చేయించుకున్న సుమారు 10 లక్షల మంది పేదలు రూ.3 వేల కోట్లను ఆదాచేసుకున్నారని పీయూష్ గోయల్ చెప్పారు. జన ఔషధి కేంద్రాల ద్వారా ప్రభుత్వం చౌక ధరలకే ఔషధాల్ని అందిస్తోందని, గుండెలో అమర్చే స్టెంట్లు, కృత్రిమ మోకాలి చిప్పల ధరల తగ్గింపుతో లక్షలాది మంది పేదలు ప్రయోజనం పొందారని తెలిపారు. దేశంలో ప్రస్తుతం 21 ఎయిమ్స్ ఆసుపత్రులు పనిచేస్తున్నాయని, అందులో 14 ఆసుపత్రుల్ని ఎన్డీయే ప్రభుత్వమే ప్రారంభించిందని అన్నారు. పేదలకు ఆరోగ్య సేవల్ని చేరువచేసేందుకు మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యల్ని ఉటంకిస్తూ..2030 నాటికి ఎలాంటి అవాంతరాలు లేని సమగ్ర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ఏర్పాటుచేసేలా పనిచేస్తున్నామని వెల్లడించారు. అలాంటి ఆరోగ్య భారత నిర్మాణంలో మహిళలనూ సమాన భాగస్వాముల్ని చేస్తామని తెలిపారు.

- ఎయిమ్స్‌కు రూ.3,599.65 కోట్లు కేటాయించారు.
- జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమానికి కేటాయింపులను రూ.50 కోట్ల నుంచి రూ.40 కోట్లకు తగ్గించారు.
- కేన్సర్, డయాబెటిస్, హృద్రోగ సంబంధ వ్యాధుల నివారణ, నియంత్రణ కార్యక్రమానికి కేటాయింపులను రూ.295 కోట్ల నుంచి రూ.175 కోట్లకు తగ్గించారు.
- టెర్షరీ కేర్(ప్రత్యేక సంరక్షణ, చికిత్సలు) కార్యక్రమాలకు కేటాయింపులను రూ.750 కోట్ల నుంచి రూ.500 కోట్లకు తగ్గించారు.
- నర్సింగ్ సేవల ఆధునీకరణకు రూ.64 కోట్లు, ఫార్మసీ స్కూల్స్, కళాశాలల బలోపేతానికి రూ.5 కోట్లు, జిల్లా ఆసుపత్రులు, రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ కళాశాలల(పీజీ సీట్లు) ఆధునీకరణకు రూ.800 కోట్లు కేటాయించారు.
- ప్రభుత్వ మెడికల్ కళాశాలలు(డిగ్రీ సీట్లు), కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి రూ.1,361 కోట్ల కేటాయింపు. కొత్త వైద్య కళాశాలల స్థాపనకు రూ.2 వేల కోట్లు, రాష్ట్రాల్లో ప్రభుత్వ పారామెడికల్ కళాశాలల ఏర్పాటుకు రూ.20 కోట్లు కేటాయించారు.

స్త్రీ, శిశు.. సంక్షేమానికి 20 శాతం అధిక నిధులు



న్యూఢిల్లీ: స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖకు ఈసారి బడ్జెట్లో కేటాయింపులు పెరిగాయి. తాజా బడ్జెట్లో ఈ శాఖకు రూ. 2,9164.90 కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయించిన రూ. 24758.62 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 20 శాతం అధికం. రాబోయే ఐదేళ్లకు చేపట్టాల్సిన పనుల గురించి రోడ్ మ్యాప్ తయారు చేస్తామని స్త్రీశిశు సంక్షేమమంత్రి మనేకా గాంధీ చెప్పారు. దేశవ్యాప్తంగా స్త్రీలు, పిల్లల కోసం ఏకీకృత కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. దేశ జనాభాలో 40 శాతమున్న పిల్లలకు జరపాల్సిన కేటాయింపులు మాత్రం అంచనాలకు అనుగుణంగా లేవని చైల్డ్ రైట్స్ అండ్ యూ సంస్థ సీఈఓ పూజా మర్వాహా పెదవివిరిచారు. బడ్జెట్ ప్రసంగంలోకానీ, విజన్ 2030లో కానీ పిల్లల ప్రస్తావనే లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సుకన్య సమృద్ధి యోజన ప్రస్తావన లేకపోవడంపై కూడా ఎన్‌జీవోలు నిరాశ వ్యక్తం చేశారు.

ప్రధాన కేటాయింపులు

- ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకానికి కేటాయింపులు రూ. 1,200 కోట్ల నుంచి రూ. 2,500 కోట్లకు పెంపు.
- ఈ పథకం కింద గర్భిణీ స్త్రీలు, బాలింతలకు రూ. 6,000 సాయం.
- జాతీయ పౌష్టికాహార మిషన్(ఎన్ఎన్ఎం) ద్వారా పది కోట్ల మందికి ప్రయోజనం. ఈ పథకానికి రూ. 3,400 కోట్ల కేటాయింపు.
- శిశు అభివృద్ధి సేవలకు కేటాయింపులు రూ. 925 కోట్ల నుంచి రూ. 1500కు పెంపుదల.
- బేటీ బచావ్, బేటీ పడావో పథకానికి రూ. 200 కోట్ల నుంచి రూ. 280 కోట్ల కేటాయింపుల పెంపుదల.
- అంగన్‌వాడీ సేవలకు రూ. 19,834.37 కోట్ల కేటాయింపులు.
- నేషనల్ క్రెచ్ స్కీమ్‌కు రూ. 30 కోట్ల నుంచి రూ. 50 కోట్లకు కేటాయింపులు పెంచారు.
- వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ పథకానికి కేటాయింపులు రూ. 52 కోట్ల నుంచి రూ. 165 కోట్లకు పెంపు.
- మహిళా శక్తి కేంద్రాల పథకానికి కేటాయింపులు రూ. 115 నుంచి రూ. 150 కోట్లకు పెంచారు.
- ఉజ్వల(అక్రమ రవాణా నుంచి కాపాడిన మహిళలను ఆదుకునే పథకం)కు కేటాయింపులు రూ. 20 కోట్ల నుంచి రూ.30 కోట్లకు, విడో గృహాలకు రూ. 8 కోట్ల నుంచి రూ. 15 కోట్లకు పెంచారు.
- మహిళా సాధికారత, సశక్తిత మిషన్‌కు బడ్జెట్‌ను రూ. 1,156 కోట్ల నుంచి రూ. 1,330 కోట్లకు పెంపుదల.

'ఆమె'కోసం రూ.1,330 కోట్లు

న్యూఢిల్లీ: మహిళల రక్షణ, సాధికారతకోసం బడ్జెట్‌లో రూ.1,330 కోట్లు కేటాయించామని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. గత బడ్జెట్‌కన్నా ఈ మొత్తం రూ.174 కోట్లు అధికమని శుక్రవారం లోక్‌సభలో ఆయన తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా తెలిపారు. గత నాలుగేళ్లుగా మహిళలకోసం అనేక పథకాలు ప్రవేశపెట్టామని, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ద్వారా 'మహిళాభివృద్ధి నుంచి మహిళల నేతృత్వంలో అభివృద్ధి'సాధించగలిగామని ఆయన అన్నారు. ప్రధానమంత్రి ముద్ర యోజన లబ్ధిదారుల్లో 70 శాతంపైగా మహిళలు ఉన్నారని, సులువైన రుణ పద్ధతి ద్వారా వారు స్వయంగా ఉపాధి అవకాశాలు సృష్టించుకున్నారని గోయల్ చెప్పారు. అలాగే 26 వారాల ప్రసూతి సెలవుల ద్వారా మహిళలకు ఉపాధిలో ఆర్థిక భరోసా కలిగిందన్నారు. ఉజ్వల యోజన ద్వారా ఎనిమిది కోట్ల ఉచిత ఎల్పీజీ కనెక్షన్లను ప్రభుత్వం అందిస్తోందని, ఇప్పటికే లబ్ధిదారుల సంఖ్య ఆరుకోట్లు దాటిందని, మిగిలినవి వచ్చే ఆర్థిక సంవత్సరంలో అందజేస్తామని ఆయన వెల్లడించారు.

పర్యావరణానికి రూ.3,111 కోట్లు



న్యూఢిల్లీ: మధ్యంతర బడ్జెట్‌లో పర్యావరణ మంత్రిత్వ శాఖకు ప్రభుత్వం రూ.3,111.20 కోట్లు కేటాయించింది. గత కేటాయింపులతో పోలిస్తే ఇది 20.27 శాతం ఎక్కువ. గత ఆర్థిక సంవత్సరంలో ఈ శాఖకు రూ.2,586.67 కోట్లు కేటాయించింది. గత ఏడాది మాదిరిగానే పులులను సంరక్షించే 'ప్రాజెక్టు టైగర్'కు రూ.350 కోట్లు, ఏనుగుల కోసం అమలు చేస్తున్న 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్'కు రూ.30 కోట్లు వెచ్చించనుంది. పులుల సంరక్షణ ప్రాజెక్టులో భాగంగా ఉన్న నేషనల్ టైగర్ కాన్జర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ)కి గత ఏడాది కంటే రూ.కోటి ఎక్కువగా రూ.10 కోట్లు ఇచ్చింది. ఈ కేటాయింపులపై ఎన్‌టీసీఏ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ నిశాంత్ వర్మ సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా, జంతు సంక్షేమ బోర్డు(ఏడబ్ల్యూబీ)కు గత ఏడాది కంటే రూ.2 కోట్లు ఎక్కువగా అంటే రూ.12 కోట్లు ప్రత్యేకించింది. నేషనల్ కమిషన్ ఫర్ గ్రీన్ ఇండియాకు గత ఏడాది కంటే రూ.30 కోట్లు ఎక్కువగా రూ.240 కోట్లు కేటాయించింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(సీపీసీబీ)కి గత ఏడాది మాదిరిగానే రూ.100 కోట్లు ప్రత్యేకించిన ప్రభుత్వం, కాలుష్య నివారణ కార్యక్రమాలకు గత ఏడాది కంటే సగానికి తగ్గించి రూ.10 కోట్లు ఇచ్చింది. ఈ పరిణామంపై స్పందించేందుకు సీపీసీబీ అధికారులు నిరాకరించారు.

సామాజిక న్యాయ, సాధికారతకు రూ.7,800 కోట్లు

న్యూఢిల్లీ: సామాజిక, న్యాయ సాధికారత శాఖకు ఈసారి బడ్జెట్ కేటాయింపులు గతేడాది కంటే కాస్త పెరిగాయి. 2018–19లో రూ.7,750 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.7,800 కోట్లకు పెంచారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రూ.1,144.90 కోట్లు కేటాయించారు. గతేడాది కంటే(రూ.1,070 కోట్లు) ఇది ఏడు శాతం అధికం. 'షెడ్యూల్ క్యాస్ట్‌కు సంబంధించి 2018–19 బడ్జెట్ అంచనాలు రూ.56,619 కోట్లు కాగా.. 2019–20కి వచ్చేసరికి రూ.76,801 కోట్లకు పెరిగింది. మొత్తంగా ఇది 35.6 శాతం అధికం' అని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, సఫాయి కర్మచారీస్ తదితర ఐదు జాతీయ కమిషన్ల కోసం గత బడ్జెట్‌లో రూ.33.72 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.39.87 కోట్లకు పెంచారు. జాతీయ స్కాలర్‌షిప్ పథకాలకు కేటాయింపులు తగ్గించారు. గతేడాది రూ.500 కోట్లు కేటాయించగా.. ఈ సారి రూ.390.50 కోట్లకు పరిమితం చేశారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర ఆర్థిక, అభివృద్ధి బోర్డులకు రూ.215 కోట్లు కేటాయించారు.


డీవోపీటీకి 241 కోట్ల నిధులు

న్యూఢిల్లీ: అధికారులకు జాతీయంగా, అంతర్జాతీయంగా శిక్షణ ఇచ్చేందుకు గానూ డీవోపీటీకి ఈ బడ్జెట్‌లో రూ. 241.8 కోట్లను కేంద్రం ప్రకటించింది. కేంద్ర సిబ్బంది శిక్షణ వ్యవహారాల విభాగానికి (డీవోపీటీ).. గతేడాది రూ. 194.76 కోట్లు కేటాయించగా.. దీనికి ఈ ఏడాది కేటాయింపులను 24% నిధులను పెంచారు. ఇందులో రూ. 79.06 కోట్లతో ఢిల్లీలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌టీఎమ్), ముస్సోరీలో లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్‌బీఎస్ఎన్ఏఏ) లను నిర్మించనున్నారు. ఈ రెండు కేంద్రాల్లో ఐఏఎస్ అధికారులకోసం పలు శిక్షణాకార్యక్రమాలు నిర్వహిస్తారు. మిగిలిన రూ.162.75కోట్లను శిక్షణ అవసరాలకోసం ఖర్చు చేస్తారు. అటు.. కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ), పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ)లకు వేరుగా రూ. 30.26కోట్లు కేటాయించారు. గతేడాది ఈ రెండు విభాగాలకు కలిపి రూ.29.27కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. అధికారుల సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ (క్యాట్)కు రూ.119.46 కోట్లు కేటాయించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపట్టే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)కి రూ. 239.97కోట్లను తాజా బడ్జెట్‌లో ప్రకటించారు.

లోక్‌పాల్‌కు, సీవీసీకి అంతంతే

న్యూఢిల్లీ: అవినీతి నిరోధక అంబుడ్స్‌మెన్ లోక్‌పాల్‌కు, కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)కు 2019–20 మధ్యంతర బడ్జెట్‌లో నామమాత్రపు నిధులనే కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరం లోక్‌పాల్‌కు రూ.4.29 కోట్లు కేటాయించగా ఈసారి బడ్జెట్‌లో కూడా అంతే మొత్తం కేటాయించారు. సీవీసీకి మాత్రం గతేడాది కేటాయింపుల కంటే ఈసారి స్వల్పంగా నిధులను పెంచారు. 2018–19 బడ్జెల్‌లో సీవీసీకి రూ.34 కోట్లు కేటాయించగా ఈసారి రూ.35.5 కోట్లు కేటాయించారు.

సీబీఐకి రూ.777 కోట్లు



న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి ఈ ఏడాది మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రం రూ.777.27 కోట్లు కేటాయించింది. గతేడాది కేటాయింపుల కన్నా ఈసారి కొంచెం తగ్గించారు. గతేడాది బడ్జెట్‌లో రూ.778.93 కోట్లు కేటాయించారు. దేశ, విదేశాల్లో చాలా సున్నితమైన కేసులపై సీబీఐ దర్యాప్తు చేపడుతుంది. భారత్‌లో సంచలనం రేపిన అగస్టా వెస్ట్‌లాండ్ స్కాం, పోంజీ కుంభకోణం, అక్రమ మైనింగ్ వ్యవహారాలు, నకిలీ ఎన్‌కౌంటర్ల వంటి వాటి గుట్టురట్టు చేసింది. అలాగే విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, జతిన్ మెహతా, మెహుల్ చోస్కీ తదితరులు ఆర్థిక నేరగాళ్ల బండారం బయటపెట్టింది. బడ్జెట్ కేటాయింపులను సీబీఐ ఈ–గవర్నెన్స్, శిక్షణ కార్యాలయాల ఆధునీకరణ, పలు సాంకేతిక, ఫొరెన్సిక్ యూనిట్ల పెంపు, కార్యాలయాల భవనాల కోసం భూ కొనుగోలు, నిర్మాణం తదితరాల కోసం సీబీఐ వినియోగించనుంది.

అభివృద్ధికి రహదారి

రోడ్ల నిర్మాణంలో అత్యంత వేగవంతమైన పురోగతి



న్యూఢిల్లీ: రోజుకు సగటున 27 కి.మీ మేర రహదారులు నిర్మిస్తూ ఈ రంగంలో భారత్ అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేసిందని పీయూష్ గోయల్ చెప్పారు. వచ్చే 8 ఏళ్లలో 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని భారత్ ఉవ్విళ్లూరుతోందని చెప్పారు. మధ్యంతర బడ్జెట్ చారిత్రకమైనదని రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ స్వాగతించారు. దీని ద్వారా 40–50 కోట్ల మంది పేదలు, మధ్యతరగతి ప్రజలు నేరుగా ప్రయోజనం పొందుతారని చెప్పారు. మౌలిక వసతులకు కేటాయింపులు, ప్రతిపాదిత ప్రాజెక్టులు, పూర్తయిన ప్రాజెక్టులపై తాజా బడ్జెట్‌లో గోయల్ ప్రస్తావించిన విషయాలు..

- రోడ్లు, రైల్వేలు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, పట్టణ రవాణా, గ్యాస్–విద్యుత్ సరఫరా, జలరవాణా మార్గాల లాంటి రంగాల్లో తరువాతి తరం మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.
- ఢిల్లీ, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్‌లలో ఏళ్లుగా నిలిచి పోయిన వంతెన ప్రాజెక్టులు పూర్తయ్యాయి.
- రోడ్ల నిర్మాణానికి రూ.83 వేల కోట్లు కేటాయించారు.
- బ్రహ్మపుత్ర నదిలో నౌకాయానాన్ని అభివృద్ధిచేస్తే.. ఈశాన్య ప్రాంతానికి కూడా జలమార్గం గుండా సరుకు రవాణా చేసేందుకు సాధ్యమవుతుంది.
- కోల్‌కతా నుంచి వారణాసికి తొలిసారిగా దేశీయంగా జలరవాణా ద్వారా సరుకు రవాణా ప్రారంభమైంది.

64,587 కోట్లు — తాజా బడ్జెట్‌లో రైల్వేలకు సమకూర్చిన మూలధనం

1,58,658 కోట్లు — రైల్వేల మొత్తం మూలధన వ్యయం విలువ

- రైల్వే చరిత్రలోనే ఈ ఏడాది అత్యంత సురక్షితమైనదిగా గడిచింది.
- సిక్కింలోని పాక్యాంగ్ విమానం అందుబాటులోకి వచ్చాక దేశంలో పనిచేస్తున్న విమానాశ్రయాల సంఖ్య 100కు చేరింది.
- స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన తొలి సెమీ హైస్పీడ్ రైలు 'వందేభారత్ ఎక్స్‌ప్రెస్'తో ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సేవలు, వేగం, భద్రత అందుబాటులోకి వస్తాయి. ఈ సాంకేతికతతో మన ఇంజినీర్లు మేకిన్ ఇండియా కార్యక్రమానికి ఊతమిస్తున్నారు.
- అరుణాచల్‌ప్రదేశ్‌లో విమానయాన సేవలు, మేఘాలయ, త్రిపుర, మిజోరంలలో రైల్వే మార్గాల అనుసంధానత ఇటీవలే ప్రారంభమయ్యాయి.
- ఈ మేరకు ఈశాన్య భారత్‌లో కేటాయింపులు 21 శాతం పెరిగి రూ.58, 166 కోట్లకు చేరుకున్నాయి.
- వచ్చే ఐదేళ్లలో లక్ష గ్రామాలను డిజిటల్ గ్రామాలుగా తీర్చిదిద్దాలని లక్ష్యం.
- 15.80 లక్షల ఇళ్లను పక్కా రోడ్లతో అనుసంధానించారు. మిగిలిపోయిన సుమారు 2 లక్షల ఇళ్లకు కూడా ఈ సౌకర్యం కల్పించేందుకు పనులు జరుగుతున్నాయి.
- ఈసారి పీఎంజీఎస్‌వైకి కేటాయించిన మొత్తం రూ.19,000 కోట్లు.
- 2014–18 మధ్యకాలంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 1.53 కోట్ల ఇళ్లను నిర్మించారు.




కంచె.. కాస్త పలచబడింది!

'జై జవాన్' అన్నది పేరుకేనా? సమయం దొరికినపుడల్లా సైనికుల గొప్పలు చెప్పే మోదీ సర్కారు.. రక్షణరంగానికి చేసిన కేటాయింపులెంత? ఆయుధాల దిగుమతుల్లో అతిపెద్ద దేశమైన మనకు.. ప్రస్తుత తరుణంలో రక్షణరంగ కేటాయింపులేమీ పెరగలేదు. రూ.3 లక్షల కోట్లకన్నా ఎక్కువ కేటాయించామని, ఈ స్థాయి నిధులివ్వటం ఇదే తొలిసారని చెబుతున్నారు. కానీ ఆయుధాలు కొనేది డాలర్లలో. గతేడాది డాలర్ విలువ ఇప్పటికన్నా చాలా తక్కువ. దీంతో గతేడాది కేటాయింపులు దాదాపు 44.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇపుడు రూ.3 లక్షల కోట్లు దాటినా... డాలర్లలో మునుపటేడాది కన్నా తక్కువే.

డాలర్లలో గతేడాది కేటాయింపులు **44.5** బిలియన్లు

డాలర్లలో ప్రస్తుత కేటాయింపులు **43** బిలియన్లు





దేశ ఆర్థిక స్థితిని బడ్జెట్ ప్రతిబింబిస్తుంది. ఈ బడ్జెట్‌లో కేటాయింపుల ఆధారంగానే దేశ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సంక్షేమపథకాలకు కేటాయింపులు, కీలక నిర్ణయాలుండే ఈ బడ్జెట్‌పై సామాన్యుడి దగ్గర్నుంచి.. కార్పొరేట్ దిగ్గజాల వరకు అందరికీ ఆసక్తి ఉంటుంది. ఏడాదికోసారి ఆర్థిక శాఖ మంత్రి.. తమ ప్రభుత్వ ఆర్థిక ప్రణాళికలను బడ్జెట్ ద్వారా దేశ ప్రజలకు, ప్రపంచానికి వెల్లడిస్తారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో.. చరిత్రలోని ఐదు ముఖ్యమైన బడ్జెట్‌ల గురించి తెలుసుకుందాం.

బ్లాక్ బడ్జెట్ 1973

1973లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను దేశ చరిత్రలో బ్లాక్ బడ్జెట్‌గా పిలుస్తారు. రహస్య లేదా పేర్కొనలేని ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు జరిగినందునే ఈ బడ్జెట్‌ను బ్లాక్ బడ్జెట్ అంటారు. 1973–74లో అప్పటి ఆర్థిక మంత్రి యశ్వంత్‌రావ్ చవాన్ భారీ ద్రవ్యలోటుతో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ రూ.550 కోట్లు. ఇందులో రూ.56 కోట్లను బొగ్గుగనులు, సాధారణ బీమా కంపెనీలు, ఇండియన్ కాపర్ కార్పొరేషన్‌ల జాతీయీకరణకు కేటాయించారు. ఈ బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి.



నవశకానికి నాంది 1991

భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త శకానికి నాంది పలికినట్లుగా పేర్కొన్న బడ్జెట్‌ను 1991లో నాటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టారు. దేశం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఆర్థిక సరళీకరణకు బీజం వేసినందునే.. దీన్ని దేశ ఆర్థిక వ్యవస్థలో నవశకానికి నాందిపలికిన బడ్జెట్ అని అంటారు. పీవీ నరసింహారావు నేతృత్వంలోని ప్రభుత్వం ఎగుమతి, దిగుమతి విధానంలో మార్పులు తెచ్చింది. తద్వారా దేశ ఆర్థిక విధానాలను ప్రపంచ వాణిజ్యానికి అనుగుణంగా.. సరళీకృతం చేశారు. 220%గా ఉన్న కస్టమ్స్ డ్యూటీని 150%కి తగ్గించారు. ఈ బడ్జెట్ విధానాల కారణంగానే.. రెండు దశాబ్దాల్లో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన నిలిచింది.



డ్రీమ్ బడ్జెట్ 1997

భారత చరిత్రలో 1997లో నాటి యునైటెడ్ ప్రభుత్వ ఆర్థిక మంత్రి పి. చిదంబరం ప్రవేశపెట్టిన బడ్జెట్ 'డ్రీమ్ బడ్జెట్'గా నిలిచిపోయింది. వ్యక్తిగత ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్నుల్లో మార్పులు తీసుకొచ్చిన బడ్జెట్ ఇది. అప్పుడు 40%గా ఉన్న ఆదాయపన్ను రేటును 30%కు తీసుకొచ్చింది ఈ బడ్జెట్‌లోనే. చాలా చోట్ల సర్‌చార్జీలను, రాయల్టీ రేట్లను తగ్గించారు. పన్నుల భారం తగ్గడంతో దీన్ని ప్రజలు స్వాగతించారు.



మిలీనియం బడ్జెట్ 2000

కొత్త శతాబ్దంలో (2000) యశ్వంత్ సిన్హా ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను మిలీనియం బడ్జెట్ అంటారు. భారత సమాచార రంగంలో విప్లవాత్మక మార్పులకు ఈ బడ్జెట్ బాటలు వేసింది. ఇందులో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా సాఫ్ట్‌వేర్ ఎగుమతిదారులకు ఇచ్చిన ప్రోత్సాహకాలను విడతలవారీగా తగ్గించారు. కంప్యూటర్లు, సీడీలు మొదలైన 21 వస్తువులపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించారు. తద్వారా ఐటీ రంగం జోరు పెరిగేందుకు కారణమైంది. ఇది కేంద్రం తీసుకున్న సాహసోపేత నిర్ణయమని ఆర్థిక నిపుణులు కూడా ప్రశంసించారు.



రోల్‌బ్యాక్ బడ్జెట్ 2002

బడ్జెట్ అంటే ప్రతిసారీ కొత్త ప్రణాళికలు, వాటి అంచనాలను ప్రకటించేమేనని తెలుసు. కానీ 2002–03కోసం యశ్వంత్ సిన్హా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పథకాలు ప్రతిపాదించారు. ఇందులో ఎల్పీజీ సిలిండర్ల ధరలు పెంచడం, సర్వీస్ టాక్స్ పెంపు వంటి నిర్ణయాలు ప్రకటించారు. అయితే విపక్షాలనుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో.. ఈ నిర్ణయాలను వెనక్కు తీసుకున్నారు. అందుకే ఇది దేశ చరిత్రలో రోల్‌బ్యాక్ బడ్జెట్‌గా నిలిచిపోయింది.



రక్షణకు మేం రెడీ



రక్షణకు రూ. 3.18 లక్షల కోట్లు

అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తామన్న పియూష్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగానికి 2019–20 బడ్జెట్‌లో రూ. 3,18,931 కోట్లు కేటాయించారు. గత ఏడాది రక్షణ శాఖ బడ్జెట్‌తో కేటాయింపు రూ. 2,95,511 కోట్లతో పోలిస్తే ఇది 6.87 శాతం ఎక్కువగా తాత్కాలిక ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆయుధాలు, యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, ఇతర పరికరాలు కొనడానికి బడ్జెట్ కేటాయింపులో రూ. 1,08,248 కోట్లను మూలధనంగా పేర్కొన్నారు. మూలధనం ఆర్మీకి రూ. 29,447 కోట్లు, నేవీకి రూ. 23,156 కోట్లు, ఎయిర్‌ఫోర్స్‌కు రూ. 39,302 కోట్లు కేటాయించారు. ఇక జీతాల చెల్లింపు తదితర రెవెన్యూ వ్యయానికి రూ. 2,10,682 కోట్లు కేటాయించారు. కేంద్రం ప్రభుత్వం మొత్తం మూలధనంలో 32.19 శాతం సాయిధ బలగాలకు కేటాయించామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వ్యయం మొత్తంలో 15.48 శాతం రక్షణ రంగం కేటాయింపులేనని చెప్పారు. రక్షణ రంగానికి ఇచ్చిన దానికి అదనంగా పెన్షన్ల కోసం రూ. 1,12,079 కోట్లను కేటాయించారు. సరిహద్దులను కాపాడటానికి అవసరమైతే మరిన్ని నిధులు ఇవ్వడానికి కూడా సిద్ధమని పీయూష్ గోయల్ బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. కఠినమైన పరిస్థితుల్లో దేశాన్ని కాపాడుతున్న సైనికులు గర్వకారణమని, అందుకే ఈ ఏడాది వారికోసం ఇప్పటివరకూ ఎవరూ కేటాయించని స్థాయిలో నిధులు కేటాయించామని తెలిపారు. నలభైఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఒకే హోదా ఒకే పింఛన్‌ను తాము పరిష్కరించామని తెలిపారు. యూపీఏ సర్కారు 2014–15 మధ్యంతర బడ్జెట్‌లో కేవలం రూ. 500 కోట్లు మాత్రమే కేటాయిస్తే తాము ఆ పథకం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.35 వేల కోట్లు పంపిణీ చేశామని పీయూష్ అన్నారు. యూపీఏ ఒకేహోదా ఒకే పింఛన్ (వన్ ర్యాంక్ వన్ పింఛన్)ను మూడు బడ్జెట్‌లలో ప్రస్తావించినప్పటికీ అమలు చేసింది మాత్రం తామేనంటూ ఆయన.. 'మిలటరీ సర్వీస్ పే'లో అన్ని దళాల వారికీ అలవెన్సులను గణనీయంగా పెంచామని వివరించారు. అంతేకాకుండా ప్రమాదకర పరిస్థితుల్లో ఉద్యోగాలు చేస్తున్న నేవీ, వాయుసేనల సిబ్బందికి ఇచ్చే ప్రత్యేక అలవెన్సులను కూడా ఎక్కువ చేశామని గుర్తు చేశారు.

హోం మంత్రిత్వ శాఖకు 1,03,927 కోట్లు

కేంద్ర హో మంత్రిత్వ శాఖకు కేటాయింపులు తొలిసారి లక్ష కోట్ల రూపాయలు దాటాయి. 2019–20 కేంద్ర బడ్జెట్‌లో హోం మంత్రిత్వ శాఖకు రూ. 1,03,927 కోట్లు కేటాయించారు. 2018–19 బడ్జెట్‌లో ఆ శాఖకు రూ. 99.03వేల కోట్లతో పోలిస్తే ఈ సారి 4.9 శాతం ఎక్కువ. దేశ రాజధానిలో శాంతిభద్రత కాపాడే ఢిల్లీ పోలీసులకు ఈ బడ్జెట్‌లో రూ. 7,496.91 కోట్లు, సరిహద్దులో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 2 వేల కోట్లు కేటాయించారు. సీఆర్‌పీఎఫ్ బలగాల కోసం రూ. 23,742.04 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి సీఆర్‌పీఎఫ్‌కు దాదాపు రూ. 1,095 కోట్లు అదనంగా కేటాయింపులు జరిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం కోసం బీఎస్‌ఎఫ్ కోసం 19,647.59 కోట్లు ఇచ్చారు. ఇది గతేడాదితో పోలిస్తే రూ. 1,061 కోట్లు అదనం. సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, ఐటీబీపీ, సీఐఎస్‌ఎఫ్, సశస్త్ర సీమా బల్, అస్సాం రైఫిల్స్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్‌తో పాటు సాయిధ బలగాల కోసం మొత్తం రూ. 71,618.70 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో ఈ కేటాయింపులు రూ. 67,779.75గా ఉన్నాయి.



ఇతర కేటాయింపులు..

- ఇంటెలిజెన్స్ బ్యూరోకు ఈ బడ్జెట్‌లో రూ. 2,198.35 కోట్లు కేటాయించారు.
- ప్రధాని, మాజీ ప్రధాని భద్రతకోసం వినియోగించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌నకు రూ. 530.75 కోట్లు ఇచ్చారు.
- పోలీస్ మౌలిక వసతుల అభివృద్ధి, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, వాహనాల కొనుగోళ్లు, బారక్‌లు, ఇళ్ల నిర్మాణం కోసం రూ. 5,117 కోట్లు ఇచ్చారు.
- పోలీసు బలగాల ఆధునికీకరణ కోసం రూ. 3,378 కోట్లు, సరిహద్దులో మౌలిక వసతులు, నిర్వహణకు రూ. 2 వేల కోట్లు, మహిళల రక్షణ, సాధికారత మిషన్‌కు రూ. 1,330 కోట్లు, సరిహద్దు ప్రాంత అభివృద్ధి కార్యక్రమానికి రూ. 825 కోట్లు, జమ్మూకశ్మీర్‌లో వలసదారులు, స్వదేశానికి తిరిగివచ్చిన వారి పునరావాసం కోసం రూ. 809 కోట్లు, స్వాతంత్ర్య పోరాటయోధుల పింఛన్ల కోసం రూ. 953 కోట్లు, నిర్భయ ఫండ్‌కు రూ. 50 కోట్లు కేటాయించారు.
- ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి జాతీయ విపత్తు రిలీఫ్ ఫండ్‌కు రూ. 10,000 కోట్లు కేటాయించారు.
- రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా 2021 జనాభా లెక్కలకు రూ. 541.33 కోట్లు, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియాకు రూ. 50 కోట్లు, జమ్మూ కశ్మీర్‌లో పరిశ్రమల ఏర్పాటుకు రూ. 78.09 కోట్లు, హిందీ భాష ప్రచారానికి రూ. 4,895.81 కోట్లు కేటాయించారు.
- కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ అండ్ నికోబార్ దీవులకు రూ. 4,817.48 కోట్లు, చండీగఢ్‌కు రూ. 4,291.70 కోట్లు, దాద్రా నగర్ హవేలీకి రూ. 1,117.99 కోట్లు, డామన్ అండ్ డయ్యు రూ. 821.4 కోట్లు, లక్షద్వీప్‌కు రూ. 1,276.74 కోట్లు ఢిల్లీకి రూ.1,112 కోట్లు, పుదుచ్చేరికి రూ. 1,545 కోట్లు కేటాయించారు.

'పది' కోటాకు దక్కని కేటాయింపులు

అగ్రవర్ణాల పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇటీవలే చట్టం తెచ్చిన ప్రభుత్వం.. ఆ మేరకు తాజా బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేయలేదు. పేదల కోటా అమలు చేయాలంటే విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో 25 శాతం సీట్లు పెంచాలి. లాబోరేటరీలు, లైబ్రరీలు అదనంగా కావాలని, టీచర్లు కూడా పెద్ద సంఖ్యలో అవసరమని నిపుణులు అంటున్నారు. బడ్జెట్‌లో ఉన్నత విద్యకు కేటాయించిన నిధులు వీటికి ఏ మాత్రం సరిపోవని స్పష్టం చేశారు. పది శాతం కోటా అమలు చేయాలంటే ఒక్క పంజాబ్ యూనివర్సిటీకే రూ.500 కోట్లు అవసరమని పేర్కొన్నారు. పది శాతం రిజర్వేషన్ వల్ల దేశ వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల సీట్లు పెరుగుతాయని పీయూష్ గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో సూచనప్రాయంగా చెప్పారు. ఉన్నత విద్యకు కేంద్రం బడ్జెట్‌లో రూ. 37,461.01 కోట్లు కేటాయించింది. గత ఏడాది కేటాయించిన 33,512.11 కోట్ల కంటే ఇది సుమారు 4 వేల కోట్లు ఎక్కువ. పది శాతం రిజర్వేషన్ల అమలుకు ఈ పెంపుదల సరిపోదనేది విద్యావేత్తల వాదన. కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు 6,604.46 కోట్లు, యూజీసీకి రూ. 4,600 కోట్లు కేటాయించారు. ఇక సాంకేతిక విద్యకు కేటాయింపులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఐఐటీలకు రూ. 6,143.02 కోట్లు కేటాయించారు.

లాభం ఎవరికి.. నష్టం ఎవరికి?

ఎన్నికల వేళ అన్ని వర్గాలను ఆకట్టుకోవడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ప్రధాని నరేంద్రమోదీ పలు వర్గాలకు వరాలు ప్రకటించారు. రైతులకు ఆర్థిక సాయం, ఉద్యోగులకు ఆదాయపు పన్ను పరిమితి పెంపు, అసంఘటిత రంగ కార్మికులకు పింఛన్ వంటివి ఇందులో ముఖ్యమైనవి. బడ్జెట్ ప్రతిపాదనల వల్ల కొన్ని వర్గాలు లబ్ధి పొందుతాయని, మరికొన్ని నష్టపోయే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

లాభపడేది..

రైతులు

ప్రధానమంత్రి సమ్మాన్ యోజన పేరుతో రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ.6,000 చొప్పున నేరుగా వారి ఖాతాల్లోకే బదిలీ చేస్తారు. మూడు విడతలుగా ఈ సాయం అందిస్తారు. ఈ పథకంతో దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం కలుగనుంది. ఎన్నికలకు ముందే వీరి ఖాతాల్లో మొదటి విడత రూ.2,000 సాయం జమ కానుంది.

పన్ను చెల్లింపుదారులు

ఆదాయపు పన్ను(ఐటీ) పరిమితిని రూ.5 లక్షలకు పెంచారు. రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్నవారు పన్ను చెల్లించనవసరం లేదు. రూ.6.5 లక్షల వార్షికాదాయం ఉన్న వారు కూడా ప్రావిడెంట్ ఫండ్, ఈక్విటీలలో పెట్టుబడులు పెడితే పన్ను పోటు నుంచి తప్పించుకోవచ్చు. దీనివల్ల 3 కోట్ల మంది ప్రయోజనం పొందుతారని అంచనా.

గ్రామీణ భారతం

పశు సంరక్షణ, మత్స్య రంగాలకు కేటాయింపులు పెంచడం, చిన్న, సన్నకారు వ్యాపారులకు వడ్డీ రాయితీ ఇవ్వడం వల్ల సంబంధిత కంపెనీలు గ్రామాలకు మళ్లే అవకాశం ఉంది. తద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

కార్మికులు

అసంఘటిత కార్మికులకు పింఛను పథకం వల్ల వచ్చే ఐదేళ్లలో 10 కోట్ల మంది లాభం పొందుతారని కేంద్రం అంచనా వేస్తోంది. రూ.15,000 లోపు నెలవారీ ఆదాయం గల కార్మికులకు 60 ఏళ్లు దాటిన తర్వాత నెలకు రూ.3 వేల చొప్పున పింఛను ఇవ్వనున్నట్టు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది.

రియల్ ఎస్టేట్

గృహ నిర్మాణ రంగానికి ఊతమిచ్చే చర్యలను బడ్జెట్‌లో పొందుపరచడంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచిక పైకెగిరింది. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక ఇల్లు సమకూరుస్తామని పీయూష్ గోయల్ హామీ ఇచ్చారు. ఇంటి అద్దెపై వడ్డీ పరిమితిని కూడా పెంచారు. ఆటోమొబైల్ రంగం కూడా లబ్ధి పొందనుంది. గోయల్ ప్రసంగం చేస్తుండగానే ఎస్‌అండ్‌పీ బీఎస్‌ఈ ఇండెక్స్ 5.3 శాతం పెరిగింది.

ప్రధాని మోదీ

బడ్జెట్‌లో ప్రకటించిన రైతు సాయం, పింఛను పథకాలను ప్రధానమంత్రి పేరుతో రూపొందించారు. దీనివల్ల ప్రధాని నరేంద్ర మోదీ పరపతి ఎంతో కొంత పెరిగే అవకాశం ఉంది.

నష్టపోయేది...

బాండ్ హోల్డర్లు

ఈసారి ద్రవ్యలోటు 3.4 శాతం వరకు ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. దీనివల్ల మన క్రెడిట్ రేటింగ్ తగ్గే అవకాశం ఉంది. పైగా బడ్జెట్‌లో ఆదాయం పెంపునకు కొత్త పథకాలేమీ లేవని ప్రధాని మోదీ చెప్పారు. దీనివల్ల వివిధ రకాల బాండ్లు కొనేవారికి పెద్దగా లాభం ఉండదు.

ప్రతిపక్షాలు

బడ్జెట్‌లో ప్రకటించిన రాయితీలు, ప్రోత్సాహకాలు రైతులు, మధ్య తరగతి వారితోపాటు వ్యాపారులను కూడా ఆకర్షిస్తాయి. వీటి ప్రభావంతో అధికార పార్టీకి సానుకూల వాతావరణం ఏర్పడే వీలుంది. అది ప్రతిపక్షాలకు నష్టదాయకమే.

వ్యవసాయ కూలీలు/కౌలు రైతులు

మోదీ ప్రకటించిన రైతు సాయం భూయజమానులకే తప్ప కౌలు రైతులకు అందదు. దేశంలోని పంటలు సాగుచేస్తున్న వారిలో చాలామందికి సొంత భూమి లేదు. కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు.

రక్షణ రంగం

గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి కేవలం రూ.3 వేల కోట్లు మాత్రమే పెంచారు. ఫలితంగా రక్షణ శాఖ ఆధునికీకరణ కష్టమవుతుంది.

పల్లె.. డిజిటల్!



ప్రభుత్వ రంగంలోకి కృత్రిమ మేథ

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ భారతాన్ని డిజిటల్ పుంతలు తొక్కించేందుకు ఎన్డీయే సర్కారు తన తుదిబడ్జెట్‌లో గట్టి ప్రయత్నమే మొదలు పెట్టింది. భారత్ నెట్ పథకం కింద అనుసంధానించే 2.5లక్షల గ్రామ పంచాయతీల్లో కనీసం లక్ష గ్రామాలను డిజిటల్ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని ఆర్థికశాఖ తాత్కాలిక మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం నాటి బడ్జెట్ ప్రసంగంలో తెలపడమే ఇందుకు తార్కాణం. అంతేకాదు..వేర్వేరు ప్రభుత్వ శాఖల్లోని సమాచారాన్ని విశ్లేషించి వనరులను మరింత సమర్థంగా వినియోగించు కునే లక్ష్యంతో ప్రభుత్వ శాఖల్లోనూ కృత్రిమ మేథను వాడేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కృత్రిమ మేథ టెక్నాలజీలు మరింత కచ్చితంగా వాతావరణ అంచనాలు కట్టేందుకు మాత్రమే కాకుండా.. అనేక ఇతర రంగాల్లోనూ ఉపయోగపడతాయని వాహనాల్లో విద్యుత్ వ్యవస్థల సమర్థ నిర్వహణ, ఫొటోలు, వీడియోల విశ్లేషణ వంటివి వీటిల్లో ఉన్నాయని గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

కామన్ సర్వీసెస్ సెంటర్లు కేంద్రంగా డిజిటల్ గ్రామాలు..

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డిజిటల్ గ్రామాల వ్యవస్థ మొత్తం కామన్ సర్వీసెస్ సెంటర్లు కేంద్రంగా నడుస్తాయి. వచ్చే ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా లక్ష వరకూ గ్రామాల్లో ఈ కామన్ సర్వీసెస్ సెంటర్ల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చాలన్నది లక్ష్యం. గ్రామాల్లో డిజిటల్ టెక్నాలజీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించుకోవాల్సిన బాధ్యత కూడా ఈ కామన్ సర్వీసెస్ సెంటర్లపైనే ఉంచనున్నారు. దేశంలో ఇప్పటికే దాదాపు మూడు లక్షల కామన్ సర్వీసెస్ సెంటర్లు పని చేస్తున్నా యనీ, వీటి ద్వారా మరిన్ని ఎక్కువ సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. గత ఐదేళ్లలో ఎన్డీయే ప్రభుత్వం అనేక ప్రభుత్వ సర్వీసులను, విధానాలను డిజిటల్ రూపంలోకి మార్చేసిందని.. వీటన్నింటి ఆధారంగా 2030 నాటి డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేస్తామని వివరించారు. దేశ యువత సృష్టించే అనేక స్టార్టప్ కంపెనీలు సృష్టించే డిజిటల్ ఇండియా కారణంగా లక్షలాది కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుందని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో మొబైల్ డేటా 50 రెట్లు ఎక్కువైందని, ప్రభుత్వం చేపట్టిన అనేక చర్యల ఫలితమిదని మంత్రి వ్యాఖ్యానించారు. డిజిటల్ గ్రామాల వంటి వాటి వల్ల మధ్యవర్తుల ప్రమేయం అస్సలు లేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతాయని చెప్పారు.

కృత్రిమ మేథతో అనేక లాభాలు..

ప్రభుత్వ ప్రాజెక్టుల్లో కృత్రిమ మేథ వినియోగం సర్వత్రా పెరగనుందని.. ఇందుకు తగ్గట్టుగా త్వరలోనే కేంద్ర ప్రభుత్వం కృత్రిమ మేథ సర్వీసుల కోసం ఓ జాతీయ పోర్టల్‌ను ఏర్పాటు చేస్తుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు, సేవలు, కేంద్రాలకు ఈ పోర్టల్ ద్వారా సేవలు అందిస్తామని.. ఆసక్తికర ప్రైవేట్ వ్యాపార సంస్థలు కూడా ఈ పోర్టల్ సేవలు వినియోగించుకోవచ్చునని మంత్రి వివరించారు. త్వరలో సిద్ధం కానున్న నేషనల్ సెంటర్ ఫర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ఈ కృత్రిమ మేథ సర్వీసులు చాలా కీలకం కానున్నాయని మంత్రి చెప్పారు. దేశం ఇప్పటికే స్టార్టప్ రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందని.. దీంతోపాటు కృత్రిమ మేథ తాలూకూ లాభాలను ప్రజల చెంతకు చేర్చేందుకు జాతీయ స్థాయిలో ఓ విస్తృత స్థాయి కార్యక్రమం చేపట్టాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. నేషనల్ సెంటర్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రంగా.. ఇతర అత్యున్నత నైపుణ్య కేంద్రాలు కూడా ఏర్పాటు కావడం ద్వారా ఈ కార్యక్రమానికి ఊపు లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ మేథ సర్వీసులను ఉపయోగించు కునేందుకు ఇప్పటికే తొమ్మిది రంగాలను గుర్తించామని మంత్రి అన్నారు.




ఊరికి మరిన్ని మెరుపులు...

పదిహేనేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతున్న ఉపాధి హామీకి నిధుల హామీ దొరికింది. మునుపటికన్నా మరీ ఎక్కువ కాకున్నా... ఒక మోస్తరుగా కేటాయింపులు పెరిగాయి. ఇక గ్రామ్‌జ్యోతి యోజనంటూ ఏటా విద్యుత్ కనెక్షన్లిచ్చిన కుటుంబాల సంఖ్య పెరుగుతున్నందుకు ఆనందించాలో... అసలింకా కరెంటుకు నోచుకోని ఇళ్లున్న దౌర్భాగ్యానికి సిగ్గుపడాలో తెలియని పరిస్థితి. గ్రామీణ రోడ్ల నిర్మాణం మాత్రం జోరుగానే సాగుతోంది. స్వచ్ఛ భారత్ ఆశయంలో ఉన్నంత ఉదాత్తత ఆచరణలో ఇంకా కనిపించాల్సి ఉందన్నది కాదనలేని నిజం. కాకపోతే దీనికి ప్రభుత్వం కన్నా ప్రజలే ఎక్కువ చేయాల్సిందన్నది వాస్తవం.

ఏడాదిలో కనీస ఉపాధి రోజులు: 100





సాక్షి



బడ్జెట్

స్థూలంగా ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయ, వ్యయపట్టిక. సర్కారు ఆర్థిక, విధాన పత్రం. ప్రజల నుంచి పన్నుల రూపేణా వసూలు చేసిన ధనాన్ని వారికోసం ఎలా వినియోగించబోతున్నారో వివరించే కార్యాచరణ ప్రణాళిక.

తాత్కాలిక బడ్జెట్ INTERIM BUDGET

సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టే బడ్జెట్‌నే తాత్కాలిక బడ్జెట్ అంటారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలోపు ప్రభుత్వ కార్యకలాపాలు, ఖర్చులకోసం ప్రవేశపెట్టేదే ఈ బడ్జెట్. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ తాత్కాలిక లేదా బడ్జెట్‌లో విధాన నిర్ణయాలు ప్రకటించకూడదు. ఎన్నికలు పూర్తయ్యాక ఏర్పడే కొత్త ప్రభుత్వం.. ఆ తర్వాత మిగిలిన 9 నెలలకోసం బడ్జెట్‌ను ప్రవేశ పెడుతుంది. ఎన్నికల సంవత్సరంలో సాధారణ బడ్జెట్‌ను తాత్కాలిక బడ్జెట్ అని పిలుస్తారు.

మూలధన బడ్జెట్ CAPITAL OUTLAY

మూలధన ఆదాయ, వ్యయ పట్టికగా చెప్పుకోవచ్చు. వార్షిక బడ్జెట్‌లో మూలధన బడ్జెట్ తోపాటు రెవెన్యూ బడ్జెట్ కూడా ఉంటుంది. ప్రభుత్వానికి మూలధన ఖాతాలో వసూలయ్యే ఆదాయం, ఖర్చులు మూలధన బడ్జెట్‌లో ఉంటాయి. ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ వసూళ్లు, ఖర్చులకు సంబంధించిన వివరాలు రెవెన్యూ బడ్జెట్‌లో ఉంటాయి.

క్యాపిటల్ పద్దు (ప్రణాళికా వ్యయం) (CAPITAL EXPENDITURE)

ప్రభుత్వం ఆదాయ వనరులను, ఆస్తులను సృష్టించుకునేందుకు చేసే వ్యయం ఇది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రణాళికలకు చేసే కేటాయింపులు ఇందులో ఉంటాయి.

రెవెన్యూ పద్దు (ప్రణాళికేతర వ్యయం) (REVENUE EXPENDITURE)

ఉద్యోగుల జీతభత్యాలు, రక్షణ, పోలీసు వ్యవస్థల నిర్వహణ, ఎన్నికలు, కళలు, క్రీడలు, కుటుంబ సంక్షేమం, సమాచార ప్రసార, పర్యాటకం, కార్మిక సంక్షేమం, వ్యవసాయ రంగాలకు వెచ్చించే నిధులు, వడ్డీలు, రుణ చెల్లింపులు ఈ పద్దులోకి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే ప్రణాళికేతర గ్రాంటులు కూడా ఈ ఖాతాలోనే ఉంటాయి.

సంచిత నిధి CONTINGENCY FUND

అన్ని రకాల వసూళ్లు, ఆదాయాలు, రుణాల ద్వారా వచ్చిన సొమ్ము ఈ నిధి కింద జమ అవుతుంది. ఈ నిధి నుంచి ఖర్చు చేయడానికి పార్లమెంటు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఇందులో రెండు పద్దులుంటాయి. 1. రెవెన్యూ వసూళ్లు–రెవెన్యూ వ్యయం. 2. మూలధన వసూళ్లు–మూలధన వ్యయం.

ప్రభుత్వ ఖాతా GOVERNMENT ACCOUNT

సంచిత నిధిలో జమయ్యే వసూళ్లు మినహా ప్రభుత్వం వద్దకు వచ్చే ఇతర అన్ని రకాల నిధులు ఈ ఖాతాలో జమ అవుతాయి. రిజర్వ్ బ్యాంకు నుంచి, పీఎఫ్ నుంచి తీసుకునే రుణాలను ఈ ఖాతా కింద ఖర్చు చేస్తారు. ఈ సొమ్మును మళ్లీ చెల్లించాల్సి ఉంటుంది.

రెవెన్యూ వసూళ్లు REVENUE RECEIPTS

పన్నులు, సుంకాల ద్వారా వసూలయ్యే ఆదాయమే రెవెన్యూ వసూళ్లు. ఎగుమతి, దిగుమతి సుంకాలు (కస్టమ్స్), ఎక్సైజ్ డ్యూటీ, కార్పొరేట్ ట్యాక్స్, ఇతరత్రా పన్నుల రూపంలో వచ్చే సొమ్మంతా ఈ ఖాతాలోకే చేరుతుంది. ప్రభుత్వ పెట్టుబడులపై వడ్డీలు, డివిడెండ్ల రూపంలో వచ్చే ఆదాయం, ప్రభుత్వ సేవలపై వసూ లు చేసే చార్జీలు వీటి కిందకే వస్తాయి.

రెవెన్యూ వ్యయం REVENUE EXPENDITURE

ప్రభుత్వ నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు, బదిలీలపై చేసే ఖర్చును రెవెన్యూ వ్యయంగా పేర్కొంటారు. ఇది ప్రభుత్వానికి ఆస్తులను సృష్టించదు.

రెవెన్యూ లోటు (REVENUE DEFICIT) రెవెన్యూ వసూళ్లు, వ్యయానికి మధ్య తేడా.

ప్రత్యక్ష పన్నులు DIRECT TAXES

ప్రభుత్వానికి మనం నేరుగా చెల్లించే పన్నులు ఇవి. ఆదాయ పన్ను, సంపద పన్ను, ఫ్రింజ్ బెని ఫిట్ ట్యాక్స్ మొదలైనవన్నీ ఈ కోవలోకే వస్తాయి.

పరోక్ష పన్నులు (INDIRECT TAXES): మనం చేసే వ్యయాలపై పరోక్షంగా విధించే పన్ను. కస్టమ్స్,ఎక్సైజ్, సర్వీస్ టాక్స్‌లన్నీ దీని పరిధిలోకే వస్తాయి.

రూరల్ రంగస్థలం!



ఎన్నికల వేళ గ్రామీణ భారతంపై మరింత ఫోకస్

పలు ఫ్లాగ్‌షిప్ పథకాలకు కేటాయింపులు పెంపు

ఇన్నాళ్లు ఒకెత్తు.. ఇప్పుడు ఎన్నికల పైఎత్తు!! గ్రామీణ రంగస్థలంపై ప్రేక్షకుడిని ఆకట్టుకోవడమే లక్ష్యంగా మోదీ సర్కారు ఈ సారి బడ్జెట్‌పై పెద్ద కసరత్తే చేసింది. ఇటీవలి రాష్ట్రాల ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బలను దృష్టిలో ఉంచుకొని పల్లెల్లో ఓటర్‌ను ఆకర్షించేవిధంగా 'ఫ్లాగ్‌షిప్' ప్రణాళికను ప్రకటించారు. పేరుకు మధ్యంతర బడ్జెటైనా, పూర్తిస్థాయి బడ్జెట్‌ను తలపింపజేశారు. ఉపాధిహామీకి మరింత ధీమా, మారుమూల పల్లెల్లో కూడా అందరికీ విద్యుత్ సౌకర్యం, గ్రామీణ రోడ్లకు మెరుగులు దిద్దేందుకు నిధులను కుమ్మరించారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. గ్రామపంచాయతీలకు డిజిటల్ సొబగులు, ప్రతిఒక్కరికి గృహవసతి కల్పన లాంటి తాయిలాలు ప్రకటించారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధతో కొనసాగుతున్న స్వచ్ఛ భారత్ లక్ష్యానికి ఆమడదూరంలో భారత్ నిలిచింది.

ఉపాధి హామీకి మరింత ఊతం

2019-20 కేటాయింపులు **60,000 కోట్లు**



2018-19 కేటాయింపులు **55,000 కోట్లు**

- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఈ దఫా బడ్జెట్లో రూ. 60వేల కోట్లు కేటాయింపు.
- గతేడాది కన్నా ఈ మొత్తం రూ. 5వేల కోట్లు లేదా 11 శాతం అధికం.
- అవసరమైతే ఈ కేటాయింపులు మరింత పెంచుతారు.
- దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండకుండా ఉండేందుకు, అర్బన్– రూరల్ విభజనను తగ్గించేందుకు కృషి.
- 2005లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు.
- ఏడాదిలో వందరోజుల పాటు కనీస ఉపాధి హామీని ఇవ్వడమే ఈ పథకం ప్రధానోద్దేశం.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ్‌జ్యోతి యోజన

2019-20 కేటాయింపులు **4,066 కోట్లు**



2018-19 కేటాయింపులు **3,800 కోట్లు**

- 2017లో ఆరంభించిన సౌభాగ్య పథకం కింద ఇప్పటిదాకా 2,48,19,168 కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. మొత్తం లక్ష్యం 2.5 కోట్ల కుటుంబాలు.
- ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్‌మెంట్ స్కీమ్‌కు కేటాయింపులు రూ. 3970 కోట్ల నుంచి రూ. 5280 కోట్లకు పెంచారు.
- దీనికోసం ఇప్పటివరకూ రూ. 16320 కోట్ల వెచ్చింపు.
- పేద, మధ్యతరహా కుటుంబాలకు 143 కోట్ల ఎల్‌ఈడీ బల్బుల అందజేత.
- ఎల్‌ఈడీ బల్బులతో రూ.50వేల కోట్ల విద్యుత్ బిల్లుల ఆదా.

మూడు రెట్లు పెరిగిన గ్రామీణ రోడ్ల నిర్మాణం

2019-20 కేటాయింపులు **19,000 కోట్లు**



2018-19 సవరించిన కేటాయింపులు **15,500 కోట్లు**

- 2022కు బదులు 2019 మార్చికే అన్ని ఆవాసాలకు రహదారులు
- ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు 3 రెట్లు పెరిగాయి.
- మొత్తం 17.84 లక్షల ఆవాసాల్లో 15.8 లక్షల ఆవాసాలకు పక్కా రోడ్లు వచ్చాయి. ఫేజ్–3 కింద ఆవాసాలను ఆస్పత్రులు, పాఠశాలలు, మార్కెట్లతో కలిపేందుకు లింక్ రోడ్ల నిర్మాణాలు.
- హైవేల నిర్మాణంలో ప్రపంచంలోనే ముందంజ. రోజుకు 27 కి.మీ. హైవేల నిర్మాణం

స్వచ్ఛ భారత్ సాకారం...

2019-20 కేటాయింపులు **12,750 కోట్లు**



2018-19 కేటాయింపులు **16,978 కోట్లు**

- 2014–15 నుంచి ఇప్పటివరకు దాదాపు 9 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి. బహిరంగ మలవిసర్జన అలవాటు దాదాపు కనుమరుగైంది.
- ఓడీఎఫ్(బహిరంగ మలవిసర్జన రహిత) గ్రామాల సంఖ్య 5.45 లక్షలకు చేరింది.
- గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 98 శాతం శానిటేషన్ కవరేజ్ కల్పన.

గ్రామీణ టెలిఫోనీ

2019-20 కేటాయింపులు **8,350 కోట్లు**



2018-19 సవరించిన కేటాయింపులు **5,000 కోట్లు**

- భారత్ నెట్ ఫేజ్1 కింద 1, 21, 652 గ్రామ పంచాయతీలకు హైస్పీడ్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ కనెక్టివిటీ పూర్తి.
- 1.16లక్షల పంచాయతీల్లో సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి.
- దీంతో 2.5 లక్షల గ్రామాల్లోని దాదాపు 20 కోట్ల మంది గ్రామీణవాసులకు బ్రాడ్‌బ్యాంక్ యాక్సెస్ లభించింది.
- 39, 359 పంచాయతీల్లో వైఫై హాట్ స్పాట్స్ ఇన్‌స్టలేషన్ పూర్తి.
- ఐదు కోట్లమంది గ్రామీణులకు లబ్ధి చేకూరేలా 5 లక్షల వైఫై స్పాట్స్ ఏర్పాటు లక్ష్యం.

జాతీయ గ్రామీణ తాగునీటి పథకం

2019-20 కేటాయింపులు **8,201 కోట్లు**



2018-19 సవరించిన కేటాయింపులు **5,500 కోట్లు**

- ఈ 'భారత్ నిర్మాణ్' పథకానికి నిధులు జోరుగానే అందుతున్నాయి.
- దేశంలో తాగునీటి సౌకర్యం లేని(అన్‌కవర్డ్) అన్ని మారుమూల గ్రామీణ ప్రాంతాలకూ సురక్షితమైన, తగినంత తాగునీటిని అందించాలనేది ఈ పథకం ప్రధానోద్దేశం.
- దీన్ని ఇప్పుడు విజన్ 2030లో భాగంగా చేర్చారు.
- నాలుగేళ్లలో 28,000 ఆర్సెనిక్, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సురక్షితమైన తాగునీటిని అందించాలనేది కూడా ఈ పథకంలో భాగంగా మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది.

ఊరటనిచ్చేదే!

'బడ్జెట్ ప్రజలకు కొంత ఊరట కలిగించేదే. ముఖ్యంగా ఆదాయపు పన్ను పరిమితిని రూ.5 లక్షలకు పెంచడం మధ్యతరగతి వర్గాలకు మేలు చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన తరహాలో కేంద్ర స్థాయిలో నగదు బదిలీని పెట్టడం హర్షించదగిన పరిణామం'

–డాక్టర్ చిట్టెడి కృష్ణారెడ్డి, ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన



2019-20 కేటాయింపులు **25,853 కోట్లు**

2018-19 సవరించినది **26,405 కోట్లు**

- ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇప్పటి వరకు 1.53 కోట్ల ఇళ్ల నిర్మాణం(గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలు కలిపి)
- నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌లో రూ. 10వేల కోట్ల కార్పస్‌తో కొత్తగా హౌసింగ్ ఫండ్(ఏహెచ్‌ఎఫ్) ఏర్పాటు.
- ఇళ్ల నిర్మాణాలు ఇందిరా ఆవాస్ యోజన కన్నా ఈ పథకం కింద ఐదు రెట్లు అధికం. 2022 నాటికి అందరికీ గృహవసతి లక్ష్యం.

ప్రగతికి 'పట్టాలు'!




రైల్వేకు మూలధన వ్యయం	రైల్వేకు కేటాయింపులు	చరిత్రలో ఇదే అత్యధికం
1.58 లక్షల కోట్లు	64 వేల కోట్లు	కాపలా లేని రైల్వే క్రాసింగ్‌లన్నీ ఎత్తేశాం: గోయల్

న్యూఢిల్లీ: మరో మూడు నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఊహించినట్లుగానే రైల్వే చార్జీల పెంపు లేకుండానే తాజా బడ్జెట్ వచ్చింది. అంతేకాకుండా గతంలో ఎన్నడూ లేనంత మూలధన వ్యయాన్ని ఈ బడ్జెట్‌లో రైల్వేకు కేటాయించారు. గతేడాది అరుణ్ జైట్లీ ఆర్థిక మంత్రిగా ఉండగా రూ. 1.48 లక్షల కోట్లను రైల్వేకు కేటాయించగా, ప్రస్తుతం దాన్ని మరో పది వేల కోట్లు పెంచి రూ. 1,58,658 కోట్లకు పియూష్ గోయల్ చేర్చారు. అలాగే బడ్జెట్ నుంచి మూలధన సాయంగా రూ.64,587 కోట్లను రైల్వేలకు కేటాయించారు. ఇప్పటివరకు రైల్వే చరిత్రలో 2018–19 సంవత్సరమే అత్యంత సురక్షితమైనదనీ, బ్రాడ్‌గేజ్ పట్టాలపై వెంట ఉన్న కాపలా లేని రైల్వే గేట్లను సంపూర్ణంగా తొలగించామని రైల్వే, ఆర్థిక శాఖల మంత్రి పియూష్ చెప్పారు. బడ్జెట్ ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ 'వచ్చే ఏడాదికి రైల్వేకు కేటాయించిన మూలధన వ్యయం చరిత్రలోనే అత్యధికం. ఆ మొత్తం రూ. 1.58 లక్షల కోట్లు. దేశీయంగా తయారైన పాక్షిక అత్యంత వేగవంతమైన రైలు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ 18) భారతీయ ప్రయాణికులకు ప్రపంచ స్థాయి అనుభవాన్ని ఇవ్వనుంది. పూర్తిగా మన ఇంజినీర్లే తయారు చేసిన ఈ రైలుతో మనం సాంకేతికతలో మరో పెద్ద అడుగు ముందుకేశాం'అని వివరించారు. రైల్వేకు వచ్చే ఆర్థిక ఏడాదిలో రూ. 2.73 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. గతేడాది ఈ అంచనా రూ. 2.5 లక్షల కోట్లుగా ఉంది. కొత్త మార్గాల నిర్మాణాలకు రూ. 7,255 కోట్లు, గేజ్ మార్పిడికి రూ. 2,200 కోట్లు, డబ్లింగ్ పనులకు రూ. 700 కోట్లు, ఇంజిన్లు, బోగీలు తదితరాలకు రూ. 6,114.82 కోట్లు, సిగ్నల్ వ్యవస్థ, టెలికాంలకు కలిపి రూ. 1,750 కోట్లు, ప్రయాణికులకు సౌర్యాలను మెరుగుపరిచేందుకు రూ. 3,422 కోట్లను ఈ బడ్జెట్‌లో కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్వహణ నిష్పత్తి 96.2కు మెరుగుపడిందనీ, వచ్చే ఏడాదికి దీనిని 95 శాతానికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని గోయల్ చెప్పారు.

త్వరలో అధునాతన బోగీలు

ఇంజిన్లు, బోగీలు తదితరాల కోసం గతేడాది కన్నా ఈ ఏడాది బడ్జెట్‌లో 64 శాతం అధిక కేటాయింపులకు చేశారు. 2018–19 బడ్జెట్‌లో ఈ కేటగిరీ కోసం రూ. 3,724.93 కోట్లు కేటాయించగా, తాజా ఆ బడ్జెట్‌లో ఆ మొత్తం రూ. 6,114.82 కోట్లుగా ఉంది. దీంతో త్వరలోనే అధునాతన బోగీలు రైల్వే ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. రైలు బోగీల మార్కెట్‌లో ప్రపంచ వ్యాప్తంగా 200 బిలియన్ డాలర్ల వ్యాపారం చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు తాజా బడ్జెట్ కేటాయింపులు ఉపకరించనున్నాయి. భారత్‌లో అత్యంత వేగవంతమైన రైలు ట్రైన్ 18 (వందే భారత్ ఎక్స్‌ప్రెస్), కొత్త ఏసీ కోచ్‌లు, మెట్రో కోచ్‌లు తదితరాల తయారీ విజయవంతం అవ్వడంతో అదే ఉత్సాహంతో 2021 వరకు తయారీ ప్రణాళికలను రైల్వే అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. ఇవి సరిగ్గా అమలైతే వచ్చే రెండేళ్లలో దేశంలోని వివిధ రైల్వే ఫ్యాక్టరీలు కలిసి దాదాపు 15 వేల బోగీలను తయారు చేయనున్నాయి. ప్రస్తుతం వివిధ నగరాల్లో తిరుగుతున్న ఈమూ, మెమూ రైళ్లకు బదులుగా కొత్త బోగీలను ప్రవేశపెట్టనున్నారు. త్వరలోనే మరో 6 ట్రైన్ 18లను తయారు చేయాలని ఇప్పటికే నిర్ణయించారు.

ఓల్డ్ ఈజ్ గోల్డ్



1850 తొలినాళ్లలో మన దేశంలో ఇలా ఎడ్లే ఇంజిన్లుగా అప్పటి న్యారో గేజ్ రైలును లాగేవి.

ఫస్ట్ యాక్సిడెంట్..






ప్రపంచంలో తొలిసారి రైలు చక్రాల కింద నలిగిపోయిన అభాగ్యుడెవరో తెలుసా? ఈయనే. పేరు విలియం హస్కిసన్, బ్రిటన్ ఎంపీ. 1830 సెప్టెంబర్ 15న బ్రిటన్‌లోని లివర్‌పూల్, మాంచెస్టర్ రైల్వేలైన్‌ను ప్రారంభించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ రైలు కింద పడి మరణించారు. ఇదే కార్యక్రమానికి వచ్చిన డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్ ఆర్థర్ వెల్లస్లీతో మాట్లాడేందుకు పక్కనే ఉన్న పట్టాలపై నడుచుకుంటూ ముందుకు వెళ్లారు. అయితే అదే సమయంలో ఆ పట్టాలపై మరో రైలు వస్తోంది. రైలు దగ్గరికి రాగానే తడబడుతూ పట్టాలపై పడిపోయారు. అందరూ చూస్తుండగానే ఘోరం జరిగిపోయింది.




తెలంగాణకు ఒరిగేదేమీ లేదు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌తో తెలంగాణకు పెద్ద గా ప్రయోజనమేమీ లేదని రాష్ట్ర ఆర్థిక శాఖ వర్గాలు అంచనాకు వచ్చాయి. కేంద్ర ప్రభు త్వం ప్రారంభిస్తున్న కిసాన్ సమ్మాన్ యోజన కింద రాష్ట్రంలోని 47 లక్షలకు పైగా రైతులకు లబ్ధి చేకూరనుందని భావిస్తోంది. రైతుల బ్యాంకు ఖాతాల్లోకే ఈ పథకం సొమ్ము వెళ్తుందని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు పథకానికి ఇది ఎలాంటి దోహదకారిగా ఉండబోదని అంచనాకు వచ్చింది. ఆర్థిక శాఖ వర్గాల సమాచారం ప్రకారం గ్రామీణ సడక్ యోజన, నేషనల్ ఎడ్యుకేషన్ మిషన్, నేషనల్ లైవ్లీ హుడ్ మిషన్ కార్యక్రమాల కింద రాష్ట్రానికి కొద్దిగా నిధులు పెరిగే అవకాశం ఉంది.

కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు: ఈ సారి 3.27 లక్షల కోట్లు
(గత బడ్జెట్‌లో రూ.3.04 లక్షల కోట్లు)





పాతపని పూర్తిచేసేందుకే!

- రైల్వే బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్రం నిర్ణయం
- ఈ ఏడాదే కొత్తపల్లి-మనోహరాబాద్, అక్కన్నపేట-మెదక్ ట్రయల్‌రన్
- ఎంఎంటీఎస్-2 కూడా.. నెమ్మదిగా టెర్మినళ్ల అభివృద్ధి
- ప్రస్తుతానికి కాజీపేట డివిజన్, లాలాగూడ మెడికల్ కాలేజీ పెండింగ్
- కొత్తలైన్లకు టెండర్లపైనా రాని స్పష్టత

సాక్షి, హైదరాబాద్

ఈసారి బడ్జెట్‌లో పెండింగ్‌లో ఉన్న పాత ప్రాజెక్టులను పూర్తిచేసేందుకే కేంద్రం ఎక్కువ ఆసక్తి చూపించింది. కొత్త ప్రాజెక్టుల గురించి ఎలాంటి ప్రకటన చేయకుండా.. పాత వాటికి నిధుల కేటాయింపునకే పెద్దపీట వేసింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాజీపేట డివిజన్ హోదా, వట్టినాగులపల్లి టెర్మినల్ నిర్మాణం తదితర డిమాండ్లు ఈ బడ్జెట్‌లోనూ తీరని కోరికలుగానే మిగిలిపోయాయి. కాజీపేట-బల్లార్షా మూడో లైనుకు ఈ ఏడాది కూడా మోక్షం లభించలేదు. మరోవైపు అక్కన్నపేట-మెదక్ రైలు మార్గం ఈఏడాది ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. కొత్తపల్లి-మనోహరాబాద్‌కు మార్గంలోనూ మనోహరాబాద్-గజ్వేల్ వరకు ట్రయల్ రన్‌కు అధికారులు సిద్ధమవుతుండటం శుభసూచకం. శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే కేంద్రమైన సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ జాన్ థామస్ బడ్జెట్ వివరాలు వెల్లడించారు.





దక్షిణ మధ్య రైల్వే బడ్జెట్ హైలైట్స్

2019-20లో రైల్వే మొత్తం బడ్జెట్:	రూ.1,58,658 కోట్లు
మధ్యంతర బడ్జెట్‌లో మొత్తం రైల్వే బడ్జెట్	రూ.64,578 కోట్లు
2019-20లో దక్షిణ మధ్య రైల్వేకు కేటాయింపులు:	రూ.5,924 కోట్లు
గతేడాదితో పోలిస్తే కేటాయింపులు:	రూ.172కోట్లు ఎక్కువ
పనులు	నిధులు(రూ.కోట్లలో)
కొత్త లైన్లకు	834
డబ్లింగ్ వర్క్స్	1,905
ట్రాఫిక్ సదుపాయాలు	138కోట్లు
ప్యాసింజర్ సదుపాయాలు	229 (గతేడాది రూ.189 కోట్లు)

భద్రతా చర్యలు

- నాలుగున్నరేళ్లలో భద్రతకు పెద్దపీట వేశామని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.
- గతేడాది నిర్మించిన ఆర్వోబీ/ఆర్‌యూబీ: 335
- ఈ ఏడాది నిర్మించతలపెట్టిన ఆర్వోబీ/ఆర్‌యూబీ: 102
- కాపలాలేని లెవెల్ క్రాసింగులను గతేడాది అక్టోబరుకు పూర్తిగా నిర్మూలించింది.
- ఆర్వోబీ/ఆర్‌యూబీల నిర్మాణానికి కేటాయించిన నిధులు: రూ.397 కోట్లు
- బ్రిడ్జీల నిర్మాణానికి: రూ.52 కోట్లు
- లెవెల్ క్రాసింగుల వద్ద భద్రతకు: రూ.72.5 కోట్లు
- ట్రాకుల పునరుద్ధరణకు: రూ.657 కోట్లు
- శిక్షణ, మానవ వనరుల అభివృద్ధికి: రూ.16.4 కోట్లు

కీలక ప్రాజెక్టులకు కేటాయింపులు..

1. మనోహరాబాద్ కొత్తపల్లి ప్రాజెక్టుకు రూ.200 కోట్లు
2. మునీరాబాద్-మహబూబ్‌నగర్ మార్గానికి రూ.275 కోట్లు
3. భద్రాచలం-సత్తుపల్లి లైన్‌కు రూ.405 కోట్లు
4. కాజీపేట-బల్లార్షా మూడో లైన్‌కు రూ.265 కోట్లు
5. సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ డబ్లింగ్‌కు రూ.200 కోట్లు
6. కాజీపేట-విజయవాడ మూడోలైన్‌కు రూ.110 కోట్లు
7. ఘట్‌కేసర్-యాదాద్రి ఎంఎంటీఎస్ ఫేజ్-2కు రూ.20 కోట్లు
8. చర్లపల్లి శాటిలైట్ స్టేషన్‌కు రూ.5 కోట్లు
9. కాజీపేట ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్‌కు రూ.10 కోట్లు
10. మౌలాలిలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైల్వే ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ ఏర్పాటుకు రూ.1.5 కోట్లు

తీరని కలలు...

1980 నుంచి తీరని కలగా మిగిలిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి ఈసారి కూడా మోక్షం దక్కలేదు. కాజీపేటను డివిజన్‌గా మార్చాలన్న డిమాండ్, లాలాగూడలో మెడికల్ కాలేజీ నిర్మించాలన్న డిమాండ్ ప్రస్తుతానికి పెండింగ్‌లోనే ఉన్నాయి. దక్షిణమధ్య రైల్వే పరిధిలోని చర్లపల్లి, వట్టినాగులపల్లి టెర్మినళ్ల నిర్మాణం ఇంకా సాకారం కావడం లేదు. ఇక్కడ తెలంగాణ ప్రభుత్వం స్థలం కేటాయించడంలో జాప్యం చేస్తున్నందునే ఇది ఆలస్యమవుతోంది.

ఈ సర్వే పనులకు టెండర్లు పిలుస్తారా?

1. పటాన్‌చెరు-సంగారెడ్డి-జోగిపేట-మెదక్ 95 కిలోమీటర్లు
2. నిజామాబాద్-నిర్మల్-ఆదిలాబాద్ రూ.125 కోట్లు
3. కరీంనగర్-హుజూరాబాద్-ఎల్కతుర్తి: 60 కిమీ

రైతు బంధుకు అనుకరణ: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సర్కారు అమలు చేస్తున్న రైతుబంధు స్ఫూర్తితో ఎన్డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేంద్ర తాత్కాలిక బడ్జెట్‌పై ట్విట్టర్‌లో స్పందించారు. అనుకరణకు మించిన ప్రశంస మరొకటి లేదని, సీఎం కేసీఆర్ మానస పుత్రిక అయిన రైతుబంధు వల్ల దేశంలోని రైతులందరికీ సహాయం అందే ప్రక్రియ మొదలవడం హర్షణీయమన్నారు.

‘రైతుబంధు’ను కేంద్రం ఆచరించడం సంతోషం

ఎంపీ జితేందర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం కేసీఆర్ రోల్ మోడల్ ఆఫ్ కంట్రీ అనడానికి ఈ బడ్జెట్ నిదర్శనం అని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కేంద్ర బడ్జెట్ సమర్పించాక మాట్లాడుతూ.. ‘రైతు ఆత్మహత్యలు అరికట్టేలా రైతుబంధు పథకాన్ని కేసీఆర్ ప్రవేశపెట్టారు. యూనియన్ బడ్జెట్‌లో రైతులకు రూ.6 వేల పంట సాయం ప్రకటించినప్పుడు గర్వ పడ్డాం’అని చెప్పారు. ఇది రాజకీయ బడ్జెట్‌గా భావిస్తున్నామని పేర్కొన్నారు.

‘రైతుబంధు’ను దేశవ్యాప్తం చేయడం సంతోషకరం

ఎంపీ కవిత

సాక్షి, న్యూఢిల్లీ: రైతుబంధు స్ఫూర్తిని దేశవ్యాప్తం చేయడం సంతోషకరమని టీఆర్‌ఎస్ ఎంపీ కవిత అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై ఆమె స్పందించారు. ‘తెలంగాణ పథకాలు ఆదర్శవంతంగా నిలిచాయి. తెలంగాణ రైతులకే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు లాభం చేకూరనుంది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతుబంధు స్ఫూర్తిగా బీజేపీ ప్రభుత్వం రైతుకు సాయం చేసే పథకాన్ని ప్రకటించింది. కేసీఆర్ నాయకత్వంపై గర్వపడుతున్నాం. వారి ఆలోచనలను మోదీ అమలు చేస్తున్నారు.

పూర్తి స్థాయిలో కూడా స్వీకరించలేదు: బి. వినోద్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబంధును కేంద్రం పూర్తి స్థాయిలో కూడా స్వీకరించలేదని ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో మాట్లాడుతూ.. ఎన్నికల కోణంలో, మళ్లీ గెలవాలన్న ఆలోచనతో కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. ఆర్థిక మం త్రి ప్రసంగం చూస్తే 3 నెలలపాటు ఉద్యోగుల జీతభత్యాలు, రోజువారీ ఖర్చుల కోసం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సిన పోయి సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు అనిపిస్తోందన్నారు.

ఎన్నికల జిమ్మిక్కుగా బడ్జెట్: సురవరం

సాక్షి, హైదరాబాద్: పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జనాకర్షక బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించినా చివరకు అంకెల గారడీగా, ఎన్నికల జిమ్మిక్కుగా మిగిలిపోయిందని విమర్శించారు. రైతులకు ఎకరాకు రూ.12–15 వేల లోపు పెట్టుబడి అవుతుంటే, రూ.6 వేలు ఇస్తామనడంలో అర్థం లేదన్నారు. 10 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులకు నెలకు రూ.3 వేలు ఇస్తామంటున్నా.. బడ్జెట్ కేటాయింపులు సరిపోవన్నారు.

మోదీ దూరదృష్టి బడ్జెట్ ఇది: లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో ఈ బడ్జెట్‌ను రూపొందించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. అవినీతిరహిత సమాజం, 2030 నాటికి సంపూర్ణ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను తెచ్చారని వెల్లడించారు. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ.. వ్యవసాయం లాభసాటిగా, రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు, విద్యుత్, ఎరువుల సమస్యలు లేకుండా చేసేందుకు ఈ బడ్జెట్‌లో చర్య లు చేపట్టారన్నారు. పెట్టుబడి సాయం కింద రైతులకు రూ.6 వేలు ఇచ్చేలా చర్యలు చేపట్టారని, దీంతో తెలంగాణలో దాదాపు 50 లక్షల రైతులకు మేలు జరుగుతుందన్నారు.

‘ఇన్నేళ్లు పట్టించుకోకుండా ఇప్పుడు వరాలా’

సాక్షి, హైదరాబాద్: నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగపడే చర్యలు తీసుకోకుండా ఎన్నికలకు రెండు నెలల ముందు వరాలు గుప్పించడంలోనే బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధి స్పష్టమవుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి ఘోర పరాభావం ఎదురవడంతో పాటు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వెల్లడవుతుండటంతో దాన్ని అధిగమించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

‘ఓట్ల కోసమే ఈ బడ్జెట్’

సాక్షి, హైదరాబాద్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం ఓట్ల కోసమే పెట్టినట్టుందని కాంగ్రెస్ ఆరోపించింది. పేదలను వదిలి వ్యాపారుల మన్ననలు పొందేలా ఉన్న ఈ బడ్జెట్‌తో బీజేపీ వ్యాపారస్తుల పార్టీ అని మరోమారు తేలిపోయిందని టీపీసీసీ వర్కిం గ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏఐసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డితో కలసి మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయపు పన్నును మినహాయించినట్టు ప్రకటించి వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. బడాబాబులకు ఐటీ తగ్గించి పేదలను పట్టించుకోకుండా అంకెలు చూపెట్టారని, మోదీ వల్ల దేశానికి ఒరిగిందేమీ లేదని, రాబోయే ఎన్నికల్లో మోదీ సర్కారును గద్దెదింపేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెట్

ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ త్వరలో జరిగే సాధారణ ఎన్నికలకు ప్రచారం మాదిరిగా ఉందని ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం కొండా విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ ద్వారా గతంలో తాను ప్రవేశపెట్టిన అన్ని పథకాలు విఫలమైనట్లుగా కేంద్ర ప్రభుత్వం ఒప్పుకున్నట్టు అయిందన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు, మద్దతు ధర, ఈనామ్ లాంటివన్నీ విఫలమవడంతో ఇప్పుడు కొత్తగా రైతులకు పెట్టుబడి సాయం పేరుతో ముందుకొచ్చారని విమర్శించారు. ఆదాయ పన్ను పరిమితి పెంపు మంచిదని పేర్కొన్నారు. అయితే, దీన్ని గత ఐదేళ్లలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ఎన్నికల కోణంలో ఉందన్నారు.

రాష్ట్ర రైతులకు కేంద్రం ‘పెట్టుబడి’ ₹2,824 కోట్లు

- తెలంగాణలో 47 లక్షల మంది సన్న, చిన్నకారు రైతులకు లబ్ధి
- రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా చేరనున్న సాయం
- వారి ఖాతాల వివరాలను కేంద్రానికి పంపనున్న రాష్ట్రం

సాక్షి, హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ప్రవేశపెట్టిన ‘ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి’పథకం కింద తెలంగాణలో 47.08 లక్షల మంది సన్న, చిన్నకారు రైతులు రూ. 2,824 కోట్ల పెట్టుబడి సాయం పొందనున్నారు. ఆయా రైతులందరికీ రూ. 2 వేల చొప్పున మూడు విడతల్లో (ఏటా రూ. 6 వేలు) వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ కానుంది. ప్రస్తుత రబీ సీజన్‌కు అంటే గతేడాది డిసెంబర్ నుంచి ఈ పథకం అమలులోకి వస్తున్నందున ఈ ఏడాది మార్చి నాటికి రైతులకు డబ్బు జమ అవుతుందని భావిస్తున్నారు. అందుకు అవసరమైన రైతు బ్యాంకు ఖాతా నంబర్లను కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.

రాష్ట్రంలో 90 శాతం మంది రైతులకు ప్రయోజనం...

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టుబడి పథకం వల్ల రాష్ట్రంలోని 90 శాతం మంది రైతులకు ప్రయోజనం కలుగనుంది. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం తెలంగాణలో మొత్తం రైతుల సంఖ్య 57.24 లక్షలుకాగా అందులో ఐదెకరాల లోపున్న సన్న, చిన్నకారు రైతుల సంఖ్య 47.05 లక్షలుగా (అంటే 90 శాతం మంది) ఉంది. సన్న, చిన్నకారు రైతుల్లో అత్యధికంగా ఎకరం లోపు భూమి ఉన్న వారు 14.86 లక్షల మంది ఉన్నారు. రాష్ట్రంలో 1.40 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా సన్న, చిన్నకారు రైతుల చేతిలో 95.59 లక్షల ఎకరాలు (అంటే 68.05 శాతం) ఉంది.

‘రైతుబంధు’ఆదర్శంగా...

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని ఆదర్శంగా తీసుకొని కేంద్రం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే కేంద్రం తెచ్చిన ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా ఇప్పటికిప్పుడు అమలు చేయడం అంత సులువు కాదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ రైతుల బ్యాంకు ఖాతాలు అందుబాటులో లేకపోవడమే అందుకు కారణమని, కాబట్టి సార్వత్రిక ఎన్నికల నాటికి రైతు బ్యాంకు ఖాతాలను సేకరించి ఇవ్వడమనేది సులువైన వ్యవహారం కాదని చెబుతున్నారు.

లక్ష్యం ఒకటే అయినా ...

రాష్ట్రం అమలు చేస్తున్న రైతుబంధు పథకం, కేంద్రం తెచ్చిన పెట్టుబడి సాయం పథకం లక్ష్యం రైతులను ఆర్థికంగా ఆదుకోవడమే అయినప్పటికీ వాటి అమలు మాత్రం వేర్వేరుగా ఉంది. తెలంగాణలో రైతుబంధు కింద ప్రస్తుతం ఎకరాకు రూ. 4 వేల చొప్పున పెట్టుబడి సాయం ఇస్తుండగా కేంద్రం ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకే ఏటా రూ.6 వేల చొప్పున సాయం అందించనుంది. ఈ లెక్కన ఐదెకరాలున్న ఒక రైతు.. రైతుబంధు ద్వారా ఏడాదికి రెండు సీజన్లకు కలిపి రూ.40 వేలు పొందితే కేంద్ర పథకం ద్వారా రెండు సీజన్లకూ కలిపి రూ.6 వేలే పొందుతాడు. దీనిపై పలువురు రైతులు పెదవి విరుస్తున్నారు. రాష్ట్రంలో రైతుబంధు కింద అన్ని వర్గాలూ పెట్టుబడి సాయం పొందుతుండగా మోదీ ప్రభుత్వం తెచ్చిన పథకంతో ఇప్పుడు సన్న, చిన్నకారు రైతులకే అదనంగా కేంద్ర సాయం అందనుందని వ్యవసాయశాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కేంద్ర పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వంతో కలిపి అమలు చేస్తే కేంద్రానికి పేరు రాదన్న భావనతోనే విడిగా అమలు చేస్తున్నారంటున్నారు.

తెలంగాణ ఊసే లేదు

రైతు బంధు స్ఫూర్తితో కేంద్రం కొత్త పథకం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతు బంధు పథకాన్ని స్ఫూర్తిగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రైతుబంధు తరహాలో ఐదెకరాలలోపు రైతుకు ఏటా రూ.6 వేల చొప్పున సాయాన్ని ప్రకటించింది. ఈ ఒక్క విషయంలోనే తెలంగాణ చర్చకు వచ్చింది తప్ప బడ్జెట్‌లో తెలంగాణకు సంబంధించి ప్రత్యేక ప్రస్తావనే లేదు. ఏపీ, తెలంగాణలో కలిపి గిరిజన విశ్వవిద్యాలయాలకు రూ.8 కోట్లు కేటాయించారు. ఈ అంశంలో తప్ప మరెక్కడా తెలంగాణ ప్రస్తావన రాలేదు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి ఇవ్వాల్సిన రాయితీల్లో భాగంగా ఏపీకి, తెలంగాణకు కలిపి వడ్డీ రాయితీ కింద 2018–19 బడ్జెట్ అంచనాలను రూ.100 కోట్లుగా చూపారు. సవరించిన అంచనాల్లో సున్నాగా చూపారు. అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించలేదు. 2019–20కి కూడా నిధులు కేటాయించలేదు. ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టులు, పలు జాతీయ సంస్థలకు ఏటా ఇచ్చే సాధారణ ప్రణాళికేతర వ్యయాన్ని కొన్ని పద్దుల్లో చూపారు. తెలంగాణలో ప్రతిపాదిత ఎయిమ్స్‌కు నిధుల ప్రస్తావన ఈ బడ్జెట్‌లో కనిపించలేదు. పునర్ వ్యవస్థీకరణ చట్టంలో ప్రతిపాదించిన బయ్యారంలో స్టీలు ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రస్తావన కూడా ఈ బడ్జెట్‌లో లేదు.

ఏడాది	వాటా (రూ. కోట్లల్లో)
2014-15	10,091.94
2015-16	12,350.72
2016-17	14,876.61
2017-18	16,505.02
2018-19	18,560.88
2019-20	20,583.05

కేంద్ర పన్నుల్లో వాటా ఇలా..

తెలంగాణకు 2019–20 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంచే మొత్తం (42 శాతం వాటా) నిధుల్లో 2.437 శాతం దక్కింది. ఇది రూ.20,583.05 కోట్లకు సమానం. గత ఏడాదికంటే దాదాపు రూ.2,022 కోట్లు అధికం. ఇందులో కార్పొరేషన్ టాక్స్ రూ.6,665.84 కోట్లు, ఆదాయ పన్ను రూ.5,600.58 కోట్లు, సెంట్రల్ జీఎస్టీ రూ.6,229.45 కోట్లు, కస్టమ్స్ టాక్స్ రూ.1,293 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.794 కోట్లు ఉన్నాయి. 2014–15తో పోల్చితే ఇప్పుడు కేంద్ర పన్నుల్లో వచ్చే వాటా రెట్టింపు కావడం విశేషం.

దిగజారుడు రాజకీయాల్లో కొత్త ఒరవడి

- నాలుగు నెలలకు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఇన్ని ప్రలోభాలా?
- ప్రజల్ని మోసం చేయడంలో కేంద్ర, రాష్ట్ర పెద్దలు పీహెచ్‌డీ
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన వాటిపై ప్రకటన లేదు
- ఓటుకు కోట్లు కేసు తర్వాత లొంగుబాటు వల్లే ఈ దుస్థితి
- ప్రత్యేక హోదాను వదిలేసి ప్యాకేజీకి ఊకొట్టారు
- హోదా కోసం ప్రతిపక్షం గొంతెత్తితే ప్రివిలేజ్ నోటీసులిచ్చారు..
- ఇప్పుడు ఎవరూ లేకుండా చూసి బాబు భారీ డైలాగులు
- ఏపీకి అన్యాయం చేసిన పార్టీలన్నిటికీ గుణపాఠం తప్పదు
- ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: నాలుగు నెలలకు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో వరాలు, పథకాలు ప్రవేశపెడుతూ ప్రలోభాలకు దిగడాన్ని చూస్తుంటే ప్రజల్ని మోసం చేయటంలో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పెద్దలు పీహెచ్‌డీ తీసుకున్నారని అర్థమవుతోందని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ఇది దిగజారుడు రాజకీయాల్లో కొత్త ఒరవడి అని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్, అసెంబ్లీలో ప్రత్యేక హోదా అంశంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై జగన్ స్పందించారు. శుక్రవారం సాయంత్రం అందుబాటులో ఉన్న నాయకులతో ప్రతిపక్ష నేత సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ‘ఈ చివరి బడ్జెట్లో కూడా రాష్ట్రానికి రావాల్సిన వాటిపై ఎలాంటి ప్రకటన లేదు. ముఖ్యమంత్రి చేతకాని వాడు అయితే రాష్ట్ర ప్రయోజనాలు ఎలా దెబ్బతింటాయో దానికి చంద్రబాబు పెద్ద ఉదాహరణ’అని దుయ్యబట్టారు. ఓటుకు కోట్లు కేసు తర్వాత చంద్రబాబు లొంగుబాటు వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఆ తర్వాతే ప్రత్యేక హోదాను వదిలేసి లేని ప్యాకేజీ ఊకొట్టారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్తూ ఇదే అసెంబ్లీలో నాలుగు సార్లు తీర్మానాలు చేయించాడని గుర్తు చేశారు. ఆ రోజు మేం ఇది తప్పు, రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని నల్లచొక్కాలతో వస్తే.. మమ్మల్ని సభలో నానా మాటలు అని ఈరోజు చంద్రబాబు నల్లచొక్కాలు వేసుకొచ్చారని జగన్ మండిపడ్డారు.



హత్య చేసినవాడే శాంతి ర్యాలీ చేసినట్లు బాబు వైఖరి..

ప్రత్యేక హోదా కోసం గొంతు ఎత్తినందుకు తమ ఎమ్మెల్యేలపై ప్రివిలైజ్ నోటీసులు ఇచ్చారని, ప్యాకేజీకి చంద్రబాబు జై కొట్టడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేస్తుంటే, 2016 సెప్టెంబరు 8, 9, 10 తేదీల్లో అసెంబ్లీలో మాట్లాడ్డానికి తనకు 30 సెకన్ల సమయం కూడా ఇవ్వలేదని జగన్ గుర్తు చేశారు. ఈరోజు ఎవరూ లేకుండా చూసి అసెంబ్లీలో చంద్రబాబు భారీ డైలాగులు చెప్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘అసెంబ్లీలో లేని వ్యక్తుల గురించి మాట్లాడకూడదన్న కనీస జ్ఞానం కూడా చంద్రబాబుకు లేదు. 2017 జనవరి 27న ఇదే వ్యక్తి ఏమన్నాడో గుర్తుకు తెచ్చుకోవాలి. ఇంతకంటే ఏ రాష్ట్రానికి ఇచ్చారో చెప్పండి అంటూ వరుసగా 4 సంవత్సరాలు కేంద్రం ఏపీకి అద్భుతంగా సహాయం చేసిందని ఇదే చంద్రబాబు చెప్పారు. హత్యచేసిన వాడే ఆ హత్యకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీ చేస్తే ఎలా ఉంటుందో ఇప్పుడు అసెంబ్లీలో చంద్రబాబు డైలాగుల్ని చూసినా అలాగే ఉంది. నాలుగేళ్లపాటు టీడీపీకి చెందిన ఇద్దరు మంత్రులు కేంద్ర కేబినెట్‌లో ఉన్నారు. వాళ్లు ఉండి కూడా ఈ రాష్ట్రానికి ఏం చేశారంటే.. ఏమీ మాట్లాడరు. ఆ మంత్రులు దిగిపోతూ ప్రెస్‌మీట్ పెట్టి కూడా కేంద్ర ప్రభుత్వం అద్భుతంగా చేసిందని చెప్పారు. విశాఖ మెట్రో రైల్‌కు రూ.1 లక్ష రూపాయలు ఇచ్చినా, పోలవరం ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా బడ్జెట్లో కేటాయించకపోయినా చంద్రబాబు జై కొట్టారు. కేంద్రం నాలుగేళ్లుగా ఇవ్వనిది ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో ఇస్తుందని ఎలా అనుకుంటారు? ఏపీకి న్యాయం చేసైనా ఎన్నికలకు వెళ్తారన్న ఆశ కొద్దిగా మిగిలి ఉంటే అదీ లేకుండా చేశారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన పార్టీలన్నింటికీ గుణపాఠం తప్పదు’అని జగన్ హెచ్చరించారు.

ఏపీకి తీరని అన్యాయం

ఎంపీ విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్ట ప్రకారం ఏపీకి ఇచ్చిన హామీలపై కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టుకు నిధుల మంజూరును బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. ఏపీకి కేంద్రం అన్యాయం చేసింది కేవలం ఈ ఒక్క బడ్జెట్‌లో మాత్రమే కాదని, గత నాలుగేళ్లు బీజేపీ మిత్రపక్షంగా టీడీపీ ఆమోదించిన నాలుగు బడ్జెట్లలో జరిగిన అన్యాయమే పునరావృతమైందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నల్లధనం రూ.70 లక్షల కోట్లుంటే.. రూ.1.3 లక్షల కోట్లు పన్నుల రూపంలోకి తెచ్చామని కేంద్ర మంత్రి అంటున్నారని, ఇందులో 30 శాతం పన్ను, 30 శాతం పెనాల్టీ పోనూ వచ్చింది 50 నుంచి 60 శాతం ఆదాయమేనని వివరించారు. విదేశాల్లో ఉన్న నల్లధనంలో రూ.50 వేల కోట్లు జప్తు చేశామని చెప్పడం కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉందని చెప్పారు. మొత్తంగా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు.



నమో ఓటర్

డిజిన్వెస్ట్‌మెంట్‌తో రూ. 90వేల కోట్లు

వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం (డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా రూ. 90,000 కోట్లు సమీకరించాలని కేంద్రం నిర్దేశించుకుంది. 2018-19లో ఈ లక్ష్యం రూ. 80,000 కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటిదాకా రూ. 36,000 కోట్లు సమీకరించిన కేంద్రం మరో రెండు నెలల్లో ఇంకో రూ. 44,000 కోట్లు సేకరణపై కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం దాదాపు 57 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈ) లిస్టయ్యాయి. వీటి మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ. 13 లక్షల కోట్లుగా ఉంటుంది. 2017-18లో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ. 1 లక్ష కోట్లు వచ్చాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్నట్లుగా రూ. 80,000 కోట్ల లక్ష్యాన్ని సాధించగలమనేది కేంద్రం అంచనా.

2018-19 డిజిన్వెస్ట్‌మెంట్ ఆదాయం: 80,000 కోట్లు

2017-18లో రూ. లక్ష కోట్ల మొత్తం పీఎస్‌యూ షేర్ల విక్రయం ద్వారా ఖజానాకు వచ్చింది

'స్టాక్స్'పై ఒకే స్టాంప్ డ్యూటీ

స్టాక్స్, బాండ్స్ వంటి ఆర్థిక సాధనాల లావాదేవీలపై ఇకపై ఒకే స్టాంప్ డ్యూటీ రేటును వర్తింపచేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ఈ డ్యూటీని స్టాక్ ఎక్స్ఛేంజీలే వసూలు చేసి, ఖజానాకు జమచేయాల్సి ఉంటుంది. ఇన్వెస్టర్లు నివసించే రాష్ట్రాలతో కేంద్రం ఈ నిధులను పంచుకుంటుంది. ప్రస్తుతం ఒక్కో రాష్ట్రానికి ఒక్కో రకమైన స్టాంప్ డ్యూటీ ఉంటోంది. ఈ సంక్లిష్టతలను తొలగించే దిశగా ఫైనాన్షియల్ సెక్యూరిటీస్ లావాదేవీలపై విధించే స్టాంప్ డ్యూటీలకు సంబంధించి సంస్కరణలు ప్రవేశపెడతామంటూ కేంద్రం గతేడాది ఇచ్చిన హామీని ప్రస్తుతం నెరవేర్చినట్లయింది.




సాక్షి

మోదీ.. 'రియల్' మేజిక్!!

రియల్టీ... ఇకనైనా నిలబడుతుందా?

- బడ్జెట్లో గృహ రంగంపై ప్రత్యేక దృష్టి
- రెండో ఇంటికీ మూలధన లాభాలు
- అందుబాటు గృహాల రాయితీలో మరో ఏడాది
- అమ్ముడుకాని ఇళ్లకు మరో రెండేళ్లు పన్ను లేదు
- జీఎస్‌టీ తగ్గింపుపై మంత్రుల బృందం ఏర్పాటు
- బడ్జెట్లో కీలక ప్రతిపాదనలు చేసిన కేంద్రం





హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:

భారీ నిర్మాణ సంస్థలు ప్రాజెక్టుల్ని పూర్తి చేయలేక మధ్యలోనే చేతులెత్తేస్తుండటం... అప్పటికే డబ్బులు చెల్లించి ఇళ్లకోసం ఎదురుచూస్తున్న కొనుగోలుదారులు న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తుండటం కొన్నాళ్లుగా రియల్టీ రంగాన్ని తీవ్రంగా వేధిస్తున్నాయి. రెరా వంటి చట్టాల్ని తెచ్చినా ఈ మధ్య కాలంలో రియల్టీ పుంజుకున్నది లేదు. ఈ రంగాన్ని ఆదుకోవటానికి కేంద్రం ముందుకు రావాల్సిన అవసరం ఉందని అన్ని వర్గాలూ భావిస్తున్న తరుణంలో ఈ సారి బడ్జెట్లో కేంద్రం పలు చర్యలు తీసుకుంది. అందుబాటు గృహాలపై పన్ను రాయితీలు మరో ఏడాది పాటు పొడిగించటమే కాకుండా... అమ్ముడుపోకుండా ఉన్న గృహాలు (ఇన్వెంటరీ) మీద పన్ను మినహాయింపులు రెండేళ్ల వరకూ పొడిగించింది. రెండో ఇంటిపై కూడా ఆదాయ పన్ను మినహాయింపులిచ్చింది. వీటికి సంబంధించిన వివరాలు చూస్తే...

ఊహాజనిత అద్దెపై పన్నుండదు..

ప్రస్తుతం ఒక వ్యక్తి పేరిట రెండు ఇళ్లున్నాయనుకోండి. అద్దెకు ఇవ్వకుండా రెండు ఇళ్లలోనూ తనే నివాసం ఉంటున్నా... ఒకదాన్ని అద్దెకు ఇచ్చినట్లుగా భావించి, ఆ ఊహాజనిత అద్దెపై ఆదాయపు పన్ను చెల్లించాల్సి వస్తోంది. మారుతున్న పరిస్థితుల్లో ఉద్యోగరీత్యా, పిల్లల చదువు రీత్యా, లేక తల్లిదండ్రుల సంరక్షణ మొదలైన సందర్భాల్లో మధ్యతరగతి ప్రజలకు రెండు చోట్ల ఇళ్లు ఉండటమన్నది అవసరంగా మారిపోతోందని, అలా రెండు ఇళ్లలనూ తామే నివాసముంటున్నా అద్దె వస్తున్నట్లుగా భావించి ఆదాయపు పన్ను చెల్లించటమనేది ఇబ్బందిగా మారిందని తన బడ్జెట్ ప్రసంగంలో పీయూష్ గోయెల్ స్పష్టంచేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈసారి బడ్జెట్‌లో రెండో గృహంపై వచ్చే ఊహాజనిత అద్దెకు ఆదాయ పన్ను మినహాయింపునిచ్చారు. అంటే రెండు ఇళ్లున్న వారు తాము గనక రెండింట్లోనూ ఉంటే... ఒకదాన్ని అద్దెకిచ్చినట్లుగా భావించి పన్ను కట్టక్కర్లేదన్నమాట. అంతే కాకుండా ఐటీ సెక్షన్ 54 ప్రకారం ఒక ఇంటిని విక్రయించగా వచ్చే మొత్తాన్ని రెండు ఇళ్ల కొనుగోలుకు వెచ్చించే అవకాశాన్ని కల్పించారు. గరిష్ఠంగా రూ.2 కోట్ల మొత్తానికి లోబడి ఈ రెండు ఇళ్లకు వెచ్చించిన మొత్తంపై మూలధన లాభాలకు మినహాయింపు కల్పిస్తారు. ఇప్పటిదాకా ఇది ఒక గృహం కొనుగోలుకు మాత్రమే వర్తించేది. కాకపోతే ఇది జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే వర్తిస్తుంది!

ఇన్వెంటరీ మీద నో ట్యాక్స్..



అమ్ముడు పోకుండా ఉన్న గృహాలపై (ఇన్వెంటరీ) పన్ను మినహాయింపును రెండేళ్ల వరకూ పొడిగించారు. ఈ ఏడాది ముగిసే నాటికి నిర్మాణం పూర్తయిన గృహాలకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుందని తెలియజేశారు. ప్రస్తుతం దేశంలోని ప్రధాన నగరాల్లో అమ్ముడుపోకుండా ఉన్న ఇన్వెంటరీ సుమారు 7 లక్షల వరకూ ఉంటుందని పలు ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థల సర్వేలు చెబుతున్నాయి. ఈ లెక్కన ఇన్వెంటరీ ఉన్న డెవలపర్లకు కాస్త ఊరట లభించిందన్నమాట.

2020 వరకూ సెజ్ లాభాల కొనసాగింపు..



స్టాంప్ డ్యూటీ వ్యవస్థలో సవరణలను ప్రభుత్వం ప్రతిపాదించిందని.. క్లయింట్ నివాసం ఆధారంగా స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా స్టాంప్ డ్యూటీ సేకరిస్తారని బడ్జెట్‌లో గోయల్ తెలిపారు. దేశంలో ప్రస్తుతం స్పెషల్ ఎకనామిక్ జోన్‌లకు (సెజ్) అందుతున్న పోత్సాహకాలు, రాయితీల లాభాలను 2020 వరకూ పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఈ చర్యలు దేశంలోని వాణిజ్య రియల్టీ రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తాయని టాటా రియల్టీ ఎండీ అండ్ సీఈఓ సంజయ్ దత్ తెలిపారు. సెజ్‌లల్లోని స్టార్టప్స్, మధ్యస్థాయి కంపెనీలతో కమర్షియల్ స్థలాలకు డిమాండ్ పెరుగుతుందని.. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోనూ సెజ్‌ల ఏర్పాటుకు కంపెనీలు ముందుకొస్తాయని ఆయన పేర్కొన్నారు.

అన్ని గృహ నిర్మాణ ప్రాజెక్టులకూ..

సెక్షన్ 80 ఐబీఏ ప్రకారం అందుబాటు గృహాలకు ప్రస్తుతం ఇస్తున్న పన్ను మినహాయింపును మరొక ఏడాది పాటు పొడిగించారు. 2019-20 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అనుమతి పొందిన అన్ని గృహ నిర్మాణ ప్రాజెక్ట్‌లకూ ఇది వర్తిస్తుంది. అందుబాటు ధరల్లోని గృహాలను నిర్మించే డెవలపర్లకు సెక్షన్ 80 ఐబీఏ కింద 100 శాతం ఆదాయ పన్ను రాయితీ కూడా ఉంటుంది. అంతేకాకుండా ప్రాజెక్ట్ నిర్మాణ కాల పరిమితిని మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. అందుబాటు గృహాల కార్పెట్ ఏరియా దేశంలోని నాలుగు మెట్రోపాలిటన్ నగరాల్లో 30 చ.మీ., మిగిలిన ప్రాంతాల్లో 60 చ.మీ. పరిమితికి లోబడి ఉండాలి.

జీఎస్‌టీ తగ్గింపు కోసం మంత్రుల బృందం..



ఎన్నికల ముందు, ఆఖరి బడ్జెట్‌లో తప్పనిసరిగా రియల్టీ రంగంపై జీఎస్‌టీ తగ్గింపు ప్రకటన ఉంటుందని ఊహాగానాలు వచ్చాయి. జీఎస్‌టీ తగ్గింపుతోనే గృహ నిర్మాణ రంగంలో డిమాండ్ ఉంటుందని ఎదురుచూశారు. కేంద్రం వీటికి ఫుల్‌స్టాప్ జీఎస్‌టీ తగ్గింపు సాధ్యాసాధ్యాలపై ప్రత్యేకంగా మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ''రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా), బినామీ ట్రాన్సాక్షన్, ప్రొహిబిషన్ చట్టాలు వచ్చాక రియల్టీ లావాదేవీల్లో పారదర్శకత చేకూరింది. గృహాలపై జీఎస్‌టీ భారం తగ్గించాలని మా ప్రభుత్వం కోరుకుంటోంది. జీఎస్‌టీ కౌన్సిల్ ఏర్పాటు చేసిన ఈ మంత్రుల బృందం సాధ్యమైనంత త్వరగా జీఎస్‌టీ తగ్గింపు ప్రతిపాదనలను సిద్ధం చేస్తుందని భావిస్తున్నాం. తదనుగుణంగా నిర్ణయం తీసుకుంటాం'' అని గోయల్ వివరించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గృహాలపై 12%, అందుబాటు గృహాల మీద 8% జీఎస్‌టీ ఉంది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) తీసుకున్న ప్రాజెక్ట్‌ల మీద జీఎస్‌టీ లేదు.

బడ్జెట్‌పై 'కార్పొరేట్' పలుకు...



''దేశ ఆర్థిక వృద్ధికి మధ్యతరగతి వర్గాలు, చిన్న వర్తకులు, రైతులు జీవనాడి వంటివారు. బడ్జెట్ 2019లో ప్రకటించిన నిర్ణయాలు లక్షలాది మంది కలలు.

– గౌతం అదానీ, అదానీ గ్రూపు చైర్మన్



ఆర్థిక రంగ దివాలా పరిస్థితి రాకుండా కీలకమైన మధ్యతరగతి, రైతాంగ విభాగాలకు ఇచ్చిన ఉపశమన నిర్ణయాలు గొప్పగా ఉన్నాయి. నియంత్రణతో కూడిన, ప్రేరణనిచ్చే కసరత్తు ఇది. ఆదాయాన్ని స్థిరీకరించి, ఒత్తిడిని ఎదుర్కొంటున్న వర్గాలకు రిస్కను తగ్గిస్తాయి.

– ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూపు చైర్మన్




గ్రామీణ ప్రజలకు ఉపశమనం కలిగించే, వినియోగానికి ప్రేరణనిచ్చేలా బడ్జెట్ ఉంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి వృద్ధికి ఊతమిచ్చేలా, ద్రవ్య క్రమశిక్షణతో, అదే సమయంలో ప్రభుత్వ ఖజానాపై పెద్ద భారం పడకుండా బడ్జెట్‌ను ప్రకటించినందుకు నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని అభినందించాలి''

– అనిల్ అగర్వాల్, వేదాంత రిసోర్సెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్



వినియోగాన్ని పెంచడం, వ్యవసాయం, గ్రామీణ వర్గాలు, అవ్యవస్థీకృత రంగంలోని కార్మికులకు ప్రయోజనాలు కల్పించే కార్యాచరణ వృద్ధికి ప్రేరణనిస్తుంది. బడ్జెట్ నిర్ణయాలు ఆర్థిక రంగానికి మంచి చేస్తాయి.

– సంజయ్‌పూరి, ఐటీసీ ఎండీ



ఇది ఎన్నికల సంవత్సరం బడ్జెట్. అందరికీ ఉద్దేశించినది. రైతుల నుంచి వర్తకుల వరకు, అవ్యవస్థీకృత రంగంలోని పనివారి నుంచి మధ్యతరగతి వేతన జీవుల వరకు అందరికీ ఏదో ఒకటి ఉంది. ప్రభుత్వం చాలా సమతూకం పాటించింది. ద్రవ్యలోటుకు కట్టుబడి ఉంటామన్న సంకేతాన్నిచ్చింది. అయితే, ఆరోగ్య రంగానికి అదనపు కేటాయింపుల్లేకపోవడం లేదా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగానికి ప్రోత్సాహకాలు లేకపోవడం నిరాశ కలిగించింది.

– కిరణ్ మజుందార్‌షా, బయోకాన్ సీఎండీ



వ్యవసాయం, మధ్యతరగతి వర్గాలే స్పష్టమైన లక్ష్యంతో బడ్జెట్ ఉంది. నేరుగా నగదు, పన్ను మినహాయింపుతో లబ్ధిదారులకు రూ.93,000 కోట్ల వెసులుబాటు కలిగిస్తుంది. ఈ పథకాలు వినియోగాన్ని పెంచుతాయి. గ్రామీణ ఆర్థిక రంగానికి మేలు చేస్తాయి''

– పవన్ ముంజాల్, హీరోమోటోకార్ప్ చైర్మన్



ప్రతీ రంగంలో, ప్రతీ వర్గంలో కొనుగోలు శక్తిని పెంచే విధంగా బడ్జెట్ ఉంది. వ్యక్తిగత ఆదాయపన్ను మినహాయింపును రూ.5 లక్షలకు పెంచడం చారిత్రక నిర్ణయం. దీంతో వారు ఖర్చు చేసేందుకు మరిన్ని నిధులు అందుబాటులోకి వస్తాయి. మరింత మంది ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేస్తారని, పరిశ్రమ వృద్ధికి తోడ్పడుతుందని అంచనా.

– వేణు శ్రీనివాసన్, టీవీఎస్ మోటార్ చైర్మన్



చిన్న, మధ్య స్థాయి రైతులకు ఆదాయాన్నిచ్చే పథకం ఎంతో ఆహ్వానించతగినది. పశు సంరక్షణ, చేపల పెంపకం కోసం వడ్డీ రాయితీతో కూడిన రుణాలు ఆయా రంగాలకు చేయూతనిస్తుంది. ఆదాయపన్ను మినహాయింపును రూ.5 లక్షలకు పెంచడం, బ్యాంకు డిపాజిట్లపై టీడీఎస్ పరిమితిని రూ.40,000కు పెంచడం కొత్త డిపాజిట్లను ఆకర్షించేందుకు తోడ్పడతాయి.

– రజనీష్ కుమార్, ఎస్‌బీఐ చైర్మన్



సంక్షోభం లేని ఆరోగ్య వ్యవస్థకు, ఆరోగ్య భారత్ విషయంలో ప్రభుత్వ కట్టుబాటును మధ్యంతర బడ్జెట్ తెలియజేసింది. ప్రభుత్వ చర్యల్లో ఆరోగ్య సంరక్షణ చాలా కీలకంగా ఉండాలి. ఆరోగ్య సదుపాయాల విషయంలో పల్లెలు, పట్టణాల మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేందుకు అవకాశాలను కోల్పోకూడదు. ఈ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించే విధానాలు అవసరం''

– సంగీతారెడ్డి, అపోలో హాస్పిటల్స్ గ్రూపు జాయింట్ ఎండీ

రవాణా విప్లవానికి భారత్ కెప్టెన్





న్యూఢిల్లీ: అత్యధికంగా విద్యుత్ వాహనాల వినియోగంతో అంతర్జాతీయంగా రవాణా విప్లవానికి భారత్ సారథ్యం వహించగలదని ఆర్థిక మంత్రి పియుష్ గోయల్ చెప్పారు. ఈ క్రమంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇంధన భద్రత సాధించగలదన్నారు. ఇంధనం, గ్యాస్ దిగుమతులు తగ్గితే.. పునరుత్పాదక విద్యుత్ వనరులు గణనీయంగా వృద్ధి చెందగలవని మంత్రి వివరించారు. 'ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగితే ఈ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించగలదు. అలాగే గణనీయంగా విదేశీ మారకం కూడా ఆదా కాగలదు' అని ఆయన చెప్పారు. 2030 నాటికి దేశీయంగా అమ్ముడయ్యే వాహనాల్లో 30% వాటా విద్యుత్ వాహనాలదే ఉండగలదని పరిశ్రమవర్గాల అంచనా.

సత్వర కార్యాచరణ ప్రణాళిక ఉండాలి ..

రవాణా విప్లవానికి భారత్ సారథ్యం వహించాలంటే ప్రభుత్వం సత్వరమే నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, నిర్దిష్ట గడువు విధించుకుని అమలు కూడా చేయాల్సి ఉంటుందని పరిశ్రమ వర్గాలు వ్యాఖ్యానించాయి. 'నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా ప్రభుత్వం త్వరలోనే నిర్మాణాత్మకమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించగలదని ఆశిస్తున్నాం' అని ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థల సమాఖ్య ఎస్ఎంఈవీ డైరెక్టర్ జనరల్ సోహిందర్ గిల్ తెలిపారు. విధానాలను తరచూ మార్చేస్తుండటం వల్ల తగ్గిపోయిన డిమాండ్‌కు ఊతమిచ్చేలా వచ్చే ఏడాది, రెండేళ్ల పాటు ప్రభుత్వం భారీ స్థాయిలో రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వాహనాలకు ఊతమివ్వడంపై మరింతగా దృష్టి పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని టయోటా కిర్లోస్కర్ మోటార్స్ వైస్ చైర్మన్ శేఖర్ విశ్వనాథన్ స్వాగతించారు. వాయు కాలుష్య కారక ఉద్గారాలు వెలువడే స్థాయిని బట్టి వాహనాలపై పన్నులు విధించడం ద్వారా పర్యావరణ అనుకూల వాహనాలను ప్రోత్సహించవచ్చన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాల దిగుమతులపై సుంకాలు తగ్గిస్తే.. ఆయా వాహనాల ధరలు కూడా తగ్గగలవని ట్వెంటీ టూ మోటార్స్ సహ వ్యవస్థాపకుడు పర్వీన్ ఖర్బ్ తెలిపారు.

ఎగుమతులకు మరింత జోష్..



న్యూఢిల్లీ: ఎగుమతులను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో వాటి పథకాలకు కేటాయింపులు మరింతగా పెంచింది కేంద్రం. 2019-20లో ఎగుమతి ప్రోత్సాహక స్కీములకు రూ.4,115 కోట్ల మేర కేటాయింపులను బడ్జెట్‌లో ప్రతిపాదించింది. 2018-19లో ముందుగా రూ. 3,551 కోట్లు కేటాయించగా.. ఆ తర్వాత సవరించిన గణాంకాల ప్రకారం ఇది రూ. 3,681 కోట్లకు పెరిగింది. ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్‌లో పెట్టుబడులు, జాతీయ ఎగుమతి బీమా ఖాతా, వడ్డీ రాయితీ స్కీమ్ మొదలైన వాటికి ఈ నిధులను కేటాయించారు. బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం వడ్డీ రాయితీ స్కీమ్‌లకు కేటాయింపులు రూ. 2,600 కోట్ల నుంచి రూ. 3,000 కోట్లకు పెరిగాయి. 2011-12 నుంచి ఎగుమతులు సుమారు 300 బిలియన్ డాలర్ల స్థాయిలోనే తిరుగాడుతున్నాయి. 2017-18లో స్వల్పంగా 10 శాతం పెరిగి 303 బిలియన్ డాలర్లకు చేరాయి.

చిన్న సంస్థలకు ఊతం..

- నిమిషాల్లోనే రుణాలు
- ఎస్ఎంఈల నుంచే 25 శాతం కొనుగోళ్లు



న్యూఢిల్లీ: కోట్లాది మందికి ఉపాధి కల్పించే లఘు, చిన్న, మధ్యతరహా సంస్థలకు (ఎస్ఎంఈ) తోడ్పాటునిచ్చేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోందని ఆర్థిక మంత్రి పియుష్ గోయల్ చెప్పారు. ఇటీవలే 59 నిమిషాల్లోనే రూ. 1 కోటి దాకా రుణాల పథకాన్ని ప్రారంభించామని, జీఎస్‌టీలో నమోదు చేసుకున్న ఎస్ఎంఈలకు రూ. 1 కోటిపైగా రుణాలపై రెండు శాతం మేర వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇక రూ. 5 కోట్ల కన్నా తక్కువ వార్షిక టర్నోవరు ఉన్న 90 శాతం మంది జీఎస్‌టీ చెల్లింపుదారులు ఇకపై మూణ్నెల్లకోసారి రిటర్నులు దాఖలు చేసేలా నిబంధనలు సడలిస్తున్నామన్నారు. మరోవైపు, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ఇక నుంచి 25 శాతం కొనుగోళ్లు ఎస్ఎంఈల నుంచే జరపాల్సి ఉంటుందని, ఇందులోనూ 3 శాతం కొనుగోళ్లు మహిళల సారథ్యంలోని సంస్థల నుంచి కొనాల్సి ఉంటుందని చెప్పారు.

రూ. 17వేల కోట్ల లావాదేవీలు..

ప్రభుత్వ శాఖలు, సంస్థల ఆన్‌లైన్ కొనుగోళ్ల కోసం ఉద్దేశించిన గవర్నమెంట్ ఈ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం) పోర్టల్ ద్వారా గడిచిన రెండేళ్లలో రూ. 17,500 కోట్ల పైచిలుకు లావాదేవీలు జరిగాయని గోయల్ చెప్పారు. వీటితో 25-28 శాతం మేర ఆదా అయ్యిందని ఆయన వివరించారు. ప్రస్తుతం ఈ పోర్టల్‌లో 1,90,226 మంది విక్రేతలు, సర్వీస్ ప్రొవైడర్లు 7,53,162 పైగా ఉత్పత్తులను విక్రయిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

రూ. 7 లక్షల కోట్ల ముద్ర రుణాలు..

మోదీ సర్కారు ముద్ర స్కీమ్‌ను ప్రవేశపెట్టినప్పట్నుంచీ రూ. 7.23 లక్షల కోట్ల విలువ చేసే 15.56 లక్షల రుణాలు మంజూరైనట్లు గోయల్ చెప్పారు. లబ్ధిదారుల్లో మహిళల సంఖ్య 70 శాతం పైగానే ఉందని ఆయన పేర్కొన్నారు.

బడ్జెట్.. ఎఫెక్ట్


తాజా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ ప్రతిపాదనల కారణంగా కొన్ని షేర్లు లాభపడగా, మరికొన్ని షేర్లు నష్టపోయాయి. సానుకూల ప్రతిపాదనల కారణంగా ఇంట్రాడేలో కొన్ని షేర్లు లాభపడినప్పటికీ, ట్రేడింగ్ చివర్లో నష్టపోయాయి. వివరాలు ఇవీ...



ప్రతిపాదన
రైతులకు రూ.6,000 సహాయం
ప్రభావిత షేర్లు, ముగింపు ధర (లాభం/నష్టం (శాతంలో)
యూపీఎల్ 778(-1), జైన్ ఇరిగేషన్ 59(-3) బేయర్ క్రాప్ సైన్స్ 4,357(0.7), శక్తి పంప్స్ 400(-0.2)



రక్షణ రంగానికి రూ.3.05 లక్షల కోట్ల కేటాయింపులు
వాల్‌చంద్ నగర్ ఇండస్ట్రీస్ 88 (1 శాతం)
భారత్ ఎలక్ట్రానిక్స్ 84(1 శాతం), బీఈఎమ్ఎల్ 799 (0.4 శాతం), భారత్ డైనమిక్స్ 256(-0.5 శాతం), ఎల్ అండ్ టీ 1,325(1 శాతం)



ఆదాయపు పన్ను పరిమితి పెంపు


హీరో మోటొకార్ప్	2,807(7 శాతం)
బజాజ్ ఆటో	2,602(2)
టీవీఎస్ మోటార్	512(2)
మారుతీ సుజుకీ	6,957(5)



గ్రామీణ ఆదాయం పెంపు ప్రతిపాదనలు
ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి 7 శాతం అధికంగా నిధులు
హెచ్‌యూఎల్ 1,796(2), డాబర్ ఇండియా 452(2)
ఐటీసీ 281(0.7), ఫ్యూచర్ కన్స్యూమర్ 44(5),
ప్రతాప్ స్నాక్స్ 1,050(3)



రెండో ఇంటి అద్దె మినహాయింపు పెంపు అందుబాటు గృహ రంగానికి ట్యాక్స్ హాలిడే పొడిగింపు, రెండో ఇంటి కొనుగోలుకూ క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు
డీఎల్ఎఫ్ 166(1), ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్ 75(2)
ఓబెరాయ్ రియల్టీ 450(2), గోద్రేజ్ ప్రాపర్టీస్ 746 (1)
శోభ 477(1), ప్రెస్టీజ్ ఎస్టేట్స్ డెవలపర్స్ 201(0.2)



పైరసీ నియంత్రణ, సినిమా షూటింగ్‌లకు సింగిల్ విండో
పీవీఆర్ 1,575 (-2)
ఈరోస్ ఇంటర్నేషనల్ 76(-2)
ఐనాక్స్ విండ్ 70 (0.6)



రైల్వేలకు రూ.64,000 కోట్ల కేటాయింపులు
టిటాఘర్ వ్యాగన్స్ 67(-2),
టెక్స్‌మాకో 56 (-1) , టిమ్‌కెన్ ఇండియా 569 (0.6), ఎస్‌కేఎఫ్ ఇండియా 1,897(-2)

బ్యాంకులకు మూలధన నిధుల విషయమై ఎలాంటి హామీ లేదు
కెనరా బ్యాంక్ 238(-5)
దేనా బ్యాంక్ 12(-3)
బ్యాంక్ ఆఫ్ ఇండియా 95(-8)
విజయ బ్యాంక్ 43(-2)





ఆశించిన స్థాయిలో పెరగని డైరీ రంగ కేటాయింపులు
పరాగ్ మిల్క్ ఫుడ్స్ 205(-1)
ప్రభాత్ డైరీ 56(-5)



నమో ఓటర్

జీఎస్‌టీ లక్ష్యానికి రూ.లక్ష కోట్ల దూరంలో...

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీఎస్‌టీ వసూళ్లు లక్ష్యానికి అడుగు దూరంలో ఆగిపోనుంది. రూ.లక్ష కోట్ల మేర తక్కువ వసూళ్లు అవుతాయని అంచనా. ఇక రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ.7.61 లక్షల కోట్లను జీఎస్టీ వసూళ్ల లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. వాస్తవానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీఎస్‌టీ రూపంలో కేంద్ర ఖజానాకు రూ.7.43 లక్షల కోట్ల పన్ను ఆదాయం వస్తుందని ప్రభుత్వం గత బడ్జెట్‌లో అంచనాలు వేసింది. కానీ తాజా బడ్జెట్‌లో ఈ లక్ష్యాన్ని ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ రూ.6.43 లక్షల కోట్లకు సవరించినట్టు ప్రకటించారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు 10 నెలల కాలంలో కేంద్రం, రాష్ట్రాల స్థాయిలో కలిపి వసూలైన జీఎస్‌టీ రూ.9.71 లక్షల కోట్లుగా ఉంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి కేంద్రం, రాష్ట్రాల జీఎస్టీ వసూళ్ల లక్ష్యం రూ.13.48 లక్షల కోట్లు.

కట్టుతప్పిన ద్రవ్యలోటు: జీడీపీలో 3.4 శాతం
(2018-19 బడ్జెట్ అంచనా 3.3 శాతం మాత్రమే)

ఎయిర్ ఇండియా అసెట్ హోల్డింగ్స్‌కు రూ.3,900 కోట్లు

ఎయిర్ ఇండియా రుణ నిర్వహణా సేవలు, పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి ఏర్పాటయిన స్పెషల్ పర్పస్ వెహికిల్... ఎయిర్ ఇండియా అసెట్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు బడ్జెట్ రూ.3,900 కేటాయించింది. ఇందులో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.1,300 కోట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.2,600 కోట్లు కేటాయిస్తారు. ఎయిర్ ఇండియా ప్రస్తుతం రూ.55,000 కోట్ల రుణ భారాన్ని మోస్తున్న సంగతి తెలిసిందే.



మిగతా 8 బ్యాంకులపైనా త్వరలో ఆంక్షల ఎత్తివేత

బ్యాంకింగ్ రంగంలో పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్న నేపథ్యంలో సత్వర దిద్దుబాటు చర్యలు (పీసీఏ) ఎదుర్కొంటున్న మిగతా 8 బ్యాంకులు కూడా త్వరలో ఆంక్షల నుంచి బైటపడగలవని ఆర్థిక మంత్రి పియుష్ గోయల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ బైటపడ్డాయని పేర్కొన్నారు. పీపీసీ పరిధి నుంచి తొలగించిన మూడు బ్యాంకులసహా, ఈ జాబితాలో అలహాబాద్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, యుకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, దేనా బ్యాంక్‌లు ఉన్నాయి.

గాడిలో పడిన వాహన విక్రయాలు



న్యూఢిల్లీ: దేశీ వాహన విక్రయాలు జనవరిలో స్వల్పంగా పెరిగాయి. గ్రామీణ ప్రాంతాల ఆదాయం పెరగడం, పెట్రో ధరలు శాంతించడం, కమోడిటీ ధరలు తగ్గడం వంటి సానుకూల అంశాల నేపథ్యంలో వాహన అమ్మకాలు వృద్ధిని నమోదుచేశాయని ఎం అండ్ ఎం ప్రెసిడెంట్ రాజన్ విశ్లేషించారు. కేవలం మహానగరాల్లోనే కాకుండా చిన్న పట్టణాలపై కూడా దృష్టి సారించడం వల్ల అమ్మకాలు ఊపందుకున్నాయని హోండా కార్స్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ గోయల్ అన్నారు.

పెరిగిన జనవరి వాహన అమ్మకాలు (దేశీయ)

కంపెనీ	2019	2018	వృ/క్షీ(%)
మహీంద్రా	52,500	49,432	6
మహీంద్రా ట్రాక్టర్స్	20,948	20,822	1
అశోక్ లేలాండ్	19,471	18,100	9
ఎస్కార్ట్స్ ట్రాక్టర్స్	5,762	5,160	11
మారుతీ సుజుకీ	1,42,150	1,40,600	1.1
టయోటా	12,067	13,239	-9
హోండా కార్స్	18,261	14,838	23
హ్యుందాయ్	45,803	-	-
టాటా మోటార్స్	54,915	59,441	-8

ఆటోల జోరు... బ్యాంకుల బేజారు

- బడ్జెట్ రోజు తీవ్ర ఒడిదుడుకుల్లో మార్కెట్
- ఆర్థిక మంత్రి ప్రసంగం తర్వాత సగం లాభాలు ఆవిరి
- మెప్పించిన ఆదాయ పన్ను పరిమితి పెంపు
- కానీ కట్టుతప్పిన ద్రవ్యలోటు
- ఇంట్రాడేలో 521 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్
- చివరకు 213 పాయింట్ల లాభంతోనే ముగింపు
- ఇంట్రాడేలో 11,000 పాయింట్లపైకి నిఫ్టీ
- కానీ 63 పాయింట్లు లాభంతో 10,894 వద్దే ముగింపు



ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వరాలు కురిపించిన తాజా బడ్జెట్ స్టాక్ మార్కెట్‌ను ఒడిదుడుకులకు గురి చేసింది. ఎవరూ ఊహించని వరాలు కురిపించినా, ఇంట్రాడేలో భారీ లాభాలు వచ్చినా, చివరకు ఓ మోస్తరు లాభాలతోనే స్టాక్‌సూచీలు సరిపెట్టుకున్నాయి. రైతులు, మధ్య తరగతి వర్గాల ఓట్లే లక్ష్యంగా రూపొందిన ఈ బడ్జెట్ కారణంగా స్టాక్ సూచీలు తీవ్రమైన హెచ్చుతగ్గులకు గురయ్యాయి. ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్ చివరకు 213 పాయింట్ల లాభంతో 36,469 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక ఇంట్రాడేలో 11,000 పాయింట్లకు పైగా ఎగసిన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 63 పాయింట్ల లాభంతో 10,894 పాయింట్ల వద్ద ముగిసింది. ద్రవ్యలోటు కట్టు తప్పినా, ప్రజాకర్షక పథకాలు ప్రకటించినా, మొత్తం మీద మార్కెట్ సెంటిమెంట్ సానుకూలంగానే ఉంది. ఇక వారం పరంగా చేస్తే, సెన్సెక్స్ 444 పాయింట్లు, నిఫ్టీ 113 పాయింట్లు చొప్పున పెరిగాయి. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ పథకం వ్యవసాయ రంగ షేర్లను పెంచింది.

సగమైన లాభాలు...

ఆసియా మార్కెట్ల సానుకూలతతో మన మార్కెట్ లాభాల్లోనే ఆరంభమైంది. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగం ఆరంభమయ్యే ఉదయం 11 గంటల వరకూ స్టాక్ సూచీలు స్తబ్ధుగానే ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 521 పాయింట్లు, నిఫ్టీ 153 పాయింట్ల వరకూ లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు బలహీనంగా ఆరంభం కావడం, ద్రవ్యలోటు కట్టుతప్పడం, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగ షేర్లలో అమ్మకాలు , డాలర్‌తో రూపాయి మారకం బలహీనంగా ట్రేడ్ కావడం ప్రతికూల ప్రభావం చూపించాయి. దీంతో స్టాక్ సూచీలు నష్టాల బాట పట్టాయి. సెన్సెక్స్ 35 పాయింట్లు, నిఫ్టీ 18 పాయింట్లు చొప్పున నష్టపోయాయి. జనవరి నెల వాహన విక్రయాలు బాగా ఉండటంతో వాహన షేర్లు పెరగడం, రియల్టీ, వినియోగ షేర్లలో కొనుగోళ్ల జోరు కారణంగా స్టాక్ సూచీలు మళ్లీ లాభాల్లోకి వచ్చాయి. మొత్తం మీద రోజంతా సెన్సెక్స్ 556 పాయింట్లు, నిఫ్టీ 171 పాయింట్ల రేంజ్‌లో కదలాడాయి.

వేదాంత 18 శాతం డౌన్...

వేదాంత షేర్ 18 శాతం నష్టంతో రూ.162 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే. ఈ క్యూ3లో ఈ కంపెనీ నికర లాభం 26 శాతం తగ్గి రూ.1,574 కోట్లకు చేరింది. కంపెనీ ప్రమోటర్ అనిల్ అగర్వాల్‌కు చెందిన ఫ్యామిలీ ట్రస్ట్, ఓల్కన్ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో వేదాంత అనుబంధ కంపెనీ కెయిర్న్ ఇండియా హోల్డింగ్స్ రూ.1,431 కోట్లు ఇన్వెస్ట్ చేయడంపై విమర్శలు, సందేహాలు తలెత్తడంతో ఈ కంపెనీ షేర్ భారీగా నష్టపోయింది.

డీహెచ్‌ఎఫ్‌ఎల్... ఐదో రోజూ పతనబాటే

దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్(డీహెచ్‌ఎఫ్‌ఎల్)షేర్ నష్టాలు ఐదో రోజూ కొనసాగాయి. ఈ సంస్థ రూ.31,000 కోట్ల మేర నిధులను దారి మళ్లించిందని ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ కోబ్రా పోస్ట్ వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ విషయమై ప్రభుత్వం దర్యాప్తును ప్రారంభించిందన్న వార్తల నేపథ్యంలో శుక్రవారం ఈ షేర్ 18 శాతం నష్టపోయి రూ.111 వద్ద ముగిసింది.

మరిన్ని విశేషాలు...

- యస్ బ్యాంక్ సీనియర్‌గ్రూప్ ప్రెసిడెంట్ ప్రణయ్ మండల్ రాజీనామా చేయడంతో యస్ బ్యాంక్ షేర్ 74 శాతం క్షీణించి రూ.186 వద్ద ముగిసింది. ఈ షేర్ పతనం కావడం ఇది వరుసగా ఐదో రోజు.
- పీసీఏ నిబంధనల నుంచి మినహాయింపు పొందిన బ్యాంక్ షేర్లు మిశ్రమంగా ముగిశాయి. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 1 శాతం లాభపడగా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ షేర్లు లాభపడినా, చివరకు నష్టాల్లో ముగిశాయి.
- ఈ క్యూ3లో నికర లాభం 45 శాతం పెరగడంతో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ షేర్ 2 శాతం లాభంతో రూ.2,787 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేర్ తాజా ఏడాది గరిష్ట స్థాయి, రూ.2,810ని తాకింది.
- ఇతిహాద్ ఎయిర్‌వేస్ షరతులకు తలొగ్గి రుణం తీసుకోవడానికి జెట్ ఎయిర్‌వేస్ సిద్ధమైందన్న వార్తల కారణంగా జెట్ ఎయిర్‌వేస్ షేర్ 8 శాతం లాభపడి రూ.256 వద్ద ముగిసింది.

దివాలా పిటీషన్ దాఖలుకు ఆర్‌కామ్ నిర్ణయం

రుణ భారం తగ్గించుకునేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో దివాలా పిటీషన్ వేయాలని టెలికం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) నిర్ణయించింది. వ్యూహాత్మక రుణ పరిష్కార ప్రణాళిక ప్రతిపాదన తెరపైకి వచ్చి ఏడాదిన్నర గడిచిపోయినా ఇంత వరకూ ఎలాంటి పురోగతి లేకపోవడంతో బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కంపెనీ షేర్ ధర ఎన్‌ఎస్‌ఈలో 1.28 శాతం క్షీణించి రూ.11.60 వద్ద ముగిసింది.

నేటి బోర్డు సమావేశాలు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిండికేట్ బ్యాంక్, దివీస్ ల్యాబ్స్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, జేకే సిమెంట్, ఎమ్‌ఓఐఎల్, రిలాక్సో ఫుట్‌వేర్, బీఈఎమ్‌ఎల్, డీసీఎమ్ శ్రీరామ్ ఇండస్ట్రీస్, గోదావరి పవర్ అండ్ ఇస్పాత్, పరాగ్ మిల్క్ ఫుడ్స్,

45 శాతం పెరిగిన డాక్టర్ రెడ్డీస్ లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ కంపెనీ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ డిసెంబరు త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితంతో పోలిస్తే 45 శాతం పెరిగి రూ.485 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.3,806 కోట్ల నుంచి రూ.3,850 కోట్లకు ఎగసింది. ఏప్రిల్–డిసెంబర్ మధ్య తొమ్మిది నెలల కాలంలో రూ.11,368 కోట్ల టర్నోవర్‌పై రూ.1,445 కోట్ల నికరలాభం పొందింది.

డిసెంబర్ త్రైమాసిక ఫలితాలు... (రూ. కోట్లలో)

	నికర లాభం			మొత్తం ఆదాయం		
కంపెనీ	2018-19	2017-18	వృ/క్షీ(%)	2018-19	2017-18	వృ/క్షీ(%)
జుబిలంట్ లైఫ్ సైన్సెస్	268	213	26	2,377	2,068	15
థామస్ కుక్	12	51	-76	1,555	3,005	-48
బీఎస్ఈ	50	59	-15	177	172	3
బెర్జర్ పెయింట్స్	134	130	3	1,632	1,348	21
టైటాన్	411	281	46	5,934	4,384	35

డిమాండ్, వృద్ధికి బలం
పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు

మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన నిర్ణయాలు డిమాండ్‌కు ప్రేరణనివ్వడంతోపాటు దేశ వృద్ధి రేటుకు బలాన్నిస్తాయని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక సంఘాలు అభిప్రాయపడ్డాయి. కుప్తంగా చూస్తే...

ఈ బడ్జెట్ మొత్తం మీద వినియోగదారుల విశ్వాసాన్ని పెంచుతుంది. బ్రాండెడ్ ఆహార ఉత్పత్తులు, కన్స్యూమర్ ఉత్పత్తుల డిమాండ్‌కు ఊపునిస్తుంది. ద్రవ్యలోటును 3.4 శాతానికి సవరించడం కొంచెం ఆందోళన కలిగించే అంశం
– సునీల్ దుగ్గల్, డాబర్ ఇండియా సీఈవో

కనీస మద్దతు ధరలు, రైతులకు సంబంధించిన పథకంలో పెట్టుబడులు పెంచడం ద్వారా ఆర్థిక రంగానికి బలాన్నివ్వడం ఆహ్వానించతగినది. పన్ను మినహాయింపు పెంచడం, పన్ను రిటర్నుల ప్రక్రియను సులభతరం చేయడం అన్నవి పన్నుల భారాన్ని తగ్గించడమే కాకుండా పన్నులు చెల్లించే వారి సంఖ్యను కూడా పెంచుతుంది
– సౌగత గుప్తా, మారికో ఎండీ, సీఈవో

ముందుచూపుతో కూడిన బడ్జెట్ ఇది. వినియోగదారుల చేతుల్లో ఖర్చు చేసేందుకు మరిన్ని నిధులు ఉండేలా చేస్తుంది. వీటికితోడు ఇటీవల పలు గృహోపకరణాలపై జీఎస్టీ రేట్ల తగ్గింపుతో వినియోగదారులు చేసే ఖర్చు కూడా పెరుగుతుంది. ఇది మా రంగంలో డిమాండ్ పెంచుతుంది.
– సునీల్ డిసౌజ, వర్ల్‌పూల్ ఇండియా ఎండీ

2030 నాటికి సమగ్ర ఆరోగ్య, చక్కని ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా ‘ఆరోగ్య భారత్’ లక్ష్యాన్ని బడ్జెట్లో పేర్కొనడం ఆసక్తికరం. అయితే, ఈ బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి నిధుల కేటాయింపును పెంచకపోవడం లోటు.
– అజాద్‌మూపెన్, ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ చైర్మన్

నూతన భారత్ కోసం ఉద్దేశించిన బడ్జెట్ ఇది. సమాజంలోని పలు వర్గాలకు సంబంధించి ప్రాధాన్యతల విషయంలో తాత్కాలిక ఆర్థిక మంత్రి సమతుల్యం పాటించారు. ఉద్యోగాల కల్పన, నైపుణ్య అంతరాలను భర్తీ అంశాలను పరిష్కరించేలా ఉంది. పన్ను మినహాయింపులు, తక్కువ ద్రవ్యోల్బణం దేశీయ డిమాండ్‌ను, వినియోగాన్ని పెంచుతాయి. దీంతో వ్యవస్థలో లిక్విడిటీ పెరుగుతుంది
– రితేష్ అగర్వాల్, ఓయో హోటల్స్

అద్భుతమైన బడ్జెట్. దేశంలో అతిపెద్ద వర్గమైన మధ్యతరగతి, రైతులకు, అవ్యవస్థీకృత రంగంలోని పనివారికి ఏదైనా చేసేందుకు ఆర్థిక మంత్రి ప్రయత్నించారు. అదే సమయంలో ద్రవ్యలోటు 3.4 శాతం స్థాయిలోనే కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నారు. ఇది ప్రజానుకూల బడ్జెట్. ఆర్థిక రంగానికి మేలు చేస్తుంది.
– అజయ్ సింగ్, స్పైస్‌జెట్ చైర్మన్, ఎండీ

స్టార్టప్‌ల్లో పెట్టుబడులపై ఏంజెల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని, జీఎస్‌టీ సంబంధించి మరింత స్పష్టత ఇవ్వాలన్న పరిశ్రమ విజ్ఞప్తులకు ఈ బడ్జెట్‌లో చోటు కల్పించలేదు. అయితే, తగిన చర్చల ద్వారా వీటిని పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం
– ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్

రెండు హెక్టార్ల భూమి (ఐదెకరాల్లోపు) ఉన్న రైతులకు ఏడాదికి రూ.6,000 ఇవ్వాలన్న పథకం లక్షలాది మంది పత్తి రైతులకు మేలు చేస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో పత్తి పంట దెబ్బతిన్నది. ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం వారికి చేయూతనిస్తుంది
– పి.నటరాజ్, చైర్మన్
సదరన్ ఇండియా మిల్స్ అసోసియేషన్

బడ్జెట్ ప్రకటనలు స్టీల్ రంగానికి మొత్తం మీద సానుకూలం. దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మధ్యంతర బడ్జెట్‌లోనూ చోటు కల్పించారు. రైల్వేలు, రోడ్లు, జలమార్గాలు వృద్ధికి కీలకం
– ఏకే చౌదరి, సెయిల్ చైర్మన్

2030 నాటికి వాహన కాలుష్య రహిత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని స్వాగతిస్తున్నాం. పర్యావరణ అనుకూల వాహనాల విషయంలో ప్రభుత్వం తొలిసారిగా తన నిబద్ధతను ప్రకటించింది. తాజా ప్రకటనతో ఈ రంగంలో అనిశ్చితి తొలిగినట్టయింది. ఫేమ్–2 ప్రకటన కోసం ఆతృతగా పరిశ్రమ ఎదురుచూస్తోంది.
– ఎన్.నాగసత్యం, ఈడీ, ఒలెక్ట్రా గ్రీన్‌టెక్

క్రెడిట్ నెగెటివ్ ...

ఆదాయం పెంచే ఎటువంటి విధానపరమైన నిర్ణయాలు లేకుండా అధిక ఖర్చులకు దారితీసే పలు చర్యలు ద్రవ్యోలోటు పెరిగేందుకు దారితీస్తాయి. ఇది సార్వభౌమ క్రెడిట్ రేటింగ్‌కు పెద్ద ప్రతికూలం. 2020లోనూ ద్రవ్యలోటు 3.4 శాతాన్ని చేరుకోవడం కష్టమే. వరుసగా ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోలేకపోవడాన్ని మేము క్రెడిట్ నెగెటివ్‌గానే చూస్తాం
– రేటింగ్ ఏజెన్సీ మూడీస్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	34,110	0
బంగారం (22 క్యారెట్లు)	32,490	0
వెండి (కిలో)	43,800	▼ 400
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	33,450	▲ 240
బంగారం (22 క్యారెట్లు)	31,860	▲ 230
వెండి (కిలో)	43,800	▼ 200
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	33,450	▲ 240
బంగారం (22 క్యారెట్లు)	31,860	▲ 230
వెండి (కిలో)	43,800	▼ 600
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	33,650	▼ 100
బంగారం (22 క్యారెట్లు)	31,210	0
వెండి (కిలో)	41,400	0
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	34,250	▲ 240
బంగారం (22 క్యారెట్లు)	31,860	▲ 230
వెండి (కిలో)	41,500	0
విజయవాడ		
బంగారం (24 క్యారెట్లు)	34,300	▲ 50
బంగారం (22 క్యారెట్లు)	31,400	▲ 100
వెండి (కిలో)	41,800	▲ 200
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	34,380	▲ 80
బంగారం (22 క్యారెట్లు)	31,860	▲ 130
వెండి (కిలో)	47,700	▲ 100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	54.94 (రాత్రి 11.30కు)	$53.79 (గురువారం ముగింపు)
బ్రెంట్	62.29 (రాత్రి 11.30కు)	$60.84 (గురువారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 02-02-2019

విశాఖ	395-00
చిత్తూరు	423-00
వరంగల్	397-00
చెన్నై	430-00
ముంబై	450-00
విజయవాడ	395-00
నమక్కల్	420-00
గోదావరి	395-00
01-01-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	395-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.55
బెంగళూరు	425-00
కోల్‌కత్త	426-00
ఢిల్లీ	412-00

ద్రవ్యబాటలో ఒడిదుడుకులు!



మార్కెట్ రుణ సమీకరణ రూ.4.48 లక్షల కోట్లు

మార్కెట్ నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.4.48 లక్షల కోట్ల రుణ సమీకరణ జరపనుందని ఆర్థికమంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. 2018–19 ఆర్థిక సంవత్సరం (రూ.4.47 లక్షల కోట్లు) రుణ సమీకరణకన్నా ఇది కొంచెం ఎక్కువ. నిజానికి 2018–19 ఆర్థిక సంవత్సరంలో 4.07 లక్షల కోట్ల మార్కెట్ రుణ సమీకరణలనే బడ్జెట్ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే నికరంగా ఈ పరిమాణం రూ.4.47 లక్షల కోట్లకు పెరిగినట్లు సవరిత అంచనాలు తెలిపాయి. ఇక స్థూలంగా చూస్తే రుణ పరిమాణం రూ.5.71 లక్షల కోట్ల నుంచి రూ.7.1 లక్షల కోట్లకు పెరిగింది. గడచిన రుణాల రీపేమెంట్లు కూడా స్థూల రుణాల్లో కలిసి ఉంటాయి. ఈ తరహా చెల్లింపులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2.36 లక్షల కోట్లు ఉంటాయని తాజా బడ్జెట్ పేర్కొంది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం– చేసే వ్యయం మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటును పూడ్చుకునే మార్గాల్లో ప్రభుత్వానికి మార్కెట్ నుంచి రుణ సమీకరణ ఒకటి. డేటెడ్ బాండ్లు, ట్రెజరీ బిల్లుల ద్వారా ఈ నిధుల సమీకరణ జరుగుతుంది.

కట్టుతప్పనున్న ద్రవ్యలోటు!



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు కట్టుతప్పనున్న విషయం స్పష్టమైపోయింది. 2018–19 ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 3.3 శాతంగా ద్రవ్యలోటు ఉండాలని వార్షిక బడ్జెట్ నిర్దేశించింది. విలువలో ఇది రూ.6.24 లక్షల కోట్లు. అయితే 2018 నవంబర్ పూర్తయ్యే నాటికే ఈ లోటు రూ.7.16 లక్షల కోట్లను తాకింది. అంటే లక్ష్యాని కన్నా మరో 15 శాతం ఎక్కువయిందన్న మాట. మెజారిటీ ఆర్థిక సంస్థలు, విశ్లేషణలకు అనుగుణంగానే ద్రవ్యలోటు అంచనాలు పెరగనున్నట్లు ఆర్థికమంత్రి తన తాజా బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం గమనార్హం. కాగా ద్రవ్యలోటును 2019–20 ఆర్థిక సంవత్సరంలో 3.4 శాతంగా కొనసాగించడానికి కేంద్రం కట్టుబడి ఉందని ఆర్థికమంత్రి తన ప్రసంగంలో తెలిపారు.

రైతులకు మద్దతు ఇవ్వకపోతే... అంచనాలకు అనుగుణంగానే!

‘‘2018–19 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును 3.3 శాతానికి కట్టడి చేయాలనే అనుకుంటున్నాం. అయితే రైతులకు ఆదాయ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాం. ఇందుకు సవరించిన అంచనాల్లో (2018–19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో) రైతులకు రూ.20,000 కోట్లను అందించాలని నిర్ణయించాం. 2019–20లో (బడ్జెట్ అంచనాలు) ఈ మొత్తం రూ.75,000 కోట్లుగా అంచనావేస్తున్నాం. అందువల్లే ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కొంత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నాం. ఈ మద్దతు కల్పించకపోతే, ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 3.3%, వచ్చే ఆర్థిక సంవత్సరం 3.1%గా ఉంటుంది’’ అని గోయెల్ పేర్కొన్నారు. 2020–21 నాటికి 3% లక్ష్యమన్నారు.

కరెంట్ అకౌంట్ లోటు 2.5 శాతం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కరెంట్ అకౌంట్ లోటు (ఎఫ్‌ఐఐ, ఎఫ్‌డీఐ, ఈసీబీలు మినహా దేశంలోకి వచ్చీ–పోయే విదేశీ మారకద్రవ్యం మధ్య నికర వ్యత్యాసం) జీడీపీలో 2.5 శాతం ఉంటుందని గోయెల్ బడ్జెట్ పేర్కొంది.

తగ్గిన పన్ను ఆదాయం

2018–19 ఆర్థిక సంవత్సరంలో స్థూల పన్ను ఆదాయం బడ్జెట్ అంచనాలకన్నా స్వల్పంగా రూ.23,067 కోట్లు తగ్గుతోంది. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్ల అంచనాలకన్నా తగ్గడం దీనికి కారణం.

జీడీపీలో స్థూల పన్ను వసూళ్లు 12.1 శాతానికి!

2019–20 ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో స్థూల పన్ను ఆదాయం 12.1 శాతానికి పెరుగుతుందని బడ్జెట్ అంచనావేసింది. 2020–21లో ఇది 12.2 శాతానికి చేరుతుందని పేర్కొంది.

లక్ష్యాలను దాటిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు



ప్రత్యక్ష పన్ను వసూళ్లు మాత్రం 2018–19 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాలను దాటడం గమనార్హం. బడ్జెట్ అంచనా రూ.11.50 లక్షల కోట్లయితే, అదనంగా మరో రూ.50,000 కోట్లతో మొత్తం రూ.12 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2019–20 ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యం రూ.13.80 లక్షల కోట్లు. ఈ విభాగంలో కార్పొరేట్, వ్యక్తిగత ఆదాయ పన్ను (పీఐటీ) ఉంటాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.7.60 లక్షల కోట్లను కార్పొరేట్ పన్నుగా, వ్యక్తిగత ఆదాయపు పన్నుల ద్వారా రూ.6.20 లక్షల కోట్లను సమీకరించాలన్నది బడ్జెట్ ప్రణాళిక. 2018–19లో ఈ మొత్తాలు వరుసగా 6.71 లక్షల కోట్లు, రూ.5.29 లక్షల కోట్లుగా ఉన్నాయి.

ఎస్‌బీఐ లాభం రూ.4,709 కోట్లు

- గత క్యూ3లో రూ.1,887 కోట్ల నికర నష్టాలు
- 21 శాతం వృద్ధితో రూ.22,691 కోట్లకు నికర వడ్డీ ఆదాయం
- ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార్ వెల్లడి



ముంబై: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.4,709 కోట్ల నికర లాభం(కన్సాలిడేటెడ్) సాధించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.1,887 కోట్ల నికర నష్టాలు వచ్చాయని ఎస్‌బీఐ తెలిపింది. కేటాయింపులు భారీగా తగ్గడం, రుణ నాణ్యత మెరుగుపడటం వల్ల భారీ నికర లాభం సాధించామని ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార్ వెల్లడించారు. మొత్తం ఆదాయం రూ.74,191 కోట్ల నుంచి రూ.84,350 కోట్లకు పెరిగిదన్నారు. స్టాండ్ లోన్ పరంగా చూస్తే, గత క్యూ3లో రూ.2,416 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.3,955 కోట్లకు పెరిగిందని వివరించారు. నికర వడ్డీ ఆదాయం 21 శాతం వృద్ధితో రూ.22,691 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. దీంతో నికర వడ్డీ మార్జిన్ 2.67 శాతం నుంచి 2.92 శాతానికి చేరిందన్నారు.

మెరుగుపడిన రుణనాణ్యత

ఈ క్వార్టర్లో నికర లాభం, వ్యాపార వృద్ధి, రుణ నాణ్యత.. ఇలా అన్ని అంశాల్లో అద్భుతమైన పనితీరు సాధించామని రజనీశ్ కుమార్ వెల్లడించారు. గత క్యూ3లో 10.35 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ3లో 8.71 శాతానికి తగ్గాయని తెలిపారు. నికర మొండి బకాయిలు 5.61 శాతం నుంచి 3.95 శాతానికి చేరాయని వివరించారు. మరికొన్ని మొండి బకాయిల రిజల్యూషన్ దాదాపు చివరి దశకు చేరిందని, ఇవి పరిష్కారమైతే స్థూల మొండి బకాయిలు 7 శాతానికి, నికర మొండి బకాయిలు 3 శాతానికి దిగివస్తాయని పేర్కొన్నారు. గత క్యూ3లో రూ.17,964 కోట్లుగా ఉన్న కేటాయింపులు ఈ క్యూ3లో రూ.14,144 కోట్లకు తగ్గాయని, అలాగే మొత్తం కేటాయింపులు కూడా మూడో వంతుకు తగ్గాయని వివరించారు.

10కి 9 మార్కులు: ఫ్యాప్సీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బడ్జెట్ బాగుందని ఫ్యాప్సీ అభివర్ణించింది. సమతుల బడ్జెట్ అని ఫ్యాప్సీ ప్రెసిడెంట్ అరుణ్ లుహారుకా అభిప్రాయపడ్డారు. 10కిగాను 9 మార్కులు ఇస్తున్నట్టు చెప్పారు. అన్ని రంగాలను ప్రోత్సహించేలా ఉందని సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కరుణేంద్ర జాస్తి తెలిపారు. రూ.5 లక్షల వార్షిక వేతనం వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వడం మధ్యతరగతికి పెద్ద ఊరట అని అన్నారు. జీఎస్‌టీ వసూళ్ళు పెరుగుతున్నాయి కాబట్టి బడ్జెట్ హామీల భారం పెద్దగా ఉండకపోవచ్చని చెప్పారు. పరిశ్రమలకు ఇప్పటికే పలు ప్రయోజనాలను ఈ ప్రభుత్వం అందిస్తోందని ఫ్యాప్సీ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రయోజనాలను కొనసాగించడం కూడా పెద్ద ఉపశమనమని వివరించారు.

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	338.45	338.65
ASIAN PAINT	1457.2	1412.6
AXIS BANK L	717.25	722.7
BAJAJ AUTO	2602.75	2554.55
BAJAJ FINSE	6096.95	6091.9
BAJAJ FINAN	2628.4	2574.85
BHARTI AIRT	311.85	306.4
BHARAT PETR	341	345.45
CIPLA LTD	521.35	517.3
COAL INDIA	223.2	224.65
EICHER MOTO	19663.4	19005.75
GAIL (INDIA	333.5	332.15
GRASIM INDU	718.95	721
HCL TECHNOL	1043.85	1005.2
HDFC LTD	1961.25	1922.35
HDFC BANK L	2090.45	2079.95
HERO MOTOCO	2807.25	2613.95
HINDALCO	211.4	208.5
HPCL	234	233.5
HUL	1799.3	1763.25
INDIABULLS	678.65	664.7
ICICI BANK	354.65	364.45
INDUSIND BA	1515.15	1505.55
BHARTI INFR	296.2	292.25
INFOSYS LIM	757.05	749.55
INDIAN OIL	137.2	136.85
ITC LTD	280.85	278.65
JSW STEEL L	274.95	274.6
KOTAK MAHIN	1255.7	1255.75
LARSEN & T	1324.6	1314.3
MAHINDRA &M	688.4	680.05
MARUTI SUZU	6962.3	6641.15
NTPC LTD	140.15	139.7
OIL AND NAT	141.8	141.25
POWER GRID	190.2	188.6
RELIANCE IN	1249.95	1227.15
STATE BANK	284.4	293.65
SUN PHARMAC	423.25	423.45
TATA MOTORS	181.65	181.2
TATA STEEL	474.7	476.7
TATA CONSUL	2029.95	2014.1
TECH MAHIND	746.6	731.9
TITAN COMPA	991.55	995.8
ULTRATECH C	3483.65	3519.35
UPL LIMITED	779.85	786.5
VEDANTA LIM	162.15	197.35
WIPRO LTD	371.55	369.2
YES BANK LI	185.6	194.1
ZEE ENTERTA	354.4	380.2

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ABB INDIA L	1272.2	1272.3
ADITYA BIRL	80.5	81
ACC LIMITED	1415.55	1423.35
AMBUJA CEME	212.5	209.9
ASHOK LEYLA	83.55	81.3
BANDHAN BAN	404.85	403.95
BANK OF BAR	111.1	112.45
BHARAT ELEC	84.6	83.65
BHEL	64.35	64.7
BIOCON LIMI	666.25	648.3
BOSCH LIMIT	19316.15	18851.7
BRITANNIA I	3251	3197.7
CADILA HEAL	323.6	318.95
COLGATE PAL	1293.45	1280.1
CONTAINER C	658.7	655.5
DABUR INDIA	451.85	443.65
DLF LIMITED	165.7	164.85
AVENUE SUPE	1442.95	1374.85
GENERAL INS	249.45	243.4
GODREJ CONS	710.65	709.3
HAVELLS IND	737.15	713.45
HDFC LIFE I	375.45	371.6
HINDUSTAN Z	254.7	260.2
ICICI LOMBA	880.1	880.25
ICICI PRU L	285.8	285.85
VODAFONE ID	30.9	30.1
INTERGLOBE	1174.1	1187.8
L&T FINANCE	130.3	131.45
LIC HOUSING	460.15	448.85
LUPIN LIMIT	883.1	875.7
MARICO LIMI	376.45	366.75
UNITED SPIR	544.4	539.8
MOTHERSON S	139.3	140.6
MRF LTD	61275.7	61289.2
NHPC LTD	25.4	25
THE NEW IND	175.6	174.85
NMDC LTD.	95.35	96.9
ORACLE FIN	3794.8	3801.05
OIL INDIA L	171.55	167.65
PIRAMAL ENT	2155.3	2032.45
PETRONET LN	221.1	227.65
P&G HYGIENE	9898.6	9908.75
PIDILITE IN	1122.8	1119.75
STEEL AUTHO	46.25	47
SBI LIFE IN	590.95	595
SHREE CEMEN	15782	15714.7
SIEMENS LTD	1031.1	1030.1
SHRIRAM TRA	1047.1	1015.35
SUN TV NETW	532.15	530.1

4న ఈసీతో విపక్షాల భేటీ

ఢిల్లీలో సమావేశమైన ప్రతిపక్ష నేతలు

న్యూఢిల్లీ: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) వినియోగం విషయంలో చర్చించేందుకు ప్రతిపక్ష పార్టీలు శుక్రవారం ఢిల్లీలో భేటీ అయ్యాయి. ఈ సమావేశం అనంతరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ..'లోక్‌సభ ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై విస్తృతంగా చర్చించాం. అలాగే దేశంలో నిరుద్యోగిత, వ్యవసాయం, రాజ్యాంగ వ్యవస్థలు, సంస్థలపై దాడిపై మరింత లోతుగా చర్చించేందుకు అన్నిపక్షాలు అంగీకరించాయి. ఈవీఎం ట్యాంపరింగ్ విషయంలో ప్రతిపక్ష పార్టీలన్నీ ఈ నెల 4న కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలుసుకుని తమ అభ్యంతరాలు, ఆందోళనల్ని తెలియజేస్తాయి'అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శరద్ పవార్(ఎన్సీపీ), ఒమర్ అబ్దుల్లా(నేషనల్ కాన్ఫరెన్స్), రామ్‌గోపాల్ యాదవ్(సమాజ్‌వాదీ పార్టీ), సతీశ్‌చంద్ర మిశ్రా(బీఎస్పీ), కనిమొళి(డీఎంకే), డెరెక్ ఓబ్రెయిన్(టీఎంసీ), డి.రాజా(సీపీఐ), టీకే రంగరాజన్(సీపీఎం), జయంత్ చౌదరి(ఆర్జేడీ)తో పాటు కాంగ్రెస్ నేతలు అహ్మద్ పటేల్, గులాంనబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, ఏకే ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ విమానం కూలి, ఇద్దరు పైలట్లు మృతి

బెంగళూరు: వైమానిక దళానికి చెందిన శిక్షణ విమానం కూలడంతో అందులో ఉన్న ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. బెంగళూరు సమీపంలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. మిరేజ్-2000 రకం శిక్షణ యుద్ధ విమానం గురువారం ఉదయం హెచ్ఏఎల్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అవుతుండగా కూలిపోయింది. దీంతో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించి మంటల్లో చిక్కుకుంది. మంటల నుంచి బయట పడేందుకు అందులో ఉన్న ఇద్దరు పైలట్లు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. సమీపంలోని అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చి, పైలట్లను రక్షించేందుకు యత్నించారు. అయితే, అప్పటికే ఒక పైలట్ సజీవ దహనం కాగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు. మృతులను ఎయిర్‌క్రాఫ్ట్ అండ్ సిస్టమ్స్ టెస్టింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగానికి చెందిన స్క్వాడ్రన్ లీడర్ సమీర్ అబ్రాల్, స్క్వాడ్రన్ లీడర్ సిద్ధార్థ నేగిగా గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు వైమానిక దళం అధికారి తెలిపారు.

సీబీఐ డైరెక్టర్‌ను ఎందుకు నియమించలేదు?

కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)కు పూర్తిస్థాయి డైరెక్టర్‌ను ఇంతవరకూ ఎందుకు నియమించలేదని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఇంతకాలం సీబీఐకి పూర్తిస్థాయిలో డైరెక్టర్‌ను నియమించకపోవడంపై తాము సంతృప్తిగా లేమని ధర్మాసనం స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సీబీఐకి పూర్తిస్థాయి డైరెక్టర్‌ను నియమించి ఉండాల్సిందని వ్యాఖ్యానించింది. సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వరరావు నియామకాన్ని సవాలుచేస్తూ ఎన్జీవో సంస్థ 'కామన్ కాజ్'దాఖలు చేసిన పిల్‌పై జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ నవీన్ సిన్హాల ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ స్పందిస్తూ.. సీబీఐ కొత్త డైరెక్టర్ నియామకం కోసం ప్రధాని మోదీ నేతృత్వంలో హైపవర్డ్ కమిటీ శుక్రవారం భేటీ అవుతుందని తెలిపారు. ఈ కమిటీ అనుమతితోనే కేంద్రం నాగేశ్వరరావుకు సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగించిందన్నారు. దీంతో ఈ కేసు విచారణను ఫిబ్రవరి 6కు వాయిదా వేస్తున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. కామన్ కాజ్ పిటిషన్‌పై స్పందిస్తూ.. తొలుత కొత్త సీబీఐ డైరెక్టర్ నియామకం జరగనివ్వాలనీ, ఆ తర్వాత ఎంపిక ప్రక్రియ, అభ్యర్థి గుణగణాలపై అభ్యంతరాలు ఉంటే సవాలు చేసుకోవచ్చని ధర్మాసనం సూచించింది.



అమెరికాలో ఎప్పుడూ జలజలా పారే నయాగరా జలపాతం.. చలితీవ్రతకు సాక్ష్యంలా ఇలా మంచుకొండలా మారింది

130 మంది విద్యార్థుల అరెస్టు

- అమెరికాలో నకిలీ వర్సిటీ కేసులో పట్టుకున్న పోలీసులు
- వారిలో అత్యధికులు భారతీయులే
- బూటకపు వర్సిటీ అని విద్యార్థులకు తెలీదంటున్న న్యాయవాదులు

వాషింగ్టన్: అమెరికా వీసా మోసం కేసులో 130 మంది విద్యార్థులు అరెస్టయ్యారు. వీరిలో అత్యధికులు భారతీయులే. అధికారులు వల పన్ని ఏర్పాటు చేసిన ఫార్మింగ్‌టన్ యూనివర్సిటీ నకిలీదని తెలిసినప్పటికీ అమెరికాలో ఉండి అక్రమంగా ఉద్యోగాలు చేసుకునేందుకే ఈ విద్యార్థులంతా ఆ విశ్వవిద్యాలయంలో చేరారని వలస విభాగం అధికారులు ఆరోపణలు నమోదు చేశారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం ఉదయమే వీరందరినీ అరెస్టు చేశారు. మరికొంత మంది కూడా అరెస్టయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే ఫార్మింగ్‌టన్ యూనివర్సిటీ చట్టబద్ధమైన రీతిలో పనిచేయడం లేదనే విషయం విద్యార్థులకు తెలియదనీ, చాలా కోర్సులు/యూనివర్సిటీల్లో చదువుతోపాటే ఉద్యోగాలు చేసుకునే వెసులుబాటు ఉండటంతో ఇది కూడా నిజమైన యూనివర్సిటీనే అని ఆ విద్యార్థులు భావించారని వారి తరఫు న్యాయవాదులు అంటున్నారు. అధికారులే ఇబ్బందికర పద్ధతుల ద్వారా, వల విసిరి విద్యార్థులను పట్టుకున్నారని లాయర్లు ఆరోపించారు. అమెరికాలో విద్యార్థి వీసాలపై అక్రమంగా ఉంటూ ఉద్యోగాలు చేసుకుంటున్న విదేశీయులను పట్టుకునేందుకు ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ (ఐసీఈ) అధికారులు ఫార్మింగ్‌టన్ పేరుతో నకిలీ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం తెలిసిందే. ఈ వలలో చిక్కిన 8 మంది మధ్యవర్తులు (అందరూ తెలుగు వారే) ఇప్పటికే అరెస్టవ్వగా, తాజాగా 130 మంది విద్యార్థులు కూడా అరెస్టయ్యారు. 8 మందిపై వీసా సంబంధిత నేరపూరిత కుట్ర, లాభం కోసం అన్యులకు ఆశ్రయమివ్వడం తదితర అభియోగాలను నమోదు చేసిన అధికారులు, విద్యార్థులపై మాత్రం కేవలం పౌర వలస నిబంధనల ఉల్లంఘన అభియోగంతో సరిపెట్టారు.

వారికేం తెలియదు: న్యాయవాదులు

ఫార్మింగ్‌టన్ యూనివర్సిటీలో తరగతులు జరగవు, సిబ్బంది ఉండరనే విషయం అందులో చేరిన విద్యార్థులకు ముందే తెలుసుననీ, కేవలం అమెరికాలో ఉండి ఉద్యోగాలు చేసుకోవాలన్న ఉద్దేశంతోనే వారు ఆ యూనివర్సిటీలో చేరారని దర్యాప్తు అధికారులు అంటున్నారు. కానీ ఇలా చదువుతున్నప్పుడే ఉద్యోగాలు చేయడం మామూలే కాబట్టి విద్యార్థులు ఇది కూడా అలాంటిదే అనుకున్నారనీ, ఇందులో వారి తప్పేమీ లేదని విద్యార్థుల తరఫు న్యాయవాదులు వాదిస్తున్నారు. మైకేల్ సోఫో అనే న్యాయవాది మాట్లాడుతూ 'కోర్సులో చేరిన తొలి రోజు నుంచే ప్రయోగాత్మక శిక్షణను ప్రారంభించి, మిగిలిన సమయంలో ఉద్యోగాలు చేసుకునే యూనివర్సిటీలు ఉన్నాయి. యూనివర్సిటీకి రాకుండా ఎంతో దూరంలో ఉండి, ఉద్యోగాలు చేసుకుంటూ కూడా ఆ కోర్సులు చేయొచ్చు. ఇది కూడా అలాంటిదేనని ఆ విద్యార్థులు భావించారు' అని చెప్పారు. రవి మన్నం అనే మరో న్యాయవాది మాట్లాడుతూ ప్రభుత్వమే అభ్యంతరకర, ఇబ్బందికరమైన పద్ధతుల్లో విదేశీ విద్యార్థులను చేర్చుకుందని అన్నారు. అమెరికాలోని రాయబార కార్యాలయం, కాన్సుల్ జనరళ్లు, భారత సంఘాలు తదితరాల ద్వారా అరెస్టయిన, మోసపోయిన విద్యార్థులకు సాయం అందించే ప్రయత్నాలను తాము ప్రారంభించామని విదేశాంగ శాఖ తెలిపింది.

మాఫియా డాన్ రవి పుజారి అరెస్ట్

భారత్‌కు తీసుకురానున్న అధికారులు

ముంబై: భారత అధికారులకు గత 15 ఏళ్లుగా దొరక్కుండా తిరుగుతున్న మాఫియా డాన్ రవి పుజారి ఎట్టకేలకు దొరికాడు. ఆఫ్రికా దేశమైన సెనెగల్ రాజధాని డకార్‌లో పోలీసులు పుజారీని జనవరి 22న అరెస్ట్ చేశారు. ఈ విషయమై ముంబై పోలీస్ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ.. పుజారి అనుచరులు విజయ్ రోడ్రిక్స్, ఆకాశ్ శెట్టిలను ఇటీవల ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. వీరిని విచారించగా, పుజారి సెనెగల్‌లో తలదాచుకుంటున్నట్లు తేలిందన్నారు. భారత అధికారులు ఇచ్చిన సమాచారంతో సెనెగల్ పోలీసులు ఈ మాఫియా డాన్‌ను అరెస్ట్ చేశారని వెల్లడించారు. బిల్డర్లు, సినీ ప్రముఖులను డబ్బుల కోసం ఈ గ్యాంగ్ బెదిరిస్తుందన్నారు. పుజారిని భారత్‌కు తీసుకొచ్చే ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కర్ణాటకకు చెందిన పుజారిపై డజనుకుపైగా హత్య, బెదిరింపుల కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. తొలుత ఛోటారాజన్, దావూద్ ఇబ్రహీంతో కలిసి పనిచేసిన పుజారి.. ఆ తర్వాత సొంత గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకున్నాడని తెలిపారు.

ఐఎన్ఎఫ్ నుంచి వైదొలుగుతున్నాం: అమెరికా

వాషింగ్టన్: రష్యాతో కుదుర్చుకున్న ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి ఐఎన్ఎఫ్ (ఇంటర్మీడియట్-రేంజ్ న్యూక్లియర్ ఫోర్సెస్) ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్లు అమెరికా శుక్రవారం ప్రకటించింది. ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించి రష్యా క్షిపణులను తయారు చేసినందునే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మైక్ పాంపియో చెప్పారు. వైదొలిగే ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమై ఆర్నెల్లు కొనసాగుతుందనీ, ఆలోపు రష్యా తాను తయారు చేసిన ఆయుధాలను నాశనం చేసి చర్చలకు రావాలని కోరారు. '30 ఏళ్లకుపైగా ఈ ఒప్పందానికి అమెరికా కట్టుబడి ఉంది. కానీ రష్యా ఉల్లంఘనలకు పాల్పడుతున్నప్పుడు మేం కూడా ఈ ఒప్పందం నుంచి బయటకొస్తాం'అని పాంపియో తెలిపారు. ఈ 6 నెలల్లోపు రష్యా తన ఆయుధాలను నాశనం చేసి ఒప్పందానికి కట్టుబడుతుందని తాము భావిస్తున్నామన్నారు.

రాష్ట్రంలో నేడు, రేపు పొడి వాతావరణం

సాక్షి, హైదరాబాద్: ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నందున రాష్ట్రంలో శని, ఆదివారాల్లో పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఇదిలా ఉండగా 24 గంటల్లో మెదక్‌లో అత్యంత తక్కువగా 10 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, ఆదిలాబాద్‌లో 11 డిగ్రీలు రికార్డు అయింది.

'లోక్‌సభ' జాబితాను 20లోగా పంపండి

రాష్ట్రాల ఎన్నికల కమిటీలకు కాంగ్రెస్ అధిష్టానం నిర్దేశం
ఎంపిక బాధ్యతల నుంచి స్క్రీనింగ్ కమిటీల తొలగింపు

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లను కాంగ్రెస్ వేగవంతం చేసింది. ఈనెల 20వ తేదీలోగా అభ్యర్థుల జాబితా పంపాలని అన్ని ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ)లకు శుక్రవారం సర్క్యులర్ జారీ చేసింది. అయితే, ఈసారి స్క్రీనింగ్ కమిటీలకు బదులు ప్రత్యేక కమిటీలకు ఎంపిక బాధ్యతలు అప్పగించింది. గతంలో ఎన్నికలప్పుడు రాష్ట్రాల స్థాయిలో స్క్రీనింగ్ కమిటీలే అభ్యర్థులను ఎంపిక చేసి ఏఐసీసీకి పంపించేవి. తాజాగా ఈ విధానానికి స్వస్తి చెప్పారు. లోక్‌సభ అభ్యర్థుల పేర్లతో కూడిన జాబితాను ముందుగా ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీసీసీ)లు రూపొందించి రాష్ట్ర స్థాయిలోని ప్రత్యేక కమిటీలకు అందజేస్తాయి. ఈ కమిటీల్లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి లేదా ఆ రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి, రాష్ట్ర పీసీసీకి కేటాయించిన ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేత సభ్యులుగా ఉంటారు. వీరు పీసీసీ జాబితాను పరిశీలించి అవసరమైన మార్పులు చేర్పులతో ఏఐసీసీ స్థాయిలోని కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ)కి పంపుతారు. రాష్ట్రాల స్థాయిలో కీలకమైన పార్టీ బాధ్యతలను నెరవేర్చేవారు, విధాన నిర్ణయాలను అమలు చేసేవారికి ఎంపికలో బాధ్యతలు అప్పగిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని రాహుల్ భావిస్తున్నారు. దీనివల్ల అభ్యర్థుల ఎంపిక సత్వరం పూర్తవడంతోపాటు, వారు ఎన్నికల ప్రచారాన్ని ముందుగానే ప్రారంభించేందుకు కూడా సమయం దొరుకుతుందని తెలిపారు. అయితే, ముఖ్యమైన విధానపర నిర్ణయాల్లో కాంగ్రెస్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పాత్ర కీలకంగా మారింది. కేరళ నుంచి లోక్‌సభకు ఎన్నికైన వేణుగోపాల్ అన్ని పీసీసీల్లోనూ సభ్యుడే. అదేవిధంగా కర్ణాటక పార్టీకి ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కూడా. రాహుల్ గాంధీకి వేణుగోపాల్ అత్యంత సన్నిహితుడిగా ఉంటూ ఆయన ఆదేశాల అమలు బాధ్యతలను చూస్తున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు గెలిచే అభ్యర్థుల జాబితా తయారీతోపాటు, ఇతర వివరాలను ఇప్పటికే రాహుల్ గాంధీ తీసుకుంటున్నారని సమాచారం. కొన్ని రాష్ట్రాల్లో కుల సమీకరణాలు, బాగా పరిచయం ఉన్న వ్యక్తులు, వారి గెలుపోటములపై సొంతంగా సర్వేలు కూడా చేయించినట్లు తెలుస్తోంది.

అసంపూర్తిగా ముగిసిన 'సీబీఐ చీఫ్ ఎంపిక' సమావేశం

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)కు కొత్త చీఫ్‌ను ఎంపికచేసేందుకు ఏర్పాటైన అత్యున్నత స్థాయి మండలి సమావేశం శుక్రవారం ఎలాంటి తుది నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. ప్రధాని మోదీ నేతృత్వం లోని ఏర్పాటైన ఈ ప్యానెల్ సమావేశానికి ప్రధానితోపాటు ప్యానెల్ సభ్యులైన సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్, లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే హాజరయ్యారు. ఢిల్లీలో ప్రధాని నివాసంలో జరిగిన ఈ సమావేశంలో మధ్యప్రదేశ్ క్యాడర్ 1983 బ్యాచ్ మహిళా సీనియర్ ఐపీఎస్ అధికారిణి రీనా మిత్రా సహా ఐదుగురి పేర్లు పరిశీలనకు వచ్చినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792



వెబ్ ఫ్లిక్స్

ప్రేమ.. పగ.. యుద్ధం

21 సర్ఫ్‌రోష్ - సారాగఢి 1897

ప్రేమతో ఈ కథ మొదలవదు. పగతోనూ ప్రారంభం అవదు. సామ్రాజ్య విస్తరణ కాంక్షతో ప్రపంచాన్ని పంచుకు తినాలని ఉవ్విళ్లూరే రెండు శక్తులైన బ్రిటన్, రష్యాల మధ్య ఆధిక్యపోరులో.. బ్రిటన్ క్రమంగా ఆఫ్ఘనిస్తాన్ వరకు వ్యాపిస్తుంది. ఆఫ్ఘన్ రాజ్యాన్ని చేజిక్కించుకునేందుకు యువకులైన భారత సిపాయిలను సైన్యంలోకి తెమ్మని ఒక హవల్దార్‌ను నియమిస్తుంది. ఇక అక్కడి నుంచి ప్రేమ, పగ, ప్రతీకారం, మోసం, సాహసం, కుయుక్తి, కుట్ర, పన్నాగం.. కథను నడిపిస్తాయి. వీరులైన 21 మంది సిక్కు సిపాయిలు కథను పరుగులు తీయిస్తారు.

ప్రారంభం

1897. ఆసియాలో పెత్తనం కోసం బ్రిటన్, రష్యాల మధ్య పోటీ పరాకాష్టకు చేరిన సమయం. అప్పటికే రష్యా మధ్యాసియాలో పాగా వేసింది. ఇటు బ్రిటిష్ సామ్రాజ్యం కూడా అఫ్గానిస్తాన్ సరిహద్దుల దాకా వ్యాపించింది. లఖార్ట్, గులిస్తాన్ కోటలను అవుట్‌పోస్ట్‌లుగా చేసుకుంది. వీటికి ఆధిపత్యం వహిస్తుంటారు.. కల్నల్ హఫ్టన్, మేజర్ చార్ల్స్ డేస్ వోక్స్. ఈ హద్దులకు ఆవల ఉన్న అఫ్గాన్ ప్రాంతాన్నీ ఆక్రమించుకోవాలని చూస్తుంటారు. అందుకు సారాగఢిని బేస్‌గా చేసుకుంటారు. అఫ్గాన్‌తో యుద్ధం చేయడానికి ఊళ్లోని బలవంతులైన యువకులను తీసుకురావల్సిందిగా భారత సిపాయి హవల్దార్ ఇషార్ సింగ్ (మోహిత్ రైనా)ను ఆజ్ఞాపిస్తారు. ఆ ప్రయత్నం కోసం సొంత ప్రాంతానికి వస్తాడు ఇషార్ సింగ్ మరో సిపాయితో కలిసి.

ప్రతీకారం

అప్పటికే పెళ్లయ్యిన్న ఇషార్ సొంతూరితో పాటు అత్తగారి ఊరు, చుట్టుపక్కల ఊళ్లూ తిరుగుతుంటాడు.. సైన్యంలో చేరేందుకు ఆసక్తిగా ఉన్న యువకులను వెదుకుతూ. అత్తగారి ఊళ్లో బల్వీందర్ సింగ్ ఎదురుపడ్తాడు. సైన్యంలో చేరమని కోరుతాడు. అప్పటికే బల్వీందర్.. ఇషార్ సింగ్ మీద పగతో రగిలిపోతుంటాడు. తాను ఇష్టపడ్డ సోనీని ఇషార్ సింగ్ పెళ్లి చేసుకున్నందుకు. అయితే సోనీ .. బల్వీందర్‌నేమీ ఇష్టపడదు. పైగా అసహ్యించుకుంటుంది కూడా. ప్రేమ, పెళ్లి అంటూ వెంటబడ్డందుకు. ఇవన్నీ మనసులో పెట్టుకున్న బల్వీందర్.. సైన్యంలో చేరమని అడిగిన ఇషార్‌ను అవమానపరుస్తాడు. ''పరాయి పాలకులకు నువ్వు గులామ్‌గిరి చేస్తున్నది కాక.. మమ్మల్ని చేయమని అడుగుతున్నావా?'' అంటూ. అయితే బల్వీందర్‌సింగ్ స్నేహితుడు బల్వీందర్‌సింగ్‌కి ఓ సలహా ఇస్తాడు.. ''ఇలా మాటలతో కాకుండా ఇషార్ మీద నిజంగా కక్ష తీర్చుకోవాలంటే అతను చెప్పినట్టే సైన్యంలో చేరి సమయం దొరికినప్పుడు ఇషార్‌ను చంపేయ్'' అని. ఆ మాట నచ్చుతుంది బల్వీందర్‌కి. సైన్యంలో చేరడానికి ఒప్పుకుంటాడు. చాలా ప్రయాసపడి ఇంకొంత మందినీ ఒప్పించి తీసుకెళ్తాడు ఇషార్‌సింగ్. వాళ్లంతా సిక్కులే.

మోసం

మొత్తానికి 21 మంది సిక్కు వీరులతో ఒక క్యాంప్ తయారవుతుంది. వీళ్లు సార్‌టాప్, సారాగఢి చూసుకుంటూంటారు. యుద్ధం కోసం వీళ్లకు శిక్షణ ప్రారంభించబోతుండగా ఒకరోజు ఒకముస్లిం వనిత పరిగెత్తుకుంటూ వస్తుంది ఆ కోటలోకి. ''ఇక్కడికి దగ్గర్లో ఉన్న కబేలా (తండా లాంటిది)లో ఉంటున్నాం. మా అక్క గర్భవతి. నొప్పులతో బాధపడుతోంది. మీ దగ్గర డాక్టర్ ఉన్నాడని తెలిసి వచ్చాను. కొంచెం సాయం చేయండి. కాదనకండి'' అంటూ ప్రాధేయపడ్తుంది.

కల్నల్ హఫ్టన్ భార్య తమ దగ్గరున్న డాక్టర్‌తో పాటు ఆయా థెరిసానూ పంపిస్తుంది. వీళ్లు వెళ్లాక కాని అర్థం కాదు అది మోసమని. హఫ్టన్ ఏ ప్రాంతాన్నయితే కైవసం చేసుకోవాలని చూస్తున్నాడో ఆ ప్రాంతపు ఏలిక గుల్ బాద్షా పన్నిన కుట్ర అది. డాక్టర్‌ను, థెరిసాను బంధిస్తాడు. వాళ్ల కోసం బ్రిటిష్ సేనలు వస్తే యుద్ధం చేయాలని తయారుగా ఉంటాడు. వేగుల ద్వారా ఈ విషయం హఫ్టన్ క్యాంప్‌కి తెలుస్తుంది. వెంటనే ఎదురుదాడికి వెళ్లి డాక్టర్‌ని, థెరిసాను విడిపించుకురావాలని ఆవేశపడ్తాడు గురుముఖ్‌సింగ్ అనే సైనికుడు. సంయమనం పాటించమంటాడు ఇషార్ సింగ్. థెరిసా.. గురుముఖ్‌ను ఇష్టపడ్తుంటుంది. ఇషార్ సింగ్ మాటవినకుండా, హఫ్టన్ అనుమతి లేకుండా ఒక్కడే బయలుదేరుతాడు గురుముఖ్.

సాహసం

ఒడుపుగా గుల్‌బాద్షా కోటలోకి వెళ్లి, చాకచక్యంగా డాక్టర్‌ను, థెరిసాను విడిపించి బయటకు తీసుకొస్తాడు గురుముఖ్. దాన్ని గుల్‌బాద్షా పసిగట్టడమే కాదు తమ సరిహద్దు దాటేలోపలే వాళ్లను పట్టుకుంటాడు కూడా. గురుముఖ్‌ను గుల్‌బాద్షా తుపాకితో కాల్చబోతుంటే డాక్టర్ అడ్డుపడ్తాడు. దాంతో డాక్టర్‌కు తుపాకి గుండు తగిలి నేలకొరుగుతాడు. ఈ గొడవలో థెరిసాను తీసుకుని అక్కడి నుంచి తప్పించుకుంటాడు గురుముఖ్. అక్కడ క్యాంప్ నుంచి హెన్రీ మెయిన్ అనే సైనికాధికారి, ఇషార్‌సింగ్, బల్వీందర్ సింగ్ వస్తారు గుల్ బాద్షా మీద దాడికి. దార్లో తూటా తగిలి పడి ఉన్న డాక్టర్ కనపడ్తాడు వీళ్లకు. పరిస్థితి అర్థమవుతుంది. డాక్టర్‌ను తీసుకొని క్యాంప్‌కి తిరిగి వెళ్లమని ఇషార్‌సింగ్‌కు ఆర్డర్ వేస్తాడు హెన్రీ. హతాశుడవుతాడు ఇషార్ సింగ్. బదులు చెప్పలేక అయిష్టంగానే వెనుదిరుగుతాడు ఇషార్.

కుయుక్తి

థెరిసాతో తప్పించుకున్న గురుముఖ్ స్థానిక గిరిజన ముస్లిం కబేలాకు చేరుతాడు. అప్పటికే థెరిసా కాలుకి గాయమవుతుంది. కబేలా పెద్దను వైద్య సహాయం కోరుతాడు. వైద్యం చేయడానికి గుడారంలోకి తీసుకెళ్తారు వాళ్లను. ఇంతలోకే ఓ వైపు నుంచి గుల్‌బాద్షా, ఇంకో వైపు నుంచి హెన్రీ మెయిన్ వాళ్లు ఆ గుడారంలోకి వస్తారు. గుల్‌బాద్షాను చూస్తాడు గురుముఖ్. ప్రమాదాన్ని గ్రహించి థెరిసాను అక్కడినుంచి పంపించేస్తాడు. ఆ క్రమంలోనే గుడారాలకు బల్వీందర్ నిప్పు పెడ్తూండడం చూస్తాడు గుర్‌ముఖ్. అతను అయోమయంలో ఉండగానే గుల్‌బాద్షా, అతని అనుచరులు ఓ గుడారంలోంచి తప్పించుకుపోవడాన్ని చూస్తాడు బల్వీందర్, ఇటు గురుముఖ్ కూడా. గుల్‌బాద్షా తప్పించుకుపోతూ అవతలివైపున ఉన్న హెన్రీకి స్నేహపూర్వకంగా చేయి ఊపడమూ గమనిస్తాడు బల్వీందర్.

కుట్ర

థెరిసా, గురుముఖ్, హెన్రీ, బల్వీందర్ క్యాంప్‌కి చేరుతారు. బల్వీందర్ ఆ కబేలాకు నిప్పుపెట్టడాన్ని మర్చిపోలేక ఆ సంగతిని గురుముఖ్.. ఇషార్‌కూ చెప్తాడు. అతనికీ బల్వీందర్ చర్యలోని ఆంతర్యం బోధపడదు. దాంతో బల్వీందర్‌ను నిలదీస్తాడు ఇషార్‌సింగ్. అయినా బల్వీందర్ పెదవి విప్పడు సరికదా.. ఇషార్‌ను చంపే అవకాశం పోయినందుకు రుసరుసలాడుతుంటాడు. హెన్రీ మాటలు, చేతల మీదా అనుమానం వస్తుంది ఇషార్‌కు. అతని మీద కన్నేసి ఉంచుతాడు. ఇదిలా సాగుతుండగానే క్యాంప్‌లోని పావురాల గుంపులోకి ఓ కొత్త పావురం చేరుతుంది. అది ఉత్తరాలను మోసేది అని తెలుస్తుంది ఓ సిపాయికి. ఇషార్ దృష్టికి తీసుకొస్తాడు. ఆ విషయం తెలిసిన హెన్రీ.. తుపాకిని పేల్చి ఆ పావురం ఎగిరిపోయేలా చేస్తాడు. దీంతో హెన్రీ మీద అనుమానం బలపడ్తుంది ఇషార్‌కు. బల్వీందర్‌ను అదుపులోకి తీసుకుని ఆ క్యాంప్‌లో న్యాయ విచారణ చేపడితే గుల్‌బాద్షాకు హెన్రీ ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నాడని తెలుతుంది. కబేలాలో గుల్ బాద్షా తమ చేతికి చిక్కేవాడని బందీగా తెచ్చేవాళ్లమని.. బల్వీందర్ నిప్పు పెట్టడం వల్లే తప్పించుకుపోయాడని గురుముఖ్ చేసిన ఆరోపణ మీద ఈ విచారణంతా సాగుతుంది. హెన్రీ.. ఐర్లాండ్ దేశస్థుడు. బ్రిటన్ మీద కోపంతో ఉంటాడు. గుల్ బాద్షాకు స్పైగా మారి బ్రిటన్ మీద కసితీర్చుకోవాలనుకుంటాడు. ఒకసారి క్యాంప్‌లో బల్వీందర్ ఓ నాటు బాంబును ఇషార్ మీదకు విసరబోతుంటే హెన్రీ పట్టుకుంటాడు. ఈ నిజం బయటపెడితే మరణ శిక్ష అని భయపెట్టాడు బల్వీందర్‌ను. బతిమాలుకున్న బల్వీందర్‌తో బేరం కుదుర్చుకుంటాడు. అతని తప్పును కాయాలంటే తను ఎప్పుడు ఏ పని చెబితే ఆ పని చేయాలని. అలా మాట ప్రకారమే కబేలా నుంచి గుల్ బాద్షాను తప్పించడంలో హెన్రీకి ఉపయోగపడ్డాడు బల్వీందర్. ఇవన్నీ సాక్ష్యాధారాలతో రుజువై హెన్రీకి శిక్ష పడ్తుంది.

పన్నాగం

తగలబడిపోయిన కబేలా.. ఇటు భారత్, అటు అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లో లేని స్వతంత్ర ప్రాంతం. కబేలా తగలబడిందని న్యాయం కోసం అఫ్గానిస్తాన్ రాజు దగ్గరకు వస్తారు కబేలా వాసులు. అప్పుడు రాజు హఫ్టన్‌కు, గుల్‌బాద్షాకు లేఖలు పంపిస్తాడు రావాల్సిందిగా. ఇద్దరూ వస్తారు. అతని ఆస్థానంలోనే తమ సైనికాధికారితో కలిసి గుల్‌బాద్షా చేసిన కుట్ర గురించి రాజుకు చెప్తాడు హఫ్టన్. గుల్ బాద్షాను మందలించి, ఇక్కడితోనైనా యుద్ధాలోచనలు మాని సంధి చేసుకొమ్మని హితవు చెప్తాడు అఫ్గాన్ రాజు. సంధికి సరే అంటాడు గుల్‌బాద్షా. ఆ శుభ సందర్భంగా ఆ రోజు రాత్రి విందును ఏర్పాటు చేస్తాడు అఫ్గాన్ రాజు. సరదాగా ఓ ఆట ఆడుదామని మల్లయుద్ధ పోటీ పెట్టి, బరిలోకి ఇషార్‌ను ఆహ్వానించి ఓడిస్తాడు గుల్‌బాద్షా. అంతేకాదు సిగార్‌లో పేలుడు పదార్థం పెట్టి హఫ్టన్‌ను హతమార్చడానికి ప్రయత్నిస్తాడు. దీన్ని భగ్నంచేసి అఫ్గాన్ రాజు దృష్టికి తీసుకెళ్తాడు ఇషార్. వీళ్ల ముందు ఆ రాజు.. గుల్‌బాద్షాకు మరణ శిక్ష విధించి, బంధించి హఫ్టన్ వాళ్లు వెళ్లిపోయాక.. బ్రిటన్ ఆక్రమిత సారాగఢ్ మీదకు ఎలా దండెత్తాలో ఉపాయం చెప్తాడు గుల్‌బాద్షాకు.

ముగింపు

1897..సెప్టెంబర్ 12. అఫ్గానిస్తాన్ నుంచి వచ్చాక.. సారాగఢిలోని 21 మంది సిక్కులకు శిక్షణను ముమ్మరం చేయాలని నిర్ణయానికి వస్తారు హఫ్టన్, ఇషార్‌లు. ఆ 21 మందికున్న ప్రత్యేకతలన్నిటినీ పరీక్షించి.. తర్ఫీదు ఆరంభిస్తాడు ఇషార్. ఈలోపే అఫ్గాన్ రాజు ఇచ్చిన సలహా ప్రకారం.. ఆ ప్రాంతంలోని ఒరక్‌జై అనే గిరిజన తెగలోని పదివేల మంది సహాయంతో సారాగఢి మీదకు దండెత్తుతాడు గుల్ బాద్షా. అప్పటికి ఈ 21 మంది సిక్కు జవాన్లు యుద్ధానికి సన్నద్ధంగా ఉండరు. అయినా వచ్చిన ఉపద్రవాన్ని ఎదుర్కోవడానికి సిద్ధపడ్తారు. జట్లుగా విడిపోయి పదివేల మంది గిరిజనులను అడ్డుకోవడానికి తుపాకులను, కత్తులను, బాంబులను సిద్ధం చేసుకుంటారు. ఉదయం తొమ్మిది గంటలకు మొదలై రాత్రి వరకు సాగుతుంది యుద్ధం. సారాగఢి .. గుల్‌బాద్షా వశం కాకుండా చివరి శ్వాస వరకూ పోరాడుతారు సిక్కులు. ఇషార్ నాయకత్వం వహించిన ఆ సైన్యం.. 180 మంది ప్రత్యర్థులను నేలకొరిగిస్తుంది. గుల్‌బాద్షా కూడా మరణిస్తాడు. ఇదీ కథ. నెట్‌ఫ్లిక్స్‌లో ఉంది.

– సరస్వతి రమ

హవిల్దార్ ఇషార్‌సింగ్ భార్య సోనీ (నటి సమీక్ష). ఈ అమ్మాయినే బల్వీందర్ చేసుకోవాలనుకుంటాడు. కానీ సోనీకి బల్వీందర్ అంటే ఇష్టం ఉండదు. ఇషార్‌ను చేసుకుంటాడు. ఆ కక్షతో ఇషార్‌ను చంపేందుకు సైన్యంలో చేరతాడు బల్వీందర్.



విశేష పరిశోధన

ఇడ్లీ – ఉప్మా – దోక్లా... మూడేళ్లుంటాయి!

రేడియేషన్ సమీపానికి వెళ్లాలంటే అందరికీ భయం. కానీ రేడియేషన్‌తో ఇప్పటి వరకు ఉన్న లాభాలే కాకుండా, కనీవినీ ఎరుగని రీతిలో మరొక అత్యంత కీలకమైన ప్రయోజనాన్నీ కనుగొన్నారు ముంబై యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ వైశాలి బంబోలి. ముంబై యూనివర్సిటీ క్యాంపస్‌లోని బయో నానో ఫిజిక్స్ లాబ్‌లో గత ఐదేళ్లుగా పరిశోధనలు జరిపి ఆమె ఈ విషయాన్ని కనుగొన్నారు!


ప్రొఫెసర్ వైశాలి

ఉదయం వండిన వంటకాలు రాత్రి తినాలంటే ముఖం చిట్లించుకుంటాం. అయితే వాటిని రేడియేషన్ ద్వారా ఏకంగా వెయ్యి రోజులు.. అంటే సుమారు మూడు సంవత్సరాల పాటు తాజాగా ఉంచవచ్చని ప్రొఫెసర్ వైశాలి కనుగొన్నారు! ఇది భవిష్యత్తులో మానవాళికి ఉపయుక్తమైన పరిణామాలకు నాంది అవుతుందని ఆమె భావిస్తున్నారు. ''ముఖ్యంగా నేటి సమాజంలో ఆహారం కొరతను తగ్గించడంతోపాటు, ప్రకృతి విపత్తుల సమయంలో ఆహారాన్ని దీర్ఘకాలం తాజాగా ఉంచి, అన్నార్తులకు అందించేందుకు వీలవుతుంది. అదే విధంగా మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలున్న సరిహద్దులో ఉండే సైనికులకు కూడా తాజాగా ఆహారాన్ని అందించవచ్చు. మరో సంతోషకరమైన సంగతి.. అమెరికాతో పాటు దేశ విదేశాలలో ఉండే మనవారికి మన ఊరిలో మన ఇంట్లో తినే వంటలను తిన్పించేందుకు అవకాశం కలుగుతుంది'' అన్నారు ప్రొఫెసర్ వైశాలి.



ఏమిటా ప్రయోగం?!

'రెడీ టు ఈట్' ప్రాజెక్టులో భాగంగా.. వండిన పదార్థాలపై వైశాలి బృందం ఈ ప్రయోగం చేశారు. ఇడ్లీ, ఉప్మాతో పాటు తెల్లని డోక్లా (గుజరాతీ వంటకం)ను మూడేళ్లపాటు తాజాగా ఉంచవచ్చని తెలుసుకున్నారు. ప్రయోగ ఫలితాన్ని నిర్ధారించుకున్న తర్వాతే ఈ విషయాన్ని ఇటీవల వెల్లడించారు. ''ప్రత్యేకంగా రూపొందించిన మల్టీ లేయర్డ్ కవర్లలో (సంచులలో) ఆహార పదార్థాలను ఉంచి ప్యాక్ చేసి రేడియేషన్ ఇచ్చాం. ఇందుకోసం ఎలక్ట్రానిక్ బీమ్ రేడియేషన్ టెక్నాలజీ వినియోగించాం. ముఖ్యంగా ఎంత రేడియేషన్ ఇవ్వాలనేది కనుగొన్నాం. మేము అనేక తినుబండారాలపై చేసిన పరిశోధనలలో.. ముఖ్యంగా ఇడ్లీ, ఉప్మా, తెల్లని డోక్లాలపై చేసిన ప్రయోగం విజయవంతమైంది. ఇప్పుడు మూడేళ్ల అనంతరం కూడా వాటి రుచితోపాటు వాటి నాణ్యత, వాటిలోని ప్రొటీన్స్, ఫ్యాట్స్, కార్బొహైడ్రేట్స్, మైక్రో సెన్సరీ వాల్యూస్ అన్నీ మూడేళ్ల కింద ఉన్నట్టే ఉన్నాయి'' అని ప్రొఫెసర్ వైశాలి చెప్పారు.

అయిదేళ్ల నాటి ఆలోచన

''రేడియేషన్ సాధారణంగా వండిన వంటకాలపై కాకుండా కూరగాయలు, పండ్ల నిల్వ విధానానికి ఉపయోగిస్తారు. అయితే మనం వండిన వంటలపై వినియోగిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన అయిదేళ్ల కిందట వచ్చింది. అయితే గామా రేడియేషన్‌కు కొన్ని సమస్యలున్న సంగతి అందరికీ తెలిసిందే. కాని ఎలక్ట్రానిక్ బీమ్ రేడియేషన్ ద్వారా ప్రయత్నిస్తే ఫలితం దక్కవచ్చని భావించాను. బోర్డ్ ఆఫ్ రేడియేషన్, ఐసోటోప్ టెక్నాలజీ (బిఆర్ఐటి) సంస్థలోని రేడియేషన్ యంత్రాన్ని నా పరిశోధన కోసం వినియోగించుకునేందుకు అనుమతి కోరాను. అనంతరం ముంబై యూనివర్సిటీలోని కలీనా క్యాంపస్‌లో బయో నానో ఫిజిక్స్ లాబ్ ఏర్పాటు చేసుకున్నాం. ముందుగా రేడియేషన్ డోస్ ఎంత ఇవ్వాలనే దానిపై పరిశోధన చేశాం. అనంతరం వంటకాలను ఎలాంటి ప్యాకేజీలలో ఉంచి రేడియేషన్ ఇస్తే బాగుంటుందని ప్రయోగాలు చేశాం. మొదట పరిశీలనలో భాగంగా ముప్పై రోజుల అనంతరం రేడియేషన్ ద్వారా ప్రత్యేక ప్యాకెట్‌లో ఉంచిన ఇడ్లీ, ఉప్మా, డోక్లాను అన్ని రకాలుగా పరీక్షలు చేశాం. ప్యాకింగ్ చేసిన రోజు ఎలా ఉన్నాయో నెల తర్వాత కూడా ఆ వంటకాలు అలానే తాజాగా ఉండడం గమనించాం. అనంతరం వెయ్యి రోజుల పరీక్షలు నిర్వహించాం. అప్పటికి కూడా ఆ వంటకాలలో ఎలాంటి మార్పులేదు'' అని వివరించారు వైశాలి.


త్వరలో యంత్రాల అభివృద్ధి

టేబుల్ టాప్ ఎలక్ట్రానిక్ రేడియేషన్ యంత్రం సహాయంతో రాబోయే రోజుల్లో ఇతర వంటకాలను కూడా తాజాగా ఉంచే పరిశోధనల్ని వైశాలి బృందం చేయబోతోంది. ''అయితే ఇందు కోసం కావలసిన రేడియేషన్ యంత్రాలు కొన్ని ప్రాంతాల్లోనే అందుబాటులో ఉన్నాయి. చైనాలో టేబుల్‌టాప్ ఎలక్ట్రానిక్ బీమ్ రేడియేషన్ యంత్రాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ వాటి ధరలు భారీగా ఉన్నాయి. దీంతో మేమే అత్యంత తక్కువ ధరలో ఆ యంత్రాలను అభివృద్ధి చేస్తున్నాం'' అని ప్రొఫెసర్ వైశాలి తెలిపారు.

– గుండారపు శ్రీనివాస్, సాక్షి, ముంబై

రేపటి ఫన్‌డేలో...

యాసిడ్ టెస్ట్



గదిలో ఫ్యానుకు తాడును వేలాడదీసే ప్రయత్నంలో ఉంది రేష్మ. సమయానికి అక్కడికి తల్లి రావడంతో ప్రాణాలు దక్కాయి. పెద్దగా ఎప్పుడూ మాట్లాడని తండ్రి ఈసారి నోరు విప్పాడు.

''వ్యవసాయం అంత తేలిగ్గాదమ్మా. నకిలీ విత్తనాలు, కల్తీ మందులు, గిట్టుబాటు కాని ధర... ఇవన్నీ ఒక ఎత్తయితే అవసరానికి కురవని వానలు, పంట చేతికొచ్చే సమయంలో ముంచుకొచ్చే తుపాను ఒక ఎత్తు... ఈ లెక్కన నేను ఇప్పటికి వందసార్లు ఆత్మహత్య చేసుకోవాలి'' అన్నాడు. యాసిడ్ దాడికి గురై, నరకం అనుభవించిన మోడల్ రేషమ్‌ఖాన్ తిరిగి ఎలా నిలదొక్కుకోగలిగిందో, నలుగురికి ఎలా ఆదర్శంగా నిలిచిందో కూడా చెప్పాడు.

తండ్రి మాటలతో ప్రభావితమైన రేష్మ ఇక వెనక్కి తిరిగి చూసుకోలేదు. అంతా సజావుగా సాగుతున్నప్పుడు ఆమె జీవితంలోకి రణధీర్ వచ్చాడు. ఇప్పుడు రేష్మాకు మరో పెద్ద సవాలు ఎదురైంది. ఆ సవాలును ధైర్యంగా ఎదుర్కొందా? పిరికితనంతో నీరుగారిపోయిందా?

'యాసిడ్ టెస్ట్' కథలో చదవండి.

నాలుగు రోజులు

తెల్లవారుజామున పెద్దగాలి రేగింది. మసక చీకటి తొలగిపోయింది. మూడోరోజు ప్రారంభమైంది.

''నా జీవితంలో మూడోరోజు అనాలా? లేకపోతే నరకంలో మూడురోజులు అనాలా?'' అనుకున్నాడు యుద్ధంలో తీవ్రంగా గాయపడిన సైనికుడు ఐవనోవ్.



బతుక్కి దూరంగా, చావుకి అతి దగ్గరగా ఉన్నాడతడు.

'మరణమా ఎక్కడున్నావ్, దయచూడు' అని ప్రార్థించాడు కూడా. ఆయన మొర గాలిలో కలిసిపోయింది.

యుద్ధంలో గాయపడి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడిన ఒక సైనికుడి మానసిక సంఘర్షణ...

రష్యన్ కథ 'నాలుగు రోజులు'లో చదవండి.

సాయిపథం





ఒక పెద్ద నాగుపాము కప్పను మింగడానికి ప్రయత్నిస్తుంటే, సాయి ఆ రెండిటి దగ్గరకు వెళ్లి...

''వీరభద్రప్పా! అనుక్షణం భయంతో జీవిస్తున్నా నీకు సిగ్గులేదా... చినబసప్పా! ఇంకా వాడితో ఆనాటి వైరం పోలేదా...'' అన్నాడు. అంతే...కప్పని పాము వదిలేసింది. కప్ప ఎగిరిపోవడం, పాము పారిపోవడం క్షణాల్లో జరిగిపోయింది. సాయి స్వయంగా చెప్పిన కథ 'నేటి ఈ వైరం ఏనాటిదో'లో చదవండి.

ఇంకా...

నక్కజిత్తుల క్యాన్సర్ (వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ముఖచిత్రకథనం), కలాన్ని, గళాన్ని ఆయుధంగా చేసుకున్న గరిమెళ్ల జీవిత కథ (ధ్రువతారలు), 'గుణసుందరి కథ' సినిమాలో కొత్తపదాలతో పింగళి సృష్టించిన పాట గురించి సీనియర్ నటి రక్తకన్నీరు సీతమ్మ మాటల్లో (పాటతత్వం)...ఇంకా మిమ్మల్ని ఆకట్టుకునే మరెన్నో శీర్షికలు రేపటి ఫన్‌డేలో చదవండి...

సాక్షి
ఫ్యామిలీ
నల్లగొండ । శనివారం
2-2-2019

అటు ఇటు తిరుగుతూ దంచుకుని... మంచుకునే సూపర్ స్నాక్.
అటుకుల వంటకాలు చిటికెలో అయిపోతాయి. చేయడానికి ఇన్ని కిటుకులు ఉన్నాయి.

అటుకిటుకులు



అటుకుల మిక్స్చర్

కావలసినవి: పల్చటి అటుకులు – 2 కప్పులు; వేయించిన పల్లీలు – పావు కప్పు; పుట్నాల పప్పు – పావు కప్పు; వేయించిన జీడి పప్పులు – పావు కప్పు; ఎండు కొబ్బరి ముక్కలు – పావు కప్పు; కిస్‌మిస్ – 2 టేబుల్ స్పూన్లు; నూనె – పావు కప్పు; బెల్లం పొడి – 2 టీ స్పూన్లు; ఉప్పు – తగినంత; నూనె – అర టేబుల్ స్పూను

పోపు కోసం... కరివేపాకు – రెండు రెమ్మలు; తరిగిన పచ్చి మిర్చి – 2; పసుపు – పావు టీ స్పూను; ఇంగువ – కొద్దిగా ;

తయారీ: ● స్టౌ మీద బాణలి ఉంచి వేడయ్యాక, మంట బాగా తగ్గించి, అటుకులు వేసి దోరగా వేయించి తీసి పక్కన ఉంచాలి ● అదే బాణలిలో నూనె వేసి కాగాక, పల్లీలు వేసి వేయించి తీసి పక్కన ఉంచాలి ● పావు కప్పు ఎండు కొబ్బరి ముక్కలు వేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించి, ముక్కలను తీసి పక్కన ఉంచాలి ● పుట్నాల పప్పు, జీడి పప్పులు, కిస్‌మిస్‌లు కూడా విడివిడిగా వేయించి తీసి పక్కన ఉంచాలి ● అదే బాణలిలో అర టేబుల్ స్పూను నూనె వేసి కాగాక, మంట తగ్గించాలి ● కరివేపాకు, పచ్చి మిర్చి, ఇంగువ వేసి వేయించాలి ● పసుపు, ఉప్పు జత చేయాలి ● బెల్లం పొడి జత చేసి కలిపి, రంగు మారుతుండగా, వేయించిన అటుకులు జత చేసి ఐదు నిమిషాల పాటు కలపాలి ● వేయించిన డ్రై ఫ్రూట్స్ జత చేసి కలిపి దింపేయాలి ● చల్లారాక గాలిచొరని డబ్బాలో నిలవ చేసుకోవాలి ● టీ టైమ్‌లో తినడానికి బాగుంటుంది.

కిటుకు: కొద్దిగా నెయ్యి, కొద్దిగా గరం మసాలా జత చేస్తే మిక్స్చర్ మరింత రుచిగా ఉంటుంది.



అటుకుల లడ్డూ

కావలసినవి: అటుకులు – ఒక కప్పు; గింజలు తీసిన ఖర్జూరాలు – అర కప్పు; ఏలకుల పొడి – పావు టీ స్పూను; ఎండు కొబ్బరి తురుము – పావు కప్పు; బెల్లం పొడి – ఒక టేబుల్ స్పూను; వేయించిన నువ్వులు – ఒక టేబుల్ స్పూను; నెయ్యి – ఒక టీ స్పూను.

తయారీ: ● స్టౌ మీద బాణలిలో నెయ్యి వేసి కరిగాక అటుకులు వేసి వేయించి తీసేయాలి ● మిక్సీ జార్‌లో అటుకులు, ఖర్జూరాలు, ఎండు కొబ్బరి తురుము, నువ్వులు, బెల్లం పొడి, ఏలకుల పొడి వేసి మెత్తగా చేసి, ఆ మిశ్రమాన్ని పాత్రలోకి తీసుకోవాలి ● చేతికి కొద్దిగా నెయ్యి పూసుకుని, అటుకుల మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుంటూ, ఉండలు చేయాలి.

కిటుకు: ఈ జీడి పప్పుల పొడి జత చేస్తే లడ్డూలు మరింత రుచిగా ఉంటాయి.



అటుకుల చిక్కీ

కావలసినవి: అటుకులు – ఒక కప్పు; బెల్లం పొడి – ఒక కప్పు; ఏలకుల పొడి – ఒక టీ స్పూను; జీడిపప్పుల పొడి – ఒక టీ స్పూను; బాదం పప్పుల పొడి – ఒక టీ స్పూను; నెయ్యి – ఒక టేబుల్ స్పూను

తయారీ: ● స్టౌ మీద బాణలిలో నెయ్యి వేసి కరిగాక అటుకులు వేసి దోరగా వేయించాలి ● బెల్లం పొడి, కొద్దిగా నీళ్లు పోసి, స్టౌ మీద ఉంచి ఉండ పాకం వచ్చే వరకు కలుపుతుండాలి ● ఏలకుల పొడి, బాదం పప్పుల పొడి, జీడి పప్పుల పొడి వేసి కలిపి దింపేయాలి ● నెయ్యి వేసి కలియబెట్టాలి ● ఒక ప్లేటుకి నెయ్యి పూసి, తయారు చేసి ఉంచుకున్న అటుకుల చిక్కీ మిశ్రమాన్ని అందులో వేసి సమానంగా పరవాలి ● కొద్దిగా గట్టిపడుతుండగా, చాకుతో ముక్కలుగా కట్ చేసి, చల్లారాక ముక్కలను గాలి చొరని డబ్బాలో నిల్వ చేసుకోవాలి.

కిటుకు: పాకంలో నెయ్యి వేసి కలిపితే చిక్కీ చూడటానికి అందంగా ఉంటుంది.



అటుకుల పునుగులు

కావలసినవి: అటుకులు – ఒక కప్పు; బియ్యప్పిండి – పావు కప్పు; పెరుగు – అర కప్పు; ఉల్లి తరుగు – పావు కప్పు; క్యారట్ తురుము – ఒక టేబుల్ స్పూను; బంగాళదుంప తురుము – ఒక టేబుల్ స్పూను; అల్లం తురుము – ఒక టీ స్పూను; వెల్లుల్లి తురుము – ఒక టీ స్పూను; తరిగిన పచ్చి మిర్చి – 3; కొత్తిమీర తరుగు – టీ స్పూను; ఉప్పు – తగినంత; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ఒక పాత్రలో అటుకులకు తగినన్ని నీళ్ల జత చేసి, ఐదు నిమిషాల పాటు నానబెట్టాలి ● రెండు మూడు సార్లు శుభ్రంగా కడిగి, గట్టిగా పిండి, నీళ్ల వేరు చేయాలి ● ఒక పాత్రలో అటుకులు, బియ్యప్పిండి, ఉల్లి తరుగు, క్యారట్ తురుము, బంగాళదుంప తురుము, అల్లం తురుము, వెల్లుల్లి తురుము, కొత్తిమీర తరుగు, ఉప్పు, పెరుగు వేసి పునుగుల పిండిలా కలపాలి ● స్టౌ మీద బాణలిలో నూనె వేసి కాచాలి ● పిండిని పునుగుల మాదిరిగా నూనెలో వేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించి, పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి ● టొమాటో సాస్‌తో తింటే రుచిగా ఉంటాయి.

కిటుకు: నానబెట్టి, ఉడికించిన సగ్గుబియ్యాన్ని (రెండు టీ స్పూన్లు) జత చేస్తే పునుగులు మెత్తగా వస్తాయి.

నిర్వహణ :
వైజయంతి పురాణపండ



అటుకుల పులిహోర

కావలసినవి: అటుకులు – 2 కప్పులు; చింతపండు – పెద్ద నిమ్మ కాయంత; వేయించిన పల్లీలు – ఒక టేబుల్ స్పూను; వేయించిన జీడి పప్పులు – 15; నూనె – 2 టేబుల్ స్పూన్లు; ఇంగువ – అర టీ స్పూను; పచ్చి సెనగ పప్పు – 2 టీ స్పూన్లు; మినప్పప్పు – 2 టీ స్పూన్లు; ఆవాలు – ఒక టీ స్పూను; జీలకర్ర – ఒక టీ స్పూను; ఎండు మిర్చి – 10; తరిగిన పచ్చి మిర్చి – 6; కరివేపాకు – 4 రెమ్మలు; పసుపు–పావు టీ స్పూను; ఉప్పు – తగినంత.

తయారీ: ● చింతపండును రెండు కప్పుల నీళ్లలో అరగంట సేపు నానబెట్టాక, రసం తీయాలి ● అటుకులను శుభ్రంగా కడిగి, చింతపండు రసంలో నానబెట్టాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, ఇంగువ, పచ్చి సెనగ పప్పు, మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి, పచ్చి మిర్చి, కరివేపాకు వేసి వేయించి తీసేయాలి ● ఒక పాత్రలో... చింతపండులో నానబెట్టిన అటుకులు, పోపు, పసుపు, ఉప్పు వేసి గరిటెతో జాగ్రత్తగా కలియబెట్టి అరగంట తరవాత తింటే రుచిగా ఉంటుంది **కిటుకు:** తగినంత చింతపండు రసం మాత్రమే తీసుకుంటే రుచిగా ఉంటుంది.

రాశి ఫలాలు
(సౌరమానం)



జన్మనక్షత్రం తెలియదా? నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా? మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం (ఫిబ్రవరి 2 నుంచి 8 వరకు) మీ రాశి ఫలితాలు

డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

మేషం
(మార్చి 21 - ఏప్రిల్ 19)

నడిచే మార్గంలో గోతులు గొప్పులూ మధ్య మధ్య చిన్న నీటి గుంటలూ ఉన్నాయనిపించినప్పుడు ప్రతి అడుగునూ జాగ్రత్తగా గమనించుకుని మాత్రమే వేస్తామో, అదే మనకి మంచిదౌతుందో అలాగే మీరు చేస్తున్న వృత్తి ఉద్యోగ వ్యాపారాల్లో అలాంటి చిన్న చిన్న సమస్యలూ ఇబ్బందులే ప్రతి విషయంలోనూ కనిపిస్తూ ఉంటాయి. ఆ కారణంగా మీరు మరింత శ్రద్ధతో అవగాహనతో ముందు చూపుతో మాత్రమే వెళ్తూ విజయాన్ని సాధిస్తారు.

ఉయ్యాలలో ముందుకీ వెనక్కీ ఊగే వ్యక్తి ఓసారి ఎత్తుకీ మళ్లీ మామూలు స్థితికీ ఆ మీదట మళ్లీ కొంత వెనక్కీ... ఇలా వెళ్తాడే తప్ప ఎప్పుడూ పైకే ఊగ(లే)డు. అలాగని ఎప్పుడూ మామూలు స్థితిలోనూ అదే తీరుగా వెనక్కీ కూడా ఉండడు. అలాగే మీరు కూడా అతి ముఖ్యంగా మీ కుటుంబ వ్యవహారాల్లో ఎప్పుడూ పట్టుతోనే ఉండకండి. విడుపుతో ఉండడం కూడా అత్యవసరం– విశేషించి ఈ వారంలో.

ఎంత పౌష్టికాహారం మితాహారం ఉన్నతాహారం మీరు తింటున్నా ఆరోగ్యంలో చిన్నపాటి ఒడిదుడుకులు తప్పవు కాబట్టి ఏది మీ శరీరానికి పడదో అలాంటి పదార్థాలని దూరంగా ఉంచడం, అదే తీరుగా వాతావరణంలోని శీతోష్ణ స్థితులని గమనించుకుని ప్రవర్తించడం మంచిది. లేనిపక్షంలో మీరు సంపాదించే ద్రవ్యంలో కొంత మీ వైద్యునికి వాటాగా చెల్లించవలసి రావచ్చు.

'అప్పుడే సంతానం వద్దు– ఇప్పుడే వివాహం వద్దు'... అనే తీరు వ్యతిరేక భావాన్ని గాని విడిచినట్లయితే– మన చేతిలోనే ఉన్న సంతానం వివాహం ఉద్యోగం వంటివి తేలికపాటి ప్రయత్నంతోనే సాధ్యమయ్యే అవకాశముంది. ఆలసించిన ఆశాభంగం, కావాలంటే కార్యసాఫల్యం. గమనించుకోండి!

లౌకిక పరిహారం: పట్టూ విడుపూ కూడా ఉండాలి. ఆరోగ్యం జాగ్రత్త!
అలౌకిక పరిహారం: శ్రీవిష్ణు సహస్రనామ పఠనం ప్రశస్తం.

వృషభం
(ఏప్రిల్ 20 - మే 20)

పరమ ఆచార పరుడైన బ్రాహ్మణుడే. శరీరానికి వ్యాధి వచ్చింది. వైద్యుడు వెల్లుల్లిపాయ (చిన్న/ తెల్ల ఉల్లిపాయ) రసం 40 రోజులుపాటు తాగడమే ఔషధమన్నాడు. ఎవరికీ తెలియకుండా 60 రోజులపాటు తాగాడు. వ్యాధి నయం కాలేదు గానీ ఈ బ్రాహ్మణుని రహస్యం అందరికీ తెలిసింది. సంస్కృతంలో ఓ మాట ఉంది– వెల్లుల్లి తిన్నా వ్యాధి తగ్గలేదని. అలాగే మీరు కూడా మంచి అనుభవజ్ఞుని సూచన మీదట వృత్తి ఉద్యోగ వ్యాపారాలని మరీ తీరుగానూ మరింత శ్రమపడుతూనూ చేసినా లాభాల్లో మార్పు రాకపోవచ్చు. సేవించిన ఔషధం ఎలా వ్యాధిని ఇంతకాలమూ పెరగకుండా మిమ్మల్ని రక్షించిందో, అలాగే మీరు పడ్డ శారీరక శ్రమా గడించిన అనుభవమూ అనేవి ప్రస్తుతానికి ప్రయోజన పడకపోవచ్చు గాని, తప్పక సత్ఫలితాలని ముందు నాటికిస్తాయి.

మరుగుతున్న నూనెలో నీటిచుక్కని వేసినా లేక పొరపాటున చేతిని విదిల్చినప్పుడు పడినా ఎలా వెంటనే మంట పైకి వస్తుందో, అలా మీ జీవిత భాగస్వామి ఈ వారంలో కొంత అశాంతిగా ఉండే కారణంగా మీరు సహజ ధోరణిలో వేళాకోళం/ పరిహాసం కోసం ఏదైనా పరాచికమాడితేమిమ్మల్ని మీ జీవిత భాగస్వామి నలుగురిలోనూ అవమానించే తీరులో ప్రవర్తించవచ్చు. పాలు చల్లారినప్పుడు తోడు వేస్తేనే అది చక్కని గడ్డపెరుగుగా అవుతుంది. లేనిపక్షంలో ఆ మొత్తం పనికిరాకుండా పోతుంది కదా!

మీ సంతానాన్ని చక్కని చోట చదువుకోసం ప్రవేశపెట్టారు. సంతోషించదగిన విషయమే. విత్తనాన్ని మంచి నేలలో పాతినా చీడపీడల్లేకుండా ఎలా జాగ్రత్త చేసుకోవడం ఎప్పటికప్పుడు ఎలా చూసుకుంటూ ఉండాలో ఆ తీరు పర్యవేక్షణ ప్రస్తుతం అవసరం. అలాగని సంతానం సరిలేరని చెప్పడం దీని లక్ష్యం కాదు. గమనించుకోవడం అవసరమని భావం.

లౌకిక పరిహారం: తగినంత ఫలితం రాలేదని నిరుత్సాహపడవద్దు.
అలౌకిక పరిహారం: నవగ్రహ ప్రదక్షిణాలు చేయండి ప్రతిరోజూ.

మిథునం
(మే 21 - జూన్ 20)

సూర్యుడెలా ఉదయకాలం నుండి అస్తమయం వరకు అలా ప్రయాణిస్తూనే ఉంటాడో, మధ్యలో మేఘం అడ్డుపడినా, వర్షం కారణంగా తాను ఒకవేళ కనపడకపోయినా కూడా తన గమనాన్ని ఆప(లే)డో అదే తీరుగా మీరు గడియారంలోని ముల్లుల్లా పని చేస్తూనే ఉండాల్సిన కాలం ఇది. ఉద్యోగంలోనైతే స్థిరీకరణ (పర్మినెంట్ కావడం), వ్యాపారంలోనైతే నిలదొక్కుకోవడం, వృత్తిలోనైతే తగినంత గుర్తింపుకి నోచుకోవడమనేవి పొందగలుగుతారు. తొందరగా మోసపోగల కాలం కాబట్టి, ప్రతి విషయాన్నీ బాగా ఆలోచించి అనుభవజ్ఞులని సంప్రదించి పెద్దల సలహాని అనుసరించి మాత్రమే చేయాల్సి ఉంటుంది తప్ప, తగినంత సమయం మీకు చిక్కని– సాధ్యపడని కారణంగా ఏదో ఒక నిర్ణయాన్ని ఎలాగో ఒకలా చేసేయడం ఏమాత్రమూ సరికాదు సరికదా ఫలితాలు తారుమారయ్యే అవకాశముంది కూడా. ఇంతకీ చేయవలసినది పెద్దలు– అనుభవజ్ఞులతో సంప్రదింపు మాత్రమే.

ఆర్థిక వ్యవహారాల్లో నిక్కచ్చిగా ఉండండి. ఎదుటివారు కొంత సొమ్మునిస్తే'ఫరవాలేదు– సరిగానే ఉండి ఉంటుందనకుండా అనుకోకుండా వారిముందే లెక్కపెట్టుకోవడం మంచిది. శరీరమంతటినీ శాసించి అదుపులో ఉంచగలిగింది మనసు. ఆ కారణంగా మీ ప్రతిపనిలోనూ మనసుతో చెడుని (కాదేమో– పని మరోలా వికటిస్తుందేమో– ఉద్యోగం ఏమౌతుందో.. లాంటి) పొరపాటున కూడా ఊహించకండి. విజ్ఞానశాస్త్రం ఆలోచిస్తూ పోతుంటే వ్యతిరేక ఫలితమే లభించి తీరుతుందని. జాగ్రత్త. కుటుంబంలోని సంతానానికి సంబంధించిన ప్రయత్నాలని కొత్త సంవత్సరం వచ్చేవరకూ ఆపండి. ఇంట్లో కన్యగాని ఉంటే ఆమె ఆరోగ్యాన్ని ముందుగా కుదుట పడేలా చేయండి. ముఖ్యంగా బరువు పెరగడం, స్థూలశరీరం, ఆయాసం వంటివి వచ్చే అవకాశముందని గమనించి తగు జాగ్రత్తలు తీసుకోండి. మొక్క దశలోనే వంచండి. మ్రానైనప్పుడు సాధ్యం కాదు.

లౌకిక పరిహారం: సమయం తీసుకుని ఆలోచించి పెద్దల్ని సంప్రదించి మాత్రమే పనిలోకి దిగండి.
అలౌకిక పరిహారం: ఇష్టదేవతా దర్శనాన్ని మానకండి.

కర్కాటకం
(జూన్ 21 - జులై 22)

తినబోయే పదార్థం రుచికరంగా ఉండాలంటే ఎలా ఉప్పు, కారం సమపాళ్లలో ఉండాలో అదేతీరుగా ఆశ అపరిమితంగా ఉండకూడదు. సంతృప్తి కూడా శ్రుతిమించి ఉండకూడదు. ఈ కారణంగా నిరంతరం ధనార్జన మీదే దృష్టిని సారిస్తూ ఈ ఊరు ఆ ఊరనుకుంటూ దూరభారాలని లెక్కించుకోకుండా ప్రయాణాన్ని సాగించడం సరికాదు. ప్రయాణ శ్రమని తగ్గించుకోవాల్సిందే. గుప్పెడుని మూసి ఉంచితే ఉండే ఆసక్తి, ఏముందో తెలుసుకోవాలనే అభిలాషా ఎదుటివారికి ఎక్కువగా ఉండడం సహజం కాబట్టి కుటుంబ విషయాల్లో గోప్యతని పాటించడం ఎంతైనా అవసరం. ముఖ్యంగా జీవిత భాగస్వామికి ఆ అలవాటు తక్కువైన కారణంగా మీ కుటుంబపు విశేషాలు దాదాపుగా గాలి ప్రవహించినట్లు అలా వెళ్లిపోతూ ఉంటాయి. ఇప్పుడు వాటి ప్రభావం తెలియకపోవచ్చుగాని, రేపు సంతానపు పెళ్లిళ్ల కాలానికొచ్చినప్పుడు ఈ మొక్కలే మానులై మనకి వెళ్లేందుకు తోవనియ్యవు– కొట్టిపడేసేందుకు చేతికి లొంగవు కూడా.

ఆమెకి/ ఆయనకి నిదానంగా అర్థం అయ్యేలా చెప్పేందుకు ప్రయత్నించండి.

స్థలాన్నో ఇంటినో బంగారు వెండి లోహాలనో కొనే యోచనలో ఉంటారు. అది మంచి ఆలోచనే. అవకాశమున్నంతలో ఆ పనిని పూర్తి చేయండి. 'ఫలాని సమయానికి ఇయ్యగలను– అందుకు అంగీకారమైతేనే కొనగలనని చెప్పి కొనుక్కోండి తప్ప, రుణానికి పత్రాలని రాసి ఆస్తులని హామీగా ఉంచి కొత్త ఆస్తులని సంపాదించుకోవద్దు. ప్రస్తుతం ఈ రాశివారికి అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని ఇబ్బందికి లోనయ్యే పరిస్థితి ఉంది కాబట్టి ఇతరుల విషయాలని నెత్తికెత్తుకోవద్దు. వాళ్లుగాని చెప్తే విని ఉదాశీనంగా ఉండండి తప్ప ఆ ఊబిలోకి దిగద్దు. ఆ సమస్యా పరిష్కారాన్ని చేయగల వ్యక్తుల్ని వాళ్లనే వెదుక్కోనీయండి. ఇది స్వార్థమూ ద్రోహమూ కాదు. ప్రస్తుతం మీ దశకి అనుగుణమైన ఉపాయం మాత్రమే.

లౌకిక పరిహారం: రుణాన్ని చేయద్దు– ఇతరుల విషయాల్లో జోక్యమూ వద్దు.
అలౌకిక పరిహారం: శ్రీ లలితా సహస్రనామ పారాయణం ఉత్తమం.

సింహం
(జులై 23 - ఆగస్ట్ 22)

సంస్కృతంలో 'రుణార్ణ'మని ఓ మాట ఉంది. అక్కడ ఎవరి బాకీనో తీర్చేందుకోసం ఇక్కడ ఒకరి వద్ద రుణాన్ని తీసుకుని అవతలివాని బాకీని తీర్చడమని దానర్థం. మద్యానికి అలవాటుపడితే ఎలా మానడమనేది ఆ వ్యక్తికి సాధ్యం కాదో, అదే తీరుగా పై తీరు 'రుణార్ణ'మనే ధోరణికి అలవాటుపడిన మీకు ఈ అలవాటు ఇబ్బందిని కలిగించే వారం ఇది. జాగ్రత్తపడండి.

రోజుకి వెయ్యి రూపాయల ఆదాయం. నెలకి 30 వేలు. సంవత్సరానికి.. అంటూ ఈ తీరుగా ఆలోచించడమనేది గణితశాస్త్రం ప్రకారం నిజం కావచ్చునేమో గాని, యదార్థ జీవితంలో ఈ తీరు ఆలోచన ఏ మాత్రమూ సరికాదు. రోజులో ఉన్న అన్ని గంటల్లోనూ మనం ఎలా ఒకే తీరుగా ఉండ(లే)మో అదే తీరుగా అన్ని రోజుల్లోనూ అదే పనీ – ఆదాయం 'ఉండకపోవచ్చు కాదు' – ఉండదు. అందుకని ఈ తీరు ఆలోచనతో ముందుకి సాగిపోవద్దు.

సొంత అన్నదమ్ములతో అలాగే తల్లితో కూడా చిన్న మానసిక వ్యధ ఆందోళన కలిగే అవకాశముంది కాబట్టి ఆచి తూచి మాట్లాడండి. వెంటనే సమాధానాన్ని ఇచ్చేయడం కాకుండా 'ఆలోచించి చెప్తా'ననడం శ్రేయస్కరం. లోగడ రుణాలని ఇచ్చినవాళ్లు కొంతగా మీమీద అసహన భావంతో ఉంటారు కాబట్టి, వాళ్లంతా మీదికి ఒక్కుమ్మడిగా ఒత్తిడి చేసేందుకు రాకుండా ఉండేలా – ఎప్పుడు ఎంత తీర్చేందుకు వీలుందో వాళ్లకి ముందుకి ముందే సమయాన్ని చెప్పి వాళ్లలో వ్యతిరేకత రాకుండా, అందరూ ఒకటిగా కాకుండా ప్రయత్నం చేయండి. విజయవంతమౌతుంది మీ ప్రయత్నం.

సంతానం చదువుల్లో బాగా రాణిస్తూ ఉండడం, వాళ్లకి చదువుల్లో మార్గనిర్దేశనం చేయగల వ్యక్తి మీకు లభించడం జరుగుతాయి. దాంతో సగం భారం తగ్గుతుంది మీకు.

లౌకిక పరిహారం: ఏ పనిని చేసినా దాన్ని నిజాయితీగా, ధర్మబద్ధంగా మాత్రమే చేయండి.
అలౌకిక పరిహారం: ఆంజనేయ ద్వాదశ నామాలని నిరంతరం పఠిస్తూ ఉండండి.

కన్య
(ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

పరధ్యానమనే మాటకి పరలోక అధినేత అయిన భగవంతుణ్ని ధ్యానించడమనేదే అర్థం నిజానికి. అయితే మీ విషయంలో మాత్రం – చేస్తున్న పనిమీద దృష్టి లేకుండా మరో పనిమీద మనసుని లగ్నం చేయడమని అర్థం. ఆ కారణంగా అతి ముఖ్యమైన, విలువైన కాగితాలు, వస్తువులు మరిచిపోయే ప్రమాదముందని గ్రహించి, అనుక్షణం మీరు అప్రమత్తంగా ఉండండి ఈ వారంలో.

వృత్తి, ఉద్యోగాల పరంగా రాత్రివేళల్లో ఎక్కువగా పని చేయాల్సిన అవసరాలు రావచ్చు. తగినంత ఆహారాన్ని అది కూడా సకాలంలో తీసుకోవాలనే నియమాన్ని సక్రమంగా పాటించి తీరాలి. నలుగురిలో నవ్వులాటగా ఉంటుంది. అలా ఉన్నట్లయితే – అనుకోవద్దు. మీ వృత్తి, మీ ఉద్యోగం మీ వీలు మీది తప్ప మీరు వాళ్లకోసం జీవించడం లేదని అతిస్పష్టంగా చెప్పండి – నవ్వులాట ప్రారంభించినా, ఆట పట్టించబోయినా.

ఎత్తయిన కొండ లేదా పొడుగైన వ్యక్తి... ఇలా ఉన్నవి గుర్తింపు పొందుతాయి భౌతికంగా తప్ప వంద మందిలో అందరితో సమానమైన తీరులో ఉన్న వ్యక్తులకి గుర్తింపు ఉండదు – పైగా అలా గుర్తింపుని ఆశించడం కూడా తప్పే అవుతుంది. ఆ కారణంగా మిమ్మల్ని ఇంటా బయటా కూడా ఎవరూ గుర్తించడమనే లేదనే అసంతృప్తితో ఉండకండి. గుర్తింపుని పొందడం కష్టం – పొందాక దాన్ని నిలుపుకోవడం కష్టం – ఒకవేళ ఆ గుర్తింపు గాని ఏదో కారణంగా దెబ్బతింటే తిరిగి ఆ గుర్తింపుని సాధించుకోవడానికి పడే వ్యధలు మరింత కష్టం కష్టం. సాధారణంగా సాగిపోండి. నష్టమేమీ లేదు. వేగం తక్కువతో ప్రయాణిస్తున్న వాహనం గమ్యాన్ని చేరకపోదు. అయితే ఓ కొంత వెనుకగా చేరుతుంది.

ఒత్తిడికీ మానసిక అశాంతికీ కొంత గురి కాగల సూచన ఉంది కాబట్టి దైవధ్యానాన్ని మానకండి.

లౌకిక పరిహారం: మీ ప్రశాంతతకి ఉపాయం మీ చేతిలోనే ఉంది. మొహర్బానీకి పోవడం సరికాదు.
అలౌకిక పరిహారం: దుర్గాదేవిని స్తుతించడం మంచిది.

తుల
(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)

యుద్ధానికి పోబోతున్న పొటేలుకి శత్రువుగా నిలబడిన పొటేలు శిరసు మాత్రమే కళ్లలో కనిపిస్తుంది తప్ప, యుద్ధాన్నే గాని చేస్తే అవతలి పొటేలు శిరసంత కాకపోయినా, కొంతైనా దెబ్బ తనకీ తగులుతుందనే ధ్యాసే ఉండదు ఆ సమయంలో. యుద్ధం ముగిశాక అనుభవపూర్వకంగా అర్థమౌతుంది – ఎందుకు ఆ ఆవేశంలో అలా చేశానా? – అని. ప్రస్తుతం మీ పరిస్థితి ఇదే.

ఈత పోటీల్లో పాల్గొన్నవాళ్లని చూస్తూ – వెనకబడిన వాళ్లని ఉత్సాహపరుస్తూ, గెలుపుకి దగ్గరగా వస్తున్నవాళ్లని మరింత ఉత్సాహపరుస్తూ అరుపులూ కేకలూ ఈలలూ వేస్తూ జనం కొలను చుట్టూరా ఉంటారు. అయితే వీళ్లంతా ఏ ప్రమాదమూ తమకు లేని ఉండవీల్లేని ఒడ్డునే ఉంటారు. అలాగే మీరు న్యాయస్థానంలోనూ పోలీసు స్టేషన్లలోనూ నానా అవస్థలకీ గురవుతున్న విషయాలని గమనిస్తూ చూస్తూ మిమ్మల్ని మీ ప్రత్యర్థుల్ని రెచ్చగొడుతూనే ఉంటారు తప్ప సయోధ ఏర్పాటు చేద్దామని కలలో కూడా భావించరు. అలాంటివాళ్లు మీకు ఎంత మాత్రపు మిత్రులో, శ్రేయోభిలాషులో బంధువులో లెక్కించుకోండి.

ఆర్థికంగా బలంగా ఉంటారు. అనుకున్న ఉద్యోగానికి మించిన ఉద్యోగమే లభించిన కారణంగా, మానసికంగా, నిరుత్సాహంగా ఉన్న ఆర్థిక సహకారం కారణంగా ఆనందంగా ఉంటారు. కొందరు ఈ పరిస్థితుల్లోనైతే తల్లిదండ్రులకీ సంతానానికీ కూడా దూరంగానే ఉంటూ కొంత నిరాశాభావంతో ఉండచ్చు. ఈ చిన్న వయసు జీవితాన్ని మానసికంగా అలిసిపోయేలా చేసుకోవడం – ఈ సమస్య అటో ఇటో పరిష్కారమయ్యాక వెనుక జరిగిన జీవితపు సంఘటనని గుర్తుచేసుకుంటూ ఉండడం అవసరమా? అనే దిశగా ఆలోచించండి. సమస్యా పరిష్కారం మీకు మీ చేతిలోనే ఉందని స్పష్టంగా తెలుస్తుంది.

లౌకిక పరిహారం: ఏకాంతంగానూ ప్రశాంత స్థితిలోనూ ఆలోచించుకోండి.
అలౌకిక పరిహారం: అర్ధనారీశ్వర స్తోత్రాన్ని పఠించుకుంటూ ఉండండి.

వృశ్చికం
(అక్టోబర్ 23 - నవంబర్ 21)

'పన్నెండేళ్ల అరణ్యవాసం ఒక్క సంవత్సరం అజ్ఞాతవాసం అనే నియమంతో ఎందుకు జూదాన్ని ఆడించా?'వని దుర్యోధనుణ్ని అడిగితే, వాడన్నాడు గదా – పన్నెండేళ్ల పాటు సుఖంగా, విశ్రాంతిగా విందు వినోదాలతో ఉండి ఆ చివరిదైన 13వ సంవత్సరం మొత్తం శ్రమపడి 'పాండవుల జాడ గనుక తెలుసుకుంటే మళ్లీ వాళ్లని 12+1 ఏళ్లపాటు అడవుల పాలు చేయొచ్చు కదా!' అని. అదే తీరుగా 'ఒక్క సంవత్సరం పాటు రాత్రింబవళ్లు శ్రమించి, పెద్ద మొత్తాన్ని సంపాదించి, ఆ మీదట కొన్ని సంవత్సరాల పాటు ఉల్లాసంగా గడపచ్చు కదా!' అనేది మీ భావన కావచ్చు. అది సరికాదు. 2 రోజుల అన్నాన్ని ఒక్కసారే తినడం సాధ్యమూ కాదు – ప్రయత్నిస్తే అనారోగ్యం కూడా. నిదానంగా పనుల్ని చేసుకోండి. విజయద్వారం వద్దే ఉన్నారు. భయపడకండి.

మీరు చేస్తున్న వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లోని మెళకువలన్నింటినీ గోప్యంగానే ఉంచండి. ఎంతటి కష్టమైన పనినైనా ఎలా అంత శీఘ్రంగా ముగించగలుగుతున్నారో ఆ రహస్యాన్ని గొప్పకోసం పదిమందికీ గాని చెప్పినట్లయితే 'పది మందిలో ఒక్కడే ఒక్క'డన్నట్లుగా ఉన్న మీరు 'పది మందిలో ఒక'డనే స్థాయికి దిగజారిపోతారు. ఇది అపచారం, స్వార్థం అన్యాయం కాదు. మీ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు మీరు ఎంచుకున్న ఓ విధానం. ఈ స్థాయి మీకు లభించడానికి మీరు మీ బుద్ధిని ఎంత బరువైన కవ్వంతో ఎంత కాలం మథించారో అది మీకే తెలుసు! ఆలోచించుకోండి. సముద్రాన్ని ఈదుతున్నవాని వీపుమీద కూచున్న వానికి ఈదేవాని కష్టం తెలియదు.

మీ జీవిత భాగస్వామి మిమ్మల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా, వ్యతిరేకించినా నోరు జారకండి. తగ్గి ఉండడమే విజయ ధ్వజాన్ని ఎగురవేయడానికి జెండా కర్ర అని గుర్తుంచుకోండి.

లౌకిక పరిహారం: గోప్యత అవసరం. నోటిని అదుపులో ఉంచుకోండి.
అలౌకిక పరిహారం: శని శ్లోకాన్ని 361 మార్లు రోజుకి పఠిస్తూ ఉండాల్సిందే!

ధనుస్సు
(నవంబర్ 22 - డిసెంబర్ 21)

ఎన్నో మార్లు పాము మంత్రాన్ని వేసి రక్షించాను ఎందర్నో అనుకుంటూ పాములపుట్ట పక్కనే పడుకోవడం గొప్పదనమనిపించుకోదు. సముద్రాన్ని ఎన్నో మార్లు ఈదాను గదా! అని భావిస్తూ సముద్రం ఒడ్డునే ఇల్లు కట్టుకోదలచడం ప్రాణాపాయకరమే తప్ప సాహస కార్యమనిపించుకోదు. అదే తీరుగా ఉద్యోగంలో నాదైన శైలిని చూపిస్తూ అనేక బహుమతుల్ని పనిచేస్తున్న సంస్థ నుండి అందుకున్నాను గదా! అనుకుంటూ తోటి ఉద్యోగుల విషయంలో, పై అధికారుల విషయంలో నోరు పారేసుకోవడం ఏమాత్రమూ సరికాదు – ఇంకా రెచ్చిపోవడం రెచ్చిపోతూండడం కూడా క్షేమకరం ఏమాత్రమూ కాదు.

జీవిత భాగస్వామి సహకారం అంతంత మాత్రంగానే ఉండే కారణంగా అనుకున్న ప్రణాళికలన్నీ కూడా బుద్ధిలోనే ఉంటాయి – ఉండచ్చునూ తప్ప కార్యాచరణకి నోచుకోపోవచ్చు. ఆలస్యాదమృతం విషమని సామెత. గమనించుకోండి.

వండుకోగలిగిన శక్తీ – జ్ఞానమూ లేదా వండేవారున్న వసతీ లేదా రోజూ ఆహారం మీ వద్దకే రప్పించుకోగల సౌకర్యం ఉండి కూడా సరైన సమయానికి సరైన ఆహారాన్ని తీసుకోకపోతూండడం ద్వారా వ్యాధి వచ్చే అవకాశముంది. అవకాశం ఉన్నంతలో నేత్ర పరీక్ష చేయించుకోవడం అవసరం. కేవలం మీ తల్లిదండ్రులూ స్నేహితులూ మాత్రమే మీ శ్రేయస్సుని కోరేవాళ్లనే అభిప్రాయాన్ని మానుకుని వాళ్లతో పాటు మీ అత్తమామల్నీ ఆడబడుచుల్నీ కూడా గౌరవిస్తూ ఉండడం మాట్లాడుతూ ఉండడం ప్రస్తుతం మీకు మరింత అవసరం.

చేస్తున్న వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలకి సంబంధించిన పై పరీక్షలకి గాని సిద్ధపడి వెళ్లినట్లయితే తప్పక ఉత్తీర్ణులు కాగలుగుతారు. పదవి, ఉన్నతి, ఆదాయాధిక్యం గౌరవ ప్రపత్తులూ పెరిగే అవకాశాన్ని పొందుతారు కూడా.

లౌకిక పరిహారం: శరీరం పట్ల మానసిక ఆలోచనల పట్ల జాగ్రత్త మరింత అవసరం.
అలౌకిక పరిహారం: శివాభిషేకం ఉత్తమం.

మకరం
(డిసెంబర్ 22 - జనవరి 19)

మల్లె సన్నజాజి మంచి గంధం మొగలి చెట్లకీ తీగలకీ సమీపంలో గనుక ఉంటే వాటి మీదుగా గాలి వచ్చిన సమయంలో ఎలా ఒక్కసారిగా ఆ గాలి పరిమళాన్ని వెదజల్లుతూ అందరికీ ఆనందాన్ని కల్గిస్తుందో అలాగే మీరు కూడా పాత పరిచయాలని తగ్గించుకుని ఉత్తములైన సంస్కారవంతులైన మిత్రులతో సహవాసానికిష్టపడుతున్న కారణంగా చక్కని అలవాట్లు మీకు అబ్బే అవకాశముంది.

'యోగ'మనే మాటని వింటుంటాం. యోగమంటే రెంటి కలయిక అని అర్థం. ఆ రెండే శరీరరమూ మనసూ అనేవి. శరీరానికి వ్యాధి వస్తే అది మనసు మీదా, అదే మరి మనసుకి బాధ కలిగితే అది శరీరమ్మీదా ప్రభావాన్ని చూపిస్తాయి. ఆ కారణంగా మీరు సకాలంలో ఆహారం, నిద్రా అనేవాటినీ, సంకాలంలో పనిని ముగించుకుంటూ ఇతరుల మీద నిందారోపణలని చేయకుండా ఉండడాన్ని గనుక చేస్తూంటే మీ 'యోగం' అమోఘంగా ఉంటుంది. శనిగ్రహ ప్రభావం లేకుండా ఉంటుంది.

మీరు చేస్తున్న జీవనశైలికి భిన్నంగా రాజకీయ రంగానికి గాని, చిత్ర పరిశ్రమ వైపుకి గాని.. ఇలా వెళ్లాలనే ఆలోచన వచ్చే అవకాశం బలంగా ఉంది. అది ఎల్లవేళలా మీకు మీ చుట్టుపక్కలవారికీ కూడ పుష్కలంగా నీటినిచ్చే నూయి ఉన్న ఇంటిని ఖాళీ చేసి, చెరువు పక్కనున్న పాకలోనికి అద్దెకి దిగడం లాంటిదది. పొరపాటున కూడ ఆ ఊహకి పోవద్దు.

అదృష్టకాలమే నడుస్తోంది కాబట్టి వ్యతిరేకమైన ఊహలూ ఆలోచనలూ మాత్రమే బుద్ధికి తడతాయి తప్ప మిమ్మల్ని గోతులోని తోసెయ్యవు. చక్కని అనుభవజ్ఞుల అండ కూడ లభించడం ఆనందదాయకమైన అంశం.

లౌకిక పరిహారం: తొందరపాటుతోనూ, తాత్కాలిక ఉత్సాహంతోనూ ఏ పనినీ చేయద్దు.
అలౌకిక పరిహారం: శ్రీ లలితా సహస్రనామ పారాయణం మంచిది.

కుంభం
(జనవరి 20 - ఫిబ్రవరి 18)

వశిష్ఠుడూ బ్రహ్మర్షే. విశ్వామిత్రుడూ బ్రహ్మర్షే. అయితే విశ్వామిత్రుడు తన బ్రహ్మర్షి పదవిని పొందడం కోసం ఈ వశిష్ఠుని మీదికి దండయాత్రకి వెళ్లడం అవమానపడడం, త్రిశంకుడనే రాజుని ఎన్నడూ ఎవరికీ సాధ్యపడని తీరులో బొందితో స్వర్గానికి పంపదలచడం నవ్వులపాలు కావడం.. ఇలా చేసి చిట్ట చివరికి సాధించుకోగలిగాడు. అతికష్టమ్మీద మీరు మీ నోటి తొందరతనం ఘర్షణవాతావరణం.. వంటి వాటి ద్వారా బయటపడిపోయే అవకాశముంది కాబట్టి గౌరవంగానూ గంభీరంగానూ ఉంటూ కార్యాన్ని సాధించుకోండి. మీరెవరి మీదా నిందలని వేయద్దు. నిందలని వినద్దు అదే తీరుగా మీరు నిందలని వ్యాప్తి చేయద్దు కూడ. ప్రశాంతత కోసం ప్రయత్నిస్తూ ఉండండి తప్ప అశాంత వాతావరణంలో ఉన్నా వ్యక్తుల మధ్య మమేకంగా ప్రవర్తించడం మీకు హానికరం.

మీది ప్రభుత్వేతర ఉద్యోగమైనట్లయితే ఉద్యోగం దాకా మీకు ఇబ్బంది ఏర్పడవచ్చు. 'ఉప్పుని అమ్మమన్నాను గాని ఊళ్లో విశేషాలని తెలుసుకురమ్మన్నానా? అన్నాట్ట వెనకటికి ఒకడు. ఎంత గొప్ప సామెత ఇది. మీకు లోగడకాలంలో సహాయపడినవాళ్లు, అలాగే మాట సహాయాన్నీ చేస్తున్నవాళ్లూ ఎవరున్నారో వారితో ఉండే పరిచయాలని ఎప్పటికప్పుడు కొనసాగేలా వాళ్లతో మాట్లాడుతూ ఆ పరిచయం ఎప్పుడూ చిగుళ్లేస్తూండేలానే చేసుకుంటూ ఉండండి తప్ప, ఎప్పుడవసరమో అప్పుడే పలకరించవచ్చునని భావించడం సరికాదు. తోటి ఉద్యోగులతో ఇరుగుపొరుగులతో మైత్రీ భావంతో ఉండండి. సంతానం జీవితభాగస్వామి ఆర్థికం.. అంతా బాగానే ఉండే కారణంగా వ్యధపడాల్సిన అవసరాలు దాదాపుగా ఏమీ లేనేలేవు. సముద్ర స్నానానికి వెళ్తే కెరటాలొచ్చిన తీరుగా చిన్న చిన్న ఇబ్బందులున్నా అవి లెక్కలోనికొచ్చేంతవి కానేకావు.

లౌకిక పరిహారం: గౌరవంగానూ గంభీరంగానూ ఉంటూ మంచి అనిపించుకోండి.
అలౌకిక పరిహారం: గణపతి షోడశనామాలనీ పఠించుకుంటూ ఉండండి.

మీనం
(ఫిబ్రవరి 19 - మార్చి 20)

ప్రయాణించవలసిన చోటుకి ఎంతో జాగ్రతతో ముందు చూపుతో ఓ గంట ముందే చేరినా, అకస్మాత్తుగా ఓ ముఖ్యమైన సంచిని మర్చిపోయి, మరోవ్యక్తిని తేవడానికి పంపితే, అతడు వచ్చేవరకూ ఎలా ఆందోళనగా ఉంటుందో, తమ మరుపుని తామే తిట్టుకుంటున్నట్టుగా ఉంటుంది ఈ వారం పరిస్థితి. చివరికి విజయమే తథ్యం. అయినా ఈ లోగా ఆందోళన కదా! అన్ని ఏర్పాట్లూ చేసుకుని ఉండడంతో పాటు అన్నీ ఉన్నదీ లేనిదీ ఒకటికి రెండు మార్లు ప్రతి పనిలోనూ చూసుకుని జాగ్రత్త పడండి. సంతానం తమ విద్యతో పాటు ప్రవర్తనలో కూడ ఎలా ఉన్నారో గమనించుకుంటూ ఉండాల్సిందే. అలాగని వారి ప్రవర్తన సరిలేదనేది కాదు. సహవాసాల కారణంగా బుద్ధి మారబోయే కాలమని గ్రహించుకోండి. పొలం ఎలా పొట్టమీద ఉన్నప్పుడు రైతు మరింత జాగ్రతగా ఉంటాడో అలా పరిశీలించుకోవాలన్నమాట. యంత్రాలని ఉపయోగించేటప్పుడూ వాహనాలని నడిపేటప్పుడూ అలాగే వాటి ప్రయాణించే స్థితి (కండిషన్) గురించీ జాగ్రతలని పాటించండి. ప్రమాదాలు జరిగే అవకాశమైతే లేదు గాని అసౌకర్యానికి గురయ్యే అవకాశముంది మీకు. అందుకని ముందు జాగ్రత్తని వహించండి.

మీ క్రింది అధికారుల పట్ల దురుసుతనం అధికార దర్పం మొదలైన వాటితో ప్రవరించకండి. తాడుతో చిన్నగా వేయబడిన ముడిని విప్పెయ్యడం తేలికే. అయితే దాన్ని పీటముడిగా చేసుకుంటే విప్పడం కష్టమై తెంపవలసి రావచు. ఆర్థికంగా చాలా ఆనందంగా ఉంటారు. వివాహాది శుభకార్యాలకున్న అడ్డు మొత్తం తొలగి. నిశ్చింతంగా ఉండగలకాలం. మీ సంతానం చదువుని మరింతగా పట్టించుకోండి. పిల్లలకి విసుగనిపించినా, సత్ఫలితలు చేరువలోనే ఉన్నాయి.

లౌకిక పరిహారం: అన్నిటిపట్లా సక్రమంగా ఉన్నా కూడ మరొక్కసారి పరిశీలించుకోండి.
అలౌకిక పరిహారం: గణపతికి వెన్నతో అభిషేకాన్ని చేయించుకోండి.

అటుకుల వడలు




కావలసినవి: అటుకులు – కప్పు; ఉల్లి తరుగు – పావు కప్పు; తరిగిన పచ్చి మిర్చి – 2; అల్లం తురుము – ఒక టీ స్పూను; కొత్తిమీర తరుగు – పావు కప్పు; బియ్యప్పిండి – పావు కప్పు; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీ స్పూను; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ఒక పాత్రలో అటుకులకు తగినన్ని నీళ్లు జత చేసి పది నిమిషాలు నానబెట్టాలి ● రెండు మూడు సార్లు కడిగి, గట్టిగా పిండి నీళ్లు తీసేయాలి ● ఒక పాత్రలో ఉల్లి తరుగు, పచ్చి మిర్చి తరుగు, అల్లం తురుము, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి ● అటుకులు, బియ్యప్పిండి, ఉప్పు, జీలకర్ర జత చేసి, గట్టిగా పకోడీపిండిలా కలుపుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె పోసి కాచాలి ● చేతికి కొద్దిగా నూనె పూసుకుని, కలిపి ఉంచుకున్న పిండిని కొద్దిగా తీసుకుని, వడ మాదిరిగా ఒత్తి నూనెలో వేయాలి ● రెండువైపులా బంగారు రంగులోకి వచ్చేవరకు ఆరేడు నిమిషాలు వేయించి తీసేయాలి.

కిటుకు: పిండిలో కొద్దిగా గోరువెచ్చని నూనె వేస్తే, వడలు మెత్తగా వస్తాయి.

అటుకుల పాయసం




కావలసినవి: అటుకులు, బెల్లం పొడి – ఒక్కో కప్పు చొప్పున; నీళ్లు – ఒక కప్పు; పాలు – 2 కప్పులు; ఏలకుల పొడి – పావు టీ స్పూను; జీడి పలుకులు – 10; కిస్‌మిస్ – ఒక టీ స్పూను; నెయ్యి – ఒక టేబుల్ స్పూను

తయారీ: ● స్టౌ మీద ఒక పాత్రలో నెయ్యి వేసి కరిగాక అటుకులు వేసి దోరగా వేయించాలి ● ఒక గిన్నెలో బెల్లం పొడి, నీళ్లు పోసి కరిగించాలి ● స్టౌ మీద ఒక గిన్నెలో పాలు పోసి మరిగించాక, వేయించిన అటుకులు వేసి మెత్తగా ఉడికించాలి ● బెల్లం నీళ్లు జత చేసి మళ్లీ ఉడికించాలి ● ఏలకులపొడి, వేయించిన జీడిపప్పులు వేసి కలిపి దింపేయాలి.

కిటుకు: బాదంపప్పులను నానబెట్టి, మెత్తగా చేసి వేస్తే పాయసం రుచిగా ఉంటుంది.

అటుకుల ఉపయోగాలు

● మధుమేహులకు ఇది మంచి ఆహారం. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అటుకులలో ఉన్న గ్లూకోజ్ అతి నెమ్మదిగా రక్తంలోకి ప్రవేశిస్తుంది కనుక, బ్లడ్ సుగర్ స్థాయిలలో హెచ్చుతగ్గులు రాకుండా చూస్తుంది ● బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవడానికి అనుకూలమైన ఆహారం. తేలికగా అరుగుతుంది. గర్భిణులకు మంచి ఆహారం. అటుకులకు కొద్దిగా నిమ్మరసం జత చేసి తీసుకుంటే శరీరంలోకి ఐరన్ త్వరగా చేరుకుంటుంది ● అటుకులలో ఫైబర్, బి కాంప్లెక్స్, విటమిన్లు అధికంగా ఉంటాయి ● అటుకులను వడ్ల నుంచి నేరుగా దంచి తయారుచేస్తారు. పాలిష్ పట్టరు కనుక వీటిలోని పోషకాలు నేరుగా అందుతాయి. ఇందులో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. కొద్దిగా తింటే చాలు తక్షణమే శక్తి వస్తుంది ● గోధుమ ఉత్పత్తులు పడని వారు అటుకులను తీసుకోవచ్చు. ఇవి తేలికగా జీర్ణమవుతాయి ● ప్రతి 100 గ్రా.ల అటుకులలో 20 మి.గ్రా. ఐరన్ ఉంటుంది ● ఎర్ర బియ్యం నుండి తయారయ్యే ఎర్ర అటుకులు ఆరోగ్యానికి మంచిది.



విరామానికి విరామం

రెండేళ్లవుతుంది తమిళంలో శ్రుతీ హాసన్ స్క్రీన్‌పై కనిపించి. సూర్యతో చేసిన 'సింగం 2' తమిళంలో శ్రుతి లాస్ట్ సినిమా. ఆ తర్వాత సినిమాలను తగ్గించి సంగీతం మీద దృష్టి పెట్టారామె. లండన్‌లో మ్యూజికల్ షోలు కూడా నిర్వహించారు. అంతే కాకుండా వీలున్నంత సమయాన్ని బాయ్‌ఫ్రెండ్ మైఖేల్‌తో ఎంజాయ్ చేస్తున్నారు. ఆ మధ్య బాలీవుడ్ దర్శకుడు మహేశ్ మంజ్రేకర్ సినిమాను అంగీకరించారు. ఆ సినిమా షూటింగ్ జరుగుతోంది. లేటెస్ట్‌గా శ్రుతీ ఓ తమిళ చిత్రం అంగీకరించినట్టు సమాచారం. రెండేళ్ళ గ్యాప్ తర్వాత అంగీకరించిన సినిమా ఇది. విజయ్ సేతుపతి హీరోగా యస్పీ జననాథన్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా శ్రుతీహాసన్ అయితే బావుంటుందని భావించి ఆమెను సంప్రదించారట. శ్రుతీ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. శ్రుతీ రెండేళ్ల విరామానికి విరామం ఇచ్చి మళ్లీ సినిమాలను అంతే స్పీడ్‌గా చేస్తారో లేదో చూడాలి మరి.



● శ్రుతీహాసన్

అంతా కొత్తగా ఉంటుంది

కృష్ణ హీరోగా వచ్చిన 'నెంబర్‌వన్' చిత్రంతో బాల నటుడిగా పరిచయమైన దిలీప్‌కుమార్ చలవాది దాదాపు 30 సినిమాలు చేశారు. ఆ తర్వాత హీరోగా మారి నాలుగు సినిమాలు చేశారు. తాజాగా ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'దిక్సూచి'. బేబి సనిక సాయిశ్రీ రాచూరి సమర్పణలో శైలజ సముద్రాల, నరసింహరాజు రాచూరి నిర్మించారు. పద్మనాభ్ స్వరపరచిన ఈ చిత్రం పాటల్ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. దిలీప్ కుమార్ చలవాది మాట్లాడుతూ– ''ఆడియో ఫంక్షన్ అనగానే చాలా మంది నన్ను 'గెస్ట్ ఎవరు అని?' అడిగారు. నాకు ఎవ్వరూ గెస్ట్‌లు వద్దు.. ప్రేక్షకులే నా అతిథులు అన్నాను. నన్ను నమ్మి డబ్బులు పెట్టిన రాజు అన్నకు థ్యాంక్స్. 1970 నేపథ్యంలోని కథతో తెరకెక్కిన చిత్రమిది. సినిమా చాలా బాగా వచ్చింది. ఫ్యామిలీతో వెళ్లి చూడొచ్చు. సినిమా కోసం చచ్చిపోతాం.. అలాంటి ఫ్యామిలీ మాది. 'దిక్సూచి' అనే ఫౌండేషన్ కూడా స్టార్ట్ చేశాను. ఈ సినిమా చూసి నన్ను సపోర్ట్ చేయాలి'' అన్నారు. ''దిలీప్ స్టోరీ లైన్ చెప్పినప్పుడు నాకు అర్థం కాలేదు. కానీ సినిమా చూశాక అనిపించింది.. నేనేనా ఈ చిత్రాన్ని నిర్మించింది అని. అంత కొత్తగా ఉంటుందీ సినిమా'' అన్నారు నరసింహరాజు. చాందిని, సుమన్, అరుణ్, గాంధీ, చైల్డ్ ఆర్టిస్ట్ ధన్వీ తదితరులు మాట్లాడారు.



● నరసింహరాజు, బిత్తిరి సత్తి, చాందిని, దిలీప్‌కుమార్, పద్మనాభ్, వెంకటేశ్వరరావు

నాది 2018 బ్యాచ్



● మమ్ముట్టి

"ఇప్పటివరకు దాదాపు 375 చిత్రాల్లో నటించాను. ఏడాదికి ఐదారు సినిమాలు చేయాలని నేను ఒప్పందం కుదుర్చుకోవడంలేదు. నా దగ్గరకు వచ్చిన సినిమాలను నేను చేస్తూ వెళ్తున్నానంతే. సినిమాల పట్ల నాకు ఉన్న తపన అలాంటిది" అన్నారు మలయాళ స్టార్ మమ్ముట్టి. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి జీవితంలోని పాదయాత్ర ఘట్టం ఆధారంగా రూపొందిన చిత్రం 'యాత్ర'. వైఎస్సార్ పాత్రలో మమ్ముట్టి నటించారు. మహి వి.రాఘవ్ దర్శకత్వంలో శివ మేక సమర్పణలో విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించారు. ఈ నెల 8న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మమ్ముట్టి చెప్పిన విశేషాలు.

● చాలా కాలం తర్వాత తెలుగు సినిమా చేశాను. తెలుగు ప్రేక్షకులు అన్ని రకాల సినిమాలను ఆదరిస్తారు. ఇండస్ట్రీలో మంచి వాతావరణం ఉంటుంది. వైఎస్సార్ లాంటి లెజెండరీ క్యారెక్టర్ కోసం మహి పూర్తి స్క్రిప్ట్‌తో నా వద్దకు వచ్చారు. నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. సినిమా ఆలస్యం కాకుండా నిర్మించగల మంచి నిర్మాత దొరికారు. ఇలా చాలా అంశాలు ఉన్నాయి ఈ 'యాత్ర' సినిమా చేయడానికి.

● వైఎస్సార్ బాడీ లాంగ్వేజ్‌ని ఇమిటేట్ చేయలేదు. ఆయనది డిఫరెంట్ పర్సనాలిటీ. సినిమాలో సోల్ ఆఫ్ ది క్యారెక్టర్‌ను మాత్రమే తీసుకుని నటించాను. స్క్రిప్ట్ ప్రకారం చేశానంతే. ఒక గొప్ప వ్యక్తి లైఫ్‌ని రెండుగంటల్లో చెప్పడం కష్టం. ఇది పూర్తి బయోపిక్ కాదు. వైఎస్సార్ పాదయాత్ర ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రం. పాదయాత్రలో భాగంగా వైఎస్సార్ ప్రజలను కలవడం, వారితో మాట్లాడటం, వారి భావోద్వేగాలను పంచుకోవడం, వారి సమస్యలను విని పరిష్కార మార్గాల గురించి చర్చించడం వంటి అంశాల ఆధారంగా ఈ సినిమా ఉంటుంది.

● వైఎస్సార్ పాత్రలో పాద యాత్ర చేసినప్పుడు సినిమాలో ప్రజలు తమ కష్టాలను చెప్పుకునే సీన్స్ ఉంటాయి కదా. ఆ కష్టాలన్నీ నిజంగా జరిగినవే. అవి విన్నప్పుడు ఎమోషనల్‌గా అనిపించింది. నా ఎమోషన్‌ను కంట్రోల్ చేసుకున్నాను. ఎందుకంటే నేను చేస్తున్నది పాత్ర అని నాకు తెలుసు. ప్రజల సమస్యలు ఎక్కడైనా ఒకేలా ఉంటాయి. పేదరికం ఒకేలా ఉంటుంది.

● మహి డైరెక్ట్ చేస్తున్నట్లు నాకు అనిపించలేదు. బాగా చేశారు. టీమ్ ఎఫర్ట్ ఇది. షూటింగ్ అంతా విహార యాత్రలా గడిచింది. ఈ సినిమా షూటింగ్ కోసం హైదరాబాద్ రావడం చాలా సంతోషంగా అనిపించింది. యాత్రలో నాకు యంగ్ ఏజ్ ఫాదర్‌గా నటించారు జగపతిబాబు. నా 'మధురరాజా' (మలయాళం) సినిమాలో ఆయనతో మంచి కాంబినేషన్ సీన్స్ ఉన్నాయి.

● నా కెరీర్‌లో ఇప్పటివరకు 70కి పైగా కొత్త దర్శకులతో పని చేశాను. వారిలో దాదాపు 90 శాతం మంది మాలీవుడ్‌లో సినిమాలు చేస్తున్నారు. కోలీవుడ్‌లో ఇద్దరు పెద్ద దర్శకులు అయ్యారు. మహి వి. రాఘవ్ ఆల్రెడీ రెండు సినిమాలు చేశారు.

● కొత్తభాష నేర్చుకోవడమంటే నాకు చాలా ఆసక్తి. అందుకే ఈ సినిమాకు స్వయంగా డబ్బింగ్ చెప్పుకున్నా. నా దర్శక నిర్మాతలు, నా సహచర నటులు నా తెలుగు పట్ల హ్యాపీగానే ఉన్నారు. తెలుగు, మలయాళ భాషలో కొన్ని సిమిలర్ పదాలు ఉన్నాయి. ఉచ్చారణలో పెద్ద తేడా లేదు. కొన్ని టేక్స్ తీసుకుని ఫైనల్‌గా బాగానే కంప్లీట్ చేశాను.

● నా కెరీర్‌లో పొలిటికల్ చిత్రాలు ఉన్నాయి. కానీ బయోపిక్స్ లేవు. 'అంబేద్కర్, బషీర్'ల బయోపిక్స్ మాత్రమే చేశాను. 38 ఏళ్లు సినిమాల్లో గడిచిపోయాయి. ఇప్పుడు రాజకీయాల్లోకి వెళ్లడం ఎందుకు? ఇవే (సినిమా) నా రాజకీయాలు (నవ్వుతూ).

● గత 30 ఏళ్లతో పోలిస్తే ఇప్పుడు అన్ని ఇండస్ట్రీస్‌లో మార్పు కనిపిస్తోంది. విశ్వనాథ్‌గారు భిన్నమైన చిత్రాలు చేశారు. నేను గ్రే షేడ్స్ ఉన్న క్యారెక్టర్స్ చేశా. తెలుగులో మంచి మసాలా సినిమా చేసే అవకాశం రాలేదు. గతంలో కోడి రామకృష్ణ డైరెక్షన్‌లో 'రైల్వేకూలి' అనే సినిమా అంగీకరించాను. అది పూర్తి కాలేదు.

● నేను తెలుగు సినిమాలు చూస్తాను. 'రంగస్థలం, భరత్ అనే నేను' సినిమాలు చూశాను. తెలుగుభాషపై పట్టు కోసం యూట్యూబ్‌లో కొన్ని క్లిపింగ్స్ చూశాను. ఇప్పుడు నేను చేస్తున్న నా మలయాళ సినిమాలు కూడా తెలుగులో రిలీజ్ అవుతాయా? కావా? అనేది 'యాత్ర' రిజల్ట్‌ని బట్టి ఉంటుంది.

● వైఎస్ జగన్‌ను నేను కలవలేదు. వైఎస్సార్‌సీపీ అభిమానులు ఎవరూ ఈ సినిమా గురించి నాతో మాట్లాడలేదు. వైఎస్సార్‌సీపీ అభిమానుల నుంచి మా సినిమాకు మద్దతు లభిస్తుందేమో నాకు తెలీదు.

● ఏ ఇండస్ట్రీలో సినిమా చేయడం కంఫర్ట్‌గా ఉంటుంది అనే విషయం మనం చేస్తున్న సినిమాపై ఆధారపడి ఉంటుంది. వందకోట్లతో సినిమా చేయవచ్చు. యాభైలక్షలతో కూడా చేయవచ్చు. మన సినిమాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలి. అప్పుడు మన నటనలో తేడా తెలుస్తుంది. ఇందుకోసం నేను ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉన్నాను. ప్రతిభ ఉండటమే కాదు. దాన్ని నిరూపించుకునేందుకు కష్టపడటం కూడా ముఖ్యమే. ఇప్పటికీ నా సహచర నటులను చూసి ఇన్‌స్పైర్ అవుతుంటాను.

● అప్పటి 'స్వాతికిరణం' సినిమాలో ఎలా ఉన్నానో ఇప్పుడూ అలానే ఉన్నాను అంటే ఇందుకు కారణం నాకు తెలీదు. దేవుడి దయ అనుకుంటున్నాను. నేను ఎప్పుడూ పాజిటివ్‌గానే ఆలోచిస్తాను. నాది 1980 బ్యాచ్ కాదు. 2018 బ్యాచ్.

● నా మలయాళ చిత్రం 'మధుర రాజా' షూటింగ్ జరుగుతోంది. ఏప్రిల్‌లో రిలీజ్ అనుకుంటున్నాం. కన్నడంలో ఓ సినిమా చేస్తున్నాను. వెబ్ సిరీస్‌లో నటించే ఆలోచన ప్రస్తుతం లేదు.

ప్రేక్షకులందరికీ యాత్ర నచ్చుతుంది

– విజయ్ చిల్లా

''మా కథని నమ్మి సినిమా చేసి, మమ్మల్ని ఎంతో సపోర్ట్ చేసిన మమ్ముట్టిగారికి థ్యాంక్స్. కె. చక్కటి పాటలిచ్చారు. తెలుగు ఇండస్ట్రీలో ఈ పేరు మళ్లీ మళ్లీ వినిపిస్తుంది. 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారు ఐదు వైవిధ్యమైన పాటలు అద్భుతంగా రాశారు. 'యాత్ర' సినిమా వైఎస్‌గారి అభిమానులకు ఎలాగూ నచ్చుతుంది. కానీ, ఈ సినిమా ఆయన అభిమానులకి మాత్రమే కాదు.. తెలుగు రాష్ట్రాల్లోని ప్రేక్షకులందరికీ నచ్చుతుంది'' అని నిర్మాత విజయ్ చిల్లా అన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర ప్రధానాంశంగా తెరకెక్కిన చిత్రం 'యాత్ర'. మమ్ముట్టి లీడ్ రోల్‌లో నటించారు. మహి వి. రాఘవ్ దర్శకత్వం వహించారు. శివ మేక సమర్పణలో 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న విడుదలవుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో మహి వి.రాఘవ్ మాట్లాడుతూ– ''యాత్ర' షూటింగ్ మొత్తం పూర్తయ్యాక జగన్ అన్నకి ట్రైలర్ చూపిస్తే, బాగుందన్నారు. సినిమా కూడా పూర్తయింది చూస్తారా? అని అన్నను అడిగాం. 'మీ నాయకుని కథ మీరు చెప్పారు.. నేను చూసి ఏం చెప్పేది' అన్నారు. ఇక్కడే మనం ఒక మాట గమనించాలి. ఇది మా నాన్న కథ అనలేదు.. మీ నాయకుని కథ అన్నారు. ఒకర్ని గుడ్డిగా నమ్మడానికి, అలాంటి మాట చెప్పడానికి చాలా గుండె ధైర్యం కావాలి. అది జగన్ అన్నకు ఉంది. ఈ ఫంక్షన్‌కి ముఖ్య అతిథిగా, అతిథులుగా ఎవర్ని పిలుద్దామన్నప్పుడు వైఎస్‌గారి అభిమానులను పిలుద్దామని చెప్పా. ఇది మన నాయకుడి కథ'' అన్నారు.

''యాత్ర' సినిమా వైఎస్‌గారి ఫ్యాన్స్‌కే కాదు.. ఆయన ఫ్యాన్స్ కానివారికి కూడా నచ్చుతుంది. అందరికీ నచ్చే స్ఫూర్తిదాయకమైన సినిమా ఇది. 'యాత్ర' అన్ని పొలిటికల్ పార్టీలు చూసే చిత్రం. వారందరికీ మంచి స్ఫూర్తిగా ఉంటుందనే నమ్మకం నాకుంది'' అని హీరో సుధీర్‌బాబు అన్నారు. నిర్మాతలు పీవీపీ, దామోదర ప్రసాద్, రవిశంకర్, నటుడు విజయ్‌చందర్, డైరెక్టర్ శ్రీరామ్ ఆదిత్య, సంగీత దర్శకుడు కృష్ణకుమార్ (కె.), చిత్ర కెమెరామెన్ సత్యన్ సూర్యన్, తుని ఎమ్మెల్యే తాడిశెట్టి రాజా, కెమెరామెన్ శ్యామ్ దత్, నటి ఆశ్రిత, 'బిగ్ సీ' డైరెక్టర్ గౌతమ్, పాటల రచయిత, గాయకుడు పెంచల్‌దాస్, ఆర్ట్ డైరెక్టర్స్ రామకృష్ణ, మోనిక పాల్గొన్నారు.



● కృష్ణకుమార్, మహి వి. రాఘవ్, మమ్ముట్టి, విజయ్ చిల్లా, ఆశ్రిత

వైఎస్ రాజశేఖర రెడ్డిగారి అభిమానులే సెలబ్రిటీలుగా హాజరై 'యాత్ర' సినిమాలోని ఒక్కో పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు వైఎస్ ప్రవేశపెట్టిన పథకాల ద్వారా ఏ విధంగా లబ్ధి పొందారో తమ మాటల్లో పంచుకున్నారు.

● 'వైఎస్‌గారు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మేము చదువుకున్నాం. నిరుపేదలమైన మేము ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ చదివాం' అని తూర్పుగోదావరి జిల్లా తాళ్రేవు మండలం పి.మల్లవరం గ్రామానికి చెందిన స్వర్ణలత, సువర్ణ కుమారి అన్నారు.

● 'వైఎస్‌గారు ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలు నా కుటుంబానికి వర్తించాయని గర్వంగా చెబుతున్నా' అని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం చిట్టవరం గ్రామానికి చెందిన నక్కా లక్ష్మీనారాయణ అన్నారు.

● 'వైఎస్‌గారి పాదయాత్రలో నేను కూడా పాల్గొన్నా. నాకు వికలాంగుల పెన్షన్‌తో పాటు ఇల్లు మంజూరు చేశారాయన. రాజన్న చేసిన సేవలు ప్రజలు ఎప్పటికీ మరచిపోలేం. రాజన్న కుమారుడు జగన్ అన్న ముఖ్యమంత్రి కావాలి'' అని ఆనపాటి వెంకటయ్య చెప్పారు.

● 'చాలా దూరం నుంచి ఒక్కదానివే ఎలా వచ్చావని ఎంతో మంది నన్ను అడిగారు. వైఎస్‌గారు ఇచ్చిన ధైర్యం చాలదా మనకి ఒంటరిగా రావడానికి? ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువుకుని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయ్యా' అని తూర్పు గోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన వి.నిఖిల సంతోషం పంచుకున్నారు.

● 'మా అమ్మకి గుండెకి రంధ్రం ఉండేది. అమ్మ ఆపరేషన్ కోసమని చదువు మానేశా. పనిలో చేరా. ఆపరేషన్ చేయించే స్థోమత లేదు. మా అమ్మ గోడు ఏ దేవుడూ వినలేదు. వైఎస్ అనే దేవుడు విన్నారు. ఆయన ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పథకంతో మా అమ్మకి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో రూపాయి ఖర్చు లేకుండా గుండె ఆపరేషన్ చేయించా' అని నిజామాబాద్ జిల్లా దేవపల్లికి చెందిన కె. రవికుమార్ చెప్పారు.

ఇంగ్లండ్ 187; విండీస్ 126/1

నార్త్‌సాండ్: వరుసగా రెండో టెస్టులోనూ వెస్టిండీస్ చేతిలో ఇంగ్లండ్‌కు కష్టాలు తప్ప లేదు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 187 పరుగులకే ఆలౌటైంది. బెయిర్ స్టో (52), మొయిన్ అలీ (60) అర్ధ సెంచరీలు సాధించారు. విండీస్ పేసర్లు కీమర్ రోచ్ (4/30), గాబ్రియెల్ (3/45) ఆకట్టుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 30/0తో తొలి రోజును ముగించింది. రెండో రోజు శుక్రవారం లంచ్ సమయానికి వికెట్ నష్టపోయి 126 పరుగులు చేసింది.



మ్యాచ్ ప్రారంభానికి ముందు కేక్ కట్ చేస్తున్న మిథాలీ రాజ్

అమ్మాయిలూ ఓడారు

న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా పురుషుల, మహిళల క్రికెట్ జట్ల ప్రయాణం ఒకే విధంగా సాగుతోంది. హామిల్టన్‌లో గురువారం తన 200వ వన్డేలో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన రోహిత్ శర్మకు పరాజయం ఎదురవగా... అదే వేదికలో శుక్రవారం రికార్డు స్థాయిలో 200వ మ్యాచ్ ఆడిన అమ్మాయిల సారథి మిథాలీ రాజ్‌కూ ఓటమి అనుభవమే మిగిలింది. ఈ ఫలితంతో సంబంధం లేకుండా రెండు జట్లూ వన్డే సిరీస్‌ను ముందుగానే కైవసం చేసుకోవడం గమనార్హం కాగా, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పరిస్థితుల్లో మ్యాచ్‌లు చేజార్చుకోవడం విశేషం.



- చివరి వన్డేలో భారత మహిళల ఓటమి
- 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ గెలుపు
- సిరీస్ 2–1తో టీమిండియా వశం
- 6 నుంచి మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్

హామిల్టన్: ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా రెండు వన్డేల్లో చెలరేగి ఆడి సిరీస్‌ను గెల్చుకున్న భారత మహిళల జట్టు చివరిదైన మూడో వన్డేలో ఓటమి పాలైంది. శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో టీమిండియాపై విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళలు... కివీస్ ఆఫ్ స్పిన్నర్, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అనా పీటర్సన్ (4/28), పేసర్ లీ మేరీ తహుహు (3/26) ధాటికి తడబడ్డారు. వన్‌డౌన్ బ్యాటర్ దీప్తి శర్మ (90 బంతుల్లో 52; 4 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా, హర్మన్‌ప్రీత్ కౌర్ (40 బంతుల్లో 24; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించింది. కెరీర్‌లో 200వ వన్డే ఆడిన కెప్టెన్ మిథాలీ రాజ్ (9) సహా ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు జెమీమా రోడ్రిగ్స్ (12), స్మృతి మంధాన (1) నిరాశపర్చారు. ఓ దశలో 35 ఓవర్లకు 115/4తో ఉన్న జట్టు బ్యాటర్ల వైఫల్యంతో 44 ఓవర్లలో 149 పరుగులకే ఆలౌటైంది. మరో స్పిన్నర్ అమేలియా కెర్ (2/43)కు రెండు వికెట్లు దక్కాయి. ఓపెనర్ సుజీ బేట్స్ (64 బంతుల్లో 57; 8 ఫోర్లు, 1 సిక్స్); కెప్టెన్ సాటర్‌వైట్ (74 బంతుల్లో 66 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించడంతో ఆతిథ్య జట్టు 29.2 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బేట్స్, సాటర్‌వైట్ రెండో వికెట్‌కు 84 పరుగులు జోడించారు. భారత ఓపెనర్ స్మృతికి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కింది. రెండు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ ఈ నెల 6 నుంచి జరుగనుంది.

20 ఏళ్లు... 200 వన్డేలు

పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే, 16 ఏళ్ల చిరు ప్రాయంలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన హైదరాబాదీ అమ్మాయి మిథాలీరాజ్... న్యూజిలాండ్‌పై మూడో వన్డేతో 200 వన్డేలు ఆడిన తొలి మహిళా క్రికెటర్‌గా అరుదైన రికార్డు నమోదు చేసింది. ఈ క్రమంలో కుదుపులతో పాటు ఎత్తుపల్లాలను చవిచూసింది. 1999 జూన్‌లో ఇంగ్లండ్‌లోని మిల్టన్ కేన్స్‌లో ఐర్లాండ్‌పై ఆడిన తొలి వన్డేలోనే అజేయ శతకం బాది అందరి దృష్టినీ ఆకర్షించిన మిథాలీ... ఇన్నేళ్ల కెరీర్‌లో, ఇన్ని ఘనతలు సాధించిన తర్వాత కూడా వినమ్రంగా ఉంటూ హుందాగా వ్యవహరిస్తోంది. ఇటీవలి టి20 ప్రపంచ కప్ సెమీఫైనల్ వివాదం తర్వాత ఆమె స్పందించిన తీరే ఇందుకు నిదర్శనం. అంతర్జాతీయ స్థాయిలో కాలం, పరిస్థితులు, ప్రమాణాలకు తగినట్లు ఆట తీరులో మార్పులు చేసుకుంటూ మనగలుగుతోంది. 'నా తొలి లక్ష్యం భారత జెర్సీ ధరించడం, జట్టు కీలక సభ్యుల్లో ఒకరిగా ఎదగడమే. కానీ, ఇంతవరకు వస్తానని ఊహించలేదు. 200 అనేది కేవలం ఓ అంకె మాత్రమే. అయినా ఆ ఘనత అందుకోవడం బాగుంది. అంతర్జాతీయ మహిళా క్రికెట్ కౌన్సిల్ (ఐడబ్ల్యూసీసీ) నుంచి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పరిధిలోకి రావడం సహా మహిళా క్రికెట్‌లో అనేక పరిణామాలు చూశా. ఈ మార్పు ఫలితమేంటో అందరికీ తెలుసు. ఇన్నేళ్లు దేశానికి ప్రాతినిధ్యం వహించడం సంతోషాన్నిస్తోంది. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు' అని మిథాలీ పేర్కొంది. ఈ హైదరాబాదీ వన్డేల్లో 6,622 పరుగులు, 10 టెస్టుల్లో 663 పరుగులు, 85 టి20ల్లో 2283 పరుగులు చేసింది. 50 ఓవర్ల ఫార్మాట్‌లో అత్యధిక పరుగుల రికార్డు మిథాలీ పేరిటే ఉంది.

క్రీడలకు రూ. 2,216 కోట్లు

గతేడాది కంటే రూ. 214 కోట్లు అధికం

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం తమ మధ్యంతర బడ్జెట్‌లో క్రీడలకు రూ. 2216.92 కోట్లను కేటాయించింది. గడిచిన ఏడాది కంటే తాజా బడ్జెట్ కేటాయింపుల్లో క్రీడలకు రూ. 214.20 కోట్లు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంలో క్రీడలకు రూ. 2002.72 కోట్లు వెచ్చించింది. బడ్జెట్ వాటాల్లో భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్)కి అత్యధికంగా నిధుల్ని కేటాయించింది. ఈ విషయాలను శుక్రవారం ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ లోక్‌సభలో వెల్లడించారు.

ఇదీ 'క్రీడల బడ్జెట్' స్వరూపం

- 'సాయ్'కి రూ. 450 కోట్లు. గతంలో (రూ. 396 కోట్లు) కంటే రూ. 54 కోట్లను ఎక్కువగా కేటాయించారు. జాతీయ శిబిరాల నిర్వహణ, క్రీడాసామాగ్రి కొనుగోలు, క్రీడాకారుల ఖర్చులకు వీటిని వెచ్చిస్తారు.
- జాతీయ క్రీడాభివృద్ధి నిధి (ఎన్‌ఎస్‌డీఎఫ్) మొత్తాన్ని రూ. 2 కోట్ల నుంచి గణనీయంగా రూ. 70 కోట్లకు పెంచారు. క్రీడాకారులకు అందించే ఇన్సెంటీవ్స్ కోసం రూ. 89 కోట్లను కేటాయించారు. గతంలో రూ. 63 కోట్లు మంజూరు చేశారు.
- క్రీడాకారుల ప్రోత్సాహకాలు, అవార్డుల్లో భాగంగా ఇచ్చే నగదు బహుమతుల మొత్తాన్ని రూ. 316.93 కోట్ల నుంచి రూ. 411 కోట్లకు పెంచారు. గతంతో పోలిస్తే రూ. 94.07 కోట్లు పెరిగాయి.
- 'ఖేలో ఇండియా'కు రూ. 601 కోట్లు కేటాయించారు. ఇది గతం (రూ.550.69 కోట్లు) కంటే రూ. 50.31 కోట్లు అదనం. జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్‌ఎస్‌ఎఫ్)లకు చేసే చెల్లింపుల్లో స్వల్పంగా కోత విధించారు. గతంలో రూ. 245.13 కోట్లు కేటాయించగా... ఈసారి రూ. 245 కోట్లకు పరిమితం చేశారు.



లలిత్ బాబు కార్తికేయన్

రన్నరప్ కార్తికేయన్ మురళి

అజేయంగా నిలిచిన లలిత్ బాబు • జిబ్రాల్టర్ మాస్టర్స్ చెస్ టోర్నీ

న్యూఢిల్లీ: అంచనాలకు మించి రాణించిన భారత గ్రాండ్‌మాస్టర్ కార్తికేయన్ మురళి జిబ్రాల్టర్ అంతర్జాతీయ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచాడు. ఇంగ్లండ్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో చెన్నైకి చెందిన 19 ఏళ్ల కార్తికేయన్ మురళి మొత్తం ఎనిమిది పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. కార్తికేయన్ చివరి ఐదు రౌండ్‌లలో ఐదుగురు గ్రాండ్‌మాస్టర్లు లారినో నిటో డేవిడ్ (స్పెయిన్), ఫాబియన్ లిబిస్‌జెవ్‌స్కీ (ఫ్రాన్స్), రవూఫ్ మమెదోవ్ (అజర్‌బైజాన్), మాక్సిమ్ మత్లకోవ్ (రష్యా), మాక్సిమి వాచియెర్ లాగ్రెవ్ (ఫ్రాన్స్)లను ఓడించడం విశేషం. ఇందులో మమెదోవ్, మాక్సిమ్, లాగ్రెవ్ ఎలోరేటింగ్ 2700 కంటే ఎక్కువ ఉంది. రన్నరప్‌గా నిలిచిన కార్తికేయన్‌కు 20 వేల పౌండ్లు (రూ. 18 లక్షల 61 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. 8.5 పాయింట్లతో ఆర్తమియెవ్ వ్లాదిస్లావ్ (రష్యా) చాంపియన్‌గా నిలిచాడు. 10 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల క్రీడాకారులు కూడా అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ఎం.ఆర్.లలిత్ బాబు ఏడు పాయింట్లతో ఈ టోర్నీలో ఎనిమిదో స్థానాన్ని సంపాదించాడు. అంతేకాకుండా టోర్నీ మొత్తంలో ఒక్క గేమ్‌లో కూడా అతను ఓడిపోలేదు. మొత్తం పది గేముల్లో లలిత్ ఎనిమిదింటిని గ్రాండ్‌మాస్టర్లతో ఆడాడు. నిల్స్ గ్రాండెలియస్ (స్వీడన్), సేతురామన్ (భారత్), గవైన్ జోన్స్ (ఇంగ్లండ్), మైకేల్ ఆడమ్స్ (ఇంగ్లండ్), సో వెస్లీ (అమెరికా), ఇవాన్ సారిచ్ (క్రొయేషియా)లతో 'డ్రా' చేసుకోగా... ఇవాన్ చెపరినోవ్ (జార్జియా), అలెగ్జాండర్ ఇండిక్ (సెర్బియా)లపై గెలిచాడు.

ఆంధ్రప్రదేశ్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి ఆరు పాయింట్లతో 49వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక 5.5 పాయింట్లతో 76వ ర్యాంక్‌లో నిలిచారు. తెలంగాణకు చెందిన గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి ఆరు పాయింట్లతో 47వ స్థానాన్ని దక్కించుకున్నాడు. సీఆర్‌జీ కృష్ణ 5.5 పాయింట్లతో 82వ ర్యాంక్‌ను పొందాడు. ఇద్దరు గ్రాండ్‌మాస్టర్లు సేతురామన్ (భారత్), కాటరీనా లాగ్నో (రష్యా)లపై సీఆర్‌జీ కృష్ణ గెలుపొందినా గ్రాండ్‌మాస్టర్ (జీఎం) టైటిల్‌కు అవసరమైన చివరిదైన మూడో జీఎం నార్మ్‌ను పొందలేకపోయాడు. టోర్నీ మొత్తంలో 150 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో 94 మంది గ్రాండ్‌మాస్టర్లు ఉన్నారు. భారత్ నుంచి 26వ మంది పోటీపడ్డారు.

ఇద్దరూ చేతులెత్తేశారు

- రామ్‌కుమార్, ప్రజ్నేశ్ పరాజయం
- ఇటలీకి 2–0 ఆధిక్యం
- నేడు మూడు మ్యాచ్‌ల్లో గెలిస్తేనే భారత్ ముందుకు



ప్రజ్నేశ్

రామ్‌కుమార్

కోల్‌కతా: భారత టెన్నిస్ బృందం వ్యూహం పని చేయలేదు. క్లే, హార్డ్ కోర్టులపై అద్భుతంగా ఆడే ఇటలీ ఆటగాళ్లకు అంతగా అలవాటు లేని పచ్చిక కోర్టులను మ్యాచ్‌ల కోసం ఎంచుకున్నా మనకు కలిసి రాలేదు. డేవిస్ కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా శుక్రవారం ఇక్కడ జరిగిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ భారత ఆటగాళ్లకు ఓటమి తప్పలేదు. రామ్‌కుమార్ రామనాథన్ 71 నిమిషాల్లో ఆండ్రియా సెప్పి చేతిలో... ప్రజ్నేశ్ గుణేశ్వరన్ 57 నిమిషాల్లో మాటియో బెరెటిని చేతిలో ఓడిపోయారు. ఫలితంగా తొలి రోజే ఇటలీ 2–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. నేడు జరిగే డబుల్స్, రెండు రివర్స్ సింగిల్స్‌లలో ఒక దాంట్లోనైనా నెగ్గితే ఇటలీ ఈ ఏడాది నవంబర్‌లో జరిగే డేవిస్ కప్ ఫైనల్స్ టోర్నీకి బెర్త్ ఖాయం చేసుకుంటుంది. ఆతిథ్య భారత్ మాత్రం ఫైనల్స్‌కు చేరాలంటే మూడు మ్యాచ్‌ల్లోనూ తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది. తొలి సింగిల్స్‌లో ప్రపంచ 37వ ర్యాంకర్ ఆండ్రియా సెప్పి 6–4, 6–2తో ప్రపంచ 129వ ర్యాంకర్ రామ్‌కుమార్‌ను ఓడించి ఇటలీకి 1–0 ఆధిక్యాన్ని అందించాడు. రామ్‌కుమార్ ఎనిమిది ఏస్‌లు సంధించినా, ఆరు డబుల్ ఫాల్ట్‌లు కూడా చేశాడు. నెట్ వద్దకు 24సార్లు దూసుకొచ్చిన రామ్‌కుమార్ ఆరుసార్లు మాత్రమే పాయింట్లు గెలిచాడు. 25 అనవసర తప్పిదాలు చేసిన అతను సెప్పి సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు రెండుసార్లు అవకాశాలు సృష్టించుకున్నా వాటిని సద్వినియోగం చేసుకోలేదు. మరోవైపు సెప్పి మూడుసార్లు రామ్‌కుమార్ సర్వీస్‌ను బ్రేక్ చేశాడు.

రెండో సింగిల్స్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ 102వ ర్యాంకర్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ 4–6, 3–6తో ప్రపంచ 50వ ర్యాంకర్, డేవిస్ కప్‌లో తొలిసారి ఆడుతున్న మాటియో బెరెటిని చేతిలో ఓటమి చవిచూశాడు. ఇటీవల ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మెయిన్ 'డ్రా'లో ఆడిన ప్రజ్నేశ్ డేవిస్ కప్‌లో మాత్రం తడబడ్డాడు. మ్యాచ్ మొత్తంలో ఒక్క ఏస్ కూడా కొట్టలేకపోయిన ప్రజ్నేశ్ ప్రత్యర్థి సర్వీస్‌లో ఒక్క బ్రేక్ పాయింట్ అవకాశాన్ని దక్కించుకోలేదు. అయితే.. ప్రజ్నేశ్ తన సర్వీస్‌ను మాత్రం మూడుసార్లు కోల్పోయాడు. 'నేడు జరిగే మూడు మ్యాచ్‌లపై దృష్టి సారిస్తాం. ఈ మూడింట్లో గెలిస్తేనే ఫైనల్స్ టోర్నీకి అర్హత సాధిస్తామన్న సంగతి తెలుసు. ఇటలీలాంటి మేటి జట్టుతో ఆడే సమయంలో అందివచ్చిన అవకాశాలను అనుకూలంగా మల్చుకోవాలి. అలా చేయకపోతే మూల్యం చెల్లించుకుంటాం. భారత ఆటగాళ్ల విషయంలో అదే జరిగింది' అని భారత నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి వ్యాఖ్యానించాడు.

నేటి నుంచి ప్రొ వాలీబాల్ లీగ్

కొచ్చి: లీగ్ తెరపైకి కొత్తగా వాలీబాల్ వచ్చింది. స్కూల్, కాలేజ్ గ్రౌండ్లతో పాటు అక్కడక్కడ కనిపించే ఈ క్రీడ టీవీల్లో కనువిందు చేసేందుకు సిద్ధమైంది. నేటి నుంచి ప్రొ వాలీబాల్ లీగ్ తొలి సీజన్ మొదలవుతోంది. ఆరు ఫ్రాంచైజీ జట్లు రెండు వేదికలు కొచ్చి, చెన్నైలో తలపడతాయి. మొదట 12 లీగ్ మ్యాచ్‌లు ఇక్కడ జరుగుతాయి. మరో ఆరు మ్యాచ్‌లు, సెమీఫైనల్స్, ఫైనల్ పోటీలు చెన్నైలో నిర్వహిస్తారు. ఈ నెల 22న టైటిల్ పోరు జరుగుతుంది. శనివారం కొచ్చి బ్లూ స్పైకర్స్, యూ ముంబా వాలీ జట్ల మధ్య ఇక్కడి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో తొలి మ్యాచ్ జరుగుతుంది. ఈ రెండు జట్లతో పాటు బ్లాక్‌హాక్స్ హైదరాబాద్, అహ్మదాబాద్ డిఫెండర్స్, కాలికట్ హీరోస్, చెన్నై స్పార్టన్స్ బరిలో ఉన్నాయి. లీగ్ దశను 15 పాయింట్ల విధానంలో ఐదు సెట్ల మ్యాచ్‌లుగా నిర్వహిస్తారు. విజయానికి 2 పాయింట్లు లభిస్తాయి. ఐదు సెట్లూ గెలిస్తే వైట్ వాష్‌గా పేర్కొంటారు. ఇలా చేస్తే అదనంగా మూడు పాయిట్లు లభిస్తాయి. ప్లే ఆఫ్ మ్యాచ్‌లను 25 పాయింట్ల విధానంలో నిర్వహిస్తారు. ప్రొ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)కు రూపే స్పాన్సర్‌షిప్ చేస్తోంది.



విన్నర్స్ ట్రోఫీతో 6 జట్ల కెప్టెన్లు



హెడ్



బర్న్స్

శతక్కొట్టిన బర్న్స్, హెడ్

- తొలిరోజే ఆస్ట్రేలియా 384/4
- శ్రీలంకతో రెండో టెస్టు

కాన్‌బెర్రా: శ్రీలంకతో మొదలైన రెండో టెస్టులో ఆస్ట్రేలియా తొలిరోజే భారీస్కోరు చేసింది. ఓపెనర్ జో బర్న్స్ (172 బ్యాటింగ్; 26 ఫోర్లు), మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ ట్రావిస్ హెడ్ (161; 21 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో కదంతొక్కారు. దీంతో శుక్రవారం ఆటముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 87 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 384 పరుగులు చేసింది. టాస్ నెగ్గిన ఆతిథ్య కెప్టెన్ పైన్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే అనుభవంలేని లంక బౌలర్లు ఆరంభంలో ఆస్ట్రేలియాను వణికించారు. దీంతో 28 పరుగులకే కీలకమైన 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. హ్యారిస్ (11), ఉస్మాన్ ఖాజా (0)లను విశ్వ ఫెర్నాండో ఔట్ చేస్తే... లబ్‌షేన్ (6)ను కరుణరత్నే పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో బర్న్స్, హెడ్ ఇన్నింగ్స్‌ను నిర్మించే బాధ్యతని తమ భుజాన వేసుకున్నారు. 34 పరుగుల వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డ బర్న్స్ ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. రెండో సెషన్‌లో బర్న్స్ 147 బంతుల్లో, మూడో సెషన్‌లో హెడ్ 193 బంతుల్లో సెంచరీలు పూర్తిచేసుకున్నారు. ఇద్దరు కలిసి నాలుగో వికెట్‌కు 308 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. అనంతరం హెడ్.. ఫెర్నాండో బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోగా... 336 పరుగుల వద్ద ఆసీస్ నాలుగో వికెట్‌ను కోల్పోయింది. ఆటముగిసే సమయానికి ప్యాటర్సన్ (25 బ్యాటింగ్), బర్న్స్ క్రీజులో ఉన్నారు.

ఎట్టకేలకు సెంచరీ+సెంచరీ

ఆసీస్ సెంచరీ వెలతి ఎట్టకేలకు తీరింది. ఓపెనర్ బర్న్స్ తాజా శతకం ఆ లోటును తీర్చగా... హెడ్ సెంచరీ 'ప్లస్' అయింది. భారత్‌తో నాలుగు టెస్టులాడినా సాధ్యంకాని మూడంకెల స్కోర్లను ఈ టెస్టులో సాధించారు. అక్టోబర్ తర్వాత (పాక్‌పై ఖాజా) నమోదైన సెంచరీలు కూడా ఇవే కావడం గమనార్హం. గత 13 నెలల కాలంలో ఆస్ట్రేలియన్లు కేవలం మూడు శతకాలే చేయగలిగారు.



ఆసియా కప్ ఫుట్‌బాల్ విజేత ఖతర్

అబుదాబి: తమకంటే మెరుగైన జట్టు, నాలుగు సార్లు చాంపియన్ అయిన జపాన్‌కు షాకిస్తూ ఖతర్ జట్టు తొలిసారి ఆసియా కప్ ఫుట్‌బాల్ విజేతగా నిలిచింది. శుక్రవారం ఇక్కడ ఒకింత ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్లో ఖతర్ 3–1తో జపాన్‌ను ఓడించింది. మ్యాచ్ 12వ నిమిషంలో అల్మొయిజ్ అలీ కళ్లుచెదిరే బైస్కిల్ కిక్‌తో ఖతర్‌కు తొలి గోల్ అందించాడు. అబ్దుల్ అజీజ్ హటెమ్ 27వ నిమిషంలో మరో గోల్ సాధించి జట్టును 2–0 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. రెండో భాగంలో టకుమి మినామినో (69వ ని.) జపాన్ ఖాతా తెరిచాడు. అయితే, అక్రమ్ అఫిఫ్ (83వ ని.) పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలిచి ఖతర్‌ను తిరుగులేని స్థితిలో నిలిపాడు.